సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 17
సంచిక: 67
బుధవారం 29-5-2024
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



హెడ్ కోచ్‌గా గంభీర్!
భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్‌తో జీసీసీఐ మంతనాలు
-12లో



సీజేఐ పరిశీలనకు పిటిషన్
కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీం తిరస్కరించింది.
-6లో



తెలంగాణ చరిత్రను చెరిపేయడమే
రాచరికపు గుర్తుల పేరిట తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగింపు సరికాదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.
వివరాలు 2లో ▸



విపక్షాలు చల్లే బురదలోనే కమల వికాసం
ప్రతిపక్ష నాయకులు ఎంత ఎక్కువ బురద చల్లితే అన్ని ఎక్కువ కమలాలు విరబూస్తాయని, ఆ సంగతి వారికి అర్థం కావడం లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.
వివరాలు 6లో ▸



రైతన్న విత్తన గోస
ఆదిలాబాద్‌లో పత్తి రైతులు మంగళవారం తెల్లవారుజాము నుంచే విత్తన విక్రయ దుకాణాల ఎదుట బారులుతీరారు. డిమాండ్ ఉన్న రకం విత్తనాలను దక్కించుకునేందుకు క్యూలో నిల్చుని రోజంతా పడిగాపులు కాశారు. ఈ సందర్భంగా రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు పోలీసుల సమక్షంలో ఒక్కో రైతుకు రెండు విత్తన ప్యాకెట్లను అందజేశారు. -సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

సొంతంగా ముందుకెళ్లం

మేడిగడ్డపై నిపుణుల కమిటీ, కేంద్ర ఏజెన్సీలు చెప్పినట్లే నడుచుకుంటాం: సీఎం రేవంత్

ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్
- మేడిగడ్డ ఎంతోకొంత నింపినా, సుందిళ్ల, అన్నారం ఉంటాయో, ఊడతాయో తెలియట్లేదు
- భారీ వరదలు వచ్చి ఎల్లంపల్లి నిండితే ఆ వరద, ఎత్తిపోసిన నీరు మూడు బ్యారేజీల నుంచే కిందికి పోవాలి
- ఇది 32 పళ్లలో ఒక పన్ను విరగడంలాంటి సమస్య కాదు.. వెన్నెముక విరిగింది
- కాళేశ్వరం అంచనాల పెంపుపై విచారణకు ఆదేశిస్తే మొత్తం ప్రాజెక్టే ముందుకెళ్లదు
- ఫోన్ ట్యాపింగ్‌పై కేసీఆర్, హరీశ్‌రావులు సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు?
- ఇందులో తన జోక్యం లేదన్న సీఎం



తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియా: సీఎం
- వివరాలు 2లో


సాక్షి, న్యూఢిల్లీ: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ బ్యారేజీ విషయంలో నిపుణుల కమిటీ, కేంద్ర ప్రభుత్వ ఏజెన్సీలు చెప్పినట్లే నడుచుకుంటామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ మాదిరి సొంతంగా నిర్ణయాలు తీసుకోబోమని చెప్పారు. మేడిగడ్డలో ఎంతో కొంత నీళ్లు నింపి, ఎగువన ఉన్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు పంపినా.. అవి ఉంటాయో, ఊడుతాయో తెలియట్లేదని వ్యాఖ్యానించారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక సైతం అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పటిష్టతపై సందేహాలు వ్యక్తం చేసిందని తెలిపారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై పార్టీ పెద్దలతో చర్చించేందుకు ఢిల్లీకి వచ్చిన సీఎం తుగ్లక్ రోడ్డులోని అధికారిక నివాసంలో మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడారు.

ఇంకెన్ని బ్లాక్‌లు కూలతాయో తెలియదు
'80 వేల పుస్తకాలు చదివి, సొంత తెలివితేటలతో కేసీఆర్
మిగతా 2వ పేజీలో ▶



18 అడుగుల ఎత్తులో ఆర్ఆర్ఆర్!
- కోట గోడను తలపించే ఎత్తులో నిర్మాణం కానున్న రీజనల్ రింగురోడ్డు
- వరికోత హార్వెస్టర్లు అండర్ పాస్‌ల నుంచి దాటేందుకు వీలుగా ట్రిపుల్ ఆర్ కనీస ఎత్తు 5.5 మీటర్లకు పెంపు
- హైవేలను క్రాస్ చేసే ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద 30 అడుగుల ఎత్తు

- వివరాలు 14లో



హైకోర్టు జడ్జీల ఫోన్‌లనూ ట్యాప్ చేశాం

- పలువురు న్యాయవాదులు, జర్నలిస్టుల్నీ వదలలేదు
- ఎన్నికల కోసం రెండు ప్రత్యేక వాట్సాప్ గ్రూపుల ఏర్పాటు
- ఇంటెలిజెన్స్‌లో టాప్ సీక్రెట్ సెల్ పేరుతో స్పెషల్ వింగ్
- నేరాంగీకార వాంగ్మూలంలో బయటపెట్టిన భుజంగరావు

సాక్షి, హైదరాబాద్: స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు తాము హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్లనూ ట్యాప్ చేశామని ఈ కేసులో నిందితుడిగా ఉన్న అదనపు ఎస్పీ నాయిని భుజంగరావు బయటపెట్టారు. తాము నిఘా ఉంచి, పర్యవేక్షించిన వారిలో జస్టిస్ శరత్ కాజా కూడా ఉన్నారని వెల్లడించారు. అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో 2024 మార్చి 23న అరెస్టయిన భుజంగరావును పోలీసులు రెండుసార్లు తమ కస్టడీలోకి తీసుకుని విచారించారు. ఈ నేపథ్యంలోనే ఆయన పలు విషయాలు వెల్లడించినట్లు నేరాంగీకార వాంగ్మూలాల్లో పొందుపరిచిన పోలీసులు.. వీటిని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. వాటిలోని వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా మిర్యాల గ్రామానికి చెందిన భుజంగరావు 1991లో ఎస్సైగా ఎంపికయ్యారు. మల్కాజిగిరి, నాచారం, వనస్థలిపురంలో పనిచేసి, 2005లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొందారు. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వర్తించిన తర్వాత డిప్యుటేషన్‌పై 2011 జనవరి నుంచి 2014 ఫిబ్రవరి వరకు
మిగతా 3వ పేజీలో ▶

టాస్క్‌ఫోర్స్ కేంద్రంగా వసూళ్ల పర్వం
- వివరాలు 3లో

'గొర్రెల'కు మంగళం!

- రెండో విడత పంపిణీ చేపట్టకుండానే సబ్సిడీ గొర్రెల పథకానికి సర్కార్ బ్రేక్?
- గొల్లకుర్మలు కట్టిన డీడీలను వెనక్కి ఇచ్చేస్తున్న పశుసంవర్థక శాఖ
- దీనికి ప్రత్యేక దరఖాస్తు రూపొందించిన ప్రభుత్వం
- గొర్రెల కోసం 3.37 లక్షల మంది ఎదురుచూపులు
- 90 రోజుల్లోనే గొర్రెలిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్
- చెప్పినదానికి విరుద్ధంగా ఇప్పుడు డీడీల వాపస్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం అటకెక్కినట్టే కనిపిస్తోంది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమై ఒక విడత పూర్తయిన ఈ పథకం కింద రెండో విడత గొర్రెలను పంపిణీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా లేనట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే మౌఖికంగా వచ్చిన ఉన్నత స్థాయి ఆదేశాల మేరకు చడీ చప్పుడు లేకుండా గొల్ల కుర్మలు కట్టిన డీడీలను పశు సంవర్థక శాఖ అధికారులు వెనక్కు ఇచ్చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేక దరఖాస్తును కూడా రూపొందించిన ప్రభుత్వం.. ఆ దరఖాస్తు పెట్టుకున్న గొల్లకుర్మల ఖాతాల్లో నగదు జమ చేస్తోంది.

గత నెలరోజులుగా..: ఈ డీడీల వాపస్ ప్రక్రియ నెల రోజుల
మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ జోక్


డైరెక్టుగా దేవుడితో టచ్‌లో ఉన్నారట!

వాట్సాప్‌లో ఫొటోలు.. ముహూర్తం రోజున డెలివరీ

చిన్నారులను విక్రయించే ముఠా అరెస్టు
- 11 మంది మధ్యవర్తుల రిమాండ్
- 16 మంది చిన్నారులను కాపాడిన రాచకొండ పోలీసులు
- ఢిల్లీ, పుణే కేంద్రంగా దందా.. ఏపీ, తెలంగాణలో విక్రయం
- డిమాండ్‌ను బట్టి రూ.1.80లక్షల నుంచి 5.50 లక్షల వరకు..
- వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి

14లో



విన్నపాలు వినవలె!
- ఆర్టీసీపై నేడు సీఎం సమీక్ష.. ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ఇతర సాయంపై నివేదిక సిద్ధం చేసిన అధికారులు

- వివరాలు 2లో

ఆర్టీఏ ఆఫీసులపై ఏసీబీ దాడులు

రాష్ట్రవ్యాప్తంగా పలు చెక్‌పోస్టుల్లో తనిఖీలు
- హైదరాబాద్ సహా 12 ప్రాంతాల్లో 15 బృందాల సోదాలు
- లెక్కల్లో చూపని రూ.2,70,720 నగదు స్వాధీనం
- అనధికారిక వ్యక్తులు కార్యాలయాల్లో ఉన్నట్లు గుర్తింపు
- చెక్‌పోస్టుల వద్ద లారీ డ్రైవర్ల నుంచి ప్రైవేటు వ్యక్తుల వసూళ్లు
- వారికి జీతాలు చెల్లిస్తున్న ఆర్టీఏ అధికారులు..


బండ్లగూడ ఆర్టీఏ కార్యాలయంలో పోలీసుల అదుపులో ఏజెంట్లు

సాక్షి, హైదరాబాద్/సాక్షి నెట్‌వర్క్

అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ (ఆర్టీఏ) కార్యాలయాలు, చెక్‌పోస్టులపై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. మంగళవారం ఏకకాలంలో 15 ఏసీబీ బృందాలు.. మొత్తం 12 ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టాయి. దాదాపు అన్ని కార్యాలయాల్లో అనధికారిక వ్యక్తులు ఇతరులకు చెందిన ధ్రువపత్రాలతో ఉన్నట్టు గుర్తించారు. పలు కార్యాలయాల్లో సిబ్బంది యూనిఫాం లేకుండానే విధులు నిర్వర్తిస్తున్నట్టు గమనించారు. ఏసీబీ అధికారులను చూసిన ఏజెంట్లు పరారయ్యారు. కార్యాలయాల సమీపంలోని తమ దుకాణాలను మూసివేశారు. కాగా దాడులు, తనిఖీల సందర్భంగా లెక్కల్లో చూపని రూ.2,70,720 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఏసీబీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ప్రాంతాల
మిగతా 3వ పేజీలో ▶

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు ఘనంగా ఏర్పాట్లు

- పరేడ్ మైదానంలో పండుగకు సన్నాహాలు
- ట్యాంక్ బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. జూన్ 2న ఉదయం పరేడ్ మైదానంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరయ్యే వేడుకలకు పకడ్బందీగా సన్నాహాలను చేస్తోంది. తొలుత సీఎం రేవంత్ గన్‌-పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి పూల మాలలు సమర్పించి నివాళులు అర్పిస్తారు. అనంతరం పరేడ్ గ్రౌండ్స్‌లో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. ఆ రోజు సాయంత్రం ట్యాంక్ బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు, కార్నివాల్, బాణా సంచా, లేజర్ షో, ఫుడ్, గేమింగ్ స్టాళ్లను ఏర్పాటు చేయనున్నారు. సీఎం, మంత్రులు, ఇతర ప్రముఖులు ఈ కార్యక్రమాలకు హాజరవుతారు. వివిధ జిల్లాల సాంస్కృతిక కళా బృందాల ఆధ్వర్యంలో కార్నివాల్ ప్రదర్శనలు ఉంటాయి. ప్రధాన స్టేజీపై శాస్త్రీయ, జానపద, దక్కనీ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 'జయ జయహే తెలంగాణ' పై జాతీయ జెండాలతో మార్చ్‌-ఫాస్ట్ నిర్వహిస్తారు. మిరుమిట్లు గొలిపే ఫైర్ వర్క్స్ ప్రదర్శన, లేజర్ షో ఉండనుంది. ట్యాంక్ బండ్‌పై దాదాపు 80 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టాళ్లలో రాష్ట్రంలోని హస్త కళలు, స్వయం సహాయక బృందాలు తయారు చేసే వస్తువులు, చేనేత ఉత్పత్తులు, నగరంలోని పలు ప్రముఖ హోటళ్ల ఆధ్వర్యంలో ఫుడ్ స్టాల్స్‌ను ఏర్పాటు చేయనున్నారు.

విన్నపాలు వినవలె!

ఆర్టీసీపై నేడు సీఎం సమీక్ష | **ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు, ఇతర సాయంపై నివేదిక సిద్ధం చేసిన అధికారులు**



సాక్షి, హైదరాబాద్: మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలకు ఉచిత ప్రయాణ వెసులుబాటు ఇవ్వటంతో ఆర్టీసీ బస్సుల్లో ఆక్యుపెన్సీ రేషియో 90 శాతాన్ని మించి పోయి పూర్వవైభవం కనిపిస్తోంది.. కానీ, అదే సమయంలో ప్రభుత్వం నుంచి రావాల్సిన మొత్తం విడుదల కాకపోవటంతో, పెరిగిన ఆక్యుపెన్సీ రేషియోకు తగ్గ ఆదాయం నమోదు కావటం లేదు. మరోవైపు ఆర్టీసీ సహకార పరపతి సంఘం, భవిష్యనిధి బకాయిలు ఏకంగా రూ.2 వేల కోట్లను దాటిపోయాయి. గత ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసినా, దాని అమలు ఆగిపోయింది. ఇప్పుడు ఉద్యోగులకు సకాలంలో జీతాలు ఇవ్వలేని దుస్థితి నెలకొంది. ఈ తరుణంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీపై సమీక్ష నిర్వహించబోతున్నారు. ఆర్టీసీ అధికారుల విన్నపాల్లో ఆయన దేనికి సానుకూలత వ్యక్తం చేస్తారోనన్న చర్చ ఇప్పుడు సంస్థలో విస్తృతంగా సాగుతోంది.

నేడు సమీక్ష లేకుంటే...

వాస్తవానికి మంగళవారం రోజునే సమావేశం ఉంటుందని చెప్పగా, ఆ రోజున వాయిదా వేసి బుధవారం ఉంటుందంటూ సమాచారం అందింది. జూన్ 2 రాష్ట్రావతరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నందున, సీఎం ఆ ఏర్పాట్లలో తలమునకలై ఉన్నారు. ఇలాంటి తరుణంలో సమీక్ష ఉండకపోవచ్చునని కూడా కొందరు అధికారులు అభిప్రాయపడుతున్నారు. జూన్ 4న పార్లమెంటు ఎన్నికల ఫలితాలు వెలువడుతున్నాయి. రాజకీయంగా అది కూడా ఆయన బిజీగా ఉండేందుకు కారణం కానుంది. దీంతో ఎన్నికల ఫలితాలు వెలువడ్డ తర్వాత సమీక్ష ఉండే అవకాశం ఉంటుందని కొందరు పేర్కొంటున్నారు. బుధవారం సమీక్ష జరగని పక్షంలో, వచ్చే పది రోజుల్లో ఉంటుందని అంటున్నారు. దీంతో, ఆర్టీసీని గాడిలో పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ఓ నివేదిక సిద్ధం చేస్తున్నారు.

అధికారులు ఏం కోరనున్నారంటే

- మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించి జారీ చేస్తున్న జీరో టికెట్ల ఆధారంగా ప్రతినెలా నిధులు రీయింబర్స్ చేయాలి. దాన్ని రూ.350 కోట్లకు పెంచాలి.
- మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సుల్లో రద్దీ బాగా పెరిగినందున, 4 వేల కొత్త బస్సులు సమకూర్చాలి.
- ప్రతిపాదిత కొత్త బస్సుల సంఖ్య దామాషా ప్రకారం.. పది వేల మంది ఉద్యోగులను రిక్రూట్ చేయాల్సి ఉంటుంది. ఇప్పటికిప్పుడు కనీసం నాలుగు వేల పోస్టులు భర్తీ చేయాలి.
- గతేడాది బడ్జెట్‌లో ప్రతిపాదించిన మొత్తంలో ఇంకా రూ.వేయి కోట్లు బకాయి ఉంది. దాన్ని వెంటనే విడుదల చేయాలి
- ఆర్టీసీ సహకార పరపతి సంఘం, భవిష్యనిధికి సంబంధించిన రూ.2 వేల కోట్ల బకాయిలను ప్రభుత్వం సర్దుబాటు చేయాలనే అంశాలను అందులో పొందుపరుస్తున్నట్టు తెలిసింది.

తెలంగాణ చరిత్రను చెరిపేయడమే

కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ ఫైర్

- అధికారిక చిహ్నం నుంచి కాకతీయ కళాతోరణం, చార్మినార్ తొలగింపు సరికాదు
- ఇది నాలుగు కోట్ల తెలంగాణ గుండెలను గాయపరచడమే
- ప్రభుత్వ సంకుచిత నిర్ణయాలపై ప్రజా ఉద్యమం తప్పదు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అధికారిక చిహ్నం, అధికారిక గీతం విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెండు నాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు విమర్శించారు. రాచరికపు గుర్తుల పేరిట తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి చార్మినార్, కాకతీయ కళాతోరణం తొలగింపు సరికాదన్నారు. అవి వెయ్యేళ్ల సాంస్కృతిక వైభవానికి చిహ్నాలు, వెలకట్టలేని తెలంగాణ అస్తిత్వానికి నిలువెత్తు ప్రతీకలు అని అభివర్ణించారు. తెలంగాణ అధికారిక చిహ్నం నుంచి వీటి తొలగింపు తెలంగాణ చరిత్రను చెరిపేయడమేనని, నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గుండెలను గాయపరచడమేనని పేర్కొన్నారు. మంగళవారం 'ఎక్స్'లో ఆయన ఈ మేరకు పోస్టు చేశారు. ఒకపక్క రాష్ట్ర గేయంగా ఎంపిక చేసిన 'జయ జయహే తెలంగాణ' గీతంలో కాకతీయ కళాప్రభల కాంతిరేఖ రామప్ప, గోల్కొండ నవాబుల గొప్ప వెలుగే చార్మినార్ అని కీర్తిస్తూనే అధికారిక చిహ్నంలో వాటిని తొలగించి అవమానిస్తారా అని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. చార్మినార్ విశ్వనగరంగా ఎదిగిన హైదరాబాద్‌కు ప్రతీక అని, కాకతీయ కళాతోరణం సిరిసంపదలతో వెలుగొందిన ఈ నేలకు నిలువెత్తు సంతకమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిస్తున్న కర్ణాటక అధికారిక చిహ్నంలోనూ ఉన్న రాచరికపు గుర్తులను తొలగిస్తారా అని ప్రశ్నించారు. భారత జాతీయ చిహ్నంలోనూ అశోకుడి స్తూపం నుంచి స్వీకరించిన మూడు సింహాలున్నాయని, జాతీయ పతాకంలో దశాబ్దాలుగా ధర్మచక్రం ఉందని వివరించారు.

చెరువులు పూడ్చేస్తారా? అసెంబ్లీని కూల్చేస్తారా?

తెలంగాణలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని కేటీఆర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి, మంత్రిమండలిలో ఒక్కరికైనా రాష్ట్ర గీతంలో ఏముందో తెలుసా అని కేటీఆర్ ప్రశ్నించారు. కాకతీయుల కాలంలో నిర్మించిన చెరువులనూ పూడ్చేస్తారా? రాచరికానికి చిహ్నంగా ఉన్న అసెంబ్లీని కూల్చేస్తారా అని నిలదీశారు. ప్రస్తుతం తెలంగాణ గుర్తులు మారుస్తామంటున్న రేవంత్ ప్రభుత్వం రేపు తెలంగాణ సరిహద్దులను కూడా చెరిపేస్తుందా? అని అన్నారు. గత పదేళ్లుగా ప్రభుత్వ అధికారిక చిహ్నానికి యావత్ తెలంగాణ సమాజం ఆమోద ముద్ర ఉందని గుర్తు చేశారు. రాజకీయ ఆనవాళ్లను తొలగించాలన్న కక్షతో రాష్ట్ర అధికారిక చిహ్నాన్ని చెరిపేస్తే సహించేది లేదన్నారు.

కనీసం విత్తనాలు ఇవ్వలేని స్థితిలో ప్రభుత్వం

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే రాష్ట్రంలో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి వెళ్లిందని కేటీఆర్ విమర్శించారు. కనీసం విత్తనాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్రంలో రైతులపై దాడులు జరుగుతుంటే సీఎం రేవంత్ ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనలతో బిజీగా ఉండటం సిగ్గుచేటని అన్నారు. ఆదిలాబాద్‌లో రైతులపై జరిగిన లాఠీచార్జి ఘటనకు ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులపై లాఠీలతో దాడులకు పాల్పడితే సహించేది లేదని, పార్టీ తరఫున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

ఇండియా కూటమి వస్తే ఇంటి పెద్దకు లక్ష

పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి హామీ

- జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు, దేశ సంపద ఈ దేశ ప్రజలకే చెందాలి
- కాంగ్రెస్ 55 ఏళ్ల పాలనలో ఏనాడూ పూజలను అడ్డుకోలేదని వెల్లడి



పంజాబ్ ఎన్నికల ప్రచారంలో డిప్యూటీ సీఎం భట్టి

సాక్షి, హైదరాబాద్: ఇండియా కూటమి అధికారంలోకి రాగానే దేశవ్యాప్తంగా ఇంటి పెద్ద బ్యాంకు ఖాతాలో రూ.లక్ష జమ చేస్తామని, మహిళలను మహారాణులుగా చేస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. మంగళవారం పంజాబ్ రాష్ట్రంలోని ఫరీద్‌కోట్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కాంగ్రెస్ తన 55 ఏళ్ల పరిపాలనలో ఏనాడూ పూజా కార్యక్రమాలను అడ్డుకోలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు ఎప్పుడూ పేదల గురించే ఆలోచిస్తుందని, బీజేపీ మాత్రం పేదలకు రూపాయి కూడా ఇవ్వకుండా అదానీ, అంబానీ వంటి కొద్దిమంది పెద్దలకు మాత్రం రూ.16 లక్షల కోట్ల రుణమాఫీ చేసిందని మండిపడ్డారు. మోదీ 10 ఏళ్ల పాలనలో రూ.100 లక్షల కోట్ల అప్పులు చేసి దేశాన్ని అప్పులకుప్పగా మార్చారని ధ్వజమెత్తారు. తమిళనాడులో 69% రిజర్వేషన్లు అమలవుతున్నాయని, అదేవిధంగా అన్ని చోట్లా రిజర్వేషన్లు పెంచుతామని ఇండియా కూటమి చెప్పిందన్నారు.

దేశవ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా

యూపీఏ హయాంలో ఉపాధి హామీ పథకం, ఆహార భద్రత, రూరల్ హెల్త్ మిషన్, భూ సంస్కరణలు చేసినప్పుడు సైతం బీజేపీ నేతలు విమర్శించారని భట్టి గుర్తు చేశారు. ప్రాణాలు లెక్కచేయకుండా సరిహద్దుల్లో కాపలాకాస్తున్న వీర జవాన్ల స్థాయిని మోదీ ప్రభుత్వం దిగజార్చిందని మండిపడ్డారు. ఇండియా కూటమి అధికారంలోకి రాగానే అగ్నివీర్ పథకాన్ని రద్దు చేస్తామని, దేశ వ్యాప్తంగా ఉచిత ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేస్తామని చెప్పారు. మద్దతు ధర, రుణమాఫీ కోసం ఢిల్లీలో రైతులు నెలల తరబడి ఆందోళన చేస్తే మోదీ 10 నిమిషాలు కూడా వారి కోసం కేటాయించలేదని భట్టి గుర్తు చేశారు. జనాభా దామాషా ప్రకారం ఈ దేశ సంపద, వనరులు పంపిణీ చేయడమే లక్ష్యంగా రాహుల్‌గాంధీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు పాదయాత్ర, మణిపూర్ నుంచి ముంబై వరకు బస్సు యాత్ర చేసిన విషయాన్ని భట్టి వివరించారు.

బీఆర్ఎస్ నేత జీవన్‌రెడ్డిపై మోకిల పీఎస్‌లో కేసు

- తన 56 ఎకరాల భూమి కాజేసేందుకు యత్నించాడని బాధితుడి ఫిర్యాదు
- కేసు నమోదు చేసిన పోలీసులు



శంకర్‌పల్లి: బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిపై సోమవారం మోకిల పీఎస్‌లో కేసు నమోదైంది. తన 56 ఎకరాల 20 గుంటల భూమిని కాజేసేందుకు జీవన్‌రెడ్డి కుట్ర పన్నాడని బాధితుడు సామ దామోదర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితుడు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2016లో దామోదర్‌రెడ్డి, జీవన్‌రెడ్డికి పరిచయం ఏర్పడింది. దీంతో ఇద్దరూ కలిసి భూముల క్రయ విక్రయాలు జరిపారు. 2016 లో ఇరు వురి స్థలాలు, భూములు బదిలీ చేసుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. దామోదర్‌రెడ్డి తన చైతన్య రిసార్ట్స్ (170 ఎకరాలు)లో 93 ఎకరాలు ఇస్తానని చెప్పగా.. జీవన్‌రెడ్డి కొంపల్లిలో కమర్షియల్ స్థలాన్ని ఇచ్చేలా ఎంవోయూ చేసుకున్నారు. దీనికి సంబంధించి 2016 మే లో దామోదర్‌రెడ్డి శంకర్‌పల్లి మండలం టంగటూర్, చేవెళ్ల మండలం ఈర్లపల్లిలోని చైతన్య రిసార్ట్స్‌లో ఉన్న 93 ఎకరాలను మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, ఆయన భార్య రజిత, తల్లి రాజు బాయి పేరు మీద రిజిస్ట్రేషన్ చేశారు. అయితే జీవన్‌రెడ్డి మాత్రం తన స్థలాన్ని ఇచ్చేందుకు వెనకంజ వేశారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన దామోదర్‌రెడ్డి జీవన్ రెడ్డిని బతిమాలుకున్నారు. దీంతో దామోదర్ రెడ్డిపై గూండాలతో జీవన్ రెడ్డి బెదిరింపులకు పాల్పడ్డారు. దీంతో దామోదర్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

విశాఖ మీదుగా ఢిల్లీకి డబ్బులు

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పౌర సరఫరాల శాఖలో జరిగిన కుంభకోణం వెనుక కాంగ్రెస్ ప్రభుత్వ పెద్దలు ఉన్నారని, టెండర్ ధరకంటే అదనంగా మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆరోపించారు. వసూలు చేసిన డబ్బులను టెండరుదార్లు విశాఖపట్నం బ్యాంకుల్లో దాస్తూ ఢిల్లీకి పంపిస్తున్నారన్నారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన కుంభకోణాలపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దాటవేసే ధోరణిలో ఉన్నారని, టెండర్లు ఎందుకు రద్దు చేయడం లేదని ప్రశ్నించారు. ఢిల్లీ పెద్దలకు మూటలు పంపించిన వారిని వదిలేస్తూ, ఇతరులను డిఫాల్టర్లుగా ప్రకటిస్తామని బెదిరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో 'బ్రూ' ట్యాక్స్ కట్టిన వారికి మాత్రమే క్లియరెన్స్ ఆర్డర్ ఇస్తున్నారని, 250 మందికి పైగా మిల్లర్లు అదనంగా బిడ్డర్ల ఖాతాల్లో డబ్బులు వేశారని చెప్పారు. ఈ కుంభకోణంపై విజిలెన్స్, అవినీతి నిరోధక శాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. పౌరసరఫరాల శాఖలో జరిగిన కుంభకోణంపై బీఆర్ఎస్ వద్ద ఆధారాలు ఉన్నాయని, కేంద్ర దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత పౌరసరఫరాల సంస్థ భవన్‌ను ముట్టడిస్తామని సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. రైతులపై లాఠీ చార్జి జరుగుతున్నా సీఎం సహా సగం మంత్రివర్గం బయటి రాష్ట్రాలు తిరుగుతోందన్నారు.

ఘనంగా తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలు

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి
- పార్టీ ఆధ్వర్యంలో 1వ తేదీ నుంచి 3 రోజుల పాటు నిర్వహణ

సాక్షి, హైదరాబాద్: పార్టీ పరంగా మూడు రోజుల పాటు నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సంబంధించిన షెడ్యూల్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు మంగళవారం ప్రకటించారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. తెలంగాణకు పర్యాయ పదం కేసీఆర్ అని, దశాబ్దాల స్వరాష్ట్ర కలను సాకారం చేసిన పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. ప్రాణాలను పణంగా పెట్టి, పోరాటాలు, త్యాగాలతో తెలంగాణ సాధించిన ఘనత కేసీఆర్‌దే అని అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో ప్రతి తెలంగాణ బిడ్డ పాల్గొనాలని పిలుపునిచ్చారు.

1న అమరులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ

'ఉత్సవాల తొలిరోజు జూన్ 1న సాయంత్రం ఐదు గంటలకు అసెంబ్లీకి ఎదురుగా ఉన్న గన్ పార్కులోని అమరవీరుల స్తూపం నుంచి ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న అమర జ్యోతి వరకు అమరవీరులకు నివాళిగా కొవ్వొత్తుల ర్యాలీ ఉంటుంది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు తెలంగాణ ఉద్యమకారులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొంటారు. 2న తెలంగాణ భవన్‌లో జరిగే వేడుకల్లో భాగంగా ఉదయం 9:30కి జాతీయ జెండాతో పాటు బీఆర్ఎస్ జెండాను కేసీఆర్ ఎగురవేస్తారు. అనంతరం పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తారు..' అని కేటీఆర్ తెలిపారు. 3న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పార్టీ అధ్యక్షుల ఆధ్వర్యంలో సమావేశాలు, పార్టీ జెండాల ఆవిష్కరణతో పాటు పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కాగా 1న కొవ్వొత్తుల ర్యాలీకి అనుమతి ఇవ్వాల్సిందిగా కోరుతూ బీఆర్ఎస్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు జీహెచ్ఎంసీ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు అందజేశారు.

సొంతంగా ముందుకెళ్లాం!

▶ మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్ చేశారు. అల్లుడు హరీశ్ రావు వరల్డ్ రికార్డు కోసం ఆగమాగం పనులు చేశాడు. ఇప్పుడు అది కూలింది. మేడిగడ్డలో కూలిన బ్లాక్‌ను సరిచేసి నీళ్లు నిలిపితే, ఇంకెన్ని బ్లాక్‌లు కూలతాయో తెలియదు. ఒకవేళ రెండున్నర మీటర్లలో మేడిగడ్డ నింపి అన్నారం, సుందిళ్లకు నీటిని పంపితే వాటి పరిస్థితి ఏంటో తెలియదు. ఒకవేళ భారీ వరదలు వచ్చి ఎల్లంపల్లి నిండితే ఆ వరద నీరు, ఎత్తిపోసిన నీరు అన్నారం, సుందిళ్ల, మేడిగడ్డ నుంచే కిందికి పోవాలి. ఇప్పటికే 52 టీఎంసీల ఎత్తిన నీళ్లు కిందకు పోయాయి. సముద్రంలోకి పోయిన నీటికి కరెంట్ బిల్లులు కట్టాం. 80 వేల పుస్తకాలు చదివిన తెలివి అట్లుంది. కాళేశ్వరం సమస్య.. 32 పళ్లలో ఒక పన్ను విరిగితే వచ్చిన సమస్య లాంటిది కాదు. విరిగింది వెన్నెముక. మేడిగడ్డ పునరుద్ధరణ అంశంపై ఇప్పటికే మూడు కేంద్ర ఏజెన్సీలు పనిచేస్తున్నాయి. ఆ ఏజెన్సీలు ఇచ్చిన సిఫారసుల మేరకు ముందుకు వెళతాం..' అని రేవంత్‌రెడ్డి చెప్పారు.

ప్రస్తుతానికి అంచనాలు, చెల్లింపుల జోలికి పోలేదు

'మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వరకే జ్యుడీషియల్ విచారణ జరుగుతోంది. ఇక్కడి తప్పిదాలకు ఎవరు బాధ్యులో అది తేలుస్తుంది. ఇది కాకుండా అంచనాలు ఎందుకు తారుమారయ్యాయి, ఎస్కలేషన్ ఎంత..ఇలా కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తం వ్యవహారంపై విచారణ మొదలు పెడితే అది ఇక్కడితో ఆగదు. మొత్తం ప్రాజెక్టే ముందుకెళ్లదు. అంచనాల పెంపులో అవకతవకలను విచారిస్తూ పోతే ఏ ప్రాజెక్టూ ముందుకు పోదు. ప్రభుత్వం కూడా పనులు చేయించలేదు. బిల్లులు ఇవ్వలేదు. ఒకవేళ పనులు కొనసాగిస్తే విచారణకు ఆదేశించాక కూడా ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. అప్పుడు ఇందులో ఏదో మతలబు ఉందని మీడియానే రాస్తుంది. అందుకే అంచనాలు, చెల్లింపుల జోలికి పోలేదు. మేడిగడ్డ అంశం తేలాక దానిపై ఆలోచిస్తాం..' అని సీఎం వివరణ ఇచ్చారు.

కరెంట్ కోతల్లేవు..అంతరాయం మాత్రమే

'రాష్ట్రంలో ఎక్కడా కరెంట్ కోతల్లేవు. చెట్లు పడిపోవడం, విద్యుత్ వినియోగం పెరగడం, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోవడం వల్ల అంతరాయాలు ఏర్పడ్డాయి తప్పితే ఎక్కడా కోతలు లేవు. తెలంగాణ రాష్ట్ర గేయ రూపకల్పన బాధ్యత పూర్తిగా అందెశ్రీకి ఇచ్చాం. ఆయన దానికి కీరవాణితో సంగీతం సమకూర్చుకుంటారో, మరొకరితోనో అనేది ఆయన ఇష్టం. తెలంగాణ చిహ్నంలో రాచరికపు పోకడలు ఉండకూడదనేది మా ఉద్దేశం. దానికి అనుగుణంగానే కొత్త చిహ్నం ఉంటుంది..' అని రేవంత్ చెప్పారు.

కోర్టు ఆదేశాల మేరకే ఫోన్ ట్యాపింగ్‌పై విచారణ

'రాష్ట్రంలో ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించిన వ్యవహారంలో నేనేమాత్రం జోక్యం చేసుకోవడం లేదు. దీనిపై ఇంతవరకు ఎలాంటి సమీక్షలు నిర్వహించలేదు. ఒకవేళ జోక్యం చేసుకున్నా ఇప్పటికిప్పుడు నాకు కానీ, పార్టీకి కానీ దక్కే ప్రయోజనం ఏంటి? ఈ విషయంలో కోర్టు ఆదేశాల మేరకే విచారణ కొనసాగుతోంది. విచారణలో నిందితులు చెబుతున్న అంశాలు నేను కూడా పత్రికల ద్వారానే తెలుసుకుంటున్నా. ప్రతి చిన్న అంశంపై సీబీఐ విచారణ కోరే కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావులు ఫోన్ ట్యాపింగ్‌పై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదు? మా ప్రభుత్వం మాత్రం ఫోన్ ట్యాపింగ్ వంటి వెధవ పనులు చేయడం లేదు. లోక్‌సభ ఎన్నికల్లో పోలీసులు పారదర్శకంగా పనిచేశారు. ఇతర రాష్ట్రాల్లో మాదిరి ఇక్కడ పోలీసుల బదిలీలు జరగలేదు..' అని ముఖ్యమంత్రి అన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్సులు

- ఎమ్మెల్సీ ఉపఎన్నికలో 72.44 శాతం పోలింగ్
- అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 78.59 శాతం
- అత్యల్పంగా ఖమ్మంలో 67.62 శాతం పోలింగ్ నమోదు
- జూన్ 5న కౌంటింగ్



స్ట్రాంగ్ రూమ్ వద్ద రాహుల్ బొజ్జా, కలెక్టర్ హరిచందన, ఎస్పీ చందనాదీప్తి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: నల్లగొండ- ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉప ఎన్నిక పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి 3 జిల్లాల పరిధిలో 72.44% పోలింగ్ నమోదైంది. అత్యధికంగా యాదాద్రి జిల్లాలో 78.59% నమోదైంది. అత్యల్పంగా ఖమ్మం జిల్లాలో 67.62% పోలింగ్ నమోదైంది. పోలింగ్ ఉదయం 8 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు జరగ్గా, 12 జిల్లాల పరిధిలోని బ్యాలెట్ బాక్సులన్నింటినీ గట్టి బందోబస్తు మధ్య నల్లగొండ జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్‌రూమ్‌కు తరలించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో 52 మంది పోటీలో ఉన్నారు. ప్రధాన పోటీ 3 పార్టీల అభ్యర్థుల మధ్య నే కొనసాగగా, జూన్ 5న వీరి భవితవ్యం తేలనుంది.

స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద మూడంచెల భద్రత..

నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని దుప్పలపల్లిలో గిడ్డంగుల సంస్థ గోదాములోని స్ట్రాంగ్ రూమ్‌లలో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. ఇక్కడ మూడంచెల భద్రత ఉంది. చుట్టుపక్కల 144 సెక్షన్ విధించడంతోపాటు పోలీసులు 24 గంటలపాటు సాయుధ రక్షణలో పహారా కాస్తూ సీసీ కెమెరాల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నట్లు నల్లగొండ ఎస్పీ చందనా దీప్తి తెలిపారు. స్ట్రాంగ్ రూమ్‌లోని బ్యాలెట్ బాక్సులను మంగళవారం ఉదయం ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకుడు రాహుల్ బొజ్జా, రిటర్నింగ్ అధికారి, నల్లగొండ కలెక్టర్ దాసరి హరిచందన పరిశీలించారు.

నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించాలి

మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి వి.నాగిరెడ్డి



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీల అభిప్రాయాలు తీసుకుని నోటాను కల్పిత అభ్యర్థిగా పరిగణించాలని, ఇది రాజకీయాల్లో మంచి పరిణామం అవుతుందని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారి వి.నాగిరెడ్డి అన్నారు. ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ ఆధ్వర్యంలో ఎం.పద్మనాభరెడ్డి అధ్యక్షతన మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పంచాయతీ ఎన్నికలలో నోటా అమలు'పై చర్చా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన నాగిరెడ్డి మాట్లాడుతూ.. మాజీ రాష్ట్ర ఎన్నికల అధికారిగా తాను నోటాను పూర్తిగా సమర్థిస్తున్నానని, కానీ ఇది జ్యుడీషియల్ స్క్రూటినీలో నిలబడుతుందో లేదో చూడాలని సూచించారు. పద్మనాభరెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు 16% ఏకగ్రీవం అవుతున్నాయని, చాలాచోట్ల వేలంపాట పాడి సర్పంచులుగా ఎన్నుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హరియాణా ప్రభుత్వం నోటాకు పూర్తి అధికారం ఇచ్చిందని, ఒక్కరే అభ్యర్థి ఉన్నప్పటికీ అక్కడ ఎన్నికలు జరగాల్సిందేనన్నారు. నోటా ఉంటే అన్ని రాజకీయ పార్టీలు మంచి నాయకున్ని ఎంచుకునే అవకాశం ఉంటుందని, లేకపోతే 50 లక్షలు ఖర్చుచేసి సర్పంచ్‌గా వేలం ద్వారా వచ్చిన నాయకుడు ప్రజలకు ఏం మేలు చేస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ అధికారి ఎస్.గోపాల్ రెడ్డి, మాజీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సభ్యులు మన్మథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సోనియమ్మ

సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడి



సాక్షి, న్యూఢిల్లీ: జూన్ 2న పరేడ్ గ్రౌండ్‌లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది ఉత్సవాలకు కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ హాజరు కానున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం సాయంత్రం 10 జన్‌పథ్ నివాసంలో సోనియాతో సీఎం భేటీ అయ్యారు. రాష్ట్ర దశాబ్ది వేడుకలకు రావాలంటూ ఆహ్వానించారు. సుమారు అరగంట సేపు జరిగిన సమావేశానంతరం రేవంత్ మీడియాతో మాట్లాడారు.

4 కోట్ల ప్రజలకు సంతోషకరమైన వార్త

'తెలంగాణ రాష్ట్రం ఏర్పాటై పదేళ్ల పూర్తి అవుతున్న సందర్భంగా జరుపుతున్న ఉత్సవాల్లో సోనియా భాగస్వామ్యం కావాలని ప్రజలు కోరుకుంటున్నారు. రాష్ట్ర మంత్రివర్గం కూడా ఈ మేరకు తీర్మానం చేసింది. ఈరోజు సోనియాగాంధీని కలిసి ఆహ్వానించాం. అందుకు ఆమె సానుకూలంగా స్పందించారు. ఇది రాష్ట్రంలోని 4 కోట్ల ప్రజలకు సంతోషకరమైన వార్త. సోనియా గాంధీ పర్యటన, అవతరణ ఉత్సవాల కోసం కాంగ్రెస్ శ్రేణులంతా ఎదురుచూస్తున్నాం. రాష్ట్రాన్నిచ్చి తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని నిలబెట్టినందుకు సోనియా గాంధీని సత్కరించడం ద్వారా కృతజ్ఞత తెలియజేయాలని అనుకుంటున్నాం. మా ఆహ్వానాన్ని మన్నించినందుకు కాంగ్రెస్ పార్టీ తరఫున, రాష్ట్ర ముఖ్యమంత్రిగా సోనియాకు ధన్యవాదాలు తెలియజేస్తున్నా.

అందరికీ సముచిత గౌరవం


ప్రజా పాలనలో చేసుకుంటున్న తొలి ఉత్సవాలు ఇవి. తెలంగాణ ఉద్యమంలో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరినీ ఇందులో భాగస్వాముల్ని చేస్తాం. అందరినీ అధికారికంగా ఆహ్వానిస్తున్నాం. వారందరికీ సముచితమైన గౌరవం దక్కుతుంది. ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలో తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. త్వరలోనే ఆ వివరాలు వెల్లడిస్తాం..' అని సీఎం తెలిపారు.

కేసీ వేణుగోపాల్‌తో భేటీ

కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో కూడా రేవంత్ భేటీ అయ్యారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు హాజరు కావాలంటూ ఆహ్వానించారు. సుమారు 40 నిమిషాలకు పైగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర రాజకీయాలు, త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. దీనికి ముందు తుగ్లక్ రోడ్డులోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరుగుతున్న మరమ్మతు పనులను రేవంత్ పరిశీలించారు. బంగ్లా మొత్తం కలియ తిరిగి అధికారులకు కొన్ని మార్పులు సూచించారు. త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. సీఎం సోమవారం అర్ధరాత్రి కేరళ నుంచి ఢిల్లీకి వచ్చారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లారు.

రాజకీయ పార్టీగా బీఆర్ఎస్ గుర్తింపు రద్దు చేయాలి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉపఎన్నికలో ఓట్ల కొనుగోలు చేసేందుకు రూ.30కోట్ల పంపిణీపై చర్యలు తీసుకోవాలి
- ఓట్ల కొనుగోలు ప్రయత్నాలకు సంబంధించిన ఆధారాలు, బ్యాంక్ వివరాలు అందజేశాం
- ఎన్నికల ప్రధానాధికారికి బీజేపీ నేత రఘునందన్‌రావు ఫిర్యాదు



సాక్షి, హైదరాబాద్: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో ఓట్లు కొనుగోలు చేసినందుకు బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారికి బీజేపీ నేత రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. నల్లగొండ-వరంగల్-ఖమ్మం జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో విచ్చలవిడిగా డబ్బు ఖర్చుచేసి అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. మంగళవారం ఈ మేరకు సీఈఓను కలిసి రాతపూర్వకంగా ఫిర్యాదు పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ బ్యాంక్ ద్వారా డబ్బు పంపించిన అకౌంట్, పాన్ కార్డు వివరాలు అందజేసినట్టు తెలిపారు. వాటి ఆధారంగా వెంటనే చర్యలు తీసుకోవాలని, ఆ పార్టీ గుర్తింపు రద్దుచేయాలని కోరినట్టు తెలిపారు. రాజకీయ కార్యకలాపాలకు సంబంధించి ఆదాయపన్ను మినహాయింపు పొందిన బీఆర్ఎస్ బ్యాంక్ ఖాతా ద్వారా రూ.30 కోట్లు పలువురు నాయకులకు బదిలీ చేసి ఎన్నికల అక్రమాలకు పాల్పడిందన్నారు. డబ్బు పంచి ఓట్ల కొనుగోలుతో ఎన్నికల్లో గెలిచేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్, ఎమ్మెల్యేలపై చర్యలతోపాటు బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలని బీజేపీ తరఫున కోరినట్టు తెలిపారు. ఏ బ్యాంక్ ఖాతా ద్వారా ప్రజల నుంచి విరాళాలు సేకరించారో, తిరిగి ఓట్లు కొనుగోలుకు ప్రయత్నించారో ఆ అకౌంట్ వివరాలు సీఈఓకు అందజేశామన్నారు. తాను అందజేసిన వివరాలు, సమాచారానికి అనుగుణంగా చర్యలు తీసుకోకపోతే ఢిల్లీ వెళ్లి చీఫ్ ఎలక్షన్ కమిషనర్‌ను కలిసి బీఆర్ఎస్ అకౌంట్ డిటైల్స్, ఆదాయపు పన్ను మినహాయింపు పొందిన ఆ పార్టీ పాన్ కార్డు వివరాలు అందజేస్తామన్నారు.

క్లుప్తంగా...

ఫోన్ ట్యాపింగ్‌లో బీఆర్‌ఎస్ బాగోతాలు బయటకొస్తున్నాయి

కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నెం, వంశీకృష్ణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యెన్నెం, వంశీకృష్ణ

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బీఆర్‌ఎస్ బాగోతాలు ఒక్కొక్కటీ బయటకొస్తున్నాయని, దీనిపై విచారణ చేసి దోషులను కఠినంగా శిక్షించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరుతామని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్, వంశీకృష్ణ తెలిపారు. గాంధీభవన్‌లో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడుతూ...మాజీ సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన అందరి ఫోన్లు ట్యాపింగ్ చేశారని, బీఆర్‌ఎస్ సొంత నేతలపై, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపైనా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని ధ్వజమెత్తారు. ఈ ఫోన్ ట్యాపింగ్ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ డైరెక్షన్‌లోనే జరిగిందని, అదేవిధంగా 30 మంది బీఆర్‌ఎస్ నాయకుల పాత్ర ఇందులో ఉందని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు ప్రోద్బలంతో తమ ఫోన్లు కూడా ట్యాపింగ్ చేశారని, దీనిపై ఇప్పటికే డీజీపీ, ఐజీపీకి ఫిర్యాదు చేశామని వెల్లడించారు.

కడియం ఫోన్ ట్యాపింగ్ చేయించారు

అవసరమైతే కోర్టుకు వెళ్తా..
మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్ (జనగామ జిల్లా): రాజకీయ దురుద్దేశంతోనే ఎమ్మెల్యే కడియం శ్రీహరి తనతో పాటు తన వెంట ఉన్న నాయకుల ఫోన్లను ట్యాపింగ్ చేయించారని, అవసరమైతే ఈ విషయమై కోర్టుకు కూడా వెళ్తానని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య పేర్కొన్నారు. జనగామ జిల్లా స్టేషన్‌ఘన్ పూర్‌లోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కడియం శ్రీహరిది వెన్నుపోటు రాజకీయాల చరిత్రన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కారు గుర్తుపై ఎమ్మెల్యేగా గెలిచిన కడియం రాజీనామాకు ప్రజలంతా ఎదురుచూస్తున్నా రని చెప్పారు.

జూలై 8 నుంచి ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ

సాక్షి, హైదరాబాద్: హెడ్‌క్వార్టర్స్ యూనిట్ కోటా కింద ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీని జూలై 8 నుంచి సెప్టెంబర్ 8 వరకు నిర్వహించనున్నట్టు మిలిటరీ ఉన్నతాధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీస్ అసిస్టెంట్, అగ్నివీర్ ట్రేడ్స్‌మెన్ పోస్టుల భర్తీకోసం ఈ ర్యాలీ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఈ ఉద్యోగాలకు స్పోర్ట్స్ కోటా కింద దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు జూలై 5న ఉదయం 6 గంటల నుంచి సికింద్రాబాద్ ఏటీసీ సెంటర్, థాపర్ స్టేడియంలో ధ్రువపత్రాలతో హాజరుకావాలన్నారు. స్పోర్ట్స్ కోటా కింద జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏదైనా అథ్లెటిక్ పోటీలో పాల్గొని ఉన్నవారే అర్హులన్నారు. ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకునే అర్హులైన అభ్యర్థులు అదనపు వివరాల కోసం " www. joinindianarmy@nic.in' వెబ్‌సైట్‌లో తెలుసుకోవచ్చని తెలిపారు.

బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్న తులపై దృష్టి పెట్టాలని టీఎస్ యూటీఎఫ్ నేతలు కె.జంగయ్య, చావా రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తొమ్మిదేళ్లుగా పదోన్న తులు, ఆరేళ్లుగా బదిలీలు లేకపోవడం వల్ల ఉపాధ్యాయులకు నష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. గత అక్టోబర్‌లో బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను రిలీవ్ చేసి నూతన పాఠశాలలకు పంపించాలన్నారు.

ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో రిపీటర్ కోర్సులు

సాక్షి, హైదరాబాద్: ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్‌లో రిపీటర్ కోర్సులు విద్యార్థులకు అందుబాటులో ఉన్నట్లు ఒక ప్రకటనలో తెలిపింది. మెడిసిన్, ఇంజనీరింగ్‌లో మొదటి ప్రయత్నంలోనే సీటు సాధించడం అంత సులువు కాదు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది అనుకున్న కాలేజీల్లో సీటు సాధించని వారి కోసం నీట్, జేఈఈ–2025కి ఆకాశ్ ఇన్‌స్టిట్యూట్ ఈ రిపీటర్ కోర్సులను అందించనున్నట్లు వెల్లడించింది. ఒక సంవత్సరం పాటు అందించే కోర్సు ద్వారా మెడిసిన్, ఇంజనీరింగ్ కలను సాకారం చేసుకోవచ్చని తెలిపింది. ఆకాశ్ రిపీటర్ కోర్సులు విద్యార్థుల స్కోర్‌ను మెరుగుపరచడానికి, తద్వారా అనుకున్న కాలేజీలో సీటు పొందడానికి అవకాశముంటుందని పేర్కొంది. నీట్ రిపీటర్ క్లాస్‌రూమ్ విద్యార్థి సూర్యాంశ్ కె.ఆర్యన్ మాట్లాడుతూ 2022లో తన మొదటి ప్రయత్నంలో 592 స్కోర్ కంటే 2023లో రెండో ప్రయత్నంలో 705 స్కోర్‌ను సాధించానని చెప్పాడు.

టాస్క్‌ఫోర్స్ కేంద్రంగా వసూళ్ల పర్వం

బీఆర్‌ఎస్ కోసం ఆర్థిక వనరుల సమీకరణ • గత ప్రభుత్వ హయాంలో సాగిన వ్యవహారం

- కీలకంగా వ్యవహరించిన పి.రాధాకిషన్‌రావు
- శ్రీధర్‌రావును బెదిరించి డబ్బు వసూలు



సాక్షి, హైదరాబాద్: బీఆర్‌ఎస్ అగ్ర నాయకుల ఆదేశాల మేరకు, ఆ పార్టీ కోసం హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీ పి.రాధాకిషన్‌రావు భారీ స్థాయిలో వసూళ్లకు పాల్పడినట్లు అక్రమ ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఉన్న ఏఎస్పీ నాయిని భుజంగరావు పోలీసుల ఎదుట వెల్లడించారు. నగరంలో ఆయనకున్న వనరులను అనుకూలంగా మార్చుకుని ఈ దందాలు చేసినట్లు నేరాంగీకార వాంగ్మూలంలో బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ కేంద్రంగా సాగిన వ్యవహారాలను ఈ వాంగ్మూలాల్లో పోలీసులు పొందుపరిచారు. స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్‌ఐబీ) మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు నాటి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ నవీన్‌రావు పేర్లు చెప్పి సైబరాబాద్ పోలీసులను ప్రభావితం చేసినట్లు పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ అగ్రశ్రేణి నాయకుల ఆదేశాల మేరకు పనిచేసిన రాధాకిషన్‌రావు టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో వ్యాపారులు, ప్రైవేట్ కంపెనీలకు సంబంధించిన సెటిల్‌మెంట్లు పెద్దఎత్తున చేశారు. బీఆర్‌ఎస్ తరఫున పోటీ చేసిన అభ్యర్థుల నగదు రవాణాలోనూ రాధాకిషన్‌రావు కీలకంగా వ్యవహరించారు. దీనికోసం తన టాస్క్‌ఫోర్స్‌ను వినియోగించడంతోపాటు ప్రతిమ, యశోద ఆస్పత్రుల యజమానుల సహకారం తీసుకున్నాడు.

15 ఆపరేషన్లు చేసిన తిరుపతన్న టీమ్

తనతోపాటు ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ తిరుపతన్న హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్, సైబరాబాద్, రాచకొండ స్పెషల్ ఆపరేషన్ టీమ్స్ సహకారం తీసుకున్నారని భుజంగరావు వెల్లడించారు. ప్రతిపక్ష పార్టీలకు చెందిన నగదు పట్టుకోవడం కోసం ప్రత్యేక టీమ్‌తో పని చేశారు. ఇందులో ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, పది మంది కానిస్టేబుళ్లు, మరో పది మంది హెడ్ కానిస్టేబుళ్లను నియమించుకున్నారు. తిరుపతన్న రోజూ గరిష్ఠంగా 40 ఫోన్లు ట్యాప్ చేశారు. తన కార్యాలయంలో మూడు సిస్టమ్స్‌తోపాటు తొమ్మిది లాగర్స్‌ను ఏర్పాటు చేసుకున్నారు. ఇలా వివిధ మార్గాల నుంచి వచ్చిన సమాచారంతో 15 ఫీల్డ్ ఆపరేషన్లు చేశారు. రేవంత్‌రెడ్డి మిత్రులు గాలి అనిల్‌కుమార్ నుంచి రూ.90 లక్షలు, కె.వినయ్‌రెడ్డి నుంచి రూ.1.95 కోట్లు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ ఇన్‌ఫ్రా నుంచి రూ.10.5 కోట్లు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మిత్రు డు సీహెచ్ వేణు దగ్గర రూ.3 కోట్లు, జి.వినోద్‌కు చెందిన విశాఖ ఇండస్ట్రీస్ నుంచి రూ.50 లక్షలు, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మిత్రుడు గిరిధర్ నుంచి రూ.35 లక్షలు, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అత్త ఝాన్సీరెడ్డి నుంచి రూ.90 లక్షలు, ఖమ్మంలో ఫెర్టిలైజర్ సంస్థ యజమాని నుంచి రూ.10 లక్షలు స్వాధీనం చేసు కోవడంలో తిరుపతన్న కీలకంగా వ్యవహరించారు.

శ్రీధర్‌రావును బెదిరించి ఎలక్టోరల్ బాండ్స్

హైటెక్ సిటీలోని హెచ్‌పీసీఎల్ పెట్రోల్ బంక్‌కు సంబంధించి టీవీ5 సాంబశివరావుతో సంధ్య కన్వెన్షన్‌కు చెందిన శరణాల శ్రీధర్‌రావుకు విభేదాలు వచ్చాయి. ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు శ్రీధర్‌రావును భుజంగరావు తన కార్యాలయానికి రప్పించారు. సైబరాబాద్‌లో శ్రీధర్‌రావుపై అనేక క్రిమినల్ కేసులు ఉండటంతో ఆ పేరుతో బెదిరించి, బీఆర్‌ఎస్ పార్టీకి ఫండ్‌గా రూ.15 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీంతో శ్రీధర్ రూ.13 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేయడంతోపాటు సాంబశివరావుకు రూ.2 కోట్లు ఇచ్చారు. ప్రభాకర్ రావు సమీప బంధువు రవీందర్ రావుతోనూ శ్రీధర్‌కు విభేదాలున్నాయి. దీంతో ప్రభాకర్ రావు అనునిత్యం శ్రీధర్‌పై నిఘా ఉంచారు. ఎలక్టోరల్ బాండ్లు ఖరీదు చేసిన తర్వాత కూడా శ్రీధర్‌కు వేధింపులు తప్పలేదు.

ఎస్సీ గురుకులాల్లో పదోన్నతులపై 'సర్వీసు నిబంధనలు' రద్దుచేయాలి

రాష్ట్ర ప్రభుత్వానికి గురుకుల ఉద్యోగుల జేఏసీ వినతి

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లోని ఉద్యోగులందరికీ ఒకే విధమైన సర్వీసు నిబంధనలు వర్తింపజేయాలని తెలంగాణ గురుకుల ఉద్యోగుల జేఏసీ డిమాండ్ చేసింది. ఎస్సీ గురుకుల సొసైటీ పరిధిలోని ఉద్యోగులకు పదోన్నతుల విభాగంలో ప్రత్యేక సర్వీసు నిబంధనలున్నాయని తెలిపింది. సాధారణంగా ఉద్యోగులకు సర్వీసు ఆధారంగా పదోన్నతులు ఇస్తుంటే ఎస్సీ గురుకుల సొసైటీలో ప్రిన్సిపల్ పదోన్నతులకు ఇంటర్వ్యూలు నిర్వహించడం, అందులో వచ్చిన మార్కుల ఆధారంగా పదోన్నతులు ఇస్తున్నారని వెల్లడించింది. ఈ ప్రక్రియ ఉద్యోగుల్లో తీవ్ర మానసిక క్షోభ కలిగిస్తోందని జేఏసీ ప్రతినిధి, తెలంగాణ ఆల్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (టిగారియా) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి నారాయణ ఆందోళన వ్యక్తంచేశారు. అన్ని గురుకులాల్లోని ఉద్యోగులందరికీ ఒకే విధమైన సర్వీసు నిబంధనలుండాలన్నారు. అలాగే ఎస్సీ గురుకుల సొసైటీలో ఉద్యోగుల పదోన్నతులు, నూతన నియామకాల విషయంలో 70:30 నిష్పత్తిని 50:50 నిష్పత్తిలో అమలు చేస్తున్నారని, దీంతో ఉద్యోగులు పదోన్నతులు రాకుండా నష్టపోతున్నారని చెప్పారు. ఈ రెండు అంశాలపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఎస్సీ అభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ముఖ్య కార్యదర్శి సానుకూలంగా స్పందించారని నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు.

కొత్త మద్యం బ్రాండ్లపై నిర్ణయం నాది కాదు

- సోమ్ డిస్టిలరీస్ నుంచి బీర్ల సరఫరా ఆఫర్‌కు స్పందించింది బీసీఎల్ ఎండీనే
- ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు వివరణ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్త మద్యం బ్రాండ్ల అమ్మకాలకు సంబంధించి తాను ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని, తన వద్దకు ఎలాంటి దరఖాస్తులు రాలేదని ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. గతంలో చెప్పిన మాటలకు తాను కట్టుబడి ఉన్నానని, అనుమతులు బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీ తీసుకున్న నిర్ణయమేనని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త మద్యం బ్రాండ్లను ఎక్సైజ్ శాఖ అనుమతించిందని జరుగుతున్న ప్రచారం తప్పని, రాష్ట్రంలో మద్యానికి సంబంధించిన అన్ని నిర్ణయాలు తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారానే జరుగుతాయని పేర్కొన్నారు. ఈ వాస్తవాలను రూఢీ చేసుకోకుండా పత్రికలు తప్పుగా ప్రచురించాయని చెప్పారు. రాష్ట్రంలోని ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్‌ఎల్) లావాదేవీలన్నీ బేవరేజెస్ కార్పొరేషన్ ద్వారా జరుగుతాయని తెలిపారు. దీనికి టీజీబీసీఎల్ ఎండీ/ఎక్సైజ్ కమిషనర్ నేతృత్వం వహిస్తారన్నారు. రాష్ట్రంలో గత ఆరువారాలుగా వివిధ కారణాల వల్ల బీర్ల కొరత ఉందని, బీర్ల వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ప్రజల ఇబ్బందులను పరిష్కరించడానికి బీసీఎల్ ఎండీ మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సోమ్ డిస్టిలరీస్ రాష్ట్రానికి బీర్లు సరఫరా చేసే ఆఫర్‌పై ప్రతిస్పందించారని తెలిపారు. కొత్తగా ఐదు సంస్థలకు బేవరేజెస్ కార్పొరేషన్ అనుమతులు మంజూరు చేసినట్లు తెలిసింది.

హిందూ వివాహ చట్టప్రకారం ఎస్టీలు విడాకులు ఇవ్వొచ్చు

పెళ్లికి సంబంధించిన ఆధారాలు తప్పనిసరి: హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: హిందూ వివాహ చట్టప్రకారం వివాహం చేసుకున్న ఎస్టీలకు అదే చట్టప్రకారం విడాకులు ఇవ్వవచ్చని.. అయితే పెళ్లికి సంబంధించిన అన్ని ఆధారాలు ఉండాలని హైకోర్టు స్పష్టం చేసింది. కామారెడ్డి జిల్లా నస్రూలాబాద్ మండలానికి చెందిన ఓ గిరిజన (లంబాడ) దంపతులు పరస్పర అంగీకారంతో విడాకులు కోరుతూ కామారెడ్డి సివిల్ కోర్టును ఆశ్రయించారు. ఎస్టీకి చెందిన వారికి హిందూ వివాహ చట్టం సెక్షన్ 2(2) వర్తించదని కోర్టు పిటిషన్‌ను తిరస్కరించింది. దీనిపై దంపతులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫున న్యాయవాది సృజన్‌కుమార్‌రెడ్డి వాదనలు వినిపించారు. పిటిషనర్లు పూర్తిగా హిందూ వివాహ చట్ట ప్రకారం వివాహం చేసుకున్నారని.. పెళ్లి కార్డు సహా ఇతర ఆధారాలన్నీ పరిశీలించాల్సిన ట్రయల్ కోర్టు ఆ పని చేయలేదన్నారు. హిందూ లంబాడా వర్గానికి చెందిన వారని.. హిందూ వివాహ చట్టం వారికి వర్తించకపోతే తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిటిషనర్లు లంబాడా వర్గానికి చెందిన వారైనా వివాహం హిందూ సంప్రదాయం ప్రకారం జరిగినందున ట్రయల్ కోర్టు పూర్తి ఆధారాలను పరిశీలించి ఆ మేరకు విడాకులు ఇవ్వవచ్చని స్పష్టం చేశారు. అయితే హిందూ వివాహ చట్టంలోని సెక్షన్ 2(2).. ఇతర సంప్రదాయాల ప్రకారం పెళ్లి చేసుకున్న ఎస్టీలకు వర్తించదని, ఈ కేసుకు మాత్రమే పరిమితమని చెప్పారు. ట్రయల్ కోర్టు నిర్ణయాన్ని కొట్టివేస్తున్నామన్నారు.

ఆర్టీఏ ఆఫీసులపై ఏసీబీ దాడులు

▶ మొదటి పేజీ తరువాయి

వారీగా వివరాలు వెల్లడించింది.

బండ్లగూడలో రూ.48,370 స్వాధీనం

హైదరాబాద్ బండ్లగూడ కార్యాలయంలో జరిపిన సోదాల్లో రూ.48,370 స్వాధీనం చేసుకున్నారు. మలక్‌పేట కార్యాలయంలో రూ.22 వేలు, టోలిచౌకి కార్యాలయంలో రూ.43,360, మణికొండలోని రంగారెడ్డి డీటీసీ కార్యాలయం రూ.23,710 స్వాధీనం చేసుకున్నారు. ఇక నల్లగొండ కార్యాలయంలో రూ.12,200, నిజామాబాద్‌లోని సాలూర్ చెక్‌పోస్టులో రూ.13,500, ఆదిలాబాద్‌లోని భోర్జా చెక్‌పోస్టులో రూ.11,630, మహబూబాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో రూ.61,900, ఖమ్మంలోని అశ్వారావుపేట చెక్‌పోస్టులో రూ.34,050 స్వాధీనం చేసుకున్నారు. మహబూబ్‌నగర్, సిద్దిపేట, కరీంనగర్ కార్యాలయాల్లో సోదాల సందర్భంగా నగదు పట్టుబడనప్పటికీ పలువురు అనధికారిక వ్యక్తులు ఇతరులకు సంబంధించిన ధ్రువపత్రాలతో ఉన్నట్టు గుర్తించారు.



అశ్వారావుపేట బోర్డర్ చెక్‌పోస్టు వద్ద డబ్బులను లెక్కిస్తున్న ఏసీబీ అధికారులు

కొన్నిచోట్ల కొందరు ఉద్యోగులు యూనిఫాం లేకుండానే విధులు నిర్వర్తిస్తున్నట్టు గుర్తించారు. మహబూబ్‌నగర్‌లో డ్రైవింగ్ టెస్టు ట్రాక్ దగ్గర ఒక ప్రైవేట్ కారు ఏర్పాటు చేసి ఒక్కొక్కరి దగ్గర రూ.200 వసూలు చేస్తున్నట్లు గుర్తించారు.

ధ్రువపత్రాలపై ప్రత్యేక కోడ్

సిద్దిపేట ఆర్టీఏ కార్యాలయంలో పలువురు ప్రైవేటు వ్యక్తులు ప్రత్యేక కోడ్ నంబర్లు వేసి ఉన్న కొన్ని ధ్రువపత్రాలతో ఉన్నట్టు గుర్తించారు. నిజామాబాద్‌లోని సాలూరు చెక్‌పోస్టులో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విధులకు హాజరుకాలేదని గుర్తించారు. అశ్వారావుపేట చెక్‌పోస్టులో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ మఫ్టీలో ఉండగా, ఏడుగురు ప్రైవేటు వ్యక్తులు వాహనాల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. ఆదిలాబాద్‌లోని భోర్జా చెక్‌పోస్టులో ప్రైవేటు వ్యక్తులకు నెలకు రూ.8 వేల చొప్పున జీతం చెల్లిస్తూ వారితో లారీడ్రైవర్ల వద్ద నుంచి డబ్బులు వసూలు చేయిస్తున్నట్టు తనిఖీల్లో భాగంగా గుర్తించారు. మంగళవారం నాటి దాడుల సందర్భంగా వివిధ ఆర్టీఏ కార్యాలయాల్లో గుర్తించిన అక్రమాలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ప్రభుత్వానికి సమగ్ర నివేదిక పంపనున్నట్టు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064లో ఫిర్యాదు చేయాలని ఉన్నతాధికారులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

లారీ డ్రైవర్ల వేషధారణలో..

- అశ్వారావుపేట చెక్‌పోస్టుపై ఏసీబీ దాడులు
- అదుపులో ఎంవీఐ, ప్రైవేటు సిబ్బంది

అశ్వారావుపేట: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట శివారులో ఉన్న రవాణా శాఖ చెక్‌పోస్టు వద్ద తనిఖీలకు ఏసీబీ అధికారులు లారీ డ్రైవర్ల వేషధారణలో వెళ్లారు. ఏపీకి సరిహద్దునే ఉన్న ఈ చెక్‌పోస్టు వద్ద సిబ్బంది లారీ డ్రైవర్ల నుంచి అక్రమంగా నగదు వసూలు చేస్తున్నట్టు గుర్తించారు. ప్రైవేట్ వ్యక్తులను నియమించి.. లారీ సామర్థ్యాన్ని బట్టి పాసింగ్ పేరుతో డబ్బు వసూలు చేస్తున్నారు. 10 టైర్ల లారీకి ఒక రేటు, 12 టైర్ల లారీకి మరో ధర ఉంది. ఇందుకోసం చెక్‌పోస్టులో ఒక ట్రే పెట్టారు. లారీ డ్రైవర్లు తాము చెల్లించాల్సిన మొత్తాన్ని ఆ ట్రేలో వేసి వెళ్లాలి. లారీకి సంబంధించిన అన్ని పత్రాలు సక్రమంగా ఉన్నా సరే మామూళ్లు సమర్పించాల్సిందేనని తెలిసింది. ఏసీబీ అధికారులు ఉన్న సమయంలో కూడా కొందరు లారీ డ్రైవర్లు ఇలా డబ్బు ఇచ్చి వెళ్లారు. ఇక్కడ ప్రైవేట్ సిబ్బంది నుంచి రూ.28 వేలు, ట్రే లోని రూ.7 వేలు స్వాధీనం చేసుకున్నామని ఏసీబీ అధికారులు చెప్పారు. విధి నిర్వహణలో ఉన్న ఎంవీఐ యూనిఫాం కూడా వేసుకోలేదని తెలిపారు. ఎంవీఐతో పాటు ప్రైవేట్ సిబ్బందిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని చెప్పారు.

హైకోర్టు జడ్జీల ఫోన్‌లనూ

ట్యాప్ చేశాం

▶ మొదటి పేజీ తరువాయి

ట్రాన్స్‌కోలో పనిచేశారు. పదోన్నతి పొందిన తర్వాత 2014–15 మధ్య ఎస్‌ఐబీలో డీఎస్పీగా పని చేశారు. అదనపు ఎస్పీగా పదోన్నతి పొందిన తర్వాత 2021లో డిప్యుటేషన్‌పై నిఘా విభాగంలోకి వెళ్లారు. గత ఏడాది డిసెంబర్ 16 వరకు పొలిటికల్ ఇంటెలిజెన్స్ వ్యవహారాలు పర్యవేక్షించారు.

బీఆర్‌ఎస్‌ను మళ్లీ అధికారంలోకి తేవడానికి...

భుజంగరావు ఇంటెలిజెన్స్‌లో టాప్ సీక్రెట్ సెల్ అనే స్పెషల్ వింగ్‌ను పర్యవేక్షించారు. ఇందులో తనకు నమ్మకస్తులైన ఇన్‌స్పెక్టర్లు చలపతి, శ్రీధర్, ఎస్సై సెయింట్ ప్రభాకర్ రాజు, ఏఎస్సైలు నర్సింగ్ రావు, జంగయ్య కీలకంగా వ్యవహరించారు. భుజంగరావు రాజకీయ నాయకుల కార్యకలాపాలతోపాటు అసమ్మతి నేతలు, ప్రతిపక్ష పార్టీల్లోని పరిస్థితులను గమనిస్తూ వివరాలను ఉన్నతాధికారులకు ఇచ్చేవారు. ఇంటెలిజెన్స్‌లో పని చేస్తుండగానే భుజంగరావుకు ప్రభాకర్ రావుతో పరిచయం ఏర్పడింది. ఇద్దరి సామాజిక వర్గం ఒకటే కావడంతో బాగా దగ్గరయ్యారు. ప్రభాకర్‌రావు 2020 జూన్‌లో పదవీ విరమణ చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆయన్ను ఓఎస్డీ హోదాలో చీఫ్ ఆఫ్ ఆపరేషన్స్‌గా నియమించింది. అప్పటి ప్రభుత్వ పెద్దల ఆశీర్వాదంతో 2020 నవంబర్‌లో నిఘా విభాగాధిపతిగా నియమితులయ్యారు. అప్పటి నుంచి ఆయన తన సామాజిక వర్గానికి చెందిన, తనకు నమ్మకమైన వారిని నిఘా విభాగంలోకి తీసుకురావడం ప్రారంభించారు. డీఎస్పీ ప్రణీత్‌రావు, అదనపు ఎస్పీగా రిటైర్ అయిన వేణుగోపాల్ రావు, అదనపు ఎస్పీ తిరుపతన్న , వెంకట్రావు ఇలా ఎస్‌ఐబీలోకి వచ్చినవారే. ప్రత్యర్థి పార్టీల నాయకులతోపాటు బీఆర్‌ఎస్‌లోని తిరుగుబాటుదారులను పర్యవేక్షించడం, వారికి సంబంధించిన ఆర్థిక వనరులను దెబ్బతీయడం ద్వారా బీఆర్‌ఎస్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావడానికి వీళ్లు పని చేశారు. దీనికోసం ఎస్‌ఐబీ, నిఘా విభాగాల్లో ఉన్న అన్ని వనరులనూ వినియోగించుకున్నారు.

ఎవరి నిఘాకు చిక్కకుండా...

హైదరాబాద్ నగరంపై పట్టు నిలుపుకోవడం కోసం బీఆర్‌ఎస్ నాయకులు పి.రాధాకిషన్‌రావును టాస్క్‌ఫోర్స్ ఓఎస్డీగా నియమించుకున్నారు. ఇన్‌స్పెక్టర్ గట్టుమల్లు రాధాకిషన్ రావు ద్వారానే ఎస్‌ఐబీలోకి వచ్చారు. భుజంగరావు సహా అంతా బీఆర్‌ఎస్ కోసం పనిచేసేలా ఒప్పించిన ప్రభాకర్‌రావు అందుకు ప్రతిఫలంగా వారికి యాక్సిలేటరీ పదోన్నతులు, వివిధ పతకాలతోపాటు ఇన్సెంటివ్స్ కూడా ఇప్పించేవాడు. వీళ్లంతా ఎవరి నిఘాకు చిక్కకుండా ఉండేందుకు వీళ్లంతా వాట్సాప్ వంటి ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్‌లోనే సంప్రదింపులు జరిపారు. 2018కి ముందు అప్పటి నిఘా చీఫ్ నవీన్ చంద్ ద్వారా ప్రభాకర్‌రావు ఏర్పాటు చేయించిన స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్‌ఓటీ) పని తీరు రానురాను మారిపోయింది. ప్రణీత్‌రావు చేతికి వచ్చిన తర్వాత కేవలం అక్రమ ఫోన్ ట్యాపింగ్ కోసమే పని చేసింది. బీఆర్‌ఎస్ రాజకీయ ప్రత్యర్థుల సమాచారాన్ని సేకరించే భుజంగరావు ఆ వివరాలను ప్రభాకర్‌రావుతోపాటు ప్రణీత్‌కు ఇచ్చి వారి ఫోన్లు ట్యాపింగ్ చేయించేవాడు. మునుగోడు ఉప ఎన్నికల సమయంలో ప్రణీత్ ఇచ్చిన సమాచారంతోనే ఆ పట్టణ శివార్లలో రూ.కోటి నగదు పోలీసులు స్వాధీనం చేసుకోగలిగారు.

వాట్సాప్ గ్రూప్‌ల ఏర్పాటు

సాధారణంగా నిఘా విభాగం ఓ ఫోన్ నంబర్‌ను నిఘాలో ఉంచాలన్నా, ట్యాప్ చేయాలన్నా అదనపు డీజీ అనుమతి తీసుకోవాలి. అయితే ఆ అవసరం లేకుండా నేరుగా ఏ నంబర్ అయినా ట్యాప్ చేసే స్వేచ్ఛను భుజంగరావుకు ప్రభాకర్ రావు ఇచ్చారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేసీఆర్ కామారెడ్డిలోనూ పోటీ చేశారు. ఆయన్ను గెలిపించడం కోసం ప్రతిపక్ష పార్టీల నేతలను దెబ్బతీయడానికి ప్రభాకర్‌రావు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. బీజేపీ అభ్యర్థి కె.వెంకట రమణారెడ్డి, రేవంత్‌రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డి కదలికలను ట్రాక్ చేయడానికి డీఎస్పీ తిరుపతన్న నేతృత్వంలో ప్రత్యేక బృందం పని చేసింది. దీనికోసం ప్రణీత్ ఎస్‌ఐబీ టీమ్‌తో 'కేఎంఆర్'పేరుతో ప్రత్యేక వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశారు. గత ఎన్నికల సమయంలో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో ప్రతిపక్షాలకు చెందిన నగదును పట్టుకోవడానికీ తిరుపతన్న టీమ్ పని చేసింది. దీనికోసం 'పోల్–2023'పేరుతో మరో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. దాదాపు 15 కీలక ఆపరేషన్లలో ప్రతిపక్షాలకు చెందిన నగదు పట్టుకోవడంతోపాటు ఇతర చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేశారు.

విద్యార్థి, కులసంఘాల నాయకుల పైనా...

ప్రభాకర్‌రావు నేతృత్వంలోని ఎస్‌ఐబీ అధికారులు ప్రభుత్వాన్ని విమర్శించే విద్యార్థి సంఘాల, కులసంఘాల నాయకుల పైనా నిఘా ఉంచారు. జర్నలిస్టులు, హైకోర్టు న్యాయమూర్తులు, ప్రభుత్వం, బీఆర్‌ఎస్ నాయకులకు సంబంధించిన ముఖ్యమైన కేసులను వాదించే న్యాయవాదుల ఫోన్లతోపాటు వారి వ్యక్తిగత జీవితాలనూ ప్రభాకర్‌రావు మానిటర్ చేయించారు. ఈ వివరాలన్నీ తెలుసుకోవడం ద్వారా వారిని ప్రభావితం చేయడం లేదా భయపెట్టాలని భావించారు. ఈటల రాజేందర్ బీఆర్‌ఎస్ నుంచి బయటకు రావడంతోపాటు టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీపై ఆందోళన చేయడం, కేటీఆర్, ఎమ్మెల్యేలకు ఎర కేసులపై వ్యాఖ్యలు చేయడం, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ చేయడం తదితర సందర్భాల్లో ఆయన కదలికలు, ఫోన్‌పై నిఘా కొనసాగిందని భుజంగరావు చెప్పారు. ప్రధానంగా ప్రతిపక్షాలను ఇరుకున పెట్టాలని, ఆర్థికంగా దెబ్బతీయాలని బీఆర్‌ఎస్‌కు లాభం చేకూర్చాలనే లక్ష్యాలతోనే తాము పని చేసినట్లు అంగీకరించారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఊహించని విధంగా ఓడిపోవడంతో ప్రభాకర్‌రావు ఆదేశాల మేరకు ట్యాపింగ్, అక్రమ నిఘాకు సంబంధించిన సాక్ష్యాధారాలు ధ్వంసం చేయడానికి భుజంగరావు సహా అధికారులంతా కలిసి కుట్ర చేసి అమలుపరిచారని పోలీసులు కోర్టుకు తెలిపారు.

'గొర్రెల'కు మంగళం!

▶ మొదటి పేజీ తరువాయి

క్రితమే ప్రారంభమైందని, జిల్లాల వారీగా వరుసగా డీడీలు వెనక్కు ఇస్తున్నారని, కొన్ని జిల్లాల్లో రెండు, మూడు రోజుల కిందటే ప్రారంభించామని పశుసంవర్థక శాఖ అధికారులు చెబుతున్నారు. అయితే, సబ్సిడీ గొర్రెల పంపిణీ పథకం కింద ఇప్పటివరకు 4 లక్షల మందికి గొర్రెలు పంపిణీ చేశారు. మరో 3,37,816 మంది గొల్లకుర్మలకు రెండో విడతలో గొర్రెలు ఇవ్వాల్సి ఉండగా, గత ఎన్నికల కంటే ముందు సుమారు 80 వేల మంది రూ.43,750 చొప్పున డీడీలు తీసి గొర్రెలెప్పుడు వస్తాయా అని ఎదురు చూస్తున్నారు. కానీ, ప్రభుత్వం అకస్మాత్తుగా డీడీలు వాపస్ చేస్తుండటం గమనార్హం.

ప్రత్యేక దరఖాస్తు రూపొందించి మరీ...

వాస్తవానికి, ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రజల ముందు పెట్టిన మేనిఫెస్టోలో కూడా గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రస్తావించింది. తాము అధికారంలోకి వస్తే ఈ పథకాన్ని కొనసాగిస్తామని, 90 రోజుల్లో రెండో విడత గొర్రెల పంపిణీ పథకాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చింది. కానీ, అందుకు విరుద్ధంగా ఇప్పుడు ప్రత్యేక దరఖాస్తు రూపొందించి మరీ గొల్లకుర్మలు కట్టిన డీడీలను వారికి వెనక్కు ఇచ్చేస్తుండటం గమనార్హం. అయితే, మంత్రివర్గంలో ఎవరికీ కేటాయించకపోవడంతో సీఎం రేవంత్‌రెడ్డి పరిధిలోకే పశుసంవర్థక శాఖ వస్తుంది. నేరుగా సీఎం పర్యవేక్షణలోకి రావడంతో శాఖ కార్యకలాపాల గురించి ఆయనకు చెప్పేందుకు అధికారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి. అసలు గొర్రెల పథకం గురించి చర్చ జరిగింది ఒక్కసారేనని, ఈ చర్చ తర్వాతే ఉన్నతాధికారులు కొందరిపై రేవంత్ చర్యలు తీసుకున్నారని అధికారులంటున్నారు. అయితే, డీడీలు వెనక్కు ఇవ్వాలని నిజంగానే రేవంత్ ఆదేశాలిచ్చారా లేక అధికారులే చొరవ తీసుకుని ఈ పథకానికి మంగళం పాడేందుకు సిద్ధమవుతున్నారా అన్నదానిపై స్పష్టత రావాల్సి ఉంది. గత ప్రభుత్వ హయాంలో పథకం అమలులో అవినీతి జరిగితే ఈ ప్రభుత్వం పారదర్శకంగా అమలు చేసి గొల్లకుర్మలకు మేలు చేయాలే కానీ ఏకంగా పథకాన్ని తీసేవిధంగా వ్యవహరించడమేంటనే చర్చ జరుగుతోంది. డీడీలు వెనక్కు ఇస్తున్న ప్రక్రియపై గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుత రవీందర్ మాట్లాడుతూ.. గతంలో మాదిరి కాకుండా అవినీతికి తావు లేకుండా నగదు బదిలీ ద్వారా పథకాన్ని అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. డీడీలను వాపస్ చేయడాన్ని వెంటనే నిలిపివేసి అసలు ఈ పథకాన్ని కొనసాగిస్తారా లేదా అన్నదానిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు.

ఇంజనీరింగ్ సీట్ల భర్తీలో అవకతవకలు లేకుండా చూడాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్‌కు బీజేవైఎం విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ సీట్ల భర్తీ విషయంపై ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ లింబాద్రికి రాష్ట్ర బీజేవైఎం విజ్ఞప్తి చేసింది. డొనేషన్ల పేరు మీద తల్లిదండ్రులపై అధిక భారం మోపుతూ ఫీజుల దోపిడీకి పాల్పడుతున్న కళాశాలల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. ఈమేరకు మంగళవారం లింబాద్రికి బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సేవెళ్ల మహేందర్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలు వ్యాపార సంస్థలుగా మారాయని, విద్యార్థుల సీట్లు, స్పాట్ అడ్మిషన్ జరిపే విషయంలో కళాశాలల యాజమాన్యాలు స్లైడింగ్ పద్ధతిలో గ్రూపులు మార్చుకునే విషయంలో పారదర్శకంగా జరిగేటట్లు చూడాలని విన్నవించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న ఇంజనీరింగ్ కళాశాలలపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టి నియంత్రించాలన్నారు. వర్సిటీలకు న్యాయబద్ధంగా వీసీల నియామకం జరిగేలా, అర్హులకు అవకాశం లభించేలా చూడాలని కోరారు. ఈ విషయంలో నియమ నిబంధనలు పాటించకపోతే బీజేవైఎం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. రాష్ట్రంలో మార్పుపేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు, విద్యా వ్యవస్థ పట్ల అలసత్వం వహించకుండా పేద విద్యార్థుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని సీఎంను కోరారు. కార్యక్రమంలో హెడ్‌క్వార్టర్ ఇన్‌చార్జి ఉపాధ్యక్షుడు మహేశ్, యోగి, సంతోష్, సందీప్, చిత్తరంజన్, తరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.



దేని మీదా ఆరాటం, తపన లేని మనసు... మలినరహితమైన ప్రజ్ఞ, సమతలను పొందుతుంది.
– బుద్ధదాస భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి
బుధవారం, 29 మే 2024

ఈ పాపం ఎవరిది?

గత వారం జరిగిన అగ్ని ప్రమాదాలు దేశాన్ని ఉలిక్కిపడేలా చేశాయి. ఇరవై నాలుగు గంటల్లో వేర్వేరు చోట్ల సంభవించిన ఈ ప్రమాదాల్లో అభం శుభం తెలియని పలువురు చిన్నారులతో సహా 40 మంది ప్రాణాలు కోల్పోవడం పెను విషాదం. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఓ గేమింగ్ జోన్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదంలో 33 మంది, అదే రాత్రి తూర్పు ఢిల్లీలోని పిల్లల ఆసుపత్రిలోని ఘోర ప్రమాదంలో నవజాత శిశువులు ఏడుగురు దుర్మరణం పాలైన ఘటనలు సున్నిత మనస్కుల్ని చాలా కాలం వెంటాడనున్నాయి. ఆక్సిజన్ సిలిండర్ల పేలుడు సంభవించిన ఆ ఆసుపత్రి లైసెన్స్ గడువు రెండు నెలల క్రితమే తీరిపోతే, రాజ్‌కోట్ గేమింగ్ జోన్ నిరభ్యంతర పత్రమే (ఎన్‌ఓసీ) లేకుండానే యథేచ్ఛగా నడుస్తుండడం మన వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది. నిబంధనల అమలులో అధికార యంత్రాంగం నిర్లక్ష్యం మరోసారి బహిర్గతమైంది. అగ్నిప్రమాద నివారణ నిబంధనలు, భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరంపై మరోసారి చర్చ మొదలైంది.

తాజా ఘటనల నేపథ్యంలో – పాతికేళ్ళ పైచిలుకు క్రితం 1997లో ఢిల్లీలో జరిగిన ఉపహార్ సినిమా హాలు ప్రమాదం మొదలు 2004లో 90 మంది పాఠశాల విద్యార్థులను బలి తీసుకున్న కుంభకోణం అగ్నిప్రమాదం దాకా పాత పీడకలలు మళ్ళీ గుర్తుకొస్తున్నాయి. గతం నుంచి మనం ఏం పాఠాలు నేర్చుకున్నామని నిలదీస్తున్నాయి. వాణిజ్య సంస్థల నుంచి నివాస ప్రాంగణాల దాకా అన్ని చోట్లా ఇవాళ ప్రాథమిక భద్రతా ఏర్పాట్లు మృగ్యమైపోతున్నాయి. అనుకోనిది ఏం జరిగినా పదుల కొద్దీ ప్రాణాలను ప్రమాదంలో పెడుతున్నాయి. మే 26 నాటి ప్రమాదంలో శిక్షణ పొందిన వైద్య సిబ్బంది కానీ, ప్రమాద భద్రతా సర్టిఫికెట్ కానీ, చివరకు అగ్ని ప్రమాద నివారణ సామగ్రి కానీ, సరైన నిష్క్రమణ మార్గాలు కానీ లేకుండానే ఢిల్లీ లాంటి చోట ఒక ఆసుపత్రి నడుస్తోందంటే ఏమనాలి? రాజ్‌కోట్ గేమింగ్ జోన్‌లో ఎలాంటి కనీస అగ్నిప్రమాద భద్రతా లేకుండా దాదాపు రెండంతస్తుల భవనం ఎత్తున రేకులతో పెద్ద నిర్మాణం చేపడితే అధికారులు ఏం చేస్తున్నట్టు? ఆ ప్రాంగణంలో 2 వేల లీటర్ల పెట్రోల్, లెక్కకు మిక్కిలి టైర్లు నిల్వ చేస్తుంటే అడ్డుచెప్పే నాథుడు లేడా?

ఒక్క ఢిల్లీలోనే గత రెండేళ్ళ పైచిలుకు కాలంలో 66 ఆసుపత్రుల్లో అగ్నిప్రమాదాలు జరిగాయని గణాంకాలు చెబుతున్నాయి. దీన్నిబట్టి, అగ్నిప్రమాద నివారణ నిబంధనలు ఎంతగా ఉల్లంఘనకు గురవుతున్నాయో స్పష్టమవుతోంది. సాక్షాత్తూ మన దేశ రాజధానిలోనే ఇలా ఉంటే, దేశంలోని ఇతర ప్రాంతాల్లో పరిస్థితిని ఇట్టే ఊహించుకోవచ్చు. మన దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు ఇప్పటికీ అంతంత మాత్రమే. మూడేళ్ళ క్రితం దేశంలో కరోనా మహమ్మారి విజృంభించి, డెల్టా వేరియంట్ విలయ తాండవం చేసినప్పుడు ఆ నిష్ఠురసత్యం మన కళ్ళ ముందు కనిపించింది. ప్రభుత్వ రంగంలో ఆరోగ్య రంగం అలా కునారిల్లుతుండడం వల్లే, ఆ లోటును పూడ్చడానికి ప్రైవేట్ రంగం అవసరం ఉంటోంది. జనం ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్‌లు, తదితరాలపై ఆధారపడడం ఎక్కువవుతోంది. సరిగ్గా ఈ కారణాల రీత్యానే ప్రైవేట్ ఆరోగ్యరక్షణ రంగంలో భవనాల మొదలు నాణ్యమైన మందులు, సేవల వరకు అన్నింటిలో కనీసపాటి భద్రతా ప్రమాణాలు తప్పనిసరి. కానీ, చాలాచోట్ల అవి హుళక్కి. తాజా ఘటనలే అందుకు తార్కాణం.

నిజానికి, మన దేశంలో అగ్నిప్రమాదాల నుంచి భద్రతకు కీలకమైన ప్రమాణంగా జాతీయ నిర్మాణ నిబంధనావళి (ఎన్‌బీసీ) ఉంది. 1970లోనే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) దీన్ని ప్రచురించింది. 2016లో సైతం దాన్ని నవీకరించారు. అగ్నిప్రమాద నివారణ అనేది రాష్ట్ర జాబితాలోని అంశమైనా, అన్ని రాష్ట్రాలూ దీన్ని పాటించడం తప్పనిసరి. ఇవి కాక స్థానిక భవననిర్మాణ చట్టాల్లోనూ కావాల్సినన్ని కఠిన నియమ నిబంధనలున్నాయి. అయితే, అవి తరచూ ఉల్లంఘనకు గురవుతున్నాయి. తాజా ప్రమాదాల్లోనూ అదే జరిగింది. ఆ మాటకొస్తే, గడచిన 2022లోనే మన దేశంలో 7500 పైగా అగ్నిప్రమాదాలు జరిగాయని తాజా నివేదిక. వాటిలో కనీసం 7435 మంది మరణించినట్టు ప్రమాద మరణాలు, ఆత్మహత్యలపై తాజా నివేదిక మాట. నిన్నటి ఢిల్లీ ప్రమాదంలో సైతం అగ్నిమాపక సిబ్బంది వేగంగా స్పందించి, పక్కనున్న భవనం నుంచి నిచ్చెన ఎక్కి, ఆసుపత్రి వెనకవైపు నుంచి వెళ్ళబట్టి కనీసం అయిదుగురు శిశువుల్ని ఆఖరు క్షణంలో కాపాడగలిగారు. లేదంటే ఏమిటి పరిస్థితి? అందుకే, ఇది ప్రభుత్వ యంత్రాంగం అంతటికీ మరోసారి మేలుకొలుపు.

గుజరాత్ లాంటి చోట్ల నిబంధనల్లోని లోపాలను అడ్డం పెట్టుకొని, అహ్మదాబాద్, గాంధీనగర్ సహా అనేకచోట్ల చట్టవిరుద్ధంగా వినోద కార్యకలాపాల వసతులు పుట్టగొడుగుల్లా మొలుస్తున్నాయి. తాత్కాలిక నిర్మాణాలతో భద్రతా ప్రమాణాలను తుంగలో తొక్కి, ప్రాణాలకే ముప్పు తెస్తున్నాయి. దీన్ని అరికట్టాలి. తప్పులు జరిగినప్పుడు సంబంధిత శాఖల అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం పరిష్కారం కాదు. కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలి. మనుషుల ప్రాణాలను తృణప్రాయంగా తీసుకొని కొందరు సాగిస్తున్న దుర్మార్గ వ్యాపారాలకు అడ్డుకట్ట వేయాలి. ఎవరినీ ఉపేక్షించేది లేదనే సంకేతాలు మాటల్లోనే కాదు చేతల్లోనూ చూపాలి. ప్రమాదాల నివారణకు సమర్థ, ప్రామాణిక చర్యల ప్రణాళికను అమలుచేయాలి. దీనికి ముందు రాజకీయ నేతల చిత్తశుద్ధి అవసరం. ఆపైన అలాంటి వసతులనే ఎంచుకోవడంలో సామాన్యుల అప్రమత్తత కీలకం. దేశవ్యాప్తంగా అధికారులు రంగంలోకి దిగి, చర్యలు చేపట్టేందుకు ప్రమాద భద్రతపై సత్వరమే జాతీయ స్థాయి ఆడిట్ జరిపితే మేలు. నేతల సంతాపాలు, నష్టపరిహారాలు మనుషుల ప్రాణాల్ని వెనక్కి తీసుకురాలేవు.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు
వైశాఖ మాసం, **తిథి:** బ.షష్ఠి ప.1.18 వరకు, తదుపరి సప్తమి
నక్షత్రం: శ్రవణం ఉ.8.41 వరకు, తదుపరి ధనిష్ట
వర్జ్యం: ప.12.27 నుండి 1.58 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.32 నుండి 12.24 వరకు, **అమృతఘడియలు:** రా.9.31 నుండి 11.02 వరకు.

సూర్యోదయం : 5.29
సూర్యాస్తమయం: 6.25
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

ఇజ్రాయెల్‌పై కొత్త ఒత్తిళ్లు

విశ్లేషణ



టంకశాల అశోక్

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తూ కొత్తగా నార్వే, స్పెయిన్, ఐర్లాండ్ ప్రకటన చేయడం ఇజ్రాయెల్ మీద ఒత్తిడిని పెంచింది. ప్రస్తుతం రఫా మీద భీకర దాడులు చేస్తున్న ఇజ్రాయెల్ ఇప్పటివరకూ సుమారు 36,000 మంది పాలస్తీనియన్ల మరణానికి కారణమైంది. అంతర్జాతీయ నేర న్యాయస్థానం ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ ఏకంగా గాజా నేరాలపై విచారణ కోసం నెతన్యాహూకు అరెస్టు వారెంట్లు జారీ చేయవలసిందిగా కోర్టుకు ప్రతిపాదించారు. నిరుడు అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్ల దాడిలో సుమారు 1200 మంది యూదులు మృతి చెందడానికి ప్రతీకారంగా తమ ఆత్మ రక్షణ కోసం హమాస్‌ను పూర్తిగా నిర్మూలించటం తమ లక్ష్యమనీ, తమను నిందించవలసింది లేదనీ ఇజ్రాయెల్ వాదిస్తున్నది. దీన్ని ప్రపంచం నిరాకరిస్తున్నది.

పాలస్తీనాను స్వతంత్ర దేశంగా గుర్తిస్తున్నట్లు మూడు యూరోపియన్ రాజ్యాలు ఈ నెల 22న ప్రకటించటంతో ఇజ్రాయెల్‌కు కొత్త చిక్కులు మొదలవుతున్నాయి. అమెరికా ఒత్తిళ్లను సైతం తోసిపుచ్చి నార్వే, స్పెయిన్, ఐర్లండ్‌లు ఈ ప్రకటన చేయటం గమనార్హం. పైగా వీటిలో నార్వే, స్పెయిన్ నాటో సభ్య దేశాలు. పాలస్తీనాను ప్రపంచంలో ఇప్పటికే 143 దేశాలు గుర్తించినందున ఆ జాబితాలో ఈ మూడు కూడా చేరటం వల్ల సాధారణంగానైతే విశేషం ఉండదు. కానీ ఇజ్రాయెల్ సైన్యం గాజాలో గత ఆరు మాసాలుగా సాగిస్తున్న మారణహోమం పట్ల ప్రపంచ వ్యాప్తమైన తీవ్ర నిరసనల మధ్య సైతం అమెరికన్ ప్రభుత్వం ఇజ్రాయెల్‌కు అడుగడుగునా మద్దతునిస్తున్న స్థితిలో, ఈ మూడు దేశాల ప్రకటనకు తగిన ప్రాముఖ్యత ఏర్పడుతున్నది.

వీరి నిర్ణయంతో ఇజ్రాయెల్‌పై కలిగిన ఒత్తిడికి రుజువు కొద్ది గంటలలోనే కనిపించింది. నార్వే, ఐర్లండ్, స్పెయిన్‌ల నుంచి తమ రాయబారులను నెతన్యాహూ ప్రభుత్వం వెనక్కి రప్పించింది. తమ రాజధాని టెల్ అవీవ్‌లో గల ఆ మూడు దేశాల రాయబారులను పిలిపించి నిరసనను తెలియజేసింది. వారు పాలస్తీనియన్ల తీవ్రవాదాన్ని సమర్థిస్తున్నారనీ, తమకు గల ఆత్మ రక్షణ హక్కును గుర్తించటం లేదనీ, సమస్య పరిష్కారానికి ఆటంకాలు సృష్టిస్తున్నారనీ వ్యాఖ్యానించింది. అదే సమయంలో, గాజాపై తమ యుద్ధం యథావిధిగా కొనసాగగలదని స్పష్టం చేసింది. దీనిని బట్టి, మూడు యూరోపియన్ దేశాల ప్రకటన ఇజ్రాయెల్‌పై ఏవిధంగా ప్రత్యేకమైన ఒత్తిడిని సృష్టించిందో గ్రహించవచ్చు.

ఈ విధమైన తీవ్ర ఒత్తిడి ఇది మూడవది కావటం మరొక గమనించదగ్గ పరిణామం. గతవారం ద హేగ్ లోని అంతర్జాతీయ నేర న్యాయస్థానం (ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టు) ప్రాసిక్యూటర్ కరీం ఖాన్, గాజా నేరాలపై విచారణ కోసం నెతన్యాహూకు అరెస్టు వారెంట్లు జారీ చేయవలసిందిగా కోర్టుకు ప్రతిపాదించారు. అది ప్రపంచ వ్యాప్తంగా పెద్ద సంచలనమైంది. ఇజ్రాయెల్ అయితే భూమ్యాకాశాలను ఏకం చేయటం మొదలుపెట్టింది. అమెరికన్ బైడెన్ ప్రభుత్వమైతే కోర్టును ఖండించటమే గాక, ఆ న్యాయమూర్తులపై ఆంక్షలు విధించగలమనే స్థాయికి వెళ్ళింది. విశేషమేమిటంటే, స్వయంగా నాటో సభ్య దేశాలైన ఫ్రాన్స్, బెల్జియం మొదలైనవి కరీం ఖాన్ ప్రతిపాదనలను బలపరిచాయి. ఇందులో మరో విశేషం ఉన్నది. ఈ నాటో రాజ్యాలు ఒకవైపు అమెరికాతో పాటు ఇజ్రాయెల్‌కు ఆయుధ సరఫరా చేస్తున్నాయి. మరొకవైపు ఐక్యరాజ్య సమితిలో, భద్రతా సమితిలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా అమెరికా ఓటు వేస్తున్నా అవి మాత్రం ఓటు వేయటం లేదు. పైగా ఇప్పుడు కరీం ఖాన్ చర్యను సమర్థిస్తున్నాయి. ఇది ఒక స్థాయిలో పరస్పర విరుద్ధమైన వైఖరి. కానీ వారనేది, ఇజ్రాయెల్ ఆత్మరక్షణ చేసుకోవలసిందే గానీ అంతర్జాతీయ నియమ నిబంధనలను ఉల్లంఘించకూడదని!



మొత్తానికి క్రిమినల్ కోర్టు పరిణామం ఇజ్రాయెల్‌పై ఇటీవలనే ఏర్పడిన మరొక ఒత్తిడి. ప్రాసిక్యూషన్ వారంట్ల జారీ ముగ్గురు హమాస్ అగ్ర నేతలకు కూడా జరగాలని కరీం ఖాన్ సిఫారసు చేశారు. దానిని హమాస్ కూడా ఖండించింది. కానీ ఇజ్రాయెల్ స్పందనలు విపరీత స్థాయిలో ఉన్నాయి. అమెరికాతో పాటు ఆ శిబిరానికి చెందిన కొన్ని దేశాలు అందుకు తోడయ్యాయి. ఇంతకూ కరీం ఖాన్ ప్రతిపాదనను చివరికి కోర్టు ఆమోదిస్తుందా, మార్పులు చేస్తుందా, తిరస్కరిస్తుందా తెలియదు. ఒకవేళ ఆమోదిస్తే పరిస్థితి ఏమిటన్నది ప్రశ్న. హమాస్ నేతలు అజ్ఞాతంలో ఉన్నందున వారి అరెస్టు సాధ్యం కాదు. నెతన్యాహూ ఇజ్రాయెల్‌లో ఉన్నంతకాలం ఆయన అరెస్టూ వీలు కాదు. ఇందులో మరొక మెలిక ఉంది. కోర్టులో సభ్యత్వం గల దేశాలకు వెళ్లినట్టయితే మాత్రమే వారంట్లు వర్తిస్తాయి. ఆ యా ప్రభుత్వాలు వారిని అరెస్టు చేయక తప్పదు. ప్రస్తుతం ఆ సభ్య దేశాల సంఖ్య 124. వాటిలో అమెరికా, రష్యా, చైనా, ఇండియా వంటివి లేవు. సభ్య దేశాలలో అమెరికా లేదు గాని యూరోపియన్ యూనియన్‌లోని మొత్తం 27 దేశాలకూ సభ్యత్వం ఉంది. ఇది నెతన్యాహూకే గాక అమెరికాకు కూడా చాలా చిక్కులు తెచ్చి పెట్టే స్థితి. నెతన్యాహూకు వారంట్లు జారీ కావచ్చుననే చర్చ ఇప్పటికే వారం రోజులుగా సాగుతున్నది. దానితో, ఏమి చేయాలంటూ అమెరికా, యూరోప్ ఇప్పటికే తలలు పట్టుకుంటున్నాయి. కొందరు అటు, కొందరు ఇటుగా చీలిపోయారు. వారికి సంకట పరిస్థితి ఏమంటే, ప్రపంచ వ్యవహారాలన్నీ నియమ నిబంధనల ప్రకారం సాగాలని పట్టుదలగా వాదించేది వారే. అటువంటప్పుడు, తామే ఒప్పందంపై సంతకాలు చేసిన అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు వారంట్లను ఎట్లా తిరస్కరించగలరు? ఈ స్థితి నెతన్యాహూను గత పదిరోజులుగా భయపెడుతున్నది.

ఆయనపై తీవ్రమైన ఒత్తిడిని సృష్టించిన మూడవ పరిణామం అంతర్జాతీయ న్యాయస్థానం గత జనవరిలో చెప్పిన వ్యతిరేక తీర్పు. గాజాలో ఇజ్రాయెల్ అమాయక పౌరుల సామూహిక హననానికి, విధ్వంసానికి పాల్పడుతున్నదనీ, వేలాదిమంది స్త్రీ పురుషులు, పిల్లలు, వృద్ధులు, రోగులు ప్రాణాలు కోల్పోయారనీ, ప్రజలకు ఆహార పానీయాలు, మందులు సైతం అందకుండా నిర్బంధాలు విధిస్తున్నారనీ దక్షిణాఫ్రికా ప్రభుత్వం ఆ న్యాయస్థానంలో కేసు వేసింది. అప్పుడు కూడా ఇజ్రాయెల్ నానా హంగామా సృష్టించింది. అయినా కోర్టు ఇజ్రాయెల్‌కు వ్యతిరేక తీర్పునిచ్చింది. అయినప్పటికీ ఇజ్రాయెల్ మారణకాండ ఆగలేదు. దక్షిణాఫ్రికా ఆరోపణలు నిజమైనట్లు అనేక స్వతంత్ర సంస్థల నివేదికలే గాక, సాక్షాత్తూ ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆహార సంస్థ, ప్రపంచ ఆరోగ్య సంస్థ, మానవ హక్కుల సంస్థల నివేదికలు కూడా ధ్రువీకరించాయి. అయినప్పటికీ, నిరుడు అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్ల దాడిలో సుమారు 1200 మంది యూదులు మృతి చెందడానికి ప్రతీకారంగా తమ ఆత్మ రక్షణ కోసం హమాస్‌ను పూర్తిగా నిర్మూలించటం తమ లక్ష్యమనీ, ఆ క్రమంలోనే ఇప్పటికి దాదాపు 35,000 పాలస్తీనియన్లు మరణించారనీ, అందులో తమను నిందించవలసింది లేదనీ ఇజ్రాయెల్ వాదిస్తున్నది. ఈ వాదనలను అత్యధిక ప్రపంచం నిరాకరిస్తున్నది.

ఇక్కడ రెండు సమస్యలున్నాయి. మొదటిది, ఇజ్రాయెల్‌కు అమెరికా మద్దతు. రెండవది, మౌలికంగా పాలస్తీనా సమస్య దశాబ్దాల పాటు పరిష్కారం కాకుండా పెచ్చరిల్లుతుండటం. ఇటీవల ఇంత జరుగుతున్నా అమెరికన్లు ఇజ్రాయెల్‌కు వేలకు వేల కోట్ల డాలర్ల ఆయుధాలు సరఫరా చేస్తూ, ఆర్థికసాయం కూడా పంపుతున్నారు. ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఓటు వేస్తూ, భద్రతా సమితిలో వీటోను ఉపయోగిస్తున్నారు. పాలస్తీనా రాజ్యం ఏర్పాటును వ్యతిరేకిస్తూ, అటువంటి ఒప్పందం అంటూ జరిగితే అది ఇజ్రాయెల్, పాలస్తీనియన్ల మధ్య చర్చల ద్వారా జరగవలసిందే తప్ప బయటి జోక్యంతో కాదని విచిత్రమైన వాదన చేస్తున్నారు. మరొకవైపు ఇజ్రాయెల్ మాత్రం పాలస్తీనా ప్రసక్తే లేదనీ, తామే ఆ భూభాగాలను నియంత్రించగలమనీ అంటున్నది. గాజా బయట వెస్ట్ బ్యాంక్ ప్రాంతంలో యూదు సెటిలర్లు క్రమక్రమంగా పెరిగిపోతూ అక్కడి పాలస్తీనియన్లను నిర్మూలిస్తున్నారు. అయినప్పటికీ అమెరికా ఈ విధమైన వైఖరి తీసుకోవటానికి ఏకైక కారణం వారి సామ్రాజ్యవాద ప్రయోజనాలు. మొదటి నుంచి ఇప్పటి వరకూ అంతే. కనుకనే తాము స్వయంగా నిర్వహించిన క్యాంప్ డేవిడ్, ఓస్లో ఒప్పందాల ప్రకారం గానీ, ఐక్య రాజ్యసమితి తీర్మానాల ప్రకారం గానీ పాలస్తీనా దేశాన్ని ఏర్పడనివ్వటం లేదు. వారిని ధిక్కరించి ఇప్పుడు నార్వే, స్పెయిన్, ఐర్లండ్‌లతో కలిపి (ఇండియా సహా) 146 ప్రపంచ దేశాలు స్వతంత్ర పాలస్తీనాను గుర్తిస్తున్నాయి.

వ్యాసకర్త సీనియర్ సంపాదకులు

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

సరైన గౌరవం



జీవితమంతా మీరు కష్టపడ్డందుకు గాను పదవీ విరమణ తర్వాత కూడా మీకు గౌరవం, భద్రత తప్పక ఉండాలి.

– రిషి సునాక్, బ్రిటన్ ప్రధాని

చైనా వేగం



చైనాలో మరో పర్యటన జరిపి వచ్చాను. 6 రోజులు - 5 నగరాలు- 8 ఫ్యాక్టరీలు. ఎప్పటిలాగానే చైనా మనల్ని ఆశ్చర్యంలో ముంచెత్తుతుంది. వేగం, విస్తృతితో భయపెడుతుంది. గత ఐదేళ్లలో విశేషమైన వృద్ధిని చూపిన ఫ్యాక్టరీలను చూశాము. వాటినే ఇండియాలో ఎట్లా అనుసరించవచ్చో నేర్చుకోవడం అనేది ఈ పర్యటన తాలూకు ఒక లక్ష్యం.

– రాహుల్ రాజ్, ఆంట్రప్రెన్యూర్

సాయానికి సిద్ధం



పాపువా న్యూ గినియాలో విధ్వంసకర భూపాతం వల్ల జరిగిన ప్రాణనష్టం తీవ్రమైన బాధ కలిగించింది. బాధిత కుటుంబాలకు మా హృదయపూర్వక నివాళులు. గాయపడ్డవారు వేగంగా కోలుకునేందుకు ప్రార్థిస్తున్నాం. అన్ని రకాలుగా సహాయం అందించేందుకు ఇండియా సిద్ధంగా ఉంది.

– నరేంద్ర మోదీ, ప్రధాని

ఫాసిస్టులతో పోరాడుదాం!



ఈ వీడియోలో (షేర్ చేశారు) పండిట్ రవిశంకర్ తన గురువు బాబా అల్లావుద్దీన్ ఖాన్, గురు మా ఆశీర్వాదాలు తీసుకుంటున్నారు. ఇదిగో ఈ ఇండియానే ఇప్పుడు ఫాసిస్టులతో పోరాడుతోంది. జూన్ 4న మనం గెలవచ్చు, గెలవకపోవచ్చు, కానీ మనం పోరాడకుండా మాత్రం విరమించేది లేదు.

– సంజయ్ ఘోష్, న్యాయవాది

దూషిస్తే ఎలా?



ఇండిపెండెంట్ జర్నలిజాన్ని ప్రోత్సహిస్తున్నట్టుగా కొందరు నటిస్తుంటారు. వాళ్ల ప్రకారం లౌకిక వాదం అంటే ప్రధాని మోదీని దూషించడం, ఆర్‌ఎస్‌ఎస్‌ను దూషించడం, బీజేపీని దూషించడం, భారత సంస్కృతిని దూషించడం! ప్రభుత్వాన్ని స్వేచ్ఛగా విమర్శించండి, కానీ బీజేపీని ఓడించేందుకు దేశాన్నీ, దాని వ్యవస్థలనూ దూషించవద్దు.

– కిరణ్ రిజిజు, కేంద్ర మంత్రి

ఏమవుతున్నారు?



ఇన్ఫోసిస్ ఉద్యోగులు: 30 ఏళ్ల వరకు ఉన్నవారు- 54.7 శాతం; 31-50 ఏళ్లవారు- 42.4 శాతం. 50 పైబడినవాళ్లు- 2.9 శాతం. టీసీఎస్ ఉద్యోగులు: 30 ఏళ్ల వరకు ఉన్నవారు- 50.3 శాతం; 31-50 ఏళ్లవారు- 48.4 శాతం. 50 పైబడిన వాళ్లు- 1.3 శాతం. యాభై ఏళ్లు దాటినవాళ్లు ఐటీలో భారీగా రిటైర్ అవుతున్నారా? లేక, ఇంకెక్కడైనా మేనేజ్‌మెంట్ అవుతున్నారా?

– కిరణ్ కుమార్ ఎస్., విశ్లేషకుడు

ఇండియా తీరు



జనానికి మరోసారి చెబుతున్నాను. సైడ్‌వాక్స్ ఉన్నవి పాదచారుల కోసమేగానీ డ్రైవ్ చేయడానికీ, పార్కింగ్ కోసమూ కాదు. నాకు దిగ్భ్రాంతి కలిగించినది ఏమంటే, ఇతరులనూ, తమ చట్టాలనూ అగౌరవపరచడాన్ని గర్వంగా ఫీలవుతున్నారు. మళ్లీ వాళ్లే ఎప్పుడూ 'వెల్‌కమ్ టు ఇండియా' (భారత్‌కు స్వాగతం) అంటుంటారు. ఇదేనా మీరు ప్రపంచానికి చూపాలనుకునేది?

– ఓల్లీ ఎస్సే, ఇటాలియన్ డీజే

స్వరాష్ట్ర సాధకులెవరో ప్రజలకు తెలుసు

సందర్భం



బి. నర్సన్

2014 జూన్ 2న ఆవిర్భవించిన కొత్త రాష్ట్రం తెలంగాణకు పదేళ్లు పూర్తయిన సందర్భంలో రాష్ట్ర పాలన కాంగ్రెస్ చేతిలోకి రావడం కాల మహిమగానే భావించాలి. ఒకరి కష్టాన్ని మరొకరు సొంతం చేసుకున్నట్లుగా తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు జరగనున్నాయి. రాష్ట్ర సాధనలో తమ పాత్రను ఇప్పుడు కాంగ్రెస్ మరింత గొప్పగా చెప్పుకోవచ్చు. పార్లమెంట్ ఉభయ సభల్లో తెలంగాణ బిల్లు ఆమోదం పొందిన 2014 ఫిబ్రవరిలో కేంద్రంలో కాంగ్రెస్ పాలన ఉండడమే వారికున్న ఏకైక ఊత కర్ర. ఆ బలంతోనే 'తెలంగాణను ఇచ్చిన పార్టీ కాంగ్రెస్' అనే ట్యాగ్ లైన్‌తో తమ పబ్బం గడుపుకుంటున్నారు. అంతే కాకుండా సోనియమ్మ మనసు కరిగి తెలంగాణను ఇచ్చినారు అనే దిగజారుడు మాటతో పాటు తెలంగాణ వాళ్లంతా ఆమెకు ఎంతో ఋణ పడి ఉండాలి, నిత్యం కృతజ్ఞతా జపం చేయాలి అనే స్థాయిలో కాంగ్రెస్ నేతల మాటలు ఉన్నాయి.



కేంద్రంలో కాంగ్రెస్ పాలన 2004 నుండి 2014 దాకా సాగింది. ఆ కాలమంతా తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రజలు ఎన్నో ఉద్యమాలు చేపట్టారు. విద్యార్థులు సమ్మెలు, ఆందోళనలు చేశారు. కవులు, కళాకారులు వేదికలెక్కి ప్రజల ఆకాంక్షను లోకానికి చాటారు. కాలయాపన వల్ల, గుండె కరగని పాలకుల వైఖరికి యువకులు బలిదానాల బాట పట్టారు. రోడ్లపై వంటా వార్పులు, ట్యాంక్ బ్యాండ్‌పై మిలియన్ మార్చ్, 42 రోజుల సకల జనుల సమ్మె వంటివి తెలంగాణ సాధనకు మైలురాళ్ళు. ప్రజలకు కేసీఆర్ నాయకత్వంతో పాటు ఉద్యోగుల, మేధావుల జేఏసీల మొక్కవోని పట్టుదల కాంగ్రెస్ మెడలు వంచి తెలంగాణను సాధించాయనవచ్చు.

కేంద్రంలో కాంగ్రెస్ పాలన ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతంలోని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు తమ పార్టీని ఒప్పించి తెలంగాణను తేలేకపోయారు. వీరి చేతగానితనం వల్లనే ఉద్యమం ఉధృతమై తెలంగాణ ప్రాంతం ఎన్నో కష్టాలను, నష్టాలను అనుభవించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలనలోనే ఉద్యమాన్ని అణచివేసేందుకు పోలీసు, మిలిటరీని ఉపయోగించారు. వేలాది మంది లాఠీ దెబ్బలు తిన్నారు. వందలాదిగా కేసుల పాలై జైలు జీవితం గడిపారు. యుద్ధంలో ప్రజలు విజయం సాధించాక తమ వల్లనే ఆ విజయం సాధ్యపడిందని అనడంలో ఔచిత్యమే లేదు.

తెలంగాణ పదేళ్ల పండుగ కాంగ్రెస్ చేతుల మీదుగా జరగడం ఇక్కడి జనం జీర్ణించుకోలేనిదే. దీని ఘనత దక్కాల్సిన కాంగ్రెసేతరులు ఎందరో ఉన్నారు. రాష్ట్రం కోసం నిర్విరామంగా పాటుపడిన కోదండరాంకు ఎమ్మెల్సీ స్థానం ఇంకా చేతికి చిక్కలేదు. కోర్టు లిటిగేషన్‌లో ఉన్న ఎమ్మెల్సీ సీట్లలో ఆయన పేరు ప్రకటించి కాంగ్రెస్ ముద్ర రాజకీయాన్ని ఆయనకు చూయిస్తున్నారు. తెలంగాణ ఇచ్చింది తామేననే వల్లింపును పక్కనబెట్టి తెలంగాణ సాధనకు కృషి చేసిన వ్యక్తులను గుర్తించి వారిని ఈ సందర్భంగా గౌరవించవలసిన అవసరం ఉంది. అయితే ఈ పండుగ అందరి పండుగలా, రాజకీయాలకు అతీతంగా జరుపుకోవాలి. తెలంగాణ సాధకుడిగా, తొలి పదేళ్ల ముఖ్యమంత్రిగా కేసీఆర్‌ను ప్రస్తుత ప్రభుత్వం సత్కరించడంలో తప్పేమీ లేదు. ప్రజలు కూడా హర్షిస్తారు.

అయితే కాంగ్రెస్ పెద్దల ఆలోచన మరోలా ఉంది. ఆ రోజున తెలంగాణ ఇచ్చిన తల్లిగా సోనియా గాంధీని హైదరాబాద్ రప్పించి ప్రజల తరపున ఆమెను ఘనంగా సన్మానించాలని ప్రభుత్వం తన తలంపును బయటపెట్టింది. పదేళ్లుగా యూపీఏ చైర్ పర్సన్‌గా ఉండి తెలంగాణ ఉద్యమాన్ని ఆమె ఏనాడూ సాకారాత్మకంగా ఆలోచించిన దాఖలాలు లేవు. చివరకు 2014 ఎన్నికల్లో నష్ట నివారణ కోసం తెలంగాణను ఇచ్చారు. ఇదంతా స్పష్టంగా తెలిసిన తెలంగాణ ప్రజలకు సోనియాపై ప్రత్యేక గౌరవమేమీ లేదు. ఆమెను ఈ సందర్భంగా సత్కరించకుంటే వారేమీ చిన్నబుచ్చుకోరు. ఇదంతా రేవంత్ రెడ్డికి కాంగ్రెస్ అధిష్ఠానం వద్ద మైలేజి పెరగడానికి పనికొస్తుంది. కేసీఆర్‌ను దూరం ఉంచితే మాత్రం జనం సానుభూతి ఆయనకు పుష్కలంగా దొరుకుతుంది.

వ్యాసకర్త తెలంగాణ గ్రామీణ బ్యాంకు విశ్రాంత అధికారి । 94401 28169

ప్రజా పాలన... చేపట్టాల్సిన చర్యలు

అభిప్రాయం



శ్రీనివాస్ మాధవ్

లోక్ సభ ఎన్నికలు కాగానే ప్రజా పాలన ప్రారంభించబోతున్నట్లు తెలంగాణ ముఖ్య మంత్రి ప్రకటించారు. ప్రజలు అడగలేక పోయినప్పటికీ-రాష్ట్ర పాలనలో చేపట్టాల్సిన కొన్ని చర్యల గురించి చర్చ అవసరం.

తెలంగాణ రాష్ట్ర అవతరణ తరువాత నూతన పరిపాలనా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయలేదు. ఒక రాష్ట్రానికి ఉండాల్సిన వ్యవస్థలలో ట్రిబ్యునల్ కూడా ఒకటి. అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్స్ చట్టం -1985 ప్రకారం రాష్ట్ర పరిపాలనా ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని కచ్చితంగా నిర్దేశించక పోవటం వెసులుబాటుగా మారింది. ఉద్యోగుల విషయాలకు సంబంధించిన వివాదాల పరిష్కారానికి ప్రత్యామ్నాయ వేదిక ఇది. ట్రిబ్యునల్ ఏర్పాటు జరగనందున చిన్న కేసులు కూడా హైకోర్టు దాకా వెళ్తున్నాయి. దీంతో కోర్టుపై భారం, తీర్పుల్లో జాప్యం పెరిగాయి.



గ్రామ న్యాయాలయాల చట్టం-2008 ప్రకారం కొన్ని గ్రామ పంచాయితీలకు కలిపి అయినా ఒక గ్రామ న్యాయాలయం ఏర్పాటు చేయాలి. చట్టం కచ్చితంగా నిర్దేశించక పోయినప్పటికీ సుప్రీం కోర్టు ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్య విచారణ సందర్భంగా (సివిల్ రిట్ పిటిషన్ 1067/2019) రాష్ట్రాలన్నీ గ్రామ న్యాయాలయాలు ఏర్పాటు చేయవలసిందేనని ప్రకటిస్తూ తెలంగాణపై లక్ష రూపాయల జరిమానా విధించింది. చిన్న చిన్న సివిల్, క్రిమినల్ కేసులు గ్రామ స్థాయిలోనే పరిష్కారం కావడం వల్ల గ్రామీణులకు ప్రభుత్వం పట్ల, న్యాయ వ్యవస్థ పట్ల మరింత నమ్మకం కలుగుతుంది.

ప్రజా సమస్యల కోసం, ఫిర్యాదుల కోసం 'ప్రజా భవన్' అంకితమవడం గొప్ప మార్పు. స్వయంగా ప్రజా భవన్ వెళ్ళి ఫిర్యాదు దాఖలు చేయడంతో పాటు ఆన్ లైన్ ద్వారా కూడా ఈ ఏర్పాటు ఉండాలి. కేంద్ర ప్రభుత్వ సీపీజీఆర్ ఏఎమ్ఎస్ పోర్టల్ సమర్థవంతంగా పని చేస్తోంది. స్వయంగా ప్రధాన మంత్రి పర్యవేక్షణ చేస్తున్నారంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇందులో దాఖలు అయిన 90 శాతం సమస్యలు నెల లోపే పరిష్కరిస్తారు. అలాగే 20 రాష్ట్రాలలో ఇప్పటికే ప్రజా సేవా హక్కు చట్టాలు అమలు చేస్తున్నారు. సేవలలో ఆలస్యం జరిగితే విచారణకు ప్రజా సేవా కమిషన్ ఏర్పాటు కూడా కొన్ని రాష్ట్రాలు చేశాయి. తెలంగాణ ఈ దిశగా ఆలోచించాలి.

మహిళలు, బాలలపై జరిగే హింసను అరికట్టడానికి కొన్ని రాష్ట్రాలు పోలీసు నియామకాల్లో అధికంగా మహిళల నియామకం జరుపుతున్నాయి. తమిళనాడు (18 శాతం), బిహార్ (25 శాతం) రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో 6 శాతం మాత్రమే మహిళలు పోలీసు శాఖలో పని చేసున్నారు. ఇది భారత దేశం లోనే కనిష్ఠ స్థాయి. అలాగే 112 ఇండియా, దిశ వంటి ఎమర్జెన్సీ ఆప్‌లను తెలంగాణలో వెంటనే అందుబాటు లోకి తీసుకు రావాలి. 'హాక్ ఐ' కొత్త స్మార్ట్ ఫోన్‌లలో అందుబాటులో లేదు. తెలంగాణ మహిళా కమిషన్, బాలల హక్కుల కమిషన్ సభ్యులను నియమించి క్రియా శీలకం చేయాలి.

సోషల్ మీడియా యుగంలో కూడా కనీసం వెబ్ సైటు కూడా లేని కొన్ని కీలకమైన ప్రభుత్వ శాఖలు రాష్ట్రంలో ఉన్నాయి. వెబ్ సైటు ఉండీ సమాచారం లేని శాఖలు ఉన్నాయి. సమాచార హక్కు చట్టం అమలులో ప్రభుత్వ బాధ్యత- పౌరులకు దరఖాస్తు అవసరం లేకుండానే స్వచ్ఛందంగా సాధ్యమైనంత సమాచారం అందించడం. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛంద సమాచార వెల్లడిపై ఆడిట్ తప్పనిసరి చేసింది. ఆన్ లైన్ ద్వారా ప్రభుత్వ శాఖలు దరఖాస్తులు, సమాచార కమిషన్ అప్పీళ్ళు స్వీకరించే ఏర్పాటు చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించింది. సమాచార కమిషన్ సభ్యులను నియమించడమే గాక మహారాష్ట్ర వలె కొన్ని జిల్లాలలో కమిషన్ బెంచీలు కూడా ఏర్పాటు చేయవచ్చు. మహోన్నతమైన ప్రజా చట్టంగా పేరొందిన సమాచార హక్కు చట్టం అమలు ప్రజా పాలనలో కీలకం.

ప్రజా పాలనలో ప్రజలు కోరుకునేవేమిటి అనే ప్రశ్నకు సామాన్య ప్రజల నుంచి ఎప్పటికప్పుడు అభిప్రాయాలు తెలుసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉండటం ప్రజలలో ప్రభుత్వం పట్ల నమ్మకాన్ని పెంచుతుంది.

వ్యాసకర్త సీనియర్ ఫ్యాకల్టీ, తెలంగాణ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ । 92471 59343

క్లుప్తంగా...

కాంగ్రెస్ పాలనలో రైతన్నల బతుకులు ఆగం: హరీశ్



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పాలనలో రైతన్న బతుకులు ఆగమయ్యాయని, ఐదు నెలల్లోనే రైతులు రోడ్డెక్కాల్సిన దుస్థితి వచ్చిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు ఆందోళన వ్యక్తంచేశారు.సాగునీరు, కరెంటు మాత్రమే కాకుండా విత్తనాలు కూడా రైతులకు అందించలేని స్థితికి కాంగ్రెస్ ప్రభుత్వం చేరుకుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల కోసం బారులు తీరిన రైతులపై లాఠీలు ఝుళిపించడం దారుణం, అత్యంత బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ తెస్తానన్న మార్పు ఇదేనా? ఇందిరమ్మ రాజ్యం అంటే ఇదేనా? అని ప్రశ్నించారు. రైతన్నలపై లాఠీలు ఝుళిపించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులపై దాడులకు కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, రైతులకు ఇబ్బందులు లేకుండా, విత్తనాలను పంపిణీ చేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని హరీశ్‌రావు కోరారు.

హెచ్‌సీయూకు అంతర్జాతీయ ర్యాంకు

రాయదుర్గం: కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థ అయిన యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. అంతర్జాతీయ విద్యార్థుల కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న టాప్–12 శాతం విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా హెచ్‌సీయూ నిలిచింది. స్టడీ అబ్రాడ్ ఎయిడ్ (ఎస్ఏఏ) అనే సంస్థ ఈ మేరకు 2024కుగాను ప్రకటించిన ర్యాంకుల్లో చోటు సంపాదించింది. యూనివర్సిటీ రకం, ఫీజులు, అందిస్తున్న కోర్సులు, అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్య తదితర వివరాల ఆధారంగా ఎస్ఏఏ ఈ ర్యాంకులు ప్రకటించింది. కాగా, తమ విద్యాసంస్థ ఈ ర్యాంకు సాధించడంపై వర్సిటీ వీసీ ప్రొఫెసర్ బీజే రావు హర్షం వ్యక్తం చేశారు.

కల్తీ విత్తనాల అమ్మకాలపై చర్యలు తీసుకోండి

సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి



సాక్షి, హైదరాబాద్: ఎలాంటి అనుమతులు లేకుండా, విత్తన చట్టాలను ఉల్లంఘిస్తూ వ్యాపారులు కల్తీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నారని, దీనిపై ప్రభుత్వం ముందస్తు చర్యలు చేట్టాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. విత్తనాలు కొనుగోలు విషయంలో రైతులు కూడా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఈ సీజన్‌లో రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను సకాలంలో అందించే కార్యాచరణను ప్రభుత్వం చేపట్టాలని, దీనిపై నిర్లక్ష్యం చేసే అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇతర రాష్ట్రాల సరిహద్దుల నుంచి రాష్ట్రానికి వస్తున్న నకిలీ విత్తనాలను అడ్డుకునేందుకు తనిఖీ బృందాలను ఏర్పాటు చేయాలని కోరారు. కల్తీ విత్తనాలను నిరోధించడానికి రైతు కమిటీల భాగస్వామ్యంతో వ్యవసాయ అధికారులు, పోలీసులు, టాస్క్‌ఫోర్స్ బృందాలు విత్తన దుకాణాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు.

ఆ కరకట్ట పనులు ప్రారంభించండి: సీతక్క



సాక్షి, హైదరాబాద్: ఏటూరు నాగారం మండల పరిధి రాంనగర్ గ్రామం నుంచి మంగపేట మండలం పొదుమూరు వరకు కరకట్ట పనులను ప్రారంభించాలని అధికారులను పంచాయితీ రాజ్, మహిళాశిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదేశించారు. మంగళవారం సచివాలయంలో నీటిపారుదలశాఖ అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఏటూరు నాగారం నుంచి రామన్న గూడెం ఎక్కల వరకు నిర్మించిన కట్ట మరమ్మతులు, తూముల రిపేర్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

వరికి ని'బంధనాలు'

నూతన పంటల బీమా పథకం అమలు తీరులో లోపాలు

- ఐదు జిల్లాల్లో ఈ పంటకు గ్రామం యూనిట్‌గా అమలు లేనట్టే..
- నిబంధనలు అడ్డొస్తున్నాయంటున్న అధికారులు
- గ్రామం యూనిట్ లేకపోతే పంట నష్టపరిహారం పొందడం కష్టం



సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా అమలు చేయాలని నిర్ణయించిన పంటల బీమా పథకంలోని నిబంధనలు వరి రైతుల పాలిట శాపంగా మారుతున్నాయి. ఒక జిల్లాలో మొత్తం సాగువిస్తీర్ణంలో 25 శాతానికి మించి విస్తీర్ణమున్న పంటలను మాత్రమే గ్రామం యూనిట్‌గా పంటల బీమా పథకం అమలు చేయాలనే నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం సంగారెడ్డితోపాటు, వికారాబాద్, జోగుళాంబ గద్వాల, ఆదిలాబాద్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాల్లో ఏ ఒక్క పంట కూడా 25 శాతానికి మించి సాగు కావడం లేదు. దీంతో ఈ జిల్లాల్లో గ్రామం యూనిట్‌గా అమలు చేసే అవకాశం లేకుండాపోతోంది.

ఈ వానాకాలం నుంచే కొత్త పథకం అమలు

అధిక వర్షాలు, వడగండ్ల వానలు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందేలా పంటల బీమా పథకం అమలు చేస్తారు. ఐదేళ్ల క్రితం నిలిపివేసిన ఈ పథకాన్ని పునరుద్ధరించాలని రాష్ట్రంలో కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా పథకంలో భాగంగా ఈ వానాకాలం నుంచే రాష్ట్రంలో ఈ పథకాన్ని అమలు చేసేందుకు చర్యలు చేపట్టింది.

నిర్మల్‌లో వరితోపాటు, సోయా కూడా..

రాష్ట్రవ్యాప్తంగా 32 జిల్లాల్లో ఈ పంటల బీమా పథకం అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం అన్ని జిల్లాల్లో వరి పంటను గ్రామం యూనిట్‌గా అమలు చేసేందుకు నిబంధనలు కలిసొస్తున్నాయి. నిర్మల్ జిల్లా వరితోపాటు, సోయా పంట కూడా గ్రామం యూనిట్‌గా అమలు చేసేందుకు వీలు కలుగుతోంది.

మండలం యూనిట్ అయితే వరి రైతుకు నష్టం

పంటల బీమా పథకం గ్రామం యూనిట్‌గా అమలు చేస్తేనే ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయిన రైతులకు క్లెయిమ్ (పరిహారం) అందుతుంది. మండలం యూనిట్‌గా అమలు చేస్తే చాలామంది రైతులకు ఈ క్లెయిమ్ అందదు. ఎలాగంటే.. మండలం యూనిట్‌గా తీసుకుంటే అధిక వర్షాలుగానీ, వడగండ్ల వానగానీ, ఈదురుగాలుల వర్షం కారణంగా మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో మొత్తం వరి పంట నష్టపోతే మాత్రమే రైతులకు పరిహారం అందుతుంది. మండలంలో కొన్ని గ్రామాల్లో పంట నష్టం జరిగి, మరికొన్ని గ్రామాల పరిధిలో నష్టం జరగకపోతే పంట నష్టపోయిన గ్రామాల రైతులకు కూడా పరిహారం అందదు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితులు ఎదురుకానున్నాయి. ఈ నిబంధనపై రైతు సంఘాలు పెదవి విరుస్తున్నాయి. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని అన్ని జిల్లాలకు ఒకే విధంగా నిబంధనలను సరళీకృతం చేయాలని కోరుతున్నారు.

ఖరీఫ్‌లో జిల్లాల వారీగా పథకం అమలు తీరు ఇలా..

జిల్లా	గ్రామం యూనిట్‌గా ఎంపికైన పంట	మండలం/జిల్లా యూనిట్‌గా ఎంపికైన పంటలు
ఆదిలాబాద్	–	సోయా, కంది, మక్క, జొన్న
కొమురంభీం ఆసిఫాబాద్	–	వరి, కంది, సోయా
మంచిర్యాల	వరి	కంది
నిర్మల్	వరి, సోయా	మక్క, కంది, పసుపు
నిజామాబాద్	వరి	సోయా, మక్క, పసుపు
జగిత్యాల	వరి	మక్క, పసుపు, కంది
పెద్దపల్లి	వరి	--
జయశంకర్ భూపాలపల్లి	వరి	--
భద్రాద్రి కొత్తగూడెం	వరి	మక్క, వేరుశనగ, కంది
మహబూబాబాద్	వరి	మక్క, పెసర, కంది, పసుపు
వరంగల్	వరి	మక్క, వేరుశనగ, పసుపు
హనుమకొండ	వరి	మక్క
కరీంనగర్	వరి	మక్క
రాజన్నసిరిసిల్ల	వరి	కంది
కామారెడ్డి	వరి	సోయా, మక్క, కంది, పెసర, మినుము, చెరకు
సంగారెడ్డి	--	వరి, కంది, సోయా, మక్క, పెసర, మినుము, చెరకు
మెదక్	వరి	మక్క, కంది
సిద్దిపేట	వరి	మక్క, కంది
జనగాం	వరి	మక్క, కంది
యాదాద్రి భువనగిరి	వరి	కంది
మేడ్చల్ మల్కాజ్‌గిరి	వరి	--
రంగారెడ్డి	వరి	మక్క, కంది, జొన్న
మహబూబ్‌నగర్	వరి	మక్క, జొన్న, కంది
జోగుళాంబ గద్వాల	--	వరి, కంది, మక్క, వేరుశనగ
వనపర్తి	వరి	మక్క, వేరుశనగ, కంది, చెరకు
నాగర్‌కర్నూల్	వరి	మక్క, జొన్న, కంది
నల్లగొండ	వరి	కంది
సూర్యాపేట	వరి	కంది, పెసర
ఖమ్మం	వరి	పెసర, చెరకు, మక్క
ములుగు	వరి	--
నారాయణపేట	వరి	కంది, జొన్న, పెసర
వికారాబాద్	--	వరి, కంది, మక్క, పెసర, జొన్న, మినుము,సోయా, చెరకు,పసుపు

5 లేదా 6న రాష్ట్రానికి జస్టిస్ ఘోష్

జూన్ 30లోగా న్యాయ విచారణ ముగించాలని పేర్కొన్న ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంపై న్యాయవిచారణ చేపడుతున్న జస్టిస్ పినాకి చంద్రఘోష్ జూన్ 5 లేదా 6న రాష్ట్రానికి వస్తున్నట్లు నీటిపారుదల శాఖకు సమాచారం ఇచ్చారు. ఇప్పటికే ఆయన రాష్ట్రంలో రెండుసార్లు పర్యటించిన విషయం తెలిసిందే. కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంలో నిర్ణయాత్మక పాత్ర పోషించిన అధికారులు, ఇంజనీర్లు, మాజీ ప్రజాప్రతినిధులకు జూన్ తొలి లేదా రెండో వారంలో జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ నోటీసులు జారీ చేసే అవకాశాలున్నాయి. ఈసారి ఆయన 10–15 రోజులపాటు హైదరాబాద్‌లోనే ఉండి విచారణ ప్రక్రియను కొలిక్కి తెస్తారని అధికార వర్గాలు తెలిపాయి. నీటిపారుదల శాఖ నుంచి స్వాధీనం చేసుకున్న ఫైళ్లు, కాగ్ ఆడిట్ నివేదిక, విజిలెన్స్ ప్రాథమిక దర్యాప్తు నివేదిక, ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా బ్యారేజీల నిర్మాణంలో కీలకంగా వ్యవహరించిన అధికారులు, ఇంజనీర్లను గుర్తించి జూన్ రెండో వారంలోగా నోటీసులు జారీ చేయనున్నారు. జూన్ 30లోగా న్యాయ విచారణ పూర్తిచేసి నివేదిక సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం గడువు విధించడంతో ఆలోగా నోటీసులు జారీ చేసి నివేదిక రూపొందించనున్నారు. అవసరమైతే కమిషన్ గడువు పొడిగింపు కోరే అవకాశముంది. జస్టిస్ చంద్రఘోష్ చివరిసారిగా రాష్ట్రంలో పర్యటించిన సమయంలో ఆయన మేడిగడ్డ బ్యారేజీని సందర్శించారు. జూన్ రెండో వారంలో ఆయన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలను సందర్శించే అవకాశం ఉంది.

మెడికల్ బోర్డు అవకతవకలపై ఏసీబీ విచారణ

సింగరేణి (కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఇటీవల జరిగిన మెడికల్ బోర్డు నిర్వహణలో జరిగిన అవకతవకలపై ఏసీబీ అధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఓ గెస్ట్‌హౌస్‌లో మధ్యాహ్నం, సింగరేణి మెయిన్ ఆస్పత్రిలో సాయంత్రం విచారణ చేసినట్లు తెలిసింది. మెడికల్ బోర్డ్ జాబితాలో ఉన్న ఉద్యోగులను వేర్వేరుగా పిలిచి...మెడికల్ ఇన్‌వాలిడేషన్ కావడానికి గల కారణాలు, వారికి ఉన్న జబ్బుల వివరాలపై ఆరా తీశారు. మెడికల్ బోర్డు నిర్వహణలో దళారీ వ్యవస్థను రూపుమాపే బాధ్యతను సీఎండీ ఎన్.బలరామ్ ఇటీవల ఏసీబీకి అప్పగించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టడంతో దళారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. వీరు కొంతకాలంగా ప్రజాప్రతినిధులు, యూనియన్ నాయకుల అండతో మెడికల్‌బోర్డు నిర్వహణలో దందాలు కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అప్పులు తీరక.. పంట పండక రైతు బలవన్మరణం

ఎల్కతుర్తి: పంట సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం కనిపించక యువ రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండలం గోపాల్‌పూర్‌లో జరిగిన ఈ సంఘటనపై గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలివి. గోపాల్‌పూర్‌కు చెందిన రైతు పెండ్యాల నాగరాజు (38) తనకున్న ఆరెకరాల పొలంలో వరి సాగు చేశాడు. పంట చేతికందే సమయంలో అకాల వర్షంతో కొంత నష్టం వాటిల్లింది. మరోవైపు మిగిలిన పంటకు సోకిన తెగుళ్లతో ఆశించిన దిగుబడి రాలేదు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.5 లక్షల అప్పు ఎలా తీర్చాలని మనస్తాపం చెందిన నాగరాజు మంగళవారం ఉదయం తన పొలంలోని పనస చెట్టుకు ఉరేసుకున్నాడు. మృతుని భార్య పెండ్యాల కల్యాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు.



రావినూతలలో విత్తనాల కోసం బారులు తీరిన రైతులు

'డిమాండ్' పత్తి కోసం ఉద్రిక్తత

ఆ విత్తనాల కోసం బారులు తీరిన అన్నదాతలు

- షాపుల్లోకి వెళ్లేందుకు యత్నించగా అడ్డుకున్న పోలీసులు
- ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో గందరగోళ పరిస్థితి

ఆదిలాబాద్ టౌన్, బోనకల్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని పత్తి విత్తన దుకాణాల వద్ద మంగళవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుండడంతో అన్నదాతలు జిల్లా నలుమూలల నుంచి విత్తనాల కొనుగోలు కోసం ఆదిలాబాద్ పట్టణానికి చేరుకున్నారు. గాంధీచౌక్, అంబేడ్కర్ చౌక్ ప్రాంతాల్లోని ఆయా విత్తన దుకాణాల వద్ద బారులు తీరారు. డిమాండ్ రకం పత్తి విత్తనాల కోసం రైతులు కొద్ది రోజులుగా జిల్లా కేంద్రానికి వచ్చి వెళ్తున్నారు. ఇందులో భాగంగా వేకువజామునే భారీగా తరలివచ్చారు. గంటల తరబడి క్యూలో నిలబడ్డారు. దుకాణ యజమానులు ఆధార్ కార్డు ఉన్నవారికి రెండు ప్యాకెట్లకు మించి ఇవ్వకపోవడంతో రైతులు ఆగ్రహానికి గురయ్యారు. కొందరు విత్తన దుకాణంలోకి చొరబడేందుకు యత్నించారు. దీంతో ఒక్కసారిగా గందరగోళ పరిస్థితి నెలకొంది. పరిస్థితి అదుపు చేసేందుకు పోలీసులు లోనికి చొరబడ్డ రైతులను చెదరగొట్టారు. ఈ సమయంలోనే కొంత మంది రైతులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. విషయం తెలుసుకున్న జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య అక్కడికి చేరుకొని రైతులకు నచ్చజెప్పారు. అలాగే ఆదిలా బాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో పాటు రైతు సంఘాల నేతలు, వివిధ పార్టీల నాయకులు అక్కడికి చేరుకొని రైతులకు డిమాండ్ రకం విత్తనాలు అందించాలని డీలర్లకు సూచించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ.. ఖరీఫ్ సీజన్ సన్నద్ధం కంటే ముందే అన్నదాతలకు విత్తన కష్టాలు మొదలయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఏ విత్తనాలకు డిమాండ్ ఉందో వాటిని కొరత లేకుండా ప్రభుత్వం చూడాలని డిమాండ్ చేశారు. కాగా, ఆ తర్వాత పోలీసులు దగ్గరుండి ఒక్కో రైతుకు రెండు విత్తన ప్యాకెట్లను అందజేశారు.

లాఠీచార్జి చేయలేదు: ఎస్పీ గౌస్ ఆలం

జిల్లా కేంద్రంలో పత్తి విత్తనాల దుకాణాల వద్ద రైతులపై పోలీసులు ఎలాంటి లాఠీచార్జి చేయలేదని ఎస్పీ గౌస్ ఆలం స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఎస్పీ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. విత్తన దుకాణాల వద్ద భారీగా చేరుకున్న రైతులను వరుస క్రమంలో నిలబడేలా మాత్రమే పోలీసులు చర్యలు చేపట్టారని వివరించారు. పోలీసులు రైతులను అడ్డుకున్నారని, చెదరగొట్టారనేది అవాస్తవమని తెలిపారు.

ఆ కంపెనీ పత్తి విత్తనాల కోసం రైతుల బారులు

ఖమ్మం జిల్లా బోనకల్ మండలం రావినూతలలోని ఓ విత్తనాల షాపు వద్ద ఓ ప్రైవేట్ కంపెనీ విత్తనాల (యూఎస్ సీడ్స్) కోసం రైతులు మంగళవారం బారులు తీరారు. ఆ పత్తి విత్తనాలను గత ఏడాది సాగు చేసిన రైతులకు అధిక దిగుబడి వచ్చిందనే సమాచారంతో క్యూ కట్టారు. ఈ విషయమై వ్యవసాయాధికారి సరిత మాట్లాడుతూ ప్రభుత్వం ధ్రువీకరించిన చాలా రకాల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నందున రైతులు ఒకే రకం కోసం ఆరాటపడొద్దని సూచించారు.

ఉల్లిగడ్డల చాటున.. పత్తి విత్తనాలు రవాణా

- రూ.16.50 లక్షల విలువైన 5.5 క్వింటాళ్ల విత్తనాలు స్వాధీనం
- వ్యాన్‌లో నిషేధిత బీటీ–3 సీడ్
- రామగుండం సీపీ శ్రీనివాస్ వెల్లడి

గోదావరిఖని: కర్ణాటక నుంచి మహారాష్ట్ర మీదుగా రాష్ట్రంలోకి అక్రమంగా రవాణా అవుతున్న నిషేధిత బీటీ–3 రకం పత్తి విత్తనాలను పట్టు కున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు పోలీసుస్టేషన్ పరిధి బతుకమ్మవాగు వద్ద వీటిని స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. స్థానిక సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిషేధిత బీటీ–3 రకం పత్తి విత్తనాలు రవాణా చేస్తున్నారన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్ఐ లచ్చన్న సిబ్బందితో కలిసి బతుకమ్మ వాగువద్ద వాహనాల తనిఖీలు చేపట్టారన్నారు. ఓ వ్యాన్‌ను ఆపి తనిఖీ చేయగా రూ. 16.50 లక్షల విలువైన 5.5 క్వింటాళ్ల నిషేధిత పత్తి విత్తనాలు లభించాయన్నారు.

కర్ణాటక వయా మహారాష్ట్ర టు తెలంగాణ..

కర్ణాటక కుస్తీ ప్రాంతంలోని గుంటూరుకు చెందిన సుబ్బారావు వద్ద బీటీ–3 రకం విత్తనాలను కొనుగోలు చేసిన సొల్లు పెద్దయ్య, సొల్లు హరికుమార్.. అక్కడి నుంచి మహారాష్ట్రకు తరలించారని సీపీ తెలిపారు. ఎవరికీ అనుమానం రాకుండా వ్యాన్‌లో కింద విత్తన బస్తాలు వేసి, ఆపైన ఉల్లిగడ్డల బ్యాగులు లోడ్ చేసి మంచిర్యాల జిల్లాలోకి ప్రవేశించారని అన్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ అధికారులు, సిబ్బందిని సీపీ అభినందించి రివార్డులు అందజేశారు. సమావేశంలో మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జొన్నలపై జగడం..

- రైతులు తెచ్చిన జొన్నలు బాగోలేదన్న అదనపు కలెక్టర్
- రైతుల ఆగ్రహం.. గతేడాది ఇలాంటి జొన్నలే కొన్నారని వాదన
- వాహనం ఎదుట బైఠాయించి ఆందోళన
- కొనుగోలు చేస్తామన్న హామీతో శాంతించిన రైతులు
- కల్హేర్ మండలం బీబీపేటలో సంఘటన



అడిషనల్ కలెక్టర్ మాధురి వాహనం ముందు బైఠాయించి ఆందోళన చేస్తున్న రైతులు

కల్హేర్ (నారాయణఖేడ్): జొన్నలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ కల్హేర్ మండలం బీబీపేటలో అదనపు కలెక్టర్ మాధురి వాహనాన్ని రైతులు మంగళవారం అడ్డుకున్నారు. వాహనం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. బీబీపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని అదనపు కలెక్టర్ పరిశీలించి.. రైతులు తెచ్చిన జొన్నలు దెబ్బతిన్నాయని, శుభ్రంగా లేవని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఉంటేనే కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఇలాంటి జొన్నలే కొనుగోలు చేశారని వాదించారు. లారీలు రాకపోవడంతో కొనుగోలు నెమ్మదిగా జరుగుతున్నాయని వాపోయారు. ఆమె అక్కడి నుంచి వెళ్తుండగా, తమ గోడు పట్టించుకోకుండా వెళ్లిపోతున్నారంటూ రైతులు మండిపడ్డారు. ఆమెను వెళ్లనీయకుండా వాహనాన్ని అడ్డుకొని బైఠాయించారు. ప్రభుత్వం, అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

పెట్రోల్ డబ్బాతో రైతు ఆందోళన

ఫత్తేపూర్‌కు చెందిన రైతు నరేందర్ పెట్రోల్ డబ్బా పట్టుకుని ఒంటిపై పోసుకునేందుకు యత్నించాడు. మార్క్‌ఫెడ్ డీఎం శ్రీదేవి, ఆర్డీఓ అశోక్‌చక్రవర్తి వెంటనే కలుగజేసుకుని నచ్చజెప్పారు. రైతులందరి జొన్నలు కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు శాంతించారు. అనంతరం కల్హేర్, కృష్ణాపూర్, బోక్కస్‌గాంలో కొనుగోలు కేంద్రాలను కూడా అదనపు కలెక్టర్ తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

మార్క్‌ఫెడ్ ద్వారా 12 క్వింటాళ్ల జొన్నల కొనుగోలు

- ఇప్పటివరకు ఎకరాకు 8 క్వింటాళ్లే కొనుగోలు... మంత్రి దామోదర రాజనర్సింహ లేఖకు స్పందన
- వ్యవసాయ శాఖ కార్యదర్శి ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: మెదక్ జిల్లాలో రైతులు పండించిన జొన్నలను ఎకరాకు 12 క్వింటాళ్లు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు ఎకరాకు 8 క్వింటాళ్ల జొన్నలను మాత్రమే మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసేది. దీనివల్ల రైతులు తాము పండించిన మిగతా జొన్నలను ఎక్కడ విక్రయించుకోవాలో తెలియక ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని రైతులు మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకురాగా, మెదక్ జిల్లాలో ఎకరాకు 12 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేయాలని ఆయన రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి లేఖ రాశారు. మంత్రి లేఖకు రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రభుత్వ కార్యదర్శి స్పందించారు. మెదక్ జిల్లాలో కొనుగోలు చేసే జొన్నలను ఎకరాకు 8 క్వింటాళ్ల నుండి 12 క్వింటాళ్ల వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి దామోదర రాజనర్సింహ తీసుకున్న ప్రత్యేక చొరవపై జొన్న రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పశ్చిమ బెంగాల్‌లో సార్వత్రిక ఎన్నికల ఘట్టం తుది అంకానికి చేరింది. ఆరు విడతల్లో 33 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు పూర్తయ్యాయి. మిగతా 9 స్థానాల్లో జూన్ 1న చివరిదైన ఏడో విడతలో పోలింగ్ జరగనుంది. వీటిలో చాలా సీట్లు కోల్‌కతా నగర పరిధిలో ఉన్నవే. ఇవన్నీ అధికార తృణమూల్ ఖాతాలోని స్థానాలే. ఈసారి వాటిపై కమలనాథులు కన్నేశారు. దాంతో బీజేపీ, తృణమూల్ మధ్య హోరాహోరీ సాగుతోంది. బెంగాల్లో ఇండియా కూటమికి మమత దూరంగా ఉండటంతో కాంగ్రెస్–సీపీఎం కలిసి పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో కీలక సీట్లపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్

కోల్‌కతా మే సవాల్

తృణమూల్ కోటపై కమలం గురి!

బెంగాల్లో 9 స్థానాలకు జూన్ 1న పోలింగ్

పోలింగ్ జరిగే లోక్‌సభ స్థానాలు

డమ్ డమ్, బారాసత్, బసీర్హాట్, జయనగర్, మథురాపూర్, డైమండ్ హార్బర్, జాదవ్‌పూర్, కోల్‌కతా దక్షిణ్, కోల్‌కతా ఉత్తర్



• అభిషేక్ బెనర్జీ

డైమండ్ హార్బర్...

అభిషేక్ హ్యాట్రిక్ గురి

బ్రిటిషర్ల కాలంలో నిర్మించిన డైమండ్ హార్బర్ పోర్టు యూరప్‌కు ముడి సరుకుల రవాణా హబ్‌గా వెలుగు వెలిగింది. ఈ నియోజకవర్గంలో 2009లో తృణమూల్ జెండా పాతింది. గత రెండు ఎన్నికల్లోనూ మమత మేనల్లుడు అభిషేక్ బెనర్జీ గెలిచారు. ఈసారి హ్యాట్రిక్‌పై గురిపెట్టారు. బీజేపీ ఇక్కడ గత ఎన్నికల్లో రెండో స్థానంలో నిలిచినా పోయినసారి 4.7 లక్షల పైగా ఓట్లు దక్కించుకుంది. ఈసారి అభిజిత్ దాస్ (బాబీ)ను రంగంలోకి దించింది. సీపీఎం నుంచి ప్రతీకుర్ రెహ్మాన్ పోటీలో ఉన్నారు.



• సుదీప్ బందోపాధ్యాయ్

కోల్‌కతా ఉత్తర్..

తృణమూల్ వర్సెస్ మాజీ

తృణమూల్‌కు మరో కంచుకోట. 2009లో ఉనికిలోకి వచ్చింది. తృణమూల్ సీనియర్ నేత సుదీప్ బందోపాధ్యాయ్ హ్యాట్రిక్ కొట్టారు. ఈసారీ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి తృణమూల్ మాజీ నేత తపస్ రాయ్ పోటీ చేస్తున్నారు. తృణమూల్ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా గెలిచి, పార్టీ డిప్యూటీ చీఫ్ విప్‌గా ఉన్న ఆయన ఇటీవల తన ఇంట్లో ఈడీ సోదాలు జరిగిన కొద్ది రోజులకే బీజేపీ తీర్థం పుచ్చుకోవడం విశేషం! లెఫ్ట్ మద్దతుతో కాంగ్రెస్ తరఫున ప్రదీప్ భట్టాచార్య బరిలో ఉండటంతో ముక్కోణపు పోరు నెలకొంది. 20 శాతం పైగా ఉన్న ముస్లిం ఓటర్లు ఇక్కడ కీలకం.



• సయానీ ఘోష్

జాదవ్‌పూర్...

బరిలో బెంగాలీ నటి

ఒకప్పుడు కమ్యూనిస్టుల కంచుకోట. కోల్‌కతా పరిధిలోని ఈ స్థానంలో 2009 నుంచీ తృణమూల్ వరుస విజయాలు సాధిస్తోంది. సిట్టింగ్ ఎంపీ, ప్రముఖ నటి మిమి చక్రవర్తి ఇటీవలే తృణమూల్‌కు, లోక్‌సభ సభ్యత్వానికి గుడ్‌బై చెప్పారు. దాంతో ఈసారి మరో బెంగాలీ నటి, తృణమూల్ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సయానీ ఘోష్‌కు దీదీ టికెటిచ్చారు. బీజేపీ నుంచి అనిర్బన్ గంగూలీ, సీపీఎం నుంచి శ్రీజన్ భట్టాచార్య బరిలో ఉన్నారు.



• మాలా రాయ్

కోల్‌కతా దక్షిణ్...

దీదీ అడ్డా

ఇది మమత కంచుకోట. 1991, 1996ల్లో కాంగ్రెస్ తరఫున గెలిచిన ఆమె తర్వాత 2009 దాకా సొంత పార్టీ తృణమూల్ తరఫున నెగ్గారు. ఆమె సీఎం అయ్యాక కూడా ఇక్కడ తృణమూల్ జెండాయే ఎగురుతోంది. ఈసారి కూడా సిట్టింగ్ ఎంపీ మాలా రాయ్ బరిలో ఉన్నారు. బీజేపీ నుంచి దేబశ్రీ చౌదరి, సీపీఎం అభ్యర్థిగా సైరా షా హలీం రేసులో ఉన్నారు. పోటీ ప్రధానంగా తృణమూల్, బీజేపీ మధ్యే నెలకొంది.



• ప్రతిమా మండల్

జయనగర్...

టఫ్ ఫైట్

అపార అటవీ సంపదకు నెలవైన ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం. సజ్నేఖాలీ పక్షుల సంరక్షణ కేంద్రం, సుందర్బన్ మాంగ్రూవ్ నేషనల్ పార్క్ దీని పరిధిలోవే. 2004 దాకా ఆరెస్పీ కంచుకోట. 2014 నుంచి తృణమూల్ పాగా వేసింది. ఆ పార్టీ సిట్టింగ్ ఎంపీ ప్రతిమా మండల్ హ్యాట్రిక్‌పై గురి పెట్టారు. బీజేపీ నుంచి గత ఎన్నికల్లో గట్టి పోటీ ఇచ్చిన అశోక్ కందారీయే మళ్లీ బరిలో ఉన్నారు. 2019లో ఆయనకు 4.5 లక్షల ఓట్లు వచ్చాయి! కాంగ్రెస్ దన్నుతో సీపీఎం సమేంద్రనాథ్ మండల్‌ను పోటీలో నిలిపింది.



• అశోక్ పురకాయిత్

మథురాపూర్..

హోరాహోరీ

ఈ కూడా ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానంలో కమ్యూనిస్టులదే ఆధిపత్యం. 94 శాతం మంది గ్రామీణ ప్రజలే. 30 శాతం మంది ఎస్సీ ఓటర్లు. 2009 తర్వాత ఇక్కడ తృణమూల్ జెండా పాతింది. ఆ పార్టీ నుంచి బపీ హల్దార్ పోటీలో ఉన్నారు. బీజేపీ అశోక్ పురకాయిత్‌ను బరిలోకి దించింది. కాంగ్రెస్ దన్నుతో సీపీఎం శరత్ చంద్ర హల్దర్‌ను పోటీలో నిలిపింది. దీంతో త్రిముఖ పోరు ఆసక్తికరంగా మారింది.

విపక్షాలు చల్లే బురదలోనే కమల వికాసం

- నేను లంచాలు తీసుకోను.. తీసుకోనివ్వను
- జూన్ 4 తర్వాత అవినీతిపై యుద్ధం ఉధృతం
- జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ ఎన్నికల ప్రచారంలో మోదీ



దుమ్కా: ''బురద చల్లి మోదీని భయకంపితులను చేయగలమని ప్రతిపక్ష నాయకులు అనుకుంటున్నారు. వారు ఎంత ఎక్కువ బురద చల్లితే అన్ని ఎక్కువ కమలాలు విరగబూస్తాయి. ఆ సంగతి వారికి అర్థం కావడం లేదు'' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. విపక్ష నాయకుల బండారం తాను బయటపెడుతుండటంతో వారు తట్టుకోలేక తనపై నిందలు వేస్తున్నారని విమర్శించారు. అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల రిజర్వేషన్లు లాక్కొని ఓటు బ్యాంక్‌కు కట్టబెట్టడానికి విపక్ష 'ఇండియా' కూటమి కుట్రలు చేస్తోందని ఆరోపించారు. తాను జీవించి ఉన్నంతకాలం రిజర్వేషన్లను కాపాడుతానని ప్రకటించారు. మంగళవారం జార్ఖండ్‌లోని దుమ్కా, పశ్చిమ బెంగాల్‌లోని బరాసత్‌లో ఎన్నికల ప్రచార సభల్లో మోదీ మాట్లాడారు. జూన్ 4 తర్వాత అవినీతిపై యుద్ధం ఉధృతం చేస్తామని వెల్లడించారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తాను లంచాలు తీసుకోనని, ఎవరినీ తీసుకోనివ్వనని తేల్చిచెప్పారు. ఒకవేళ ఎవరైనా లంచాలు తీసుకుంటే తిరిగి ఇచ్చేయాల్సిందేనని, ఇది తన కొత్త గ్యారంటీ అన్నారు.

'లవ్ జీహాద్' పుట్టింది జార్ఖండ్‌లోనే...

జార్ఖండ్‌లోని సంథాల్ పరగణాల్లో గిరిజనుల జనాభా తగ్గిపోతోందని, అక్రమ వలసలే ఇందుకు కారణమని ప్రధానిమంత్రి మండిపడ్డారు. జేఎంఎం ప్రభుత్వం అక్రమ వలసదార్లను ప్రోత్సహిస్తోందని ధ్వజమెత్తారు. అక్రమ వలసదార్లు గిరిజనుల భూములు కబ్జా చేస్తున్నారని, మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నారని, వారిని వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. 'లవ్ జీహాద్' పదం మొదట జార్ఖండ్‌లోనే పుట్టిందన్నారు. జేఎంఎం ప్రభుత్వం మత రాజకీయాలు, బుజ్జగింపు రాజకీయాలు చేస్తోందని దుయ్యబట్టారు. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వం ఓటు జీహాద్ చేసే వారిని సంతోషపర్చడానికి ఓబీసీ యువత హక్కులను కాజేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ప్రధాని మోదీ రోడ్ షోలో పాల్గొన్నారు. బాగ్‌బజార్‌లోని శారదా మాత ఇంటిని దర్శించుకున్నారు. ఆమెకు నివాళులర్పించారు. అనంతరం శ్యామ్‌బజార్‌లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

మూడు రోజులపాటు మోదీ ధ్యానం

ఈ నెల 30 నుంచి కన్యాకుమారి వివేకానంద రాక్ మెమోరియల్‌లో ధ్యానం చేయనున్న ప్రధాని

న్యూఢిల్లీ/చెన్నై: లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మూడు రోజులపాటు ధ్యానం చేయనున్నారు. ఈ నెల 30వ తేదీ సాయంత్రం నుంచి వచ్చే 1వ తేదీ సాయంత్రం దాకా తమిళనాడు రాష్ట్రం కన్యాకుమారిలోని స్వామి వివేకానంద రాక్ మెమోరియల్ ధ్యాన మండపంలో ఆయన ధ్యానం చేస్తారని బీజేపీ నేతలు మంగళవారం వెల్లడించారు. 2019 ఎన్నికల ప్రచార సమయంలో ప్రధాని మోదీ ఉత్తరాఖండ్‌లోని కేదార్‌నాథ్ గుహలో ధ్యానం చేసిన సంగతి తెలిసిందే. ఈసారి ఆయన దక్షిణాదిని ఎంచుకున్నారు. స్వామి వివేకానందను మోదీ తన ఆధ్యాత్మిక గురువుగా భావిస్తుంటారు. కన్యాకుమారి రాక్ మెమోరియల్‌లో వివేకానంద మూడు రోజులపాటు ధ్యానం చేశారు. శివుడి కోసం పార్వతీదేవి ఇక్కడే తపస్సు చేశారని చెబుతుంటారు. ఇప్పుడు అదే ప్రదేశంలో మోదీ ధ్యానం చేయబోతున్నారు.

సీజేఐ పరిశీలనకు.. కేజ్రీవాల్ పిటిషన్

న్యూఢిల్లీ: మధ్యంతర బెయిల్ గడువును పొడిగించాలంటూ ఆప్ నేత, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ వేసిన పిటిషన్‌పై అత్యవసర విచారణకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పరిశీలనకు పంపించనున్నట్లు వెల్లడించింది. మద్యం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై అరెస్టయిన కేజ్రీవాల్‌కు అనారోగ్య కారణాలతో సుప్రీంకోర్టు జూన్ ఒకటో తేదీ వరకు బెయిలిచ్చిన విషయం తెల్సిందే. జూన్ 2వ తేదీన తిహార్ జైలు అధికారుల ఎదుట లొంగిపోవాల్సి ఉంది. మంగళవారం కేజ్రీవాల్ పిటిషన్ వెకేషన్ బెంచ్‌లోని జస్టిస్ మహేశ్వరి, జస్టిస్ విశ్వనాథన్‌ల ముందుకు వచ్చింది. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న కేజ్రీవాల్ కొన్ని అత్యవసర వైద్య పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని, బెయిల్ మరో వారం పొడిగించాలంటూ ఆయన తరఫున సీనియర్ లాయర్ అభిషేక్ మనుసింఘ్వి కోరారు. పిటిషన్‌పై బుధవారం విచారణ చేపట్టాలని తెలిపారు. అయితే, ధర్మాసనం 'వాదనలు విన్నాం. తీర్పు రిజర్వు చేశాం. ఈ పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి ఎదుట ఉంచుతున్నాం' అని తెలిపింది.

నిర్దోషిగా బయటపడిన 'డేరా' బాబా

పంజాబ్, హరియాణా హైకోర్టు తీర్పు



చండీగఢ్: ఇరవై రెండు సంవత్సరాల క్రితం నాటి హత్య కేసులో డేరా సచ్చా సౌదా ఆశ్రమం అధిపతి గుర్మీత్ రామ్ రహీమ్ సింగ్ బాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ పంజాబ్, హరియాణా హైకోర్టు మంగళవారం తీర్పు వెలువర్చింది. బాబాతోపాటు మరో నలుగురినీ నిర్దోషులుగా తేల్చింది. అయితే తన శిష్యులైన ఇద్దరు సాధ్విలను అత్యాచారం చేశారన్న కేసులో 2017లో దోషిగా తేలడంతో ప్రస్తుతం బాబా హరియాణాలోని రోహ్‌తక్‌లో ఉన్న సునారియా జైలులో ఖైదీగా 20 ఏళ్ల కారాగార శిక్ష అనుభవిస్తున్న విషయం తెల్సిందే. 2002లో డేరా సచ్చా సౌదా ఆశ్రమ మాజీ మేనేజర్ రంజిత్‌సింగ్ హత్య కేసు తీర్పును మంగళవారం జస్టిస్ సురేశ్వర్ ఠాకూర్, జస్టిస్ లలిత్ బాత్రాల డివిజన్ బెంచ్ వెలువర్చింది. గతంలో ఈ కేసులో బాబాతోపాటు మరో నలుగురిని దోషులుగా ప్రకటిస్తూ 2021 అక్టోబర్‌లో పంచకులలోని సీబీఐ ప్రత్యేక కోర్టు ఇచ్చిన తీర్పును వీరంతా హైకోర్టులో సవాల్ చేయడం తెల్సిందే. ఆనాడు వీరందరికీ సీబీఐ కోర్టు 20 ఏళ్ల జైలుశిక్ష విధించింది.

ఢిల్లీ మంత్రి అతిశీకి కోర్టు సమన్లు

న్యూఢిల్లీ: బీజేపీ నేత వేసిన పరువునష్టం కేసులో ఆప్ నేత, ఢిల్లీ మంత్రి అతిశీకి కోర్టు సమన్లు పంపింది. ఆప్ ఎమ్మెల్యేలను ప్రలోభాలతో లొంగదీసుకునేందుకు బీజేపీ ప్రయత్నించిందంటూ అతిశీ చేసిన వ్యాఖ్యలపై ఆ పార్టీ ఢిల్లీ విభాగం మీడియా హెడ్ ప్రవీణ్ శంకర్ కపూర్ ఏప్రిల్ 30న ఢిల్లీ కోర్టులో పిటిషన్ వేశారు. ఆప్‌కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలకు రూ.25 కోట్ల చొప్పున బీజేపీ ఇవ్వజూపిందని అతిశీ చేసిన ఆరోపణల కారణంగా తనకు, తమ పార్టీ ప్రతిష్టకు భంగం వాటిల్లిందని అందులో పేర్కొన్నారు. వీటిని పరిగణనలోకి తీసుకున్న కోర్టు జూన్ 29వ తేదీన తమ ఎదుట హాజరుకావాల్సిందిగా అతిశీకి సమన్లు పంపించింది. పిటిషన్‌దారు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌పైనా ఆరోపణలు చేశారు. ప్రాథమికంగా ఆధారాలు లేనందున కేజ్రీవాల్‌కు నోటీసులు పంపడం లేదని కోర్టు పేర్కొంది.

షాజహాన్ షేక్‌పై హత్యాయత్నం కేసు

సందేశ్‌ఖాలి ఉదంతంపై నమోదు చేసిన సీబీఐ

న్యూఢిల్లీ: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాలిలో జనవరి 5వ తేదీన సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై దాడి చేసిన కేసులో సస్పెండైన టీఎంసీ నేత షాజహాన్ షేక్, అతడి సోదరుడు మరో ఐదుగురిపై సీబీఐ సెక్షన్ 120–బీ(నేరపూరిత కుట్ర), సెక్షన్ 307 (హత్యాయత్నం) కింద కేసులు నమోదు చేసింది. ఈ ఘటనకు సంబంధించిన మొదటి చార్జిషీట్‌ను బసీర్‌హాత్ స్పెషల్ కోర్టులో సోమవారం దాఖలు చేసినట్లు అధికార వర్గాలు తెలిపాయి. షాజహాన్‌ను ఫిబ్రవరి 29వ తేదీన రాష్ట్ర పోలీసులు అరెస్ట్ చేయగా మార్చి 6న సీబీఐ కస్టడీలోకి తీసుకుంది. రేషన్ పంపిణీ కుంభకోణం ఆరోపణలపై షేక్ నివాసంలో సోదాలకు వెళ్లిన ఈడీ అధికారులపై అతడి అనుచరులు సుమారు వెయ్యి మంది దాడికి దిగారు. ఈ కేసులో షాజహాన్‌పై కీలక కుట్రదారుగా ఆరోపణలున్నాయి.

వారణాసి వెళ్లే విమానానికి బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: వారణాసి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు రావడం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో తీవ్ర కలకలం రేపింది. 'bomb @5.30 am' అని రాసి ఉన్న కాగితం విమానం మరుగుదొడ్డిలో ఉదయం 5 గంటల సమయంలో పైలట్‌కు కనిపించింది. ఆయన వెంటనే కంట్రోల్ రూంకు సమాచారమిచ్చారు. నిబంధనల మేరకు 176 ప్రయాణికులతో టేకాఫ్‌కు సిద్ధంగా ఉన్న విమానాన్ని తక్షణమే దూరంగా తీసుకెళ్లారు. అత్యవసర ద్వారాల గుండా ప్రయాణికులందరినీ ఖాళీ చేయించారు. ఆపైన విమానంలో క్షుణ్నంగా తనిఖీలు పూర్తి చేశారు. ఎటువంటి అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో బెదిరింపుగా తేల్చారు. మరో విమానంలో ప్రయాణికులను 11.10 గంటల సమయంలో వారణాసికి పంపారు. బెదిరింపు ఘటనపై దర్యాప్తు చేపట్టినట్లు 'ఇండిగో' తెలిపింది.

మిజోరంలో 'రెమాల్' బీభత్సం

25 మంది మృతి

ఐజ్వాల్: మిజోరంలో 'రెమాల్' తుపాను బీభత్సం సృష్టించింది. కుండపోత వానల కారణంగా కొండచరియలు విరిగిపడి ఐజ్వాల్ శివారులో రాళ్ల క్వారీ కుప్పకూలి 14 మంది చనిపోయారు. మెల్తుమ్–హిలిమన్ మధ్య ఉన్న క్వారీలో మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ఘటన చోటుచేసుకుంది. వెంటనే స్పందించిన యంత్రాంగం ఇద్దరిని రక్షించగలిగింది. ఘటనాస్థలి నుంచి 13 మృతదేహాలను వెలికితీసింది. శిథిలాల కింద మరో 8 మంది చిక్కుకుని ఉంటారనే ఆందోళన వ్యక్తమవుతోంది. మృతుల్లో నాలుగేళ్ల బాలుడు, ఆరేళ్ల బాలిక ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సహాయక చర్యలకు కుండపోత వర్షాలు అడ్డంకిగా మారాయన్నారు. రాష్ట్రంలో వర్షం సంబంధ ఇతర ఘటనల్లో మరో 11 మంది మృతిచెందారు. వరదలతో ఐజ్వాల్‌లోని సాలెంవెంగ్‌లో ముగ్గురు కొట్టుకుపోయారు. హుంటార్ వద్ద ఆరో నంబర్ జాతీయ రహదారి కొట్టుకుపోవడంతో ఐజ్వాల్‌కు బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి.

పీఎంఎల్–ఎన్ చీఫ్‌గా మళ్లీ నవాజ్ షరీఫ్

లాహోర్: పాకిస్తాన్ ముస్లిం లీగ్–నవాజ్(పీఎంఎల్–ఎన్)పార్టీ అధ్యక్షుడిగా మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్(74) మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పనామా పత్రాల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2018లో ఆయన పార్టీ అధ్యక్ష పదవి నుంచి వైదొలిగారు. ఇదే కేసులో 2017లోనే నవాజ్ ప్రధాని పదవికి రాజీనామా చేయడం తెల్సిందే. నవాజ్ సోదరుడు, ప్రస్తుత ప్రధాని షెహబాజ్ షరీఫ్ అప్పటి నుంచి పార్టీ అధ్యక్ష బాధ్యతల్లో ఉన్నారు. మే మొదట్లో షెహబాజ్ షరీఫ్ పార్టీ అధ్యక్ష బాధ్యతలకు రాజీనామా చేశారు. దీంతో, మంగళవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో నవాజ్ షరీఫ్‌ను అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పంజాబ్ పీఎంఎల్–ఎన్ అధ్యక్షుడు రానా సనావుల్లా తెలిపారు. ఫిబ్రవరిలో జరిగిన సాధారణ ఎన్నికల్లో ఏపార్టీకీ పూర్తి మెజారిటీ రాకపోవడంతో పీఎంఎల్–ఎన్, పీపీపీ మరికొన్ని పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటైంది. సోదరుడు షెహబాజ్‌ను ప్రధాని కుర్చీపై కూర్చోబెట్టిన నవాజ్ షరీఫ్ తెరవెనుక నుంచి చక్రం తిప్పుతున్నారు.

ఆరో విడతలో 63.37% పోలింగ్

- నాలుగో విడతలో అత్యధికం..
- ఐదో విడతలో అత్యల్పం: ఈసీ

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ఈ నెల 25వ తేదీన 58 సీట్లకు ఆరో విడత జరిగిన పోలింగ్‌లో 63.37 శాతం పోలింగ్ నమోదైంది. ఈ విడతలో అర్హులైన మొత్తం 11.13 కోట్ల మందికి గాను 7.05 కోట్ల మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకున్నారని ఎన్నికల కమిషన్(ఈసీ) మంగళవారం తెలిపింది. 2019 ఎన్నికల్లో ఆరో విడతలో 59 సీట్లకు జరిగిన పోలింగ్‌లో 64.4 శాతం మంది ఓటేసినట్లు ఈసీ వివరించింది. అదేవిధంగా, నాలుగో విడతలో అత్యధికంగా 69.16 శాతం మంది ఓటేయగా, అత్యల్పంగా ఐదో విడతలో 62.20 శాతం మంది మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నట్లు ఈసీ వివరించింది. తాజా ఎన్నికల్లో మొదటి ఆరు విడతల్లో కలిపి 87.54 కోట్ల ఓటర్లకు గాను 57.77 కోట్ల మంది ఓట్లేశారు. ప్రపంచంలోనే అత్యధికంగా మన దేశంలో 96.88 కోట్ల మంది ఓటర్లున్నారు.

ఆయన మాజీ సీఎం అవడం ఖాయం

ఒడిశా సీఎం నవీన్‌పట్నాయక్‌పై అమిత్ షా వ్యాఖ్య

భద్రక్/జాజ్‌పూర్(ఒడిశా): ఒడిశా శాసనసభ ఎన్నికల్లో 75కుపైగా సీట్లు సాధించి ప్రస్తుత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌ను జూన్ 4 తర్వాత మాజీ ముఖ్యమంత్రిని చేస్తామని బీజేపీ అగ్రనేత అమిత్ షా వ్యాఖ్యానించారు. భద్రక్ లోక్‌సభ నియోజకవర్గంలోని చాంద్‌బలీ ప్రాంతంలో మంగళవారం అమిత్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. '' జూన్ 4 తర్వాత నవీన్ బాబు సీఎంగా ఉండరు. మాజీ సీఎం అవుతారు. రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాలు, 75 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుంది' అని అమిత్ అన్నారు. ఒడిశాలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలు ఒకేసారి జరుగుతున్న విషయం తెల్సిందే.

రానున్నది కూటమి ప్రభుత్వమే: లాలు

పట్నా: ప్రధానమంత్రి మోదీ తనను దేవుడే పంపించాడంటూ చేసిన వ్యాఖ్యలపై ఆర్జేడీ చీఫ్ లాలు ప్రసాద్ యాదవ్ స్పందించారు. ఆయన మంగళవారం 'ఎక్స్'లో..'మోదీ తనను తాను దేవుడి అవతారమని, దేవదూత అని చెప్పుకుంటున్నారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాలు త్వరలోనే వెల్లడవుతాయి. మోదీ గద్దె దిగక తప్పదు. జూన్ 4వ తేదీ తర్వాత కేంద్రంలో ఏర్పాటయ్యేది ఇండియా కూటమి ప్రభుత్వమే'అని పేర్కొన్నారు. మూడోసారి కూడా ఎన్డీఏ ప్రభుత్వమే వస్తే రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు రద్దు చేస్తుందన్నారు.

హృదయం, ప్రాణం, రక్తంతో రాజ్యాంగాన్ని కాపాడుతాం

రాహుల్ గాంధీ హామీ



బనస్‌గావ్: కేంద్రంలో విపక్ష 'ఇండియా' కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లపై అమల్లో ఉన్న 50 శాతం పరిమితిని తొలగిస్తామని, బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు పెంచుతామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. భారత రాజ్యాంగాన్ని హృదయం, ప్రాణం, రక్తంతో కాపాడుతామని ప్రకటించారు. మంగళవారం ఉత్తరప్రదేశ్‌లోని బనస్‌గావ్‌లో ఎన్నికల ప్రచార సభలో రాహుల్ ప్రసంగించారు. కేవలం అంబానీకి, అదానీకి మేలు చేయడానికే ప్రధాని మోదీని భగవంతుడు భూమికిపైకి పంపించాడని వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో సిద్ధాంతాల మధ్య పోరాటం కొనసాగుతోందన్నారు. ఇండియా కూటమి, రాజ్యాంగం ఒకవైపు, రాజ్యాంగాన్ని అంతం చేయాలనుకుంటున్న శక్తులు మరోవైపు ఉన్నాయని చెప్పారు. భారత రాజ్యాంగానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తన జీవితాన్ని అంకితం చేశారని ఉద్ఘాటించారు. దళితులకు రాజ్యాంగం తగిన గౌరవం కల్పించిందని గుర్తుచేశారు. అలాంటి రాజ్యాంగాన్ని రద్దు చేయాలని బీజేపీ కుట్రలు పన్నుతోందని మండిపడ్డారు. అంబేడ్కర్, జవహర్‌లాల్ నెహ్రూ ఇచ్చిన ఇచ్చిన రాజ్యాంగం జోలికి ఎవరూ రావొద్దని రాహుల్ గాంధీ హెచ్చరించారు.

ఈ ఎన్నికలు చాలా కీలకం

ప్రధాని నరేంద్ర మోదీ పదేళ్ల పాలనలో 22 మంది బిలియనీర్లను సృష్టించారని, తమకు అధికారం అప్పగిస్తే దేశంలో కోట్లాది మంది లక్షాధికారులను సృష్టిస్తామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. మోదీ తన బిలియనీర్ మిత్రుల కోసం రూ.16 లక్షల కోట్ల రుణాలు రద్దు చేశారని, ఈ విషయాన్ని దేశం ఎప్పటికీ మర్చిపోదని అన్నారు. పేదలను లూటీ చేసి, పెద్దలకు కట్టబెట్టారని, ఆ సొమ్మంతా విదేశాలకు తరలిపోయిందని విమర్శించారు. ఈ ఎన్నికలు ప్రజలకు చాలా కీలకమని వెల్లడించారు. మన దేశాన్ని, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, రిజర్వేషన్లను కాపాడుకోవడానికి ఈ ఎన్నికలను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు.

ఉడుకుతున్న ఉత్తరాది

ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు

న్యూఢిల్లీ/కొచ్చి: ఆదిత్యుని ఆగ్రహ కిరణాలకు ఉత్తరభారతం ఎండలతో భగభగ మండుతోంది. వడగాలులు తోడవడంతో వేసవి కాలంలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఢిల్లీలో మంగళవారం దాదాపు 50 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ముంగేశ్‌పూర్, నరేలా ప్రాంతాల్లో 49.9 డిగ్రీ సెల్సియస్, నజఫ్‌గఢ్‌లో 49.8 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఇది ఇక్కడి సాధారణ ఉష్ణోగ్రత కంటే 9 డిగ్రీసెల్సియస్ ఎక్కువ ఉండటం గమనార్హం. ఉత్తర ప్రదేశ్, హరియాణా, రాజస్తాన్, పంజాబ్‌లోనూ ఎండలు ఇలాగే మండిపోయాయి. రాజస్తాన్‌లోని చురులో అత్యధికంగా 50.5 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఇది ఇక్కడి సాధారణ ఉష్ణోగ్రత కంటే 7 డిగ్రీ సెల్సియస్ ఎక్కువ. హరియాణాలోని సిర్సాలో 50.3, హిసార్, పంజాబ్‌లోని భటిండాలో 49.3, ఉత్తరప్రదేశ్‌లోని ఝాన్సీ పట్టణంలో 49, ప్రయాగ్‌రాజ్‌లో 48.2, వారణాసి, కాన్పూర్‌లో 47.6 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. మధ్యప్రదేశ్‌లోనూ నాలుగైదు ప్రాంతాల్లో 48 డిగ్రీలకంటే ఎక్కువ ఉష్ణోగ్రత రికార్డయింది.

కేరళలో భారీ వర్షాలు

ఉత్తరాది ప్రజలు ఉక్కపోతతో చెమట చిందిస్తుంటే దక్షిణాదిన కేరళలో భారీ వర్షాలతో ప్రజలు తడిసి ముద్దయ్యారు. ఈదురుగాలులతో కూలిన భారీ వర్షం కేరళ దక్షిణ, మధ్య ప్రాంతాలను అతలాకుతలం చేసింది. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడ్డాయి. ఇళ్లు కూలిపోయాయి. దీంతో కొందరు పునరావాస శిబిరాల్లో తలదాచుకున్నారు. చాలా జిల్లాల్లో పర్యాటక కేంద్రాలను మూసేశారు. కొండ ప్రాంతాల్లో వాహనాల రాకపోకలను నిషేధించారు. కొచ్చి సిటీ, ఎర్నాకులం జిల్లాల్లో గంటల తరబడి వర్షం పడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. కొచ్చిలోని కలమసెర్రీ ప్రాంతంలో వందలాది ఇళ్లలోకి వర్షపునీరు చేరింది. మీనాచిల్, కొల్లియార్ నదుల్లో నీటిమట్టాలు పెరిగాయి. అరవిక్కర, మలాంకర డ్యామ్‌ల గేట్లను స్వల్పంగా ఎత్తారు. జలాశయాలు ఉప్పొంగడంతో శివారు గ్రామాల మధ్య సంబంధాలు తెగిపోయాయి. తిరువనంతపురంలోని ముథలపోజీ తీరం వద్ద భారీ అల కారణంగా పడవ బోల్తాపడి మత్స్యకారుడు చనిపోయాడు.

యూకే నా సొంతిల్లు

- అమెరికాకు మకాం మార్చట్లేను
- బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ స్పష్టీకరణ



లండన్: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల తర్వాత తన కుటుంబం అమెరికాకు తరలిపోతుందని సొంత పార్టీలో చక్కర్లు కొడుతున్న వార్తను బ్రిటన్ ప్రధానమంత్రి రిషి సునాక్ కొట్టిపారేశారు. మంగళవారం సునాక్ ఆగ్నేయ ఇంగ్లాండ్‌లోని అమెర్శామ్ ప్రాంతంలో కన్జర్వేటివ్ పార్టీ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. పార్టీ మద్దతుదారులనుద్దేశించి ప్రసంగించారు. '' మాజీ విదేశాంగ మంత్రి, పార్టీ నేత జాక్ గోల్డ్‌స్మిత్ మాటలు వింటుంటే ఆశ్చర్యమేస్తోంది. అసలు ఆయనతో నేను మాట్లాడక చాలా కాలమైంది. నా విషయాలు ఆయనకెలా తెలుస్తాయి. అయినా నేను బ్రిటన్‌ను వదిలి అమెరికాకు వెళ్లట్లేను. యూకే నా సొంతిల్లు. ఇక్కడి సౌతాంప్టన్‌లో పుట్టి పెరిగా'' అని సునాక్ వ్యాఖ్యానించారు. బ్రిటన్‌ను వీడతారంటూ వచ్చిన వదంతులను ఇటీవల 'లూజ్ ఉమెన్' టెలివిజన్ షోలోనూ రిషి కొట్టిపారేశారు. ''ఇక్కడ ఎంపీగా ఉండటానికే ఇష్టపడుతున్నా. ఇక్కడే ఉంటా. నా నియోజకవర్గ ప్రజలను ప్రేమిస్తా. నార్త్ యార్క్‌షైర్‌లోని నా సొంతిల్లు అంటే చెప్పలేని ప్రేమ'' అని అన్నారు. అయితే ముందస్తు ఎన్నికలకు సొంత పార్టీ నేతలు సన్నద్ధం కాకపోవడం, ఈసారి విపక్ష లేబర్ పార్టీ మెజారిటీ సాధిస్తుందని సర్వేల్లో తేలడంతో సొంత కన్జర్వేటివ్ పార్టీ ఎంపీల్లో గుబులు పెరిగింది. దీంతో చాలా మంది ఎంపీలు పార్టీ మారొచ్చని వార్తలొచ్చాయి.

స్వలింగ సంపర్కులకు పోప్ క్షమాపణలు

వాటికన్ సిటీ: ఒక సమావేశంలో స్వలింగ సంపర్కులనుద్దేశిస్తూ అసభ్య పదాన్ని ఉచ్ఛరించారని పోప్ ఫ్రాన్సిస్‌పై విమర్శలు వెల్లువెత్తడంతో ఆయన క్షమాపణలు చెప్పారు. ఈ మేరకు క్రైస్తవుల మత కేంద్రస్థానం వాటికన్ అధికార ప్రతినిధి మేటియో బ్రూనీ మంగళవారం ఒక ప్రకటన విడుదలచేశారు. '' స్వలింగ సంపర్క పురుషులను కించపరచాలనే ఉద్దేశంతో ఆయన ఆ పదాన్ని ఉచ్ఛరించలేదు. సరదా సంభాషణలో అనుకోకుండా దొర్లిన ఆ పదం వల్ల బాధపడిన వర్గానికి పోప్ క్షమాపణ చెబుతున్నారు' అని వాటికన్ ఆ ప్రకటనలో పేర్కొంది. మే 20వ తేదీన ఇటాలియన్ బిషప్‌లతో 87 ఏళ్ల పోప్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'గే'లను మతబోధకులుగా శిక్షణనిచ్చేందుకు మళ్లీ అనుమతిస్తే ఎలా ఉంటుంది అంటూ చర్చ జరిగింది. దీంతో పోప్ '' ఆ 'కట్టె'పుల్లలను మతబోధకుల శిక్షణకు అనుమతించకండి. అయినా ఇప్పటికే 'గే' వాసన దట్టంగా కమ్ముకుంది కదా' అని పోప్ సరదాగా మాట్లాడారు. అంతర్గతంగా జరిగిన ఈ భేటీ వివరాలను స్థానిక మీడియా బట్టబయలు చేయడంతో పోప్ పలికిన ఇటాలియన్ పదంపై విమర్శలు వెల్లువెత్తాయి. స్వలింగ సంపర్కులను మతబోధనకు అనర్హులుగా ప్రకటిస్తూ 2005లో వాటికన్ ఒక నిబంధన తెచ్చింది. దానిని 2016లో పోప్ సమర్థించారు. అర్జెంటీనాకు చెందిన పోప్ ఫ్రాన్సిస్‌కు ఇటాలియన్ భాషపై అంతగా పట్టులేదు. అందుకే ఇలా భాషలో తప్పుడు దొర్లిన ఘటనలూ గతంలోనూ జరిగాయి. ' ఒక మతబోధకుడు గే అయి ఉండొచ్చు. అతను దేవుని కరుణ కోసం అన్వేషిస్తుండొచ్చు. అలాంటప్పుడు నేనెవర్ని అతడి స్థాయిని నిర్ణయించడానికి?' అని గతంలో పోప్ స్వలింగ సంపర్కుల అనుకూల వ్యాఖ్యలు చేయడం గమనార్హం.

సాక్షి
కరీంనగర్

బుధవారం | 29 | మే | 2024



భవితకు బాట 'ట్రిపుల్ ఐటీ'

బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. అయితే బాసర ట్రిపుల్ఐటీకి ఎలా దరఖాస్తు చేయాలి..? తదితర సూచనలతో కథనం. 8లో▸



పెద్ద జయంతి రద్దీ

శ్రీఆంజనేయ స్వామి పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టుతోపాటు ధర్మపురి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. 8లో▸

గరిష్టం/కనిష్టం
42.0/31.0

వాతావరణం

వాతావరణం ఎండగా ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. తీవ్ర వడగాలులు వీస్తాయి. రాత్రి వేళ వేడిగాలులు వీచే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నెలసరి పరిశుభ్రత భావితరాలకు భద్రత



సైదాపూర్: మహిళలు, కిశోర బాలికలు రుతుక్రమ సమయంలో సరైన పరిశుభ్రత పాటిస్తూ, మంచి ఆహారాన్ని తీసుకోవాలని డీఆర్‌డీవో శ్రీధర్ సూచించారు. మంగళవారం మండలంలోని రాయికల్ తండాలో యునిసెఫ్, అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన రుతు పరిశుభ్రత నిర్వహణ దినోత్సవ కార్యక్రమంలో డీఆర్‌డీవో శ్రీధర్, జిల్లా సంక్షేమాధికారి సరస్వతి పాల్గొని మాట్లాడారు. బాలింతలు, బాలికలు మంచి ఆహారం తీసుకోవడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన సమాజాన్ని అందించే అవకాశం ఉంటుందన్నారు. యూనిసెఫ్ సమన్వయ కర్త కిషన్‌స్వామి, ఎంపీడీవో యాదగిరి, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

వర్షాలు రాకముందే ఫీడర్లు తనిఖీ చేయాలి

కొత్తపల్లి(కరీంనగర్): రుతు పవనాలు రాకముందే 33/11 కేవీ ఫీడర్లను తనిఖీ చేసి విద్యుత్ అంతరాయాలు లేకుండా చూసుకోవాలని టీజీఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. కరీంనగర్‌లోని విద్యుత్ భవన్ సమావేశ మందిరంలో మంగళవారం డీఈలు, ఏడీఈలు, ఏఈలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్ల ఫెయిల్యూర్, విద్యుత్ లైన్ల నిర్వహణ ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. టీజీఎన్‌పీడీసీఎల్ కంపెనీస్థాయిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఇంటర్నల్ ఎఫిషియన్సీ ఇంప్రూవ్‌మెంట్ ఆన్ జనరేషన్ అడిషనల్ రెవెన్యూ ఆఫ్ మోర్‌డెన్ ట్రీలాక్స్ చేసిన ఏఈలు, సబ్ ఇంజినీర్లకు సీఎండీ ప్రకటించిన అవార్డులను ఈ సందర్భంగా ఎస్ఈ అందజేశారు. డీఈలు విజయేందర్ రెడ్డి, జె.రాజం, లక్ష్మారెడ్డి, తిరుపతి, చంద్రమౌళి, కాళిదాసు, ఏడీలు, ఏఈలు, ఏఓ రాజేశం, పీఓ చంద్రయ్య పాల్గొన్నారు.

క్వింటాల్ పత్తి రూ.7,600



జమ్మికుంట: జమ్మికుంట మార్కెట్లో సోమవారం క్వింటాల్ పత్తి ధర రూ.7,450 కాగా.. మంగళవారం రూ.150 పెరిగి గరిష్టంగా రూ.7,600 పలికింది. మార్కెట్‌కు 21వాహనాల్లో 325 క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తెచ్చారు. మోడల్ ధర రూ.7,550, కనిష్ట ధర రూ.7,300 పలికింది. గన్నీ సంచుల్లో ముగ్గురు రైతులు నాలుగు క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తెచ్చారు. గరిష్ట ధర రూ.6,000, మోడల్ ధర రూ.5,500, కనిష్ట ధర రూ.5,000కు ప్రైవేటు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయవిక్రయాలను కార్యదర్శి గుగులోతు రెడ్డినాయక్ పర్యవేక్షించారు.

'ఓట్ల వ్యత్యాసంపై విచారణ జరిపించండి'

కరీంనగర్ కార్పొరేషన్: లోక్‌సభ ఎన్నికల్లో ఓట్ల వ్యత్యాసంపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు కలెక్టర్‌ను కోరారు. ఈ నెల 13వ తేదీన జరిగిన పోలింగ్‌లో అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా పోలైన ఓట్లలో వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. పోలింగ్‌బూత్‌లు వారిగా ఎన్నికల అధికారులు ఇచ్చిన ఫారమ్ 17లో పొందుపరిచిన ఓట్లకు, పోలైన ఓట్లకు నడుమ వ్యత్యాసం కనిపిస్తోందన్నారు. దీనిపై విచారణ జరిపించాలన్నారు.

స్థానికం ఇప్పట్లో లేనట్టే!

- తొలుత బీసీ కులగణన
- ఆ తర్వాతే రిజర్వేషన్ల ఖరారు
- ఎలక్షన్లకు సిద్ధంగా లేమంటున్న అధికారులు!
- అక్టోబర్ తర్వాతే నిర్వహణ



సాక్షి ప్రతినిధి, కరీంనగర్:

లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ ముగిసింది. వచ్చే నెల 4న కౌంటింగ్ జరగనుంది. ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలంటూ ప్రభుత్వం నుంచి వచ్చిన ప్రకటన పల్లె పోరులో పోటీ చేయాలనుకునేవారిలో ఆశలు రేకెత్తించింది. దీంతో సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఆశావహులు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో రెట్టింపు ఉత్సాహంతో పని చేసి, నేతల మన్ననలు పొందారు. ఫిబ్రవరి 1వ తేదీకి సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో.. అంతకుముందే నూతన ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తుందని అందరూ భావించారు. కానీ, ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారులను నియమించి పాలన కొనసాగిస్తుండటంతో ఎన్నికల నిర్వహణకు మరికొంత సమయం పట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జూలైలో ముగియనున్న ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం

సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల ఎన్నికలను గతంలో మూడు దశల్లో నిర్వహించారు. మొదట సర్పంచ్, ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యులకు జరిపారు. ఎంపీటీసీ సభ్యుల పదవీకాలం జూలై 3, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం అదే నెల 5వ తేదీ వరకు ఉందని సంబంధిత అధికారులు తెలిపారు. ఈసారి మూడు ఎన్నికలను ఒకేసారి నిర్వహించే ఆలోచనలో ప్రభుత్వం ఉందని చెబుతున్నారు.

అడ్డంకులు ఇవే..

స్థానిక సంస్థల ఎన్నికలకు కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిన బీసీ కుల గణన అంశం ప్రధాన అడ్డంకిగా మారింది. ఎన్నికలకు ముందే రాష్ట్ర వ్యాప్తంగా బీసీ కులాల లెక్కలు తేల్చాలని, సమగ్ర కుటుంబ సర్వే తరహాలో యుద్ధప్రాతిపదికన ఇంటింటా సర్వే చేపట్టాలన్న డిమాండ్లు బీసీ సంఘాల నుంచి వస్తున్నాయి. వీటికి సర్కారు తలొగ్గితే బీసీ కులగణన చేపట్టాలని బీసీ కమిషన్‌కు ఆదేశాలు జారీ చేస్తుంది. సమగ్ర కుటుంబ సర్వే తరహాలో ఇంటింటా సర్వే చేస్తారా లేక జిల్లాల వారీగా తేలుస్తారా అన్న అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఆరు నెలల కాలంలోనే వరుస ఎన్నికలతో అధికారులు బిజీబిజీగా ఉండటంతో పాలనా వ్యవస్థ కుంటుపడిందన్న విమర్శలున్నాయి. ఇలాంటి తరుణంలో పంచాయతీ సమరానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపితే మూడు దఫాలుగా గ్రామపంచాయతీ ఎన్నికలు, మరో రెండు దఫాలుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల పరిపాలన గాడితప్పుతుందని సర్కారు భావిస్తే ఎన్నికలను వాయిదా వేస్తుందన్న చర్చ జరుగుతోంది. అదే జరిగితే అక్టోబర్ తర్వాతే ఎలక్షన్లు ఉండే అవకాశం ఉంది.

కులగణన చేపడితే మరింత ఆలస్యం

ప్రభుత్వం కులగణన ప్రారంభిస్తే పూర్తవడానికి సుమారు రెండు నెలల సమయం పడుతుంది. ఆ తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలన్న ఆలోచన చేస్తే ఎలక్షన్లు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రానున్న స్థానిక సమరంలో రిజర్వేషన్ల ప్రక్రియ ఎలా ఉంటుందనే విషయమై నాయకులు లెక్కలు వేసుకుంటున్నారు.

నేతలకు తలనొప్పి..

వరుస ఎన్నికలు రాజకీయ పార్టీల నేతలకు తలనొప్పిగా మారనున్నాయి. శాసనసభ, పార్లమెంట్ ఎలక్షన్లు మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల వరకు కార్యకర్తలను, ద్వితీయ శ్రేణి నాయకులను పార్టీ మారకుండా చూసుకోవడం, వారిని వెంట తిప్పుకోవడం ఖర్చుతో కూడుకున్న వ్యవహారం.

ప్రభుత్వ ఉద్యోగులు బిజీబిజీ..

ఇప్పటికే కిందిస్థాయి సిబ్బంది నుంచి కలెక్టర్ వరకు ఎన్నికల విధుల్లో బిజీబిజీగా ఉన్నారు. దీంతో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలకు అందాల్సిన సేవలు అందడం లేదు. చాలాచోట్ల అధికారులు ఏళ్ల తరబడి పాతుకుపోయారు. వారందరినీ మార్చాల్సి ఉంది. ఎన్నికల కోడ్ వల్ల ఇది సాధ్యం కాలేదు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాల ప్రక్రియ ముగిసిన వెంటనే ఒకేచోట పాతుకుపోయిన ఉద్యోగులందరినీ బదిలీ చేసి, స్థానిక సమరాన్ని సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వం మొగ్గుచూపుతున్నట్లు సమాచారం. అధికారులు కూడా ఎన్నికలకు సిద్ధంగా లేమని చెబుతున్నట్లు తెలిసింది.

జిల్లాలవారీగా పంచాయతీల సంఖ్య

కరీంనగర్	313
జగిత్యాల	382
పెద్దపల్లి	267
రాజన్నసిరిసిల్ల	255
మొత్తం	1217

రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాలి



కాంగ్రెస్ పార్టీ పాంచ్‌న్యాయ్ హామీల్లో ఒకటి సామాజిక న్యాయం. ప్రతీ వ్యక్తికి ఆర్థిక సమానత్వం, సామాజిక సమతుల్యం కులగణనతోనే సాధ్యం. అసెంబ్లీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్ల అంశాన్ని తేల్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 33 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి, బీసీలకు ద్రోహం చేసింది. రాజ్యాంగ సవరణ ద్వారా 50 శాతం పరిమితిని తొలగిస్తామన్న హామీకి కట్టుబడి ఉండాలి.

– గీకురు రవీందర్, చిగురుమామిడి జెడ్పీటీసీ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు

పక్కాగా ఓట్ల లెక్కింపు

- ప్రతీది రికార్డు అయ్యేలా ఏర్పాట్లుండాలి
- వీసీలో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



వీసీలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్

కరీంనగర్ అర్బన్: వచ్చేనెల 4న పార్లమెంటు ఎన్నికల ఓట్ల లెక్కింపును పక్కాగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. సీసీ కెమెరాల ద్వారా కౌంటింగ్ హాల్లో ప్రతీది రికార్డు అవుతుందని, సిబ్బంది జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌లోని తన కార్యాలయం నుంచి పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి, ఏఆర్వోలు, సీపీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కౌంటింగ్ సందర్భంగా చేపట్టాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. జూన్ నాలుగో తేదీన ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు ప్రారంభించాలని, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు, ఈవీఎంల ఓట్లు ఒకేసారి లెక్కించాలని పేర్కొన్నారు. ఫలితాల ప్రకటన కోసం మీడియా సెంటర్‌ను ఏర్పాటు చేయాలని సూచించారు. రౌండ్ల వారీగా ఫలితాలను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని, అన్ని నిర్ధారించుకున్న తర్వాతనే ఫలితాలను ప్రకటించాలని అన్నారు. కౌంటింగ్ హాళ్ల వద్ద మూడంచెల పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలని, ఇతరులు ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి ఐదేసి వీవీ ప్యాట్స్ నుంచి ఓటర్ స్లిప్పులను తప్పనిసరి లెక్కించాలని ఆదేశించారు. ఆయా పార్టీల అభ్యర్థులు, ఏజెంట్లు, కౌంటింగ్ సిబ్బంది సెల్ ఫోన్లు కౌంటింగ్ కేంద్రాల్లోకి తీసుకెళ్లేందుకు ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. అవసరమైన కంప్యూటర్లు, ఇంటర్నెట్, విద్యుత్తు సౌకర్యం ఉండేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. కౌంటింగ్ పూర్తి అయిన తర్వాత ఈవీఎంలు, ఎన్నికల సామాగ్రిని ఒకచోట భద్రపరచాలని తెలిపారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, లా అండ్ ఆర్డర్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఆర్డీవో కే.మహేశ్వర్, పరిశ్రమలశాఖ జీఎం నవీన్ కుమార్, ఏసీపీలు నరేందర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీఏలో ఏసీబీ తనిఖీలు

- ముందస్తు సమాచారంతో అప్రమత్తమైన అధికారులు
- విషయం తెలుసుకుని పరారైన ఆర్టీఏ ఏజెంట్లు
- ఉద్యోగుల జేబులు తనిఖీ, రికార్డులు, ఫైళ్లు పరిశీలన
- ఉన్నతాధికారులకు నివేదిక అందజేత



ఆర్టీఏ ఆఫీసులో తనిఖీ చేస్తున్న ఏసీబీ అధికారులు

తిమ్మాపూర్: జిల్లా రవాణాశాఖ కార్యాలయంలో ఏసీబీ అధికారులు మంగళవారం తనిఖీలు నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా రవాణా కార్యాలయాల్లో అవినీతి జరుగుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఫిర్యాదులు అందడంతో, ఆయన ఆదేశాల మేరకు ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కరీంనగర్ రవాణా కార్యాలయంలో ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ కృష్ణకుమార్ ఆధ్వర్యంలో సోదాలు చేశారు. కార్యాలయానికి చేరుకుని, తలుపులు వేసి ఉద్యోగుల జేబులు, మహిళా ఉద్యోగులు బ్యాగులు తనిఖీ చేశారు. పలు ఫైళ్లు, దరఖాస్తుదారుల వద్ద ఉన్న ఫైళ్లను పరిశీలించారు. కొందరి వద్ద ఉన్న ఫైళ్లపై ఏజెంట్ కోడ్‌ను ఏసీబీ అధికారులు పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని డీఎస్పీ వెల్లడించారు.

ముందస్తు సమాచారంతో అప్రమత్తం

ఏసీబీ అధికారులు వస్తున్నారన్న సమాచారం అందడంతో ఆర్టీఏ అధికారులు అప్రమత్తమయ్యారు. ఆధారాలు దొరక్కుండా దాచేశారు. కార్యాలయం ఆవరణలో నిత్యం తిరిగే ఏజెంట్లను బయటికి పంపేసి, సమీపంలోని ఏజెంట్ల ఆఫీసులు మూసివేయించారు. దీంతో ఏసీబీ అధికారులకు పూర్తిస్థాయిలో ఆధారాలు దొరకలేదని తెలిసింది.

అక్రమాల గుర్తింపు..

రవాణాశాఖ కార్యాలయంలో అక్రమాలు జరుగుతున్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. కార్యాలయంలోకి వచ్చే ఫైళ్లపై ఏజెంట్ కోడ్ ఉండడం గుర్తించారు. రిజిస్ట్రేషన్, లైసెన్స్, ఫిట్‌నెస్ టెస్ట్ కోసం వచ్చిన వారిని విచారించగా.. ఆయా పనులకు చెల్లించాల్సి ఫీజుకన్నా.. ఎక్కువ డబ్బులు చెల్లించినట్లు అధికారులకు తెలిపారు. ఎక్కువ మొత్తం సొమ్ము సంబంధిత ఏజెంట్ల ద్వారా అధికారులకు అందుతున్నట్లు అనుమానిస్తున్నారు.

సన్నిహితంగా ఉండే సిబ్బంది ద్వారా

రవాణాశాఖ కార్యాలయంలో ఇటీవలే డీటీసీ నుంచి ఏఎంవీఐ వరకు బదిలీలు జరిగాయి. కానీ రోజూ వచ్చే అధికారుల వాటా మాత్రం ఆగలేదు. ప్రతీరోజు వాహనదారుల నుంచి అన్ని రకాల ఫైల్స్‌కు సంబంధించిన మామూళ్లను కిందిస్థాయి సిబ్బంది ద్వారా జేబులో వేసుకుంటున్నట్లు తెలిసింది. ఏసీబీ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి వదిలేస్తే, వాహనదారులు నష్టపోతున్నారని కార్యాలయానికి వచ్చిన వారు చర్చించుకుంటున్నారు. ఏజెంట్లు కోడ్ వేస్తే చాలు వారి పని కార్యాలయంలో సులువుగా అవుతోందని, వాహనదారుడు నేరుగా ఆఫీసుకు వస్తే సరైన పత్రాలు లేవంటూ వాపస్ పంపించడం గతంలో చాలా సందర్భాలు జరిగాయని గుర్తు చేసుకున్నారు. రవాణా కార్యాలయంలో కన్నా సమీపంలో ఉన్న ఏజెంట్ కార్యాలయాల్లోనే రోజూ వందల మంది వాహనదారులు ఉండడం గమనార్హం.



యువకుడు పడ్డ బావి



వాగులో ప్రశాంత్‌రెడ్డి మృతదేహం



ప్రశాంత్‌రెడ్డి (ఫైల్)

వెంటాడి.. వేటాడి..

యువకుడి దారుణ హత్య

- మూడు రోజుల పాటు రెక్కీ
- పక్కా సమాచారంతో దాడి
- తప్పించుకునే యత్నంలో బావిలో పడ్డ యువకుడు
- బయటికి తీసి చిత్రహింసలు పెట్టి ఘాతుకం!
- 12 గంటల గాలింపు తర్వాత మానేరులో దొరికిన మృతదేహం
- మృతుడిది మానకొండూర్ మండలం పచ్చునూరు

మానకొండూర్: ఓ యువకుడిని చంపేందుకు మూడు రోజులు రెక్కీ నిర్వహించారు. విషయం తెలిసి సదరు యువకుడు ప్రాణాలు కాపాడుకునేందుకు పొరుగూరిలో దాక్కున్నాడు. పసిగట్టిన ప్రత్యర్థులు వెంబడించారు. తప్పించుకునే క్రమంలో బావిలో పడ్డాడు. అయినా వదలని ఆ దుండగులు ఆ యువకుడిని బావి నుంచి బయటకు తీసి తమ వాహనంలో ఎక్కించుకుని తీసుకెళ్లారు. చివరకు సదరు యువకుడు పెద్దపల్లి జిల్లా గర్రెపల్లి– కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం వెల్ది గ్రామాల మధ్యలోని మానేరు వాగులో శవమై కనిపించాడు. స్థానికుల కథనం ప్రకారం.. మానకొండూర్ మండలం పచ్చునూరుకు చెందిన గోపు ప్రశాంత్ రెడ్డి(23) మంగళవారం ఉదయం కిడ్నాప్‌నకు గురై సాయంత్రం శవమై కనిపించడంతో గ్రామం ఉలిక్కిపడింది. గ్రామానికి చెందిన గోపు రమ, రఘునాథరెడ్డికి ఇద్దరు కొడుకులు. పెద్ద కొడుకు శ్యాంసుందర్ వరంగల్‌లో ఉంటున్నాడు. చిన్న కొడుకు ప్రశాంత్‌రెడ్డి (23) ఇంటర్ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటున్నాడు. పదేళ్లక్రితం తల్లి రమ, ఆరేళ్ల క్రితం తండ్రి రఘునాథరెడ్డి అనారోగ్యంతో చనిపోయారు. ఒంటరిగానే ఇంటివద్ద ఉంటున్న ప్రశాంత్‌రెడ్డిపై పోలీసు కేసులు ఉన్నట్లు సమాచారం. కొద్దిరోజులుగా ప్రశాంత్‌రెడ్డికి స్థానికంగా ఉండే రమేశ్ ఉరఫ్ జానీతో ఓ భూమి సెటిల్‌మెంట్ వ్యవహారంలో గొడవలు జరుగుతున్నాయి. ఈ వ్యవహారంలో 'నిన్ను చంపుతా.. అంటే నిన్నే చంపుతా' అంటూ తరచూ ఒకరినొకరు చాలెంజ్ చేసుకుంటున్నారు. ఎక్కడ ప్రశాంత్‌రెడ్డి తనను చంపుతాడోననే భయంతో రమేశ్ తన ఫ్రెండ్ గాజు శంకర్, మరికొందరి సహకారంతో ప్రశాంత్‌ను అంతమొందించాలని ప్రణాళిక రచించారు. మూడు రోజులుగా ఆయన ఇంటి పరిసరాల్లో రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. ప్రత్యర్థుల వ్యూహాన్ని పసిగట్టిన ప్రశాంత్ అప్రమత్తమయ్యాడు. తనకు సాయం చేయాలని గ్రామంలో పలువురిని కోరాడు. సోమవారం సాయంత్రం ఊటూరులోని ఓ మిత్రుడి వద్దకు వెళ్లాడు. తనకు రూ.500 ఇచ్చి ఈ రాత్రికి ఆశ్రయం కల్పిస్తే ఉదయాన్నే జమ్మికుంట వెళ్లి, అక్కడి నుంచి హన్మకొండలోని తన సోదరుడి వద్దకు వెళ్తానని తెలిపాడు.

బావిలో పడ్డా.. రాళ్లతో కొట్టి.. బయటకు తీసి..

సోమవారం రాత్రి రమేశ్ ఆయన అనుచరులు పచ్చునూరులో ప్రశాంత్‌రెడ్డి గురించి ఆరా తీసినట్లు సమాచారం. ఊటూరు వెళ్లాడని తెలుసుకుని మంగళవారం వేకువజామున ఐదుగంటల ప్రాంతంలో ఆ గ్రామానికి వెళ్లారు. శివారులోని ఓ శివాలయం వద్ద ఓ హనుమాన్ మాలధారుడితో ప్రశాంత్‌రెడ్డి గురించి వాకబు చేశారు. సదరు భక్తుడి సెల్‌ఫోన్ తీసుకుని ప్రశాంత్‌రెడ్డి నంబరుకు ఫోన్ చేశారు. సమీపంలోనే ఫోన్ రింగ్ శబ్దం రావడంతో అతడిని వెంబడించారు. గమనించిన ప్రశాంత్‌రెడ్డి తప్పించుకునే క్రమంలో సమీపంలో ఉన్న ఓ పాడుబడ్డ బావిలో పడ్డాడు. అయినా వదలని దుండగులు రాళ్లతో దాడిచేశారు. తీవ్రగాయాలైనా.. వదలకుండా తాడుసాయంతో బావిలోంచి బయటకు తీసి ఉదయం 6 గంటల ప్రాంతంలో జీప్‌లో ఎక్కించుకొని గ్రామం నుంచి తీసుకెళ్లారు.

ఆ 12 గంటలు..

కిడ్నాప్ గురించి పోలీసులకు సమాచారం అందడంతో ఉదయం 6గంటలకు కరీంనగర్ రూరల్ ఏసీపీ వెంకటరమణ, మానకొండూర్ సీఐ మాదాసు రాజ్‌కుమార్ హుటాహుటిన ఊటూరు గ్రామానికి చేరుకుని ప్రశాంత్‌రెడ్డి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. 12 గంటల పాటు పలు గ్రామాల్లో సీసీ ఫుటేజీలు పరిశీలించారు. వాటి ఆధారంగా వేగురుపల్లి శివారులోని మానేరు వాగుకు జీపులో వెళ్లినట్లు గుర్తించారు. సాయంత్రం ఆరుగంటల ప్రాంతంలో సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి– మానకొండూర్ మండలం వెల్ది మధ్యలో ఉన్న మానేరు వాగులో ప్రశాంత్‌రెడ్డి మృతదేహం లభ్యమైంది. ప్రశాంత్‌రెడ్డిని హత్య చేసింది రమేశ్ అనే వ్యక్తిగా సమాచారం. కాగా.. పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు. ప్రశాంత్‌ను దారుణంగా హింసించి, పైశాచికంగా చంపినట్లు అతని మృతదేహాన్ని బట్టి తెలుస్తోంది. హత్యకు ఆధిపత్య పోరా? పాత కక్షలు కారణమా? అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిందితులు గంజాయి మత్తులో ఇలా పైశాచికంగా ప్రవర్తించి ఉంటారన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. గతేడాది ఏప్రిల్‌లోనూ గంజాయి తాగి వచ్చిన కొందరు మానకొండూరులో తుపాకీతో కాల్పులు జరిపేందుకు యత్నించారు. ఆ ఘటనతో పోలికలుండడం బలాన్ని చేకూరుస్తున్నాయి. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ రాజ్‌కుమార్ వివరించారు.

పెట్టుబడి భారం..'పాడి'కి దూరం

- గ్రామాల్లో తగ్గుతున్న గేదెలు, ఆవులు
- పెరుగుతున్న జనాభాకు సరిపోని పాల దిగుబడి
- గిట్టుబాటు కావడం లేదంటున్న పాడి రైతులు



జగిత్యాలఅగ్రికల్చర్: ఒకప్పుడు పాడి గేదెలు, ఆవులతో గ్రామాలు కళకళలాడేవి. రైతుల ఇళ్లలో పాల పొంగుల నురగలు కనబడేవి. మారుతున్న కాలగమనంలో గ్రామాల్లో పాడి పశువులు తగ్గుతుంటే, ఆ మేరకు పాల ఉత్పత్తి సామర్థ్యం కూడా దారుణంగా పడిపోతుంది. పెరుగుతున్న జనాభాకు సరిపడా పాల ఉత్పత్తి కావడం లేదు.

ఉమ్మడి జిల్లాలో 4,35,612 పశువులు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో మొత్తం 4,35,612 పశువులు ఉండగా, అందులో పాలు ఇచ్చేవి 1,66,182 మాత్రమే ఉన్నాయి. ఇందులో ఆవులు 28,975, గేదెలు 1,37,207 ఉన్నాయి. ఇందులో పాలిచ్చే దేశీ ఆవులు 8,394, విదేశీ జాతి ఆవులు 20,581, దేశీ గేదెలు 90,825, విదేశీ గేదెలు 46,382 ఉన్నాయి. అయితే, వీటి సంఖ్య రోజురోజుకు తగ్గుతుండటం ఆందోళన కలిగిస్తోంది. విదేశీ బర్లు, ఆవులను ఎక్కువగా డెయిరీ ఫారాల్లో వ్యాపారపరంగా పెంచుతున్నారు. కాగా ఉమ్మడి జిల్లాలో డెయిరీ ఫారాల సంఖ్య ఆశించినస్థాయిలో లేదు. డెయిరీల ద్వారా పశువుల సంఖ్యను బట్టి రోజుకు 100 లీటర్ల వరకు పాల ఉత్పత్తి జరుగుతుండగా, గ్రామాల్లో ఒకట్రెండు దేశీ ఆవులు, బర్లను పెంచే రైతులంతా కలిసి 100 లీటర్ల వరకు పాలను ఉత్పత్తి చేయలేకపోతుండటం ఆందోళనకర పరిణామం.

పెంపకం నుంచి తప్పుకుంటున్న రైతులు

గ్రామాల్లో ప్రతీ రైతుకు ఒకట్రెండు గేదెలు ఉండేవి. వాటిని గ్రామంలోని మందకు పంపించేవారు. సాయంత్రం వచ్చిన తర్వాత తవుడు, పచ్చిగడ్డి వేసి పాల దిగుబడి తీసేవారు. అలా గేదెల ద్వారా ప్రతీ ఇంట్లో రోజుకు 3–4 లీటర్ల పాల ఉత్పత్తి జరిగేది. ప్రస్తుతం పట్టణాలకు దగ్గరగా ఉన్న రైతులు పాలను నేరుగా వినియోగదారులకు విక్రయిస్తూ కొంత మేర లాభం పొందుతున్నారు. పట్టణాలకు దూరంగా ఉన్న రైతులు గ్రామాల్లోని పాల ఉత్పత్తిదారుల సంఘాలకు విక్రయిస్తున్నారు. అయితే, వర్షాకాలం నుంచి శీతాకాలం మధ్యలో పాడి పశువులు ఈనుతుంటాయి. ఆ సమయంలో కొంతమేర పాల దిగుబడి ఉంటుండగా, వేసవి వచ్చేసరికి దిగుబడి ఘోరంగా పడిపోతుంది. ఉదాహరణకు.. జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ పాల ఉత్పత్తిదారుల సంఘంలో సీజన్‌లో 150 లీటర్లు పాలు పోస్తుండగా, ప్రస్తుతం 70 లీటర్లకు పడిపోయింది. సంఘంలో 230 మంది వరకు సభ్యులు ఉండి, సీజన్‌లో 130 మంది పాలు పోయగా, ప్రస్తుతం 50– 60 మంది మాత్రమే పాలు పోస్తున్నారు.

రోజూ దాదాపు 3.80 లక్షల లీటర్లు

ఉమ్మడి జిల్లాలో రోజూ పాల దిగుబడి 3.80 లక్షల లీటర్ల వరకు ఉంటుందని అంచనా. అలాగే ఉమ్మడి జిల్లాలో మిల్క్ చిల్లింగ్ సెంటర్స్ ఏడెనిమిది ఉండగా, పాల సేకరణ కేంద్రాలు 600 పైగా ఉన్నాయి. కంపెనీలు పాలలోని వెన్న శాతాన్ని బట్టి రేటు ఇస్తుండటంతో రైతులకు పెద్దగా గిట్టుబాటు కావడం లేదు. పాడి రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రకటించిన ఇన్సెంటివ్స్ గత మూడేళ్ల నుంచి రావడం లేదు.

పెరుగుతున్న పెట్టుబడి

పశువులకు దాణా తప్పనిసరి. ప్రస్తుత పరిస్థితుల్లో పచ్చిమేతను వేసే పరిస్థితి లేదు. దాణాకు తవుడు 50 కిలోల ధర రూ.1,600 వరకు చేరింది. ఎండుగడ్డిని కట్టలు కట్టించి ఇంటికి తీసుకువస్తే ఒక్కో కట్టకు రూ.100 ఖర్చు వస్తుంది. గ్రామాల్లో బర్రెల మందను కాసేవారు కరువయ్యారు. ఒకవేళ కాసినా కూలి ఖర్చు.. పాల ఖర్చును మించిపోయింది. దీంతో పాలను ఉత్పత్తి చేసే బదులు పాల ప్యాకెట్ కొనుక్కుంటే సరిపోతుందనే అభిప్రాయానికి రైతులు వచ్చారు.

క్లుప్తంగా

బావిలోపడి వృద్ధురాలి మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): గర్రెపల్లి గ్రామానికి చెందిన ఆవుల బూదమ్మ(95) ప్రమాదవశాత్తు మంగళవారం వ్యవసాయ బావిలో పడి మృతి చెందింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. బూదమ్మ కొన్నిరోజుల క్రితం మతిస్థిమితం కోల్పోయింది. దీనికితోడు అనారోగ్యంతో బాధపడతోంది. ఈక్రమంలో మంగళవారం ఇంటి సమిపంలోని వ్యవసాయ బావి వైపు నడుచుకుంటూ వెళ్లింది. ప్రమాదవాశాత్తు జారి బావిలోపడి మృతి చెందింది. మృతురాలకి భర్త గతంలోనే చనిపోయాడు. కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై వివరించారు.

విద్యుత్ షాక్‌తో వ్యక్తి ..


మిరాజ్ మృతదేహం

వేములవాడ అర్బన్: విద్యుత్ షాక్‌తో వలస కూలీ మృతిచెందిన ఘటన సోమవారం అర్ధ రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేములవాడ రహదారిని ఆనుకొని ఉన్న అజీరా హోమ్స్ వెంచర్‌లోని రేకుల షెడ్డులో బిహార్‌కు చెందిన ఎండీ మిరాజ్ (27) అనే కూలీ విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వేములవాడ టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

అప్పుల బాధలు భరించలేక యువకుడి ఆత్మహత్య


బబ్లూ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): ముస్తాబాద్ మండల కేంద్రానికి చెందిన ఓ యువకుడు అప్పుల బాధలు భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శేఖర్ రెడ్డి వివరాల ప్రకారం.. ముస్తాబాద్‌కు చెందిన మీస బబ్లూ(35) సిరిసిల్లలో తాపీమేస్త్రీగా పనిచేసేవాడు. కుటుంబ పోషణకు అప్పులు చేశాడు. సరైన పనులు లభించక మద్యానికి బానిసయ్యాడు. అప్పులు తీర్చే మార్గం లేక, జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో అందరూ నిద్రించిన సమయంలో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బబ్లూ మృతితో భార్య భారతి, కుమారుడు, కూతురు రోదనలు మిన్నంటాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లింక్ ఓపెన్ చేయగానే.. రూ.9.60లక్షలు మాయం

- గోదావరిఖనిలో మరోసైబర్ క్రైం
- 1930కి ఫిర్యాదు చేసిన బాధితుడు

గోదావరిఖని: సైబర్ నేరగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానిత లింక్‌లు ఓపెన్ చేయొద్దని ఒకవైపు పోలీసులు, అధికారులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయినా, జిల్లావ్యాప్తంగా ఏదోఒకచోట కొందరు అమాయకులు సైబర్ నేరగాళ్ల బారినపడి మోసపోతూనే ఉన్నారు. ఈక్రమంలో గోదావరిఖనికి చెందిన ఓ వ్యాపారి వారి వలలో చిక్కి రూ.లక్షల్లో కోల్పోయాడు. స్థానిక చికెన్ సెంటర్ హోల్‌సేల్ వ్యాపారి దేవేందర్ సెల్‌ఫోన్‌కు ఓ బ్యాంకు పేరిట సైబర్ నేరగాళ్లు ఓ లింక్ పంపించారు. సదరు వ్యాపారిని దానిని ఓపెన్ చేయగానే బ్యాంకు ఖాతాలోని రూ.9.60లక్షలు మాయమయ్యాయి. తాను మోసపోయానని గుర్తించిన బాధితుడు వెంటనే సైబర్‌క్రైం టోల్‌ఫ్రీ నంబరు 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేశాడు.

భవితకు బాట 'ట్రిపుల్ ఐటీ'

- బాసర ట్రిపుల్ ఐటీకి నోటిఫికేషన్ విడుదల
- జూన్01 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ
- 22 వరకు చివరి గడువు
- జూలై 8న సర్టిఫికెట్ల పరిశీలన
- పదోతరగతి పూర్తయిన విద్యార్థులకు సువర్ణావకాశం



కరీంనగర్: పదోతరగతి పూర్తవగానే విద్యార్థుల భవిష్యత్ బంగారమయ్యే దారులవైపు తల్లిదండ్రులు ఆలోచన చేస్తుంటారు. అధికశాతం విద్యార్థులు ట్రిపుల్‌ఐటీల వైపు చూస్తుండగా.. బాసర ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ అవకాశాన్ని అందిపుచ్చుకుంటే విద్యార్థులు త్వరగా జీవితంలో స్థిరపడే అవకాశాలు మెండుగా ఉంటాయి. అయితే బాసర ట్రిపుల్‌ఐటీకి ఎలా దరఖాస్తు చేయాలి..? తదితర సూచనలతో కథనం.

1500 సీట్లు

రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక, సాంకేతిక విశ్వవిద్యాలయం (ఆర్‌యూయూకేటీ)పరిధిలోని బాసర ట్రిపుల్‌ఐటీలో 2024–25 విద్యా సంవత్సరం(1500 మంది) ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైంది. ఆరేళ్ల బీటెక్ సమీకృత కోర్సులో చేరేందుకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మంగళవారం నోటిఫికేషన్ జారీచేశారు. ప్రతిభగల విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో చేరి ఉన్నత విద్యనభ్యసించేందుకు ఇదే మంచి సమయం.

ప్రవేశాల షెడ్యూల్

జూన్01వ తేదీ నుంచి 22వతేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. ఈనెల 24న దివ్యాంగులు, సైనికోద్యోగుల పిల్లలు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్, గ్లోబల్ కేటగిరీకి చెందిన వారినుంచి దరఖాస్తుల స్వీకరణ ఉంటుంది. జూలై 3న ప్రొవిజనల్ సీట్లు కేటాయింపు, జూలై 8న తొలి విడత కౌన్సిలింగ్ ఉంటుంది. అభ్యర్థులు ప్రథమ ప్రయత్నంలో 2024–ఎస్ఎస్‌సీ, తత్సమాన పరీక్షలో రెగ్యులర్‌గా ఉత్తీర్ణులై ఉండాలి. 31–12–2024 నాటికి 18 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 21ఏళ్లు నిండకూడదు.

జీపీఏ ఆధారంగా అడ్మిషన్లు

పదోతరగతిలో గ్రేడ్ పాయింట్ ఏవరేజ్(జీపీఏ) ఆధారంగా మెరిట్ పద్ధతిలో ప్రవేశాలు కల్పిస్తారు. ఒకే జీపీఏ ఉన్న అభ్యర్థులకు సబ్జెక్టు వారీగా పొందిన గ్రేడ్ ఆధారంగా ప్రవేశాలు ఉంటాయి. నాన్ రెసిడెన్షియల్ ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, మున్సిపల్ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు వారి జీపీఏకు 0.4 డిప్రైవేషన్ స్కోర్‌ను అదనంగా కలుపుతారు. దీనిని సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబాటుకు గురైన విద్యార్థులకు ఇచ్చే వెయింటేజీగా పేర్కొన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో 85శాతం సీట్లను స్థానికంగా, మిగిలిన 15శాతం సీట్లను మెరిట్ కోటాలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులకు కేటాయించారు. రాష్ట్రపతి ఉత్తర్వులు 371 ఆర్టికల్ డి సెక్షన్ 95, 2014 మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు.

రిజర్వేషన్లు ఇలా...

- ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 6శాతం, బీసీ–ఏలకు 7శాతం, బీసీ–బీకి 10శాతం, బీసీ–సీకి ఒక శాతం, బీసీ–డీకి 7శాతం, బీసీ–ఈకి 4 శాతం.
- ప్రత్యేక సీట్ల కింద దివ్యాంగులకు 3 శాతం, సైనికోద్యోగుల పిల్లలకు 2 శాతం, ఎన్‌సీసీ విద్యార్థులకు ఒక శాతం, స్పోర్ట్స్ కోటా కింద 0.5 శాతం సీట్లను భర్తీ చేస్తారు.
- 33.33 శాతం సీట్లను సమాంతరంగా బాలికలకు కేటాయిస్తారు.
- వేరే రాష్ట్రాల వారికి, అంతర్జాతీయ విద్యార్థులకు, గల్ఫ్‌దేశాల్లో పనిచేస్తున్న భారతీయుల పిల్లలకు అదనపు సీట్లు కేటాయిస్తారు.

ఫీజుల వివరాలు...

- రాష్ట్ర పాఠశాలల్లో చదివిన విద్యార్థులు ఏడాదికి రూ.36 వేల ఫీజు చెల్లించాలి. ట్యూషన్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు అర్హులైన వారు చెల్లించాల్సిన అవసరం లేదు.
- ప్రవేశ సమయంలో ఆరోగ్యబీమా, ఇతరాలకు సంబంధించి రూ. 3500 ఇతరులకు, ఎస్సీఎస్టీ అభ్యర్థులకు రూ.3000 చెల్లించాలి. క్యాషన్ (దీనిని తిరిగి ఇస్తారు)డిపాజిట్ కింద ఏ కేటగిరి అభ్యర్థులైనా రూ.2000 చెల్లించాలి. ఇతర రాష్ట్రాలు, గల్ఫ్‌దేశాల్లో పని చేసే వారి పిల్లలు ఏడాదికి రూ.1.36 లక్షలు, ఎన్ఆర్ఐ విద్యార్థులు రూ.3 లక్షలు ట్యూషన్ ఫీజు చెల్లించాలి.

దరఖాస్తు చేయడం ఇలా..

- విద్యార్థులు ఆన్‌లైన్‌లో ఆర్‌జీయూకేటీ వెబ్‌సైట్ ఆధారంగా దరఖాస్తు చేసుకోవాలి. ఓసీ, బీసీ అభ్యర్థులు దరఖాస్తు రుసుం రూ.500, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు రూ.450, వేరే రాష్ట్రంవారు రూ.1500 చెల్లించాలి. ఒకటి కన్నా ఎక్కువసార్లు దరఖాస్తు చేసుకుంటే చివరగా చేసినవాటిని పరిగణలోకి తీసుకుంటారు.
- ఆన్‌లైన్ దరఖాస్తు సమర్పించినప్పుడు ఇచ్చిన రశీదు, పదో తరగతి హాల్‌టికెట్, మార్కుల లిస్టు, నివాసం, బీసీ,ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు, వికలాంగులైతే వైకల్య నిర్ధారణ పత్రాలు, సైనికోద్యోగుల పిల్లలు సంబంధిత అధికారి జారీచేసిన ధ్రువీకరణ పత్రం, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కోటా అభ్యర్థులైతే సంబంధిత అధికారి జారీ చేసిన ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి.
- ఎంపికైన విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలతో పాటు, రెండు జతల యూనిఫాం, షూలు, ల్యాప్‌టాప్‌లు, ఇతర సౌకర్యాలు ఉచితంగా కల్పిస్తారు.

మూడు నెలల్లో కాంగ్రెస్ జాతకం బట్టబయలు

- ప్రజల దృష్టి మళ్లించేందుకే ఆరోపణలు
- ఐదుసార్లు ఓడిపోయిన జువ్వాడిపై నిఘా పెట్టడమా?
- కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


మాట్లాడుతున్న కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్

కరీంనగర్: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక ఏం చేయాలో తోచక ఆరు నెలలుగా లీకులివ్వడం, సాకులు చెప్పడం, తిట్లదండకంతో కాలయాపన చేస్తోందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ నివాసంలో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీకి అభివృద్ధి పట్టదని, సంక్షేమమంటే గిట్టదని అన్నారు. ఎన్నికల సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు పనికిరాదని గందరగోళం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బ్యారేజీకి మరమ్మతులు ఎందుకు చేస్తోందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో జరిగిన పథకాలపై అడ్డగోలు విమర్శలు చేయడం తప్పా ఆరు నెలల్లో ఒరుగబెట్టిందేమీ లేదన్నారు. ధాన్యం క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ఎన్నికల ముందు చెప్పి, సన్నవడ్లకే అంటూ చేతులేత్తేశారని, ధాన్యం కొనుగోళ్లల్లో దళారులు రాజ్యమేలుతున్నారని ధ్వజమెత్తారు. సివిల్ సప్లయ్ అవకతవకలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాటలే నిదర్శనమని అన్నారు. ప్రభుత్వం లిక్కర్ స్కాం నడిపిస్తోందని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ అంటూ బీఆర్ఎస్ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్, హరీష్, తదితరులపై ఆరోపణలు గుప్పించడం సమస్యలను పక్కదారి పట్టించేందుకేనని అన్నారు. కోరుట్ల కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావుపై ఫోన్ ట్యాపింగ్ నిఘా పెట్టామని ఆరోపణ పెద్ద జోక్ అని అభివర్ణించారు. 2009 నుంచి వరుసగా ఐదు ఓటమి పాలైన నర్సింగరావు ఫోన్‌ను ట్యాపింగ్ చేయాల్సిన అవసరం ఎవరికి ఉందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌పార్టీ నేతలు ఇకనైనా గారడి మాటలకు స్వస్తి చెప్పాలని, పరిపాలన పై దృష్టిసారించాలని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామక్రిష్ణారావు, బోనాల శ్రీకాంత్, గందె మహేశ్, తిరుపతినాయక్, నేతి రవివర్మ, షౌకత్ అలీ పాల్గొన్నారు.

గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల అమలులో నిర్లక్ష్యం


మాట్లాడుతున్న పుట్ట మధు

- పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు

మంథని: గోదావరి, మానేరు పరీవాహక ప్రాంతాల్లో ఇసుక క్వారీలను నిలిపివేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలు ఇచ్చినా అమలు కావడం లేదని పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధు ఆరోపించారు. పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మానేరులో చెక్‌డ్యాంలు నిర్మిస్తున్న ప్రాంతంలో పేరుకుపోయిన ఇసుకను తీసి రీ సీల్టేషన్ చేయాలనే నిబంధనలు పాటించకపోవడంతో కొందరు ఎన్‌జీటీని ఆశ్రయించారన్నారు. ఈ క్రమంలో ట్రిబ్యునల్ ఇసుక క్వారీలను, రవాణాను ఆపేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. కానీ గోదావరి నది నుంచి ఇసుక రవాణా జరుగుతోందని అన్నారు. మంథని నియోజకవర్గంలో ఎక్కడ చూసినా ఇసుక డంపులే దర్శనమిస్తున్నాయని తెలిపారు. పోలీసులు అనేకచోట్ల ఇప్పటికే డంప్‌లను పట్టుకున్నారని పేర్కొన్నారు. ఇసుక, మట్టి, రేషన్ బియ్యం దందాలకు మంథని కేంద్ర బిందువుగా మారిందని ఆయన ఆరోపించారు. బీఆర్ఎస్ మంథని మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు తగరం శంకర్‌లాల్, సెగ్గెం రాజేశ్, కాయిత సమ్మయ్య, సత్యనారాయణ పాల్గొన్నారు.

'యశోద'లో అరుదైన శస్త్రచికిత్స


మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

కరీంనగర్‌టౌన్: హైదరాబాద్ సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించినట్లు న్యూరో ఫిజీషియన్ మోహన్‌కృష్ణ, ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్టు శ్రీహరీశ్ తెలిపారు. మంగళవారం నగరంలోని యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలం ఐతుపల్లికి చెందిన ప్రణీత (33) నాలుగేళ్లుగా తలనొప్పి, తలతిప్పడం, వాంతులు, కళ్లు మసకబారడం, చూపు మందగించడం వంటి సమస్యలతో బాధపడుతోందన్నారు. స్థానిక ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్నా ఫలితం లేదని తెలిపారు. దీంతో సోమాజిగూడ యశోద ఆసుపత్రికి రాగా, ఆమెకు పలు రకాల పరీక్షలు నిర్వహించి మెదడులో నీరు చేరినట్లు గుర్తించామన్నారు. ఈ జబ్బును ఇండియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్ (ఐఐహెచ్)గా నిర్ధారించామన్నారు. అయితే మందులతో కొన్ని రోజులు ప్రయత్నించినప్పటికీ మెరుగుపడలేదని, సమస్య మరింత జఠిలం కావడంతో తిరిగి పరీక్ష చేయగా, ఆమెకు ట్రాన్స్‌వర్స్ సైనస్ స్టెనోసిస్ ఉన్నట్లు వెల్లడైందని వివరించారు. ఆపరేషన్ చేయాల్సి ఉన్నప్పటికీ, గుండెకు స్టంట్ వేసే మాదిరిగా మెదడులో కూడా స్టంట్ వేసే పద్ధతిని అవలంబించామన్నారు. ఇంటర్వెన్షన్ రేడియాలజిస్టు సూచన మేరకు చిన్నపరికరం ద్వారా స్టంట్ వేసి ప్రభావితమైన సైనస్‌ను అమర్చామని తద్వారా రక్తప్రవాహం మెరుగుపడడమే కాకుండా పుర్రెలో ఒత్తిడి తగ్గిందన్నారు. కేవలం 3 రోజులు మాత్రమే ఆమె ఆసుపత్రిలో ఉందని తెలిపారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగైందని, ఎలాంటి ఇతర సమస్యలు లేవని సాధారణ జీవితం గడుపుతున్నట్లు తెలిపారు. ప్రణీత మాట్లాడుతూ ప్రస్తుతం తన ఆరోగ్యం బాగుందని, అన్ని పనులు చేసుకుంటున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


నాని(ఫైల్)

కరీంనగర్‌రూరల్: మండలంలోని మొగ్దుంపూర్ వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖమ్మం జిల్లాకు చెందిన ఎలక్ట్రానిక్స్ మెకానిక్ ఇంజినీర్ మృతిచెందాడు. స్థానికులు, కరీంనగర్‌రూరల్ పోలీసుల కథనం ప్రకారం ఖమ్మం జిల్లాకు చెందిన పి.నాని(26) హైదరాబాద్‌లోని టీవీఎస్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో మెకానిక్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజుల నుంచి కరీంనగర్ బ్రాంచిలో విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధుల్లో భాగంగా పెద్దపల్లికి వెళ్లాడు. తిరిగి ద్విచక్రవాహనంపై కరీంనగర్ వస్తుండగా మొగ్దుంపూర్ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న రూరల్ ఎస్సై శేఖర్ అక్కడికి చేరుకుని ప్రమాదం వివరాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. కాగా హెల్మెట్ ధరించకపోవడంతోనే రోడ్డు ప్రమాదంలో నాని తల పగిలి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్

- ప్రయాణికులు సురక్షితం


బస్సును ఢీకొన్న టిప్పర్

సుల్తానాబాద్‌రూరల్: మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదుట రాజీవ్ రహదారిపై మంగళవారం ఓ టిప్పర్ ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. ఎస్సై శ్రావణ్‌కుమార్ కథనం ప్రకారం.. మంథని డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదారాబాద్ వెళ్తోంది. ఈక్రమంలో బస్టాండ్ నుంచి రాజీవ్ రహదారిపైకి వస్తోంది. ఇదే సమయంలో కరీంనగర్ నుంచి పెద్దపల్లి వైపు వెళ్తున్న బస్సును టిప్పర్ వేగంగా ఢీకొట్టి ఆగిపోయింది. బస్సు డ్రైవర్ అప్రమత్తతతో ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

సంతకాలు ఫోర్జరీ చేసి.. ఇంటి నంబర్లు కేటాయించి..

రామగుండం: గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసూతి సెలవుపై వెళ్లడంతో ఇదే అదనగా భావించిన మాజీ సర్పంచ్, ఆమె భర్త, ఉపసర్పంచ్, కారోబార్ తదితరులు కలిసి ఆమె సంతకం ఫోర్జరీ చేశారు. ఈ–పంచాయతీ పోర్టల్ సాయంతో ఇంటి నంబర్లు కేటాయించారు. ఈఘటన టీటీఎస్ అంతర్గాం గ్రామ పంచాయతీలో చోటుచేసుకుంది. అంతర్గాం ఎస్సై వెంకట్ కథనం ప్రకారం.. టీటీఎస్ అంతర్గాం గ్రామపంచాయతీ కార్యదర్శి ఇరుగురాల అనూజ 2023 మే 15 నుంచి 2023 నవంబర్ 3వ తేదీ వరకు ప్రసూతి సెలవుల్లో ఉన్నారు. ఆ తర్వాత విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి.. ఆస్తిపన్ను వసూలు చేసేందుకు ఇటీవల రిజిష్టర్ పరిశీలించారు. అందులో 30 మంది పేర్లు ఆమెకు తెలియకుండానే ఆన్‌లైన్‌లో నమోదయ్యాయి. ఇంటినంబర్లు కూడా కేటాయించారు. ఇందులో భాగంగా ఇంటి నంబర్ 8–4/3పై పన్ను చెల్లించి, రశీదుపై పంచాయతీ కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసి, డూప్లికేట్ రబ్బర్ స్టాంపు వేసుకొని మాజీ సర్పంచ్ వెంకటమ్మ, భర్త నూకరాజు పేరిట ఇంటిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఈవిషయం వెలుగులోకి రావడంతో మాజీ సర్పంచ్ వెంకటమ్మ, ఆమె భర్త నూకరాజు, మల్టీపర్పస్ వర్కర్ (కారోబార్) మహేశ్, మాజీ ఉప సర్పంచ్ శశికుమార్ తదితరులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శి అనూజ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమగ్ర విచారణ చేసి నిందితులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై స్పష్టం చేశారు.


ఈతకు వెళ్లి విద్యార్థి గల్లంతు

- కొనసాగుతున్న గాలింపు
- ప్రాణాలతో బయటపడిన ఇద్దరు


ఇద్దరిని కాపాడిన అరుణ్‌క్రాంతి

జగిత్యాల: వారు ముగ్గురు వరుసగా బావమరుదులు. సెలవులు రావడంతో జగిత్యాలలోని బావ ఇంటికి వచ్చారు. సరదాగా ఈత కొడదామని సాయంత్రం ఐదు గంటల సమయంలో జిల్లా కేంద్రంలోని అంతర్గాం చెరువుకు వెళ్లారు. అందులో ఒకరు గల్లంతయ్యాడు. జగిత్యాలలోని వాణీనగర్‌కు చెందిన శ్రీనివాస్, లావణ్య దంపతుల కుమారుడు అభిషేక్ స్థానికంగా డిగ్రీ ఫస్టియర్ చదువుతున్నాడు. ఇతనికి వరుసకు బావమరుదులైన హైదరాబాద్‌కు చెందిన అల్లె వికాస్, కోరుట్లకు చెందిన అల్లె సాత్విక్ సెలవులు కావడంతో అభిషేక్ ఇంటికొచ్చారు. మంగళవారం అంతర్గాం వద్దనున్న లింగం చెరువులో ఈతకోసం వెళ్లారు. ముగ్గురూ లోతుకు వెళ్లడంతో మునిగిపోయారు. అక్కడే ఈత కోసం వెళ్లిన అరుణ్‌క్రాంతి ముగ్గురిని గమనించి కాపాడే ప్రయత్నంలో అప్పటికే అభిషేక్ చాలా లోతుకు చేరాడు. అరుణ్‌క్రాంతి వెంటనే ఒక చేతితో అల్లె సాత్విక్, మరోచేతితో అల్లె వికాస్‌ను ఒడ్డుకు చేర్చారు. మళ్లీ నీటిలోకి వెళ్లేసరికే అభిషేక్ నీటిలో పూర్తిగా మునిగిపోయాడు. అరుణ్‌క్రాంతి ఎంత వెదికినా దొరకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఇన్‌చార్జి ఫైర్ ఆఫీసర్ మధు ఆధ్వర్యంలో సిబ్బంది కె.రవీందర్, మల్లేశం, ఫైర్‌మెన్లు ప్రశాంత్, శ్రీనివాస్ హుటాహుటిన అక్కడకు వెళ్లారు. గాలింపు చర్యలు చేపట్టారు. అయినా అభిషేక్ ఆచూకీ దొరకలేదు. రిస్క్‌టీం ఇంకా గాలిస్తూనే ఉంది. పోలీసులు సంఘటనస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. అభిషేక్ తండ్రి శ్రీనివాస్ ఉపాధి నిమిత్తం ముంబయిలో కుట్టుమిషన్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. లావణ్య టైలరింగ్ పనిచేసుకుంటూ జీవనం కొనసాగిస్తోంది. కళ్ల ఎదుటే అభిషేక్ మునిగిపోవడంతో సాత్విక్, వికాస్ కన్నీరుమున్నీరయ్యారు. చెరువు వద్ద కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.


అభిషేక్ (ఫైల్)


గాలిస్తున్న ఫైర్ సిబ్బంది

మద్యం తాగొద్దన్నందుకు భార్యతో గొడవ

- బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న భర్త

మల్యాల(చొప్పదండి): మద్యం తాగొద్దన్నందుకు భర్త బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం మండలకేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై అబ్దుల్ రహీం కథనం ప్రకారం.. పద్మశాలీ కుటుంబానికి చెందిన కొక్కుల నగేశ్‌కు భార్య లలిత, నలుగురు కూతుళ్లు ఉన్నారు. బజ్జీలబండి నడుపుకుంటూ జీవిస్తున్నారు. ఇద్దరు కూతుళ్లకు వివాహం చేశారు. మరో ఇద్దరు పెళ్లీడుకొచ్చారు. అయితే నగేశ్ నిత్యం మద్యం తాగుతూ భార్యతో గొడపడుతున్నాడు. మంగళవారం కూడా నగేశ్ మద్యం సేవించి ఇంటికి చేరాడు. ప్రతిరోజూ మద్యం తాగితే పిల్లల భవిష్యత్ ఎలా అని, వారికి పెళ్లి ఎలా చేస్తావని ప్రశ్నించింది. దీంతో అప్పటికే మద్యం మత్తులో ఉన్న నగేశ్ భార్యతో గొడవపడి ఇంట్లోంచి వెళ్లిపోయాడు. చిన్న కూతురుకు ఫోన్ చేసి ముకుందు మల్లయ్య బావిలో పడి చనిపోతున్నానని ఫోన్ కట్ చేశాడు. దీంతో లలిత కూతురుతో కలిసి బావి వద్దకు వెళ్లి చూడగా.. ఒడ్డున నగేశ్ (55) సెల్‌ఫోన్, చెప్పులు కనిపించాయి. స్థానికుల సహాయంతో బావిలో వెదకగా నగేశ్ శవం దొరికింది. లలిత ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్టు.. 21 బైక్‌లు స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీసులు

కరీంనగర్‌క్రైం: బైక్‌లు చోరీచేసే ఇద్దరు నిందితులను కరీంనగర్ వన్‌టౌన్ పోలీసులు మంగళవారం కమాన్‌చౌరస్తా వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామానికి చెందిన గోనెల శంకర్(36), బోయిని చంద్రబాబు(29) నుంచి మొత్తం 21 ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నామని టౌన్ ఏసీపీ నరేందర్ తెలిపారు. కరీంనగర్ వన్‌టౌన్ పరిధిలో–15, ఎల్ఎండీ పరిధిలో 05, కరీంనగర్ టూటౌన్ పరిధిలో 03, గన్నేరువరం పరిధిలో 01, కొమురవెల్లి పరిధిలో ఒకబైకు చోరీ చేశారని, వీరిపై ఐపీసీ సెక్షన్ 379 ప్రకారం కేసు నమోదు చేశామని కరీంనగర్ వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ జె.సరిలాల్ తెలిపారు. కేసు ఛేదనలో కృషి చేసిన వన్‌టౌన్ ఎస్సై స్వామితో పాటు సిబ్బందిని ఏసీపీ అభినందించారు.


వేడుకలకు సిద్ధమైన ధర్మపురి లక్ష్మీనృసింహాలయం


ఆలయంలో స్వామివారికి నమస్కరిస్తున్న భక్తులు


కొండగట్టులో సిద్ధమైన క్యూలైన్లు


ఆలయం ముందు భక్తులు


కోనేరులో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు

కొండగట్టులో భక్తుల రద్దీ

కొండగట్టు/ధర్మపురి: కొండగట్టు అంజన్నను మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ అధికారులు, సిబ్బంది పర్యవేక్షించారు. స్వామి పెద్ద జయంతి ఉత్సవాలకు కొండగట్టుతోపాటు ధర్మపురి శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈనెల 30నుంచి జూన్ రెండో తేదీ వరకు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నా రు. భక్తులు, మాలధారులు లక్షలాదిగా తరలిరానున్నారు. అదనపు క్యూలైన్లు సిద్ధం చేశారు. కొండగట్టులో వై జంక్షన్ సమీ పంలో ప్రసాదాల కౌంటర్లు ఏ ర్పాటు చేశారు. బొజ్జ పోతన్న ఆలయ సమీపంలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు. స్వా గత తోరణాలు కనువిందు చేస్తున్నాయి.

క్లుప్తంగా

రవికుమార్ నేత్రాలు సజీవం


రవికుమార్ (ఫైల్)

కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌కు చెందిన రౌతు రవికుమార్ (55) మంగళవారం గుండెపోటుతో మృతి చెందగా అతని కోరిక మేరకు కుమారుడు రౌతు శివ, తమ్ముడు సతీశ్ సమాచారంతో నేత్ర వైద్యశాల వైద్యులతో నేత్రాలు సేకరించి హైదరాబాదులోని ఎల్‌వీ ప్రసాద్ నేత్రవైద్యశాలకు పంపించినట్లు అలయన్స్ క్లబ్ బాధ్యులు కోల అన్నారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పుల్లెల శ్యాం, చెరిమెల వెంకటేశ్వర్లు, చీకోటి శ్రీనివాస్‌గాంధీ, కొంజర్ల మహేష్, సాగర్‌రెడ్డి, సోమారపు వెంకటేశ్వర్లు, ఈద కుమారస్వామి, గాలిపెల్లి నాగేశ్వర్, పచ్చిమట్ల రవీందర్‌గౌడ్, గాజుల సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-2 అభ్యర్థులకు ఉచిత కోచింగ్

కరీంనగర్: అభయ రామన్ సొసైటీ(ఏఆర్ అకాడమీ) ఆధ్వర్యంలో గ్రూప్-2, ఆర్‌ఆర్‌బీ, ఎస్ఐ, పీసీ తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు నెలరోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు అకాడమీ డైరెక్టర్ భూపెల్లి లక్ష్మణ్ ఒక ప్రకటనలో తెలిపారు. శిక్షణ కాలంలో అర్థమేటిక్, రీజనింగ్ క్లాసులు మాత్రమే బోధించబడునని అన్నారు. అవకాశాన్ని ప్రతీ అభ్యర్థి సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు రూ.1,000 చెల్లించి ఈనెల 31వ తేదీలోపు తమ పేరు నమోదు చేసుకోవాలని తెలిపారు. క్లాసులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభించబడునని అన్నారు. మరిన్ని వివరాలకు 70958 20355, 94909 63155 నంబర్లను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు.

జీలుగ విత్తనాలు సరఫరా చేయాలి

కరీంనగర్‌రూరల్: రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు సరఫరా చేసేందుకు అధికారులు తగిన చర్యలు చేపట్టాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి ఊరడి శివారెడ్డి కోరారు. వానాకాలం సీజన్ ప్రారంభానికి ముందు పంపిణీ చేయాల్సిన జీలుగ విత్తనాలను ప్రస్తుతం రైతుకు ఒక్కటే బస్తా ఇవ్వడంతో సరిపోవడం లేదని తెలిపారు. విత్తనాల సరఫరాలో అధికారులు పూర్తిగా విఫలం చెందారని ఆరోపించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు అవసరమైన జీలుగ విత్తనాలు సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు.

బియ్యం అందజేత



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బహదూర్‌ఖాన్‌పేటలో ఇటీవల కాంగ్రెస్ సీనియర్ కార్యకర్త తప్పెట్ల అంజయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధి మెన్నేని రోహిత్‌రావు సౌజన్యంతో మృతుడి కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుర్ర తిరుపతిగౌడ్, గుర్రం బాపురెడ్డి, లక్ష్మణ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

'మేనిఫెస్టో హామీలు అవినీతి పరిధికి రావు'

కరీంనగర్: రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో మేనిఫెస్టోల్లో ఇచ్చే హామీలు ఎన్నికల చట్టాల పరిధిలోకి రావని సుప్రీంకోర్టు స్పష్టం చేయడం హర్షనీయమని తెలంగాణ ఎకానమిక్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నేదునూరి కనకయ్య అన్నారు. తెలంగాణ ఎకనామిక్ ఫోరం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం 'రాజకీయ పార్టీలు- మేనిఫెస్టోలు- ఎన్నికల చట్టాలు- ఓటర్ల పాత్ర' అనే అంశంపై జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ పార్టీలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలుకు అవసరమయ్యే పెట్టుబడులు, అనుసరించే అభివృద్ధి వ్యూహాలను ముందుగానే ప్రకటించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, ఫోరం ముఖ్య సలహాదారులు డాక్టర్ దశరథం, జనసత్తా అధ్యక్షుడు ముదుగంటి సుధాకర్‌రెడ్డి, సామాజిక ఆర్థిక అధ్యయన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్లు, బి.సుధాకర్ ప్రసంగించారు. వేదిక సభ్యులు రమేశ్, మహేందర్, మహేశ్, బాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ముగిశాయి. ఈనెల 19వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వారం రోజుల పాటు స్వామివారికి ప్రతి రోజు ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామప్రముఖులు, పోలీసులు, ఆలయ ఈఓ, క్లర్క్‌తో పాటు ప్రతి ఒక్కరి సహకారంతోనే బ్రహ్మోత్సవాలు సంపూర్ణంగా ముగిశాయని ఆలయ అర్చకులు, ధర్మకర్తల మండలి సభ్యులు తెలిపారు.

మేము సైతం..

- రక్తదానానికి ముందుకొస్తున్న మహిళలు
- అతివల్లో పెరుగుతున్న చైతన్యం
- ఆపదలో ఉన్నవారికి ప్రాణదానం

కరీంనగర్‌టౌన్: రక్తాన్ని పంచి జన్మనివ్వడమే కాదు.. రక్తదానం చేసి ప్రాణాలు నిలబెడుతున్నారు నేటి మహిళలు.. సమయానికి రక్తం అందకపోతే ప్రాణాన్ని నిలపగలిగే డాక్టర్ కూడా అచేతనం కావాల్సిందే. శిబి చక్రవర్తిలా దేహాన్ని కోసి ఇవ్వాల్సిన పనిలేదు. కొంత రక్తాన్ని పంచి మరొక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు. రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానం. రోడ్డు ప్రమాదాలు, సిజేరియన్ డెలివరీలు, శస్త్రచికిత్సల సమయంలో రక్తం అందక చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు, తోటి వారి ప్రాణాలను కాపాడేందుకు చేసే రక్తదానానికి పురుషులతో పాటు మహిళలూ ముందుకొస్తున్నారు. తమకు జీవితంలో ఎదురైన కష్టాలు ఇతరులు ఎదుర్కొవద్దనే సదుద్దేశంతో మహిళలు రక్తదానం చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. సమాజాన్ని చైతన్యవంతం చేస్తున్నారు. మహిళలు రక్తదానం చేయరాదనే అపోహను తుడిచేస్తున్నారు.



రక్తదానం చేస్తున్న మహిళలు

రక్తదానంతో ప్రయోజనాలు

రక్తదానం చేసిన తర్వాత, శరీరం తిరిగి రక్తాన్ని తయారుచేసే పనిలో ఉంటుంది. ఈ సమయంలో ఎక్కువ ఎర్ర రక్త కణాలు ఏర్పడతాయి. దీని కారణంగా మన ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఒక వ్యక్తి క్రమం తప్పకుండా రక్తదానం చేస్తే కొన్ని రకాల క్యాన్సర్‌లను నివారిస్తుంది. రక్తదానంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. శరీరంలో ఐరన్ సమతుల్యతను కాపాడుతుంది.

రక్తదానం ఎవరు చేయాలి.. ఎవరు చేయకూడదు..

మనం ఇచ్చే రక్తం మరొకరిని ప్రాణాపాయం నుంచి రక్షిస్తుంది. అందుకే ఎవరైనా సరే రక్తదానం చేస్తే ఇంకొకరి ప్రాణాలు రక్షించిన వారవుతారు. 18–65 సంవత్సరాల లోపు ఆరోగ్యంగా ఉన్న ప్రతీ వ్యక్తి రక్తదానం చేయవచ్చు. హిమోగ్లోబిన్ శాతాన్ని బట్టి ప్రతీ మూడు నెలలకోసారి రక్తదానం చేసే అవకాశం ఉంది. 18 ఏళ్ల వయసు కంటే తక్కువ వయసు ఉన్నవారు లేదా ఏళ్ల కంటే ఎక్కువ వయస్సు ఉన్నవారు, 49 కిలోల కంటే తక్కువ బరువు తక్కువ ఉన్నవారు, హెపటైటిస్–బీ బాధితులు, హెచ్ఐవీ, కామెర్లు, టైఫాయిడ్, బీపీ, షుగర్ ఉన్నవారు, పిల్లలకు పాలిచ్చే తల్లులు, హిమోఫీలియా వ్యక్తి, టాటూ వేసుకున్న వాళ్లు, రక్తదానం చేయకూడదు.

ఐదు సార్లు రక్తదానం చేశా



కరోనా వైరస్ కాలంలో ఇద్దరు రక్తదానం చేయమని అడగగా అప్పటి పరిస్థితులను అర్థం చేసుకొని వెంటనే దానం చేశా. ఆ తర్వాత మరో ముగ్గురికి రక్తం ఇచ్చా. భవిష్యత్‌లో దానం చేసేందుకు ఎప్పుడు ముందుంటా. అదేవిధంగా సంస్థ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు కూడా నిర్వహిస్తా.

– చకిలం స్వప్న, మేము సైతం యువసేన ఫౌండేషన్ అధ్యక్షురాలు

మహిళల్లో చైతన్యం రావాలి



రక్తదానం చేయడం వల్ల మహిళలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. హిమోగ్లోబిన్ శాతం నార్మల్‌గా ఉన్న ప్రతీ మహిళ రక్తదానం చేయవచ్చు. రక్తదానం అనగానే మగవాళ్లే ఇస్తారులే అని అనుకోకుండా మహిళలు కూడా బాధ్యతగా రక్తం దానం చేయాలి. అపోహలను తొలగించుకొని చైతన్యవంతులు కావాలి. ఇప్పటి వరకు నేను నాలుగు సార్లు రక్తదానం చేశా. సంస్థ తరఫున క్యాంపులు నిర్వహిస్తున్నా.

– సుజాతరెడ్డి, అమ్మ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకురాలు

రక్తదానం ప్రాణదానం



రక్తదానం ప్రాణాదానంతో సమానం. ప్రమాదాల్లో గాయపడిన, ఇతర శస్త్ర చికిత్సల సమయాల్లో రక్తం అవసరమైన చాలా మంది ఇబ్బంది పడటాన్ని చూశా. అప్పుడే రక్తదానం చేయాలని నిర్ణయించుకున్న. ఇప్పటి వరకు మూడు సార్లు రక్తదానం చేశా. వీలైనన్ని ఎక్కువ సార్లు రక్తదానం చేసేందుకు సిద్ధంగా ఉన్నా.

– అనూష, కరీంనగర్

ఎలాంటి ఇబ్బంది లేదు



పురుషులు మాత్రమే రక్తదానం చేయాలనే నిబంధన ఏమీ లేదు. హిమోగ్లోబిన్ శాతం సరిపడా ఉన్న ప్రతిఒక్కరూ రక్తదానం చేయవచ్చు. ముఖ్యంగా మహిళలు రక్తదానం చేయడం వల్ల ఎప్పటికప్పుడు కొత్త రక్తం వచ్చి ఆరోగ్యంగా ఉంటారు. అందుకే రక్తదానం చేస్తున్నా. రక్తదానానికి మహిళలు ముందుకు వస్తే రక్తం కొరత అనేదే ఉండదు.

– రమ్య, కరీంనగర్

డీఈవోపై చర్యలు తీసుకోండి


ఫిర్యాదు ప్రతిని ప్రదర్శిస్తున్న కేవీపీఎస్ నాయకులు

కరీంనగర్: దళిత ఉపాధ్యాయుల పట్ల కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్న డీఈవోపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి తిప్పారపు సురేశ్ అన్నారు. మంగళవారం కేవీపీఎస్ జిల్లా కార్యాలయంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్, డైరెక్టర్‌లకు ఫిర్యాదు చేసిన లేఖను విడుదల చేసి మాట్లాడారు. పదోతరగతి మూల్యాంకన కేంద్రంలో మొబైల్ ఫోన్ ఉపయోగించారని ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేసిన డీఈవో తిరిగి పునర్‌నియామకంలో ఇద్దరికి యథావిధిగా పోస్టింగ్ ఇచ్చి దళిత ఉపాధ్యాయుడైన పోతరవేని శ్రీనివాస్‌ను తన పూర్వ పాఠశాలకు కాకుండా వీణవంక మండల జెడ్పీ పాఠశాలకు బదిలీ చేసి కక్ష సాధింపు ధోరణి ప్రదర్శించాడని అన్నారు. ఇలాంటి విద్యాశాఖ అధికారి ఉన్నతమైన స్థానంలో ఉండడం తగదని తక్షణమే తనను సస్పెండ్ చేయాలని కోరారు. పోతరవేని శ్రీనివాస్ వ్యాయామ ఉపాధ్యాయుడిని నగునూర్ జిల్లా పరిషత్ పాఠశాలకు తిరిగి పోస్టింగ్ ఇవ్వాలని కమిషనర్‌ను కోరారు. లేకుంటే జిల్లావ్యాప్తంగా సామాజిక అభ్యుదయ సంఘాలను కలుపుకొని ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు కొంపల్లి సాగర్, నగర కమిటీ సభ్యులు సుకోసి శ్రీకాంత్, కట్టెకోల రాజు, తదితరులు పాల్గొన్నారు.

పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటలకు 11 కేవీ శివనగర్ ఫీడర్ పరిధిలోని రాంనగర్, మార్కండేయనగర్, ప్రగతినగర్, సప్తగిరికాలనీ, శివనగర్, టెలిఫోన్ క్వార్టర్స్, బతుకమ్మ కాలనీ, హస్నాపూర్ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

ట్యాపింగ్‌పై పిటిషన్ వేస్తా

- డీసీసీ అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ


మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

కరీంనగర్ కార్పొరేషన్: తన ఫోన్ ట్యాపింగ్ చేయడంపై హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తానని డీసీసీ అధ్యక్షుడు, మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నగరంలో ఓ హోటల్‌లో మాట్లాడుతూ.. తన ఫోన్ కూడా ట్యాప్ చేయడం బాధాకరమన్నారు. ఎన్నికల సమయంలో తన పీఏ, భార్యకు చెప్పిన విషయాలు కూడా బయటకు పొక్కడం అప్పట్లో తమకు అంతుపట్టలేదన్నారు. ప్రకటనల డబ్బులు ఇచ్చివద్దామని తన పీఏతో మాట్లాడి వెళ్తుంటే, దారిలోనే పోలీసులు అడ్డుకున్నారని గుర్తు చేశారు. పోలీసులు పూర్తిగా బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించారని, బీఆర్ఎస్ డబ్బులపై ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా వారికే సహకరించారన్నారు. సీ విజిల్‌లో ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినా, బీఆర్ఎస్ నాయకుల డబ్బులకు రక్షణ కల్పించారని ఆరోపించారు. బంగారం వ్యాపారుల ఫోన్లు ట్యాపింగ్ ద్వారా విని బ్లాక్‌మెయిల్ చేసి డబ్బులు దండుకున్న నీచచరిత్ర కేసీఆర్ కుటుంబానిదన్నారు. ఇసుక, గ్రానైట్, రియల్ ఎస్టేట్ దందాలు చేసి, అసైన్డ్ ల్యాండ్స్ కబ్జాలకు పాల్పడ్డారని ధ్వజమెత్తారు. ఫోన్ ట్యాపింగ్‌పై సీఎం, డీజీపీకి ఫిర్యాదు చేస్తానన్నారు. కాంగ్రెస్ కరీంనగర్ లోక్‌సభ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ.. ఒక దళిత నాయకుడి ఫోన్‌ను ట్యాపింగ్ చేయడం దారుణమన్నారు. రాధాకిషన్‌రావు స్పష్టంగా ఫోన్ ట్యాపింగ్ ఆధారాలతో సహా వెల్లడించినా, బీఆర్ఎస్ నాయకుల తీరు మారడం లేదని మండిపడ్డారు. ఒకరిదో, ఇద్దరిదో ఫోన్‌లు ట్యాపింగ్ చేస్తే చేసిండొచ్చు అంటూ కేటీఆర్ బాధ్యతారాహిత్యంగా మాట్లాడారని అన్నారు. గతంలో కర్నాటకలో రామకృష్ణహెగ్డేపై ఫోన్‌ట్యాపింగ్ ఆరోపణలు వస్తే మరుసటి రోజే తన పదవికి రాజీనామా చేశారని గుర్తు చేశారు. కేసీఆర్, కేటీఆర్‌లు మాత్రం సిగ్గులేకుండా సమర్థించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

చొక్కారావు ఆదర్శప్రాయుడు


చొక్కారావు చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ కార్పొరేషన్ : మాజీ ఎంపీ, దివంగత జువ్వాడి చొక్కారావు ఆదర్శప్రాయుడని కాంగ్రెస్ నాయకులు కొనియాడారు. మంగళవారం చొక్కారావు వర్ధంతి సందర్భంగా డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిరాడంబర జీవితం గడిపి రాజకీయ నాయకులకు ఆదర్శంగా మారారన్నారు. విలువలతో కూడిన రాజకీయాలు పాటించిన నేత చొక్కారావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురుమల్ల శ్రీనివాస్, ఆకారపు భాస్కర్‌రెడ్డి, ఎండీ.తాజొద్దిన్, పులి ఆంజనేయులుగౌడ్, కర్ర రాజశేఖర్, మాదాసు శ్రీనివాస్, వంగల విద్యాసాగర్, పొరండ్ల రమేష్, దీకొండ శేఖర్, నెల్లి నరేశ్, రజిత్‌రెడ్డి, జ్యోతి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

నామమాత్రంగా అవగాహన సదస్సులు


మొగ్దుంపూర్‌లో ఉపాధికూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్‌లో నకిలీ విత్తనాలపై వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు అవగాహన సదస్సులు నామమాత్రంగా సాగుతున్నాయి. కరీంనగర్ మండలంలో ఈనెల 25నుంచి అధికారులు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అయితే గ్రామాల్లో నిర్వహిస్తున్న సదస్సులకు రైతులు ఎక్కువ సంఖ్యలో హాజరుకావడం లేదు. కొందరు రైతులు జీలుగ, పత్తి విత్తనాల కోసం కరీంనగర్‌లోని విత్తన దుకాణాల చుట్టూ తిరుగుతుండగా మరికొందరు దుక్కులు దున్నే పనిలో ఉన్నారు. అంతేకాకుండా వేసవి ఎండల తీవ్రతకు రైతులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. దీంతో అధికారులు సైతం అందుబాటులో ఉన్న రైతులు, ఇతరులతో సదస్సులు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలున్నాయి. మంగళవారం దుర్శేడ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏఈవో పైడితల్లి అందుబాటులో ఉన్న రైతులతో సమావేశం నిర్వహించారు. మొగ్దుంపూర్‌లో రైతులెవ్వరూ అందుబాటులో లేకపోవడంతో చివరకు ఉపాధిహామీ కూలీలతో సమావేశం నిర్వహించి నకిలీ విత్తనాలపై ఏవో సత్యం, ఏఈవో స్వర్ణలత అవగాహన కల్పించారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

చిగురుమామిడి: రైతులకు గడువు ముగిసిన, నకిలీ విత్తనాలు అమ్మితే విత్తన డీలర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ రంజిత్‌రెడ్డి, ఎస్సై బి. రాజేశ్ హెచ్చరించారు. మంగళవారం చిగురుమామిడిలోని రైతువేదికలో మండలంలోని విత్తన డీలర్లతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఏ గ్రామంలోనైనా లూజు పత్తి విత్తనాలు విక్రయిస్తే సమాచారం అందించాలని కోరారు. కొనుగోలు చేసిన రైతులకు తప్పని సరి రశీదులు ఇవ్వాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్స్ రద్దు చేస్తామన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన 40 వీధిదీపాలు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని వాల్మీకినగర్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో నగరపాలక సంస్థకు చెందిన దాదాపు 40 వీధిదీపాలు కాలిపోయాయి. ఇటీవల వరుసగా ఈదురుగాలులు పెడుతున్న క్రమంలో రెండు లైన్‌లు ఒకదానికొకటి తగలడంతో కాలనీలోని దాదాపు 40 వీధి దీపాలు కాలిపోయినట్లు కాలనీవాసులు తెలిపారు. దీంతో రెండు, మూడు రోజులుగా వాల్మీకినగర్‌లో రోడ్లపై చీకటి ఆవరించిందన్నారు. కాగా ఈ ప్రాంతంలో తరచూ ఇదే సమస్య కొనసాగుతోందని, శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

ఇంటర్ వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరపాలి

కరీంనగర్: ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ తప్పులపై విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామారపు వెంకటేశ్, మచ్చ రమేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇంటర్ బోర్డు అధికారుల నిర్లక్ష్యం, ఇంటర్ ప్రశ్నాపత్రాల వాల్యుయేషన్ చేసిన వారు అలసత్వం వహించి తప్పులుగా దిద్దడం వల్ల వేలాది మంది విద్యార్థులకు నష్టం వాటిల్లిందని అన్నారు. మెరిట్ స్టూడెంట్‌కు మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు రెండో సంవత్సరంలో వచ్చిన మార్కులు చూస్తే చాలా విచిత్రంగా ఉందని, విద్యార్థులు తమకు ఏ సబ్జెక్ట్‌లో ఎన్ని మార్కులు వస్తాయో ముందే పరీక్ష రాశాక ఊహించుకుంటారని, ఫలితాల అనంతరం మార్కులు చూసి షాక్‌కు గురయ్యారని తెలిపారు. వేలాది సంఖ్యలో విద్యార్థులు ప్రశ్నాపత్రాల తప్పుడు వాల్యుయేషన్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఇంటర్ బోర్డు ఇప్పటివరకు ఒక స్పష్టమైన భరోసా ఇవ్వలేదని, తప్పుడు వాల్యూయేషన్ వల్ల నష్టపోయిన విద్యార్థులందరికీ వెంటనే ఇంటర్ బోర్డు న్యాయం చేయాలని అన్నారు. లేని పక్షంలో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ బోర్డు ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర



తిమ్మాపూర్: మండలంలోని మహాత్మానగర్‌లో మంగళవారం రాత్రి హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో హనుమాన్ మాలధారణ స్వాములు, భక్తులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈసందర్భంగా మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు.

అన్నదానం


అన్నదానం చేస్తున్న అలయన్స్‌క్లబ్ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ చార్టర్ గవర్నర్ పసుల సతీశ్ –హేమలత వివాహ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో అన్నదానం, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అలయన్స్ క్లబ్ బాధ్యులు డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, కోల అన్నారెడ్డి, సుద్దపల్లి ప్రసాద్, సోమారపు వెంకటేశ్వర్లు, పోలు సత్యనారాయణ, డి.వేణుకుమార్, కనుకయ్య, మల్లికార్జున్, వీర మాధవ్, గడ్డం శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సావర్కర్ స్ఫూర్తితో ఉద్యమించాలి


సావర్కర్‌కు నివాళి అర్పిస్తున్న విశ్వ హిందూ పరిషత్ నాయకులు

కరీంనగర్‌టౌన్: సావర్కర్ స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ధర్మ రక్షణకు ఉద్యమించాలని ఆర్ఎస్ఎస్ విభాగ్ శారీరక ప్రముఖ్ సామల కిరణ్ అన్నారు. వీర సావర్కర్ జయంతి సందర్భంగా మంగళవారం నగరంలోని విశ్వ హిందూ పరిషత్ కార్యాలయంలో సావర్కర్ చిత్రపటానికి నివాళి అర్పించి మాట్లాడారు. ఆజన్మ దేశభక్తుడు, హిందుత్వ, సిద్ధాంతకర్త, సంఘసంస్కర్త సావర్కర్ అని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో హిందూ సమాజ సంఘటనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు ఏనుగుర్తి రమేశ్, విభాగ్ గో రక్షా ప్రముఖ్ రాధాకృష్ణరెడ్డి, జిల్లా కార్యదర్శి అదిమూలం విద్యాసాగర్, జిల్లా సహ కార్యదర్శులు తోట రాజేందర్, జగదీశ్వర్‌లు, నగర ఉపాధ్యక్షులు బొజ్జ రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎరువుల నిల్వపై నిఘా

- వారంలో రెండు పర్యాయాలు అధికారుల తనిఖీలు
- ఎఫ్ఐవీఈఎస్ యాప్‌లో స్టాక్ వివరాల నమోదు


తీగలగుట్టపల్లిలోని ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏవో సత్యం

కరీంనగర్‌రూరల్: వానాకాలం సీజన్ వ్యవసాయ పనులు రోహిణి కార్తె ప్రవేశంతో రైతులు ప్రారంభించారు. ఎరువుల కొరత ఏర్పడుతుందనే కారణంతో కొంతమంది రైతులు ముందస్తుగా కొనుగోలు చేసి నిల్వ చేసుకునే అవకాశముంది. ఎరువుల నిల్వలు ఖచ్చితంగా తెలుసుకునేందుకు వ్యవసాయశాఖ చర్యలు చేపట్టింది. ప్రత్యేకంగా ఫర్టిలైజర్ ఇన్వెంటరీ వెరిఫికేషన్ సిస్టం (ఎఫ్ఐవీఈఎస్) యాప్‌ను ప్రవేశపెట్టింది. దీనిలో భాగంగా వ్యవసాయాధికారులు సీజన్ ఆరంభం నుంచి ముగిసే వరకు ఫర్టిలైజర్ దుకాణాలు, సింగిల్‌విండో కార్యాలయాల్లో తనిఖీలు చేస్తూ యాప్‌లో సంబంధిత ఎరువుల స్టాక్ వివరాలు నమోదు చేస్తున్నారు.

యాప్‌లో వివరాలు పక్కగా నమోదు

వానాకాలం సీజన్‌కు సంబంధించిన ఎరువుల తనిఖీ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి కరీంనగర్ మండలంలో వ్యవసాయాధికారులు ప్రారంభించారు. మండల వ్యవసాయాధికారి బి.సత్యం నగునూరు, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్‌లోని ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేశారు. ఎరువుల స్టాక్ వివరాలు పరిశీలించి యాప్‌లో నమోదు చేశారు. అయితే దుకాణాల్లో ప్రస్తుతం గత సీజన్‌కు సంబంధించిన ఎరువుల స్టాక్ మాత్రమే ఉందని, కొత్తగా ఎరువులను డీలర్లు కొనుగోలు చేయలేదని ఏవో తెలిపారు. ప్రతీ వారంలో రెండు పర్యాయాలు తప్పనిసరిగా ఏవో, ఏడీలు క్షేత్రస్థాయిలో పర్యటించి ఐదు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు చేయాలి. దుకాణాల్లో పీవోఎస్(పాయింట్ ఆఫ్ సేల్) యంత్రాలు వినియోగిస్తున్నారా? లేదా? అనే వివరాలు తెలుసుకోవాలి. స్టాక్ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిన తర్వాత ఎరువుల వివరాలను పరిశీలించి ఎరువుల నిల్వ ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీని ద్వారా ఎరువుల దుకాణాల్లో ఎంతమేరకు ఎరువులు నిల్వ ఉన్న విషయం తెలుస్తోంది. రైతులకు కొరత లేకుండా అధికారులు చర్యలు చేపట్టేందుకు అవకాశముంది.

ఎరువుల కొరత లేకుండా చర్యలు

వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఎఫ్ఐవీఈఎస్ యాప్ ద్వారా క్షేత్రస్థాయిలో తనిఖీలు చేసి ఎరువుల వివరాలను పక్కాగా నమోదు చేయడం జరుగుతుంది. యాప్ ద్వారా ఏ దుకాణంలో ఏఏ ఎరువులు ఎంత మేరకు నిల్వ ఉన్నాయో తెలుస్తోంది. పంటల సాగు సమయంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

– బి.సత్యం, మండల వ్యవసాయాధికారి

ఓటింగ్ పెంచేందుకు ఈసీ మీమ్స్

సార్వత్రిక ఎన్నికల సమరం చివరాఖరి దశకు చేరుకుంది. ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం ఎంత ప్రయత్నిస్తున్నా ఇప్పటిదాకా జరిగిన ఆరు విడతల్లో పెద్ద మార్పేమీ కనిపించలేదు. దాంతో చివరిదైన ఏడో విడతలోనైనా ఓటింగ్ శాతాన్ని వీలైనంత పెంచేందుకు ఈసీ పలు ప్రయత్నాలు చేస్తోంది. యువ ఓటర్లను పోలింగ్ బూత్‌లకు రప్పించేందుకు వారికి బాగా కనెక్టయ్యే మీమ్స్‌ను ఎంచుకుంది. మీర్జాపూర్ వెబ్ సిరీస్ ఎంత హిట్టయిందో, అందులోని మున్నా భయ్యా పాత్ర కూడా అంతే ఫేమస్ అయింది! ఈసీ రిలీజ్ చేసిన కొత్త మీమ్‌లో మున్నా భయ్యా డైలాగ్‌ను ఓటింగ్‌కు అన్వయించింది. మీర్జాపూర్ వెబ్ సిరీస్‌లో మున్నా భయ్యా క్లాస్ రూమ్‌లో చెప్పే

మీర్జాపూర్ వెబ్ సిరీస్ 'మున్నా భయ్యా' టెంప్లేట్ కాపీ



'పడాయియా లిఖాయియా కరో, ఐఏఎస్ వయ్యేఎస్ బనో' (చదువుసంధ్యలపై దృష్టి పెట్టు, కలెక్టరో మరోటో అవ్వు) అనే ఒరిజినల్ డైలాగ్ ఇప్పటికీ రీల్స్, షార్ట్ వీడియోల్లో చక్కర్లు కొడుతూనే ఉంటుంది. ఈసీ ఇప్పుడు దీనికి ఓటింగ్ ట్విస్ట్ ఇచ్చింది. 'యే క్యా రీల్స్ మే టైమ్ బర్బాద్ కర రహే? జావో వోట్ దో, లోక్‌తంత్ర్ కో మజ్‌బూత్ కరో' (రీల్స్ వెంటపడి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటారు? వెళ్లి ఓటేయండి... ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయండి) అని ఓటర్లకు మున్నా భయ్యా చెబుతున్నట్టుగా మీమ్ రూపొందించింది. 'యువతను మున్నా భయ్యా ఓటేయాలని కోరుతున్నాడు' అంటూ క్యాప్షన్‌ను కూడా జోడించింది!

ఏడు విడతల సుదీర్ఘ షెడ్యూల్‌లో ఇప్పటికి ఆరు విడతలు పూర్తయ్యాయి. 57 లోక్‌సభ స్థానాలకు జూన్ 1న చివరి విడతలో పోలింగ్ జరగనుంది. జూన్ 4న ఫలితాలు వెల్లడవుతాయి. ఆఖరి దశలో చండీగఢ్ కేంద్రపాలిత ప్రాంతంతో సహా బిహార్, హిమాచల్ ప్రదేశ్, జార్ఖండ్, ఒడిశా, పంజాబ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ జరగనుంది. దాంతో అక్కడ ప్రచారం దుమ్మురేగిపోతోంది. చివరి దశలో ప్రధాని మోదీ సహా మొత్తం 904 మంది అభ్యర్థులు తలపడుతున్నారు. ఈ నేపథ్యంలో ఈసీ మున్నా భాయ్ మీమ్ ప్రయోగం యూత్‌ను ఏ మేరకు పోలింగ్ బూత్‌లకు రప్పిస్తుందో చూడాలి!

– సాక్షి, నేషనల్ డెస్క్

కశ్మీర్ లోయలో... ఓట్ల పంట!



మూడు లోక్‌సభ స్థానాల్లో రికార్డు ఓటింగ్

మార్పుకు సూచికా, మోదీ సర్కారుపై ఆగ్రహమా?

శ్రీనగర్ 38.49
బారాముల్లా 59.1
అనంత్‌నాగ్–రాజౌరి 54.46

కశ్మీర్ లోయలోని మూడు లోక్‌సభ స్థానాల్లో నమోదైన ఓటింగ్ శాతాలివి. చూడ్డానికి ఇదేమంత భారీ ఓటింగ్ కాదనిపించవచ్చు. కానీ, గత మూడున్నర దశాబ్దాల్లో వాటిలో ఇదే అత్యధిక ఓటింగ్. జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన ఆర్టికల్ 370ని, రాష్ట్ర హోదాను తొలగించాక వచ్చిన తొలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇంత భారీగా ఓటింగ్‌లో పాల్గొనడంలో ఆంతర్యమేమిటి? వాళ్లు మార్పును ఆహ్వానిస్తున్నారా? లేదంటే మోదీ సర్కారుపై ఆగ్రహాన్ని ఓటు రూపంలో వ్యక్తం చేశారా...?

– సాక్షి, నేషనల్ డెస్క్

కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్‌లో 5 లోక్‌సభ స్థానాలున్నాయి. జమ్మూ పరిధిలో జమ్మూ, ఉధంపూర్.. కశ్మీర్ లోయలోని శ్రీనగర్, బారాముల్లా, అనంత్‌నాగ్–రాజౌరి. జమ్మూ, ఉధంపూర్‌లో హిందువుల ఓట్లు గణనీయంగా ఉన్నాయి. వాటిలో గతంతో పోలిస్తే ఈసారి ఓటింగ్‌లో పెద్ద మార్పు లేదు. కానీ ముస్లింలు అధికంగా ఉండే లోయలోని మూడు లోక్‌సభ స్థానాల్లో మాత్రం 1989లో తీవ్రవాదం పెచ్చరిల్లిన అనంతరం ఎన్నడూ లేనంతగా ప్రజలు భారీగా ఓటేశారు.

మార్పు మొదలైంది..!

కశ్మీర్ దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదని, తమ పిల్లలు పెద్ద చదువులు చదివి ఖాళీగా ఉండాల్సిన దుస్థితి మారాలని స్థానిక ఓటర్లు చెప్పడం గమనార్హం. మార్పు కోరుకుంటున్నట్టు వారి మాటల్లో వ్యక్తమవుతోంది. అయితే ఆర్టికల్ 370 రద్దుతో తాము ప్రత్యేక హక్కులు కోల్పోయామంటూ వారిలో తెలియని ఆందోళన కనిపిస్తోంది. యువతను నిర్బంధించడంతో నిరసనలు వ్యక్తం చేయలేని పరిస్థితులపైనా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు చేసి, ముస్లిం మెజారిటీ ప్రాంతాల్లోకి ఇతరులను అనుమతించడం ద్వారా ప్రాంత రూపురేఖలే మార్చేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ స్థానికుల్లో భయం సృష్టించడంలో ప్రాంతీయ పార్టీలు విజయవంతమయ్యాయి. మోదీ సర్కారుపై ఆగ్రహం అక్కడి ప్రజల మాటల్లో గట్టిగానే వ్యక్తమవుతోంది. ''రాళ్లు రువ్వి, ఎన్నికలు బహిష్కరించి మేం సాధించిందేమీ లేదు. నా మిత్రులు ఏళ్లుగా జైళ్లలో మగ్గుతున్నారు. వారిని పట్టించుకున్నవారు లేరు. మెరుగైన భవిష్యత్తుపై ఆశతో ఓటేశాం'' అని స్థానిక యువతీ యువకులు చెబుతున్నారు.

గతంలోలా కాదు...

తీవ్రవాదం, వేర్పాటువాదాల కుంపట్ల వల్లే 1989–2019 మధ్య కశ్మీర్లో అల్ప ఓటింగ్ నమోదైందని విశ్లేషకులు చెబుతున్నారు. ఓటర్లనే గాక నేతలను కూడా ఉగ్రవాదులు పొట్టన పెట్టుకున్న ఉదంతాలెన్నో! ఈసారి పరిస్థితి మారింది. వేర్పాటువాదులు, మత పెద్దల నుంచి ఎన్నికలు బహిష్కరణ పిలుపుల్లేవు. ఓటేస్తే ప్రాణాలు తీస్తామంటూ ఎన్నికల వేళ విన్పించే పాక్ ప్రేరేపిత ఉగ్రవాద బెదిరింపులూ వినిపించలేదు. 2019లో ఆర్టికల్ 370 రద్దయినప్పటి నుంచీ కశ్మీర్‌లో శాంతిభద్రతలు మెరుగయ్యాయి. ఉగ్ర కార్యకలాపాలకు అడ్డుకట్ట పడింది. రవాణా వసతులు మెరుగయ్యాయి. స్వేచ్ఛగా వ్యాపారాలు చేసుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. పర్యాటకుల రాక పెరగడంతో ఉపాధి అవకాశాలూ మెరుగుపడ్డాయి. యూట్యూబ్ చానళ్లు, సామాజిక మాధ్యమాల ద్వారా కశ్మీర్ అందాలను అక్కడి యువత ప్రపంచంతో పంచుకుంటోంది.

పార్టీల మద్దతు

కశ్మీర్లో ప్రధాన పార్టీలు కూడా ఈసారి ప్రజలు ఓటింగ్‌లో పాల్గొనడానికి మద్దతుగా నిలిచాయి. ఎన్నికల్లో పాల్గొంటే నేరంగా చూసే భావన వల్ల కశ్మీరీలు ఇంతకాలంగా మూల్యం చెల్లించుకున్నారని శ్రీనగర్ నేషనల్ కాన్ఫరెన్స్ అభ్యర్థి ఆగా సయ్యద్ రుహుల్లా మెహెదీ అన్నారు. ఓటే ఆయుధమని ప్రజలు అర్థం చేసుకున్నారని పీడీపీ అభ్యర్థి వహీదుర్ రెహ్మాన్ పర్రా అన్నారు. ఆర్టికల్ 370 రద్దుపై వ్యతిరేకతను ఓట్ల రూపంలో తెలియజేశారని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో 'బీజేపీ భయాన్ని' కల్పించడంలో ఎన్సీ, పీడీపీ విజయవంతమయ్యాయని రాజకీయ విశ్లేషకుడు షేక్ షౌకత్ హుస్సేన్ అన్నారు. అందుకే ఓటింగ్ భారీగా నమోదైందని విశ్లేషించారు. ఎన్నికల సంఘంతో పాటు ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా ఆర్టికల్ 370 రద్దు వల్లే ప్రజలు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొన్నారని చెప్పడం విశేషం.

గత మూడు ఎన్నికల్లో జమ్మూకశ్మీర్లో ఓటింగ్ (శాతాల్లో)

స్థానం	2024	2019	2014
శ్రీనగర్	38.49	14.43	25.86
బారాముల్లా	59.10	34.89	39.13
అనంత్‌నాగ్-రాజౌరి	54.46	8.98	29
జమ్మూ	72.22	72.5	67.83
ఉధంపూర్	68.27	71.01	70.91

కీలకం

అంచనాలకందని లుధియానా

లుధియానా. ఒకప్పటి సుల్తానుల నగరం. టెక్స్‌టైల్ ఉత్పత్తుల్లో మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరున్న ప్రాంతం. ఈ లోక్‌సభ స్థానంలో ప్రధాన పోటీ కాంగ్రెస్, అకాలీదళ్ మధ్యే ఉండేది. ఈసారి నాలుగు ప్రధాన పార్టీలతో పాటు స్వతంత్రులు కూడా భారీగా బరిలోకి దిగడంతో రాజకీయ దృశ్యం మారిపోయింది...

– సాక్షి, నేషనల్ డెస్క్

లుధియానా లోక్‌సభ స్థానంపై 1952 నుంచీ కాంగ్రెస్ ఆధిపత్యం కొనసాగుతోంది. ఇక్కడ 11 పర్యాయాలు కాంగ్రెస్ విజయం సాధించింది. శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఏడీ) ఈ సీటులో ఆరుసార్లు గెలిచింది. అకాలీదళ్‌తో బంధం తెగిపోవడంతో బీజేపీ ఇక్కడ తొలిసారి సింగిల్‌గా బరిలో దిగింది. ఈసారి సిట్టింగ్ ఎంపీ రవ్‌నీత్ సింగ్ బిట్టూను కాదని పీసీసీ చీఫ్ అమరీందర్ సింగ్ రాజా వారింగ్‌కు కాంగ్రెస్ టికెటిచ్చింది. దాంతో బిట్టూ బీజేపీలో చేరి ఆ పార్టీ తరఫున బరిలో దిగారు. పంజాబ్‌లో అధికార పార్టీ అయిన ఆప్ నుంచి అశోక్ పరాశర్ (పప్పీ), అకాలీదళ్ నుంచి రంజిత్ సింగ్ ధిల్లాన్ పోటీ చేస్తున్నారు.

నాలుగు పార్టీల హోరాహోరీ

- బీజేపీ అభ్యర్థిగా కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ
- పీసీసీ చీఫ్‌ను బరిలో దింపిన కాంగ్రెస్
- ఆప్, అకాలీదళ్ నుంచి గట్టి పోటీ



• రవ్‌నీత్ సింగ్ బిట్టూ



• అమరీందర్ సింగ్ వారింగ్

బిట్టూ వర్సెస్ వారింగ్

బిట్టూ పట్టణ, హిందూ ఓట్లపైనే ఆధారపడుతున్నారు. గెలుపు కోసం ఏ అవకాశమూ వదులుకోవడం లేదు. పాకిస్తాన్‌తో సరిహద్దు వాణిజ్యం కోసం వాఘా సరిహద్దును తెరుస్తానని హామీ ఇచ్చారు! వైద్యపరిశోధన విద్యాసంస్థ, మెట్రో రైలు వాగ్దానం చేస్తూ 'లుధియానా విజన్' పేరుతో సొంత మేనిఫెస్టో విడుదల చేశారు. అయితే రైతుల నుంచి ఆయనకు తీవ్ర నిరసనలు ఎదురవుతున్నాయి. రాజాను గెలిపించుకోవడానికి కాంగ్రెస్ సీనియర్లంతా బరిలో దిగారు. ఈ ఎన్నికలను విధేయుడు, ద్రోహి మధ్య పోటీగా ఆయన అభివర్ణిస్తున్నారు. ఆయన కూడా పలు హామీలతో విజన్ డాక్యుమెంట్ విడుదల చేశారు. స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన కాంగ్రెస్ నేత కమల్జీత్ సింగ్ బ్రార్ ఓట్లను చీల్చేలా ఉన్నారు.

పథకాలనే నమ్ముకున్న పప్పీ

ఆప్ అభ్యర్థి అశోక్ పరాశర్ (పప్పీ) రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై ఆధారపడుతున్నారు. గృహాలకు 600 ఉచిత విద్యుత్ యూనిట్లతో సహా ఇతర రాష్ట్ర ప్రభుత్వ పథకాలు తనను గెలిపిస్తాయనే నమ్మకంతో ఉన్నారు. పప్పీకి మద్దతుగా సీఎం భగవంత్ మాన్ రోడ్‌షోలు నిర్వహించారు. ఈ లోక్‌సభ స్థానంలోని 9 అసెంబ్లీ స్థానాలకు గాను 8 ఆప్ గుప్పెట్లో ఉండటం పప్పీకి కలిసొచ్చే అంశం. గ్రామాల్లోని రైతుల నుంచి ఆప్‌కు కూడా వ్యతిరేకత ఎదురవుతుండటం విశేషం.

'డేరా' ఓట్లపైనే ఎస్ఏడీ ఆశలు

భారీ సంఖ్యలో ఉన్న డేరా అనుయాయులు తదితరుల ఓట్లపైనే అకాలీదళ్ అభ్యర్థి ధిల్లాన్ ఆధారపడ్డారు. ఆపరేషన్ బ్లూస్టార్, సిక్కు వ్యతిరేక అల్లర్లు తదితరాలను ప్రధానంగా ప్రస్తావిస్తోంది. రాష్ట్రంపై ఇతర పార్టీలది సవతి తల్లి ప్రేమ అని ధిల్లాన్ ఆరోపిస్తున్నారు.

26 మంది స్వతంత్రులు

లుధియానా లోక్‌సభ స్థానంలో 43 మంది బరిలో ఉన్నారు. వీరిలో 26 మంది స్వతంత్ర అభ్యర్థులు. వీరిలో పీహెచ్‌డీ విద్యార్థి మొదలుకుని 8వ తరగతి ఫెయిలైన వారిదాకా ఉన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో 12వ తరగతి చదివిన బీజేపీ అభ్యర్థి బిట్టూయే అత్యంత విద్యావంతుడు! కాంగ్రెస్ అభ్యర్థి వారింగ్ మెట్రిక్ పాస్ కాగా ఆప్ పప్పీ ఏడో తరగతి పాసయ్యారు!

ఆంధ్రప్రదేశ్

ఎన్టీఆర్ సేవలు తరతరాలకు స్ఫూర్తి

ఎక్స్‌లో ప్రధాని మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: దివంగత మాజీ సీఎం ఎన్టీఆర్ ఒక మహనీయుడని ప్రధాని మోదీ కొనియాడారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా ఆయనను స్మరించుకోవడం ఆనందంగా ఉందని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంగళవారం తెలుగులో పోస్ట్ చేశారు. 'తెలుగు సినీ రంగంలో విశిష్ట నటుడైన ఆయన ఎంతో దార్శనికత గల నాయకుడు. సినీ, రాజకీయ రంగాలకు ఆయన చేసిన సేవలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. తెరపై ఆయన ధరించిన పాత్రలను, ఆయన నాయకత్వ పటిమను ఇప్పటికీ తలుచుకుంటారు ఆయన అభిమానులు. ఆయన కలలు కన్న సమాజం కోసం మేము నిరంతరం పనిచేస్తాము' అని మోదీ పేర్కొన్నారు.

మూడు కేసుల్లో పిన్నెల్లికి ముందస్తు బెయిల్

ఫలించని పచ్చ బ్యాచ్, పోలీసుల కుట్రలు

- రికార్డులు తారుమారు చేసి శక్తివంచన లేకుండా పనిచేసిన పోలీసులు
- వీరి కుట్రలను పటాపంచలు చేసిన న్యాయస్థానం
- అరెస్ట్‌తో సహా పిన్నెల్లిపై ఎలాంటి తొందరపాటు చర్యలొద్దని పోలీసులకు ఆదేశం
- కౌంటింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకే ఈ మధ్యంతర బెయిల్
- ఉత్తర్వులు జారీ చేసిన న్యాయమూర్తి
- పలు షరతులు విధించిన న్యాయస్థానం
- పిన్నెల్లి తరఫు న్యాయవాది అభ్యర్థన మేరకు ఓ షరతులో సవరణ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఈ సడలింపులు.. 'పచ్చ'సిరాతో..!

పోస్టల్ బ్యాలెట్ ఆమోదంపై గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం స్పష్టమైన మార్గదర్శకాలు జారీ

- దేశవ్యాప్తంగా అవే అమలు కూడా..
- కానీ, డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ అధికారి స్టాంప్ లేకపోయినా.. సంతకం ఉంటే చాలు ఆమోదించాలని టీడీపీ విజ్ఞప్తి
- ఆ మేరకు సడలింపు ఇస్తూ ఈనెల 25న రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఉత్తర్వులు

సాక్షి, అమరావతి : సార్వత్రిక ఎన్నికల సందర్భంలో కేంద్ర ఎన్నికల కమిషన్ ఒక నిబంధనావళి రూపొందించిందంటే అది దేశవ్యాప్తంగా అమలు జరగాలి. ఒక్కో రాష్ట్రానికి ఒక్కో నిబంధన అంటూ ఏమీ ఉండదు. అలాగే, గత ఎన్నికల్లో లేని నిబంధన.. అదే విధంగా దేశంలో ఎక్కడాలేని నియమం ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే అమలుచేస్తున్నారంటే ఏమనుకోవాలి? పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు విషయంలో ఇప్పుడు రాష్ట్రంలో ఇదే జరుగుతోంది. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన సడలింపులు ఇప్పుడు రాష్ట్రంలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఎందుకంటే.. ఈ సడలింపులు తెలుగుదేశం పార్టీ కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం ఉద్దేశపూర్వకంగా ఇచ్చిందని స్పష్టంగా తెలిసిపోతోంది కాబట్టి. గత ఎన్నికల్లో లేని సడలింపుల్ని.. పైగా ఇంకెక్కడా లేని మినహాయింపులను ఇక్కడే అమలుచేయడం.. అది కూడా టీడీపీ చెప్పింది చెప్పినట్లుగా రాష్ట్ర ఎన్నికల సంఘం తలూపుతూ చేయడం చూస్తుంటే.. రాష్ట్రంలో ఎన్నికల సంఘం.. టీడీపీ సంఘంలా వ్యవహరిస్తోందని కాక ఇంకేమనాలి?

కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు భిన్నంగా..

నిజానికి.. పోస్టల్ బ్యాలెట్ డిక్లరేషన్ ఫారంపై అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం చేసి, స్టాంప్ లేకపోయినా.. తన పేరు, డిజిగ్నేషన్ వివరాలను చేతితో రాస్తే ఆమోదించాలని గతేడాది జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) మార్గదర్శకాలు జారీచేసింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లోనూ ఇవే మార్గదర్శకాలు అమలవుతున్నాయి. కానీ.. రాష్ట్రంలో టీడీపీ నేతల విజ్ఞప్తి మేరకు ఈ మార్గదర్శకాలను సడలిస్తూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేశ్ కుమార్ మీనా ఈనెల 25న ఉత్తర్వులు జారీచేశారు. అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం ఉంటే చాలు.. డిజిగ్నేషన్ పూర్తి వివరాలను చేతితో రాయకపోయినా సరే.. ఆ సంతకంపై ఏమైనా అనుమానం వస్తే రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో), జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ అధికారి సంతకంతో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకునేలా సడలింపు ఇవ్వడంపై రాజకీయ పక్షాలు నివ్వెరపోతున్నాయి. ఎన్నికల సంఘం పచ్చపాతం మరోసారి బహిర్గతమైందని విమర్శిస్తున్నాయి. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు సందర్భంగా ఇది వివాదాలకు దారితీస్తుందని.. శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

మరీ ఇంత 'పచ్చ'పాతమా?..

పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఎన్నికల సంఘం ఏర్పాటుచేసిన అటెస్టింగ్ ఆఫీసర్లు కొంత మంది సీల్ వేయకుండా కేవలం సంతకాలు మాత్రమే చేశారని.. ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకుని తమ ఓట్లను తిరస్కరించకుండా ఆమోదించేలా చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్‌కుమార్ మీనాకు టీడీపీ నుంచి పలు విజ్ఞాపనలు వచ్చాయి. వాటిని పరిగణనలోకి తీసుకున్న ఆయన.. 2023, జూలై 19న కేంద్ర ఎన్నికల సంఘం జారీచేసిన మార్గదర్శకాలను ఉటంకిస్తూ ఈనెల 25న ఉత్తర్వులు జారీచేశారు. వాటి ప్రకారం.. డిక్లరేషన్ ఫారం మీద అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం, పేరు, హోదా (డిజిగ్నేషన్) పూర్తి వివరాలు తప్పనిసరిగా ఉండాలి. ఇవి ఉండి స్టాంప్ లేకపోయినా వాటిని పరిగణనలోకి తీసుకోవచ్చు. ఈ నిబంధన దేశవ్యాప్తంగా అమలవుతోంది. కానీ.. అటెస్టింగ్ ఆఫీసర్ స్టాంప్ లేకపోయినా.. పేరు, డిజిగ్నేషన్ వివరాలను చేతితో రాయకపోయినా.. సంతకం ఉంటే చాలు.. దానిపై ఏమైనా అనుమానం వస్తే దాన్ని రిటర్నింగ్ ఆఫీసర్, జిల్లా ఎన్నికల అధికారి వద్ద ఉన్న సంబంధిత అటెస్టింగ్ ఆఫీసర్ సంతకంతో సరిపోల్చుకుని పోస్టల్ బ్యాలెట్‌ను పరిగణనలోకి తీసుకోవాలంటూ సడలింపు ఇవ్వడం గమనార్హం.

పోస్టల్ బ్యాలెట్ ఆమోదానికి ఇతర నిబంధనలివీ..

- పోస్టల్ బ్యాలెట్ పేపర్ వెనుక రిటర్నింగ్ ఆఫీసరుగానీ లేదా ఫెసిలిటేషన్ సెంటర్ ఇన్‌ఛార్జి సంతకం తప్పనిసరిగా ఉండాలి.
- బ్యాలెట్ పేపర్ వెనుక సంతకం విషయంలో ఏమైనా సందేహాలొస్తే సీరియల్ నెంబర్ ప్రకారం కౌంటర్ ఫైల్‌ను పరిశీలించి అది నిజమైన బ్యాలెట్ అవునా కాదా అని నిర్ధారించుకోవాలి. ఒకవేళ సందేహం ఉంటే వాటిని తిరస్కరించాలి.
- ఓటరు కవర్–బీ మీద సంతకంలేదన్న కారణంతో కూడా ఓటును తిరస్కరించకూడదు. డిక్లరేషన్ ఫాం–13ఏ ప్రకారం ఓటరును గుర్తించవచ్చు. ఇవికాక.. బ్యాలెట్ పేపర్ ఉండే ఇన్నర్ కవర్ ఫారం–13బీని తెరవకుండానే ఈ సమయాల్లో ఓటును తిరస్కరించవచ్చు.
- కవర్–బీని తెరవగానే, ఓటరు డిక్లరేషన్ ఫారం లేకపోతే, డిక్లరేషన్ ఫారంపై గెజిటెడ్ లేదా అటెస్టింగ్ ఆఫీసర్ సంతకం లేకపోయినా, ఫారం –13ఏ, ఫారం–13బీలో బ్యాలెట్ సీరియల్ నెంబర్లు వేర్వేరుగా ఉంటే బ్యాలెట్ పేపర్ తెరవకుండానే తిరస్కరించొచ్చు.
- ఈ విధానం అంతా పూర్తయి బ్యాలెట్ పేపరు తెరిచిన తర్వాత.. ఎవరికీ ఓటు వేయకపోయినా.. ఒకరి కంటే ఎక్కువ మందికి ఓటు వేసినా.. అనుమానాస్పద బ్యాలెట్ పేపరుగా గుర్తించినా.. బ్యాలెట్ పేపరు చిరిగిపోయినా.. అది నిజమైన బ్యాలెట్ అని నిర్ధారించడానికి అవకాశంలేని సమయంలో.. రిటర్నింగ్ ఆఫీసరు ఇచ్చిన కవర్–బీ లేకపోయినా.. ఓటరు ఎవరో గుర్తించే విధంగా ఏమైనా గుర్తులు, లేక రాతలున్న సందర్భాల్లో తిరస్కరించవచ్చు.

మొక్కుబడిగా ఎన్టీఆర్ జయంతి

- కేవలం ఎక్స్ సందేశంతో సరిపెట్టిన చంద్రబాబు
- ఎన్టీఆర్ జయంతినీ పెద్దగా పట్టించుకోని టీడీపీ

సాక్షి, అమరావతి : ఎన్నికలు అయిపోవడంతో ఇక చంద్రబాబుకు, టీడీపీకి ఎన్టీఆర్ అవసరం తీరిపోయింది. మంగళవారం తెలుగుప్రజలంతా ఎన్టీఆర్ జయంతిని జరుపుకోగా, చంద్రబాబు, టీడీపీ నేతలు మాత్రం మొక్కుబడిగా మమ అనిపించారు. చంద్రబాబు ఎక్స్ (ట్విటర్)లో ఓ మెసేజ్ పెట్టి చేతులు దులుపుకోగా, టీడీపీ ప్రధాన కార్యాలయంలో కొందరు నాయకులు తూతూమంత్రంగా ఆయన జయంతి కార్యక్రమాన్ని నిర్వహించి అయిపోయిందనిపించారు. నిజానికి ఎన్టీఆర్ జయంతి సందర్భంగానే ప్రతి సంవత్సరం టీడీపీ మహానాడు నిర్వహిస్తారు. ఈసారి దాన్ని కూడా రద్దు చేశారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో తెలియక రద్దు చేసినట్లు ఆ పార్టీ నేతలే చెబుతున్నారు. మహానాడు గురించి అధికారికంగా ఒక్క మాట కూడా టీడీపీ చెప్పలేదు. మహానాడు నిర్వహించకపోగా ఎన్టీఆర్ జయంతిని కూడా మొక్కుబడిగా చేశారు. మంగళగిరిలోని టీడీపీ ప్రధాన కార్యాలయంలో చాలా పేలవంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. దానికి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఇతర సీనియర్ నేతలు యనమల రామకృష్ణుడు వంటి వారెవరూ హాజరు కాకపోవడాన్ని బట్టి అది ఏ స్థాయిలో జరిగిందో అర్థం చేసుకోవచ్చు. మరోవైపు విదేశీ పర్యటనకు వెళ్లిన చంద్రబాబు బుధవారం ఉదయం 8.30 గంటలకు హైదరాబాద్ రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు చేరుకొని అక్కడి నుంచి జూబ్లీహిల్స్‌లోని నివాసానికి వెళ్లనున్నారు.

ఈసీ అంపైర్‌లా లేదు

దానికి చంద్రబాబు వైరస్ సోకింది.. వారంలో టీడీపీ పీడ విరగడ

- అధికారంలోకి వచ్చేది వైఎస్సార్‌సీపీనే
- గీత దాటిన అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి హెచ్చరిక



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు వైరస్ సోకిందని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి ఆరోపించారు. అందుకే ఎన్నికల కమిషన్ అంపైర్‌లా నిష్పక్షపాతంగా వ్యవహరించడంలేదని.. పోలింగ్ రోజు నుంచి ఇప్పటివరకూ వ్యహరిస్తున్న తీరే అందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం తనను కలిసిన మీడియా ప్రతినిధులతో ఆయన ఇష్టాగోష్టిగా మాట్లాడారు. మీడియా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు బదులిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..

2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో అన్నింటినీ గత ఐదేళ్లు సీఎం జగన్ అమలుచేశారు. సుపరిపాలన అందించారు. పరీక్షల్లో వంద శాతం మార్కులు రావాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మేం పరీక్షలు అలాగే రాశాం. వైఎస్సార్‌సీపీ ఘనవిజయం సాధించడం తథ్యం. వారంలో టీడీపీ పీడ విరగడ కావడం ఖాయం. బహుశ బీజేపీకి ఉత్తరాదిలో కలిసొస్తుందన్న కారణంతో అమిత్ షా దక్షిణాదిలో సీట్లు వస్తాయని చెప్పారేమో. ఉద్యోగులూ సమాజంలో భాగమే. వారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్నట్లు.. తమకు అనుకూలంగా ఉన్నట్లు టీడీపీ భ్రమపడుతోంది. గతంలో పోస్టల్ బ్యాలెట్ కవర్‌పై సీరియల్ నంబర్‌లేదని తిరస్కరించారు. ఈసారి ఏమీలేకున్నా పరిగణనలోకి తీసుకోవాలని టీడీపీ వాళ్లే అడుగుతున్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ఏ మార్గదర్శకాలు జారీచేసినా దేశమంతా ఒకేలా ఉండాలి. దేశమంతా ఎలాంటి నిబంధనలు ఉంటాయో ఇక్కడ కూడా అవే నిబంధనలు అమలుచేయాలి.

మాచర్లలో పిన్నెల్లి లక్ష్యంగా కుట్ర..

ఇక గత 15 రోజులుగా మాచర్లలో ఏం జరుగుతోందో అందరూ గమనించాలి. అక్కడి ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని లక్ష్యంగా చేసుకుని కుట్ర జరుగుతోంది. మాచర్ల కేంద్రంగా టీడీపీ, ఎల్లోమీడియా గందరగోళం సృష్టిస్తోంది. నిష్పక్షపాతంగా ఈసీ వ్యవహరించాలన్నదే మా కోరిక. దురదృష్టవశాత్తు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏర్పడిన నాటి నుంచి ఎన్నికల కమిషన్‌కు చంద్రబాబు వైరస్ సోకినట్లుగా ఉంది. ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తున్న తీరే ఈ అనుమానాలకు కారణం. ఈసీ జోక్యం మాచర్ల కేసులో తీవ్రంగా కనిపిస్తోంది. మాచర్ల నియోజకవర్గం పాల్వాయిగేట్ పోలింగ్ కేంద్రంలో ఈవీఎంను ఎమ్మెల్యే పిన్నెల్లి ధ్వంసం చేసినట్లుగా ఉన్న వీడియో ఎలా బయటకొచ్చిందో ఈసీ చెప్పడం లేదు. అదే నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ఈవీఎంలు ధ్వంసమయ్యాయి. ఆ వీడియోలను బయటపెట్టాలి. పోలింగ్ కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ఓటర్లపై టీడీపీ గూండాలు చేసిన దాడుల వీడియోలనూ బయటపెట్టాలి. ఈవీఎంలు ధ్వంసమైన పోలింగ్ కేంద్రాల పరిధిలో రిగ్గింగ్‌కు పాల్పడింది కాబట్టే టీడీపీ రీపోలింగ్ కోరడంలేదు. వైఎస్సార్‌సీపీకి అన్యాయం జరిగింది కాబట్టే ఎమ్మెల్యే పిన్నెల్లి రీపోలింగ్ కోరుతున్నారు.

పదిరోజులు ఆ సీఐ నిద్రపోయారా?

ఇక ఈవీఎం ధ్వంసం కేసులో పిన్నెల్లికి హైకోర్టు బెయిల్ ఇవ్వగానే.. పోలింగ్ మరుసటి రోజు అంటే ఈనెల 14న జరిగిన అల్లర్లలో తన తలకు గాయమైందని.. ఆ ఘటనలో ఎమ్మెల్యే పిన్నెల్లి ఉన్నారని పది రోజుల తర్వాత సీఐ కేసు పెట్టడమేంటి? పది రోజులూ సీఐ ఎక్కడ నిద్రపోయారు? ఆ సీఐ తరఫున ప్రైవేట్ లాయర్ ఎలా వాదిస్తారు? ఇందుకు ఈసీ ఎలా అనుమతిస్తుంది. పోలీసుల ద్వారా పిన్నెల్లిని అంతమొందించడానికి చంద్రబాబు కుట్ర చేస్తున్నారు. అందుకే ఏడుగురి హత్య కేసులో నిందితుడైన బ్రహ్మారెడ్డిని టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దించారు. అలాగే, మాచర్లలో పోలీసులు వైఎస్సార్‌సీపీ శ్రేణులను భయభ్రాంతులకు గురిచేశారు. కారంపూడిలో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై, ఆస్తులపై టీడీపీ రౌడీలు ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడితే పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించడంలో ఆంతర్యమేమిటి? పోలింగ్ అయిపోయిన తరువాత బైండోవర్, రౌడీషీట్లు వేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అన్నివిధాలా అండగా ఉంటాం. ఇదంతా తాత్కాలికమే. ఫలితాల అనంతరం వైఎస్ జగన్ ప్రమాణ స్వీకారం చేస్తారు. గీత దాటి పక్షపాతంగా వ్యవహరిస్తున్న అధికారులు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు.

కౌంటింగ్ సమయంలో ఈసీ నిష్పక్షపాతంగా ఉండాలి..

చంద్రబాబు గతంలో ఎన్నికల కమిషన్‌పై ఎలా దాడికి వెళ్లారో చూశాం. వైఎస్ జగన్ ఎప్పుడూ ఈసీపై చంద్రబాబులా వ్యవహరించలేదు. ఎన్నికల కమిషన్ ఏకపక్షంగా వ్యవహరిస్తూ చంద్రబాబుకు అనుకూలంగా వ్యవహరిస్తోంది. కౌంటింగ్ సమయంలోనైనా ఈసీ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని మేం కోరుతున్నాం. కేవలం వ్యవస్థలను మేనేజ్ చేయడమే లక్ష్యంగా చంద్రబాబు కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో పొత్తు పెట్టుకున్నారు. గోబెల్స్ ప్రచారం చేసి.. వ్యక్తిత్వ హననానికి పాల్పడి.. బెదిరించి అధికారులను లొంగదీసుకుని తమ వైపు తిప్పుకునేలా ఎల్లో మీడియా ద్వారా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. చంద్రబాబు, ఎల్లో మీడియా కంటే ఉగ్రవాదులే నయం. ఎన్నికల సమయంలో చీఫ్ సెక్రటరీ (సీఎస్)ని తప్పించాలని ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ఆయనపై అభూతకల్పనలతో తప్పుడు కథనాలు అచ్చేసి.. వాటిపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తోంది.

‘కెరీర్‌లో ఎంత ఉన్నతంగా ఎదిగినా, ఎంత సంపాదించినా, ఎంతటి ధనవంతులైనా డబ్బును సరైన విధంగా నిర్వహించకపోతే వారికి ఇబ్బందులు తప్పవు’ అంటున్నారు డాక్టర్ మణి పవిత్ర. హైదరాబాద్ మాదాపూర్‌లో ఉంటున్న మణి పవిత్ర ఆర్థోడాంటిస్ట్. ఆర్థిక నిపుణురాలు, ఫార్చ్యూన్ అకాడమీ సహ వ్యవస్థాపకురాలు, వ్యాపారవేత్త, యోగా కోచ్, సామాజిక కార్యకర్త, రచయిత్రిగా మల్టీటాలెంటెడ్ ఉమన్‌గా గుర్తింపు పొందారు. మహిళలు ఆరోగ్యంగా, ఫిట్‌గా, ఆర్థికంగా స్వతంత్రంగా ఉండేందుకు అవగాహన కల్పిస్తున్న ఈ డాక్టర్‌ను ‘మనీ పవిత్ర’ అని కూడా పిలుస్తుంటారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించడానికి షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ నిర్వహిస్తున్న సందర్భంగా ఎన్నో విషయాలను ఇలా మన ముందుంచారు.



పవిత్ర

మనీ పవిత్ర

‘‘ఆర్థిక అక్షరాస్యత అనేది వ్యక్తిగత డబ్బు నిర్వహణ. ఎవరికి వారు తమదైన అవగాహనతో సంపాదించడం, పొదుపు, పెట్టుబడులు చేయడం చూస్తుంటాం. వారు తీసుకున్న ప్రణాళికల కారణంగా కొందరు తక్కువ సంపాదించినా ధనవంతులు అవుతుంటారు. ఎక్కువ సంపాదన ఉన్నప్పటికీ ఎప్పుడూ డబ్బు సమస్యలతో ఇబ్బందులు పడేవారూ ఉంటారు. అందుకే, ఆర్థిక నైపుణ్యాలను అర్థం చేసుకోవడం, సమర్థవంతంగా నిర్వహించడంలో అవగాహన ప్రతి ఒక్కరికీ అవసరం.

చాలా వెనకబడి ఉన్నాం..

మన జనాభాలో 77 శాతం అక్షరాస్యులు ఉన్నప్పటికీ, 24 శాతం కంటే తక్కువ మంది ఆర్థిక అక్షరాస్యులు ఉన్నారు. వారిలో 17 శాతం మంది యుక్తవయస్కులు మాత్రమే ఆర్థికంగా అక్షరాస్యులు. ప్రపంచంలో చూస్తే భారతదేశం ఆర్థిక అక్షరాస్యత రేటుతో 144 దేశాలలో 73వ స్థానంలో ఉంది. ఆర్థిక పరిజ్ఞానం, అవగాహన లేకపోవడం వల్ల మెజారిటీ భారతీయులు అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఇది గమనించి ప్రజలకు డబ్బుతో ఉండే రిలేషన్ గురించి దేశంలోని తొమ్మిది ప్రధాన నగరాల్లో క్యాంపెయిన్ చేశాం. ఆ క్యాంపెయిన్‌లో మూడు–నాలుగు వందల మంది పాల్గొనేవారు. అనుకున్న ఫలితం రాలేదనిపించి, ఇప్పుడు సోషల్‌మీడియా ద్వారా షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్ నిర్వహిస్తున్నాం.

ప్రోత్సాహకరమైన కథనాలు

ధనవంతులు, ప్రముఖుల జీవితాలు మనకు ఆకర్షణీయంగా కనిపిస్తాయి. కానీ పెద్దపెద్ద సెలబ్రిటీలకు కూడా డబ్బు సమస్యలు ఉంటాయి. ఇప్పటికీ బడ్జెట్‌తో జీవించే ధనవంతులు, ప్రముఖులు ఉన్నారు. వారి నియమబద్ధమైన జీవనాన్ని మనం అలవరచుకోవాలి. మా అకాడమీ ద్వారా వారి కథనాలను చెబుతూ అవసరమైన వారికి అవగాహన కల్పిస్తుంటాం. కరోనా సమయంలో ఏర్పాటు చేసిన ఈ ఆన్‌లైన్ క్లాసులు నెలలో 21 రోజుల పాటు ఉదయం 6 నుంచి 6.30 వరకు ఓ అరగంటపాటు నిర్వహిస్తుంటాను.

షార్ట్ ఫిల్మ్ ఆలోచన

ఈ రోజుల్లో సోషల్ మీడియా ప్రభావం ప్రజలపై బాగా ఉంది. ఏ సమస్య తలెత్తినా సోషల్‌మీడియా వైపుగా వెళుతున్నారు. కొంతమంది ధనవంతులను చూసి తాము కూడా కలల జీవనాన్ని ఊహించుకుంటున్నారు. దానిని సాధించలేక త్వరగా నిరాశకు, డిప్రెషన్‌కు లోనవుతున్నారు. అనవసర బేషజాలకు పోయి అధికంగా డబ్బును ఖర్చుపెట్టుకుని భవిష్యత్తును భారంగా మార్చుకుంటున్నారు. అందుకే, ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహనకు సోషల్‌మీడియాను ఎంచుకున్నాను. మధ్య, దిగువ మధ్య తరగతి వాళ్లలో పెరుగుతున్న ఆర్థిక సమస్యలను నివారించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాను.

ఆర్థికంగా విజయవంతమైన వ్యక్తుల సైన్యాన్ని సృష్టించడమే మా లక్ష్యం. ఆర్థిక అక్షరాస్యత ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించేందుకు. ఫార్చ్యూన్ అకాడమీ ద్వారా ఆర్థిక అక్షరాస్యతపై షార్ట్ ఫిల్మ్ కాంటెస్ట్‌ను నిర్వహిస్తున్నాం. దీనిలో.. డబ్బు ప్రాముఖ్యత, ఏం కొనగలం, దేనిని కొనలేం, పెట్టుబడి, గుణించడం, పొదుపు సంస్కృతి, మధ్యతరగతి డబ్బు సమస్యలు, డబ్బు, ఎమోషనల్ కనెక్షన్, ర్యాగ్స్ టు రిచ్, పిగ్గీ బ్యాంక్ ప్రాముఖ్యత, ప్లాస్టిక్ డబ్బు, డిజిటల్ లావాదేవీలు, డబ్బు గురించి ఎక్కువ శ్రద్ధ వహించే ఇతర విషయాలపై రెండు నిమిషాల నిడివిగల షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించాల్సి ఉంటుంది. ఎంట్రీలను జూలై 31, 2024లోగా fortuneacademyhub@gmail.comకు పంపవచ్చు.



తల్లుల సంపాదనకు బ్రేక్

ఏడేళ్ల క్రితం తెలంగాణ జిల్లాల్లో మహిళలు గర్భం దాల్చడానికి ముందు, గర్భం దాల్చాక, ప్రసవం తర్వాత ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలపైన ‘మిలియన్ మామ్స్’ క్యాంపెయిన్ చేశాం. ఆ సమయంలో తల్లులైన మహిళల సంపాదన పూర్తిగా తగ్గిపోవడం గమనించాం. ప్రసవం తర్వాత చదువుకున్న వారు, చదువు లేనివారు అనే తేడా ఏమీ లేకుండా చాలామంది ఒక బ్రేక్ తీసుకోవడం చూశాం. అక్కడి పరిస్థితులు చూశాక ఆర్థిక అవసరాలు ఎంత ముఖ్యమో, డబ్బుకోసం వారు పడే పాట్లు కనిపించాయి. ప్రసవం తర్వాత పూర్తి సంపాదనకు దూరం అవ్వాల్సిన అవసరం లేదు. ఇప్పుడు డబ్బు సంపాదనకు ఎన్నో అవకాశాలు ఉన్నాయి. మా నానమ్మల రోజుల్లో ఇంటి నిర్వహణ మహిళల చేతుల్లో ఉండేది. ఈ తరంలో ఆ నిర్వహణ కనిపించలేదు. ఈ రోజుల్లో భార్యాభర్తలిద్దరూ ఉద్యోగాలు చేస్తున్నారు. కానీ, ఏ రోజుకు ఆ రోజే అన్నట్టుగా ఉంటోంది. సంపాదించడంలోనూ, పొదుపు చేయడంలోనూ అవగాహన లేదు. దీంతో కుటుంబం మొత్తం ఇబ్బందులు పాలవుతుంది.

పిల్లలకోసం టైమ్

మా అమ్మానాన్నలు బిజీ డాక్టర్లు అవడంతో నా చిన్నతనంలో వారిని బాగా మిస్ అయ్యేదాన్ని. దీంతో నా పిల్లలకు అలాంటి సమస్య రాకూడదనుకున్నాను. నాకు అనుకూలమైన ఆర్థోడాంటిస్ట్ కోర్సు తీసుకున్నాను. నాకంటూ ఒక టైమ్ ఉండాలి, కెరియర్‌తో పాటు కుటుంబాన్నీ బాగా చూసుకోవాలి అనే ఆలోచనతో 15 ఏళ్లుగా ప్లాన్ చేసుకుంటూ వెళుతున్నాను. దీంతో ఇప్పుడు నా ఇద్దరు పిల్లలను, ఇంటిని, నా పనులను బ్యాలెన్స్ చేసుకోగలుగుతున్నాను. ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి మహిళా ఆర్థికవేత్తలు అయిన కిమ్ కియోసాకి, మేరీ బఫెట్‌తో కలిసి చర్చాకార్యక్రమాల్లో పాల్గొన్నాను. ఉమెన్ ఇన్‌స్పైరర్‌గా లయన్ సెంటెనియల్ అవార్డ్, 2020 యూత్ ఐకాన్ అవార్డ్, 2021లో విశిష్ట ఆర్థోడాంటిస్ట్ అవార్డులు పొందాను.

తెలుగు రాష్ట్రాల్లో క్యాంపెయిన్

సమాజంలో ఆర్థిక అక్షరాస్యత పట్ల అవగాహన కల్పించి ప్రజలు ఆర్థికంగా ఎదగడానికి నా వంతు సహాయం చేయాలనే ఉద్దేశంతో క్యాంపెయిన్ ఏర్పాటు చేస్తున్నాం. ఇందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఎనిమిది ప్రధాన ప్రాంతాలను ఎంపిక చేసుకొని, కార్యక్రమాలను చేపట్టనున్నాం. ఆర్థిక అక్షరాస్యత మెరుగైన ఆర్థిక శ్రేయస్సుకు, స్థిరత్వానికి దోహదం చేస్తుంది’’ అంటూ వివరించారు ఈ మనీ పవిత్ర.

– నిర్మలారెడ్డి

ముంబైలో విజి వెంకటేశ్ నిర్వహించే టీ పార్టీలకు నలుగురూ ఉత్సాహంగా వస్తారు. కారణం– కొన్ని కబుర్లు నడుస్తాయి. దాంతోపాటు కేన్సర్‌ను నివారించే జీవన విధానం తెలుస్తుంది. కేన్సర్ బాధితులకు అండగా నిలిచే వీలూ దొరుకుతుంది. 71 ఏళ్ల విజి వెంకటేశ్ గత రెండు దశాబ్దాలుగా కేన్సర్‌పై చైతన్యం కలిగిస్తోంది. విజి వేంకటేశ్ కృషి....

కేన్సర్‌ను జయించే టీ పార్టీలు

అవేర్‌నెస్



‘కేన్సర్ అంటే ఇంకా జనంలో భయం పోలేదు. మాట్లాడటానికి జంకుతారు. టీ అందరికీ ఇష్టం. తాగుతూ కబుర్లు చెప్పుకున్నంత సాధారణంగా కేన్సర్ గురించి మాట్లాడుకుంటూ, చర్చించుకుంటూ, బాధితులకు చేయదగ్గ సాయాన్ని గుర్తు చేయడం గురించే నేను టీ పార్టీలు– చాయ్ ఫర్ కేన్సర్ నిర్వహిస్తున్నాను’ అని తెలిపారు విజి వెంకటేశ్.

ముంబైకి చెందిన 72 ఏళ్ల ఈ సేవా కార్యకర్త దక్షిణ ఆసియాలో కేన్సర్ బాధితుల సహాయానికి పని చేస్తున్న ‘ది మ్యాక్స్ ఫౌండేషన్’కు ప్రధాన బాధ్యతలు నిర్వరిస్తోంది.

‘మేము చాలా హాస్పిటల్స్‌తో మాట్లాడాము. దిగువ ఆదాయ వర్గాల్లో కేన్సర్ బాధితులకు ఉచితంగా వైద్యం చేయడానికి వాళ్లు ముందుకు వచ్చారు. ప్రత్యేకంగా ఛారిటబుల్ ఆస్పత్రులు కూడా ఉన్నాయి. కాని సమస్య ఏమిటంటే... ఆ పేషెంట్లు ఆస్పత్రికి వచ్చి వైద్యం చేయించుకోవడానికి దారి ఖర్చులు వారి వద్ద ఉండవు. మందులు కొనుక్కోవడానికి, తగిన పౌష్టికాహారం తినడానికి వీలుండదు. అలాంటి వారికి సహాయం అందించడమే నా లక్ష్యం. అందుకు టీ పార్టీలకు స్నేహితులను పిలుస్తాను. వారి సహాయం కోరుతాను’ అంది విజి వెంకటేశ్.

కార్మికులను చూసి...

విజి వెంకటేశ్ ముందు ఒక సాధారణ కార్యకర్తగానే సేవా రంగంలోకి వచ్చింది. ముంబైలోని కేన్సర్ పేషెంట్స్ ఎయిడ్ అసోసియేషన్ కోసం నాలుగు చందాలు వసూలు చేసి పెట్టడం ఆమె పని. చిన్న చిన్న వాడల్లోకి వెళ్లి చందాలు అడిగితే వాళ్లు తమ దగ్గర ఉన్నదాంట్లో ఇరవై రూపాయలో, ముప్పై రూపాయలో ఇచ్చేవారు. మరోవైపు వారంతా కార్మికులు కనుక ధూమపానం వల్ల, ఇతర అలవాట్ల వల్ల ఎక్కువగా కేన్సర్ బారిన పడటం విజి గమనించింది. ‘ఒక కేన్సర్ పేషెంట్‌తో టెస్టులు చేయించుకుని, మందులు తీసుకోవచ్చు కదా అనంటే అతను దాని బదులు నా పిల్లలకు పాలు కొనివ్వగలిగితే నాకు ఎక్కువ సంతోషం అన్నాడు. ఆ జవాబు నన్ను కదిలించింది. ఇంత నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితులకు జీవితాంతం సహాయం చేయాలని నిశ్చయించుకున్నాను’ అని తెలిపింది విజి.



విజి వేంకటేశ్

చాయ్ పార్టీ 4 లక్షలు

విజి తన టీ పార్టీలకు స్నేహితులను, బంధువులను పిలుస్తుంది. ఆమె సంస్థ, కృషి గురించి విన్న అపరిచితులు కూడా వచ్చి టీ పార్టీలో కూచుంటారు. కేన్సర్ అవగాహన కార్యక్రమం ఉంటుంది. దాంతో పాటు సరదా పాటలు, మాటలు నడుస్తాయి. చివరలో విజి దిగువ ఆదాయ వర్గాల కేన్సర్ బాధితుల కోసం చందాలు కోరుతుంది. ‘ప్రతి టీ పార్టీలో కూడా విశేష స్పందన వస్తుంది. అప్పటికప్పుడు వారికి తోచింది ఇస్తారు. ఒకోసారి 4 లక్షల రూపాయల వరకూ వస్తాయి. అక్కడ ఉన్నవారు వేరే ఫ్రెండ్స్‌కు కాల్ చేసి మరీ డబ్బులు వేయిస్తారు’ అని తెలిపింది విజి.

18 వేల మందికి

విజి తన సంస్థ ద్వారా ముంబై, మహరాష్ట్రలోని 18 వేల మంది కేన్సర్ బాధితులకు సహాయం అందిస్తోంది. వారి చికిత్సకు, మందులకు, పరీక్షలకు డబ్బు ఏర్పాటు చేస్తుంది. ఒకోసారి కుటుంబ పరిస్థితి కూడా గమనించాల్సి ఉంటుంది. ‘తగిన వైద్యం అందితే చాలామటుకు కేన్సర్ నుంచి బయటపడొచ్చు. ఆ వైద్యం అందే పరిస్థితుల కోసం మనందరం తలా ఒక చేయి వేయాలి’ అందామె.

ప్రస్తుతం దేశంలో 30 చోట్ల విజి సంస్థ కోసం టీపార్టీలు జరుగుతున్నాయి. మిగిలిన ప్రాంతాల్లో కూడా ఇలాంటివి నిర్వహించి నిధులు కేన్సర్ బాధితులకు అందేలా చేయొచ్చు.

యూత్ పల్స్



చక్కని ‘ఫాంగ్’కు చాంగు భళా

కొడితే ‘ఫాంగ్’ జాబ్ కొట్టాలి అనుకుంటోంది యువతరం. ప్రపంచంలోని ఉత్తమ పనితీరు కనబరిచే దిగ్గజ కంపెనీల సంక్షిప్త నామం– ఫాంగ్ (ఫేస్‌బుక్, అమెజాన్, యాపిల్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్) ‘ఫాంగ్’ కంపెనీలలో ఉద్యోగం చేయాలనే కలను నెరవేర్చుకోవడానికి స్కిల్ లెర్నింగ్ కాన్ఫరెన్స్‌లకు హాజరు కావడం నుంచి సీనియర్ ఉద్యోగులతో మాట్లాడడం వరకు ఎంతో కసరత్తు చేస్తున్నారు. కలను నెరవేర్చుకుంటున్నారు.

ప్రతిష్ఠాత్మకమైన ఫాంగ్ (ఫేస్‌బుక్, యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, గూగుల్) కంపెనీలలో ఉద్యోగం చేయాలని యువతరం బలంగా అనుకోవడానికి ఎన్నో కారణాలు ఉండవచ్చు. అయితే ప్రధానంగా చెప్పుకోవాల్సి వస్తే... కాంపిటీటివ్ స్పిరిట్, వర్క్–లైఫ్ బ్యాలెన్స్, గ్రౌండ్ బ్రేకింగ్ టెక్నాలజీపై పనిచేసే అవకాశం అనేవి ముఖ్య కారణాలు.

‘ఫాంగ్’ కంపెనీలలో పనిచేయాలనే కలను నెరవేర్చుకోవడానికి తగిన కసరత్తు చేస్తున్నారు. ‘ఫాంగ్’ కంపెనీలలో పనిచేస్తున్న ఉద్యోగులతో మాట్లాడుతున్నారు. ‘ఫాంగ్’ రిక్రూటర్స్, ఎం.ఎల్. ఇంజినీర్స్, రిసెర్చర్‌లు హాజరయ్యే స్కిల్ లెర్నింగ్ కాన్ఫరెన్స్‌లకు హాజరవుతున్నారు. ‘ఫాంగ్’ ఇంటర్వ్యూల గురించి అవగాహన చేసుకోవడానికి ప్రొఫెషనల్స్‌తో మాట్లాడుతున్నారు.

‘నా ఫ్రెండ్ ఒకరు మోస్ట్ టాలెంటెడ్. అయితే మొదటి ప్రయత్నంలో ఫాంగ్ కంపెనీలలో ఒకదాంట్లో ఎంపిక కాలేదు. అలా అని డిప్రెస్ కాలేదు. ఏ పొరపాట్ల వల్ల తనకు ఉద్యోగం రాలేదో లోతైన విశ్లేషణ చేసుకుంది. ప్రొఫెషనల్స్‌తో మాట్లాడింది. పొరపాట్లను సరిదిద్దుకొని రెండో ప్రయత్నంలో విజయం సాధించింది’ అంటుంది బెంగళూరుకు చెందిన షాలిని.

‘ఓవర్ కాన్ఫిడెన్స్ వల్ల నా ఫాంగ్ కల నెరవేరలేదు. మొదట బాధ అనిపించింది. అయితే ఆ బాధలో నుంచి త్వరగా కోలుకున్నాను. మాస్టర్ ఫండమెంటల్ కాన్సెప్ట్స్‌పై దృష్టి పెట్టాను. మాక్ ఇంటర్వ్యూలకు హాజరయ్యాను. కమ్యూనికేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్–సాల్వింగ్ స్కిల్స్, ప్రెజెంటేషన్ స్కిల్స్ మెరుగుపరుచుకున్నాను’ అంటున్న శైలిమ శ్రీవాస్తవ రెండవ ప్రయత్నంలో విజయం సాధించింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, గోవాలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఖుష్బు గుప్తా గూగుల్‌లో ఉద్యోగం చేయాలనే తన కలను నెరవేర్చుకుంది.

సవాళ్లను అధిగమిస్తే విజయం ఎప్పుడూ మనదే అవుతుంది. ‘గూగుల్‌లో చేరిన కొత్తలో చాలా మిస్టేక్స్ చేసేదాన్ని. అయితే సీనియర్‌ల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్ ద్వారా తప్పులు జరగకుండా జాగ్రత్త పడడం నేర్చుకున్నాను’ అంటుంది ఖుష్బు గుప్తా.

అమెజాన్ పాపులర్ డిజిటల్ వాయిస్ అసిస్టెంట్ ‘అలెక్సా’ను మన దేశంలో లాంచ్ చేసిన బృందంలో లీలా సోమశేఖర్ ఒకరు. అమెజాన్‌లో పనిచేయాలనేది ఆమె కల. కంటెంట్ ఎడిటర్‌గా అమెజాన్‌లో అడుగులు మొదలు పెట్టిన లీల ఆ తరువాత ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్‌లోకి వచ్చింది. ‘ఆన్‌ది–జాబ్ లెర్నింగ్ ఎక్స్‌పీరియెన్స్ ఎంతో ఉపయోగపడుతుంది’ అంటున్న లీల సక్సెస్ మంత్రకు ఇచ్చే నిర్వచనం... కొత్తగా ఆలోచించడం. చిన్న వయసులోనే పోలియో బారిన పడిన రేఖా పోద్వాల్‌కు వీల్ చైర్‌పై ఆధారపడడం తప్పనిసరి అయింది. అయితే ఏదో సాధించాలనే తపన మాత్రం గట్టిగా ఉండేది. ఆ తపనే ఆమెను అమెజాన్ ఇండియా స్టార్ ఉద్యోగులలో ఒకరిగా చేసింది.

‘కలను నెరవేర్చుకోవడానికి అదృష్టం, అల్లావుద్దీన్ అద్భుతదీపంతో పనిలేదు. కష్టాలను, ప్రతికూల పరిస్థితులను తట్టుకునే ఆత్మవిశ్వాసం ఉంటే చాలు’ అంటుంది పుణెకు చెందిన రేఖా పోద్వాల్.

సుందర సందేశం

ఇటీవల గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌ని యూట్యూబర్ వరుణ్ మయ్యా ‘ఫాంగ్’కు సంబంధించి యువత కల గురించి అడిగినప్పుడు అమీర్ ఖాన్ బ్లాక్‌బాస్టర్ మూవీ ‘3 ఇడియట్స్’లోని ఒక సన్నివేశాన్ని గురించి ప్రస్తావించాడు పిచాయ్. ‘ఆ సీన్‌లో మోటర్ అంటే ఏమిటో వివరించే వెర్షన్ ఉంది. మోటర్ అంటే ఏమిటో అర్థం చేసుకునే వెర్షన్ ఉంది. విషయాలను లోతుగా అర్థం చేసుకోవడం ద్వారానే నిజమైన విజయం లభిస్తుంది’ అంటాడు సుందర్ పిచాయ్. సినిమా సీన్ విషయానికి వస్తే ‘మెషిన్ అంటే ఏమిటో నిర్వచనం చెప్పండి’ అని ప్రొఫెసర్ అడిగిన దానికి అమీర్ సింపుల్‌గా చెప్పిన సమాధానం. ‘మెషిన్స్ ఆర్ ఎనీ కాంబినేషన్ ఆఫ్ బాడీస్ సో కనెక్టెడ్ దట్ రిలేటివ్ మోషన్స్....’ అంటూ మార్కులు బాగా తెచ్చుకునే స్టూడెంట్ చెప్పిన సుదీర్ఘ, సంక్లిష్ట నిర్వచనం... ఒక విషయాన్ని వివరించడానికి, అర్థం చేసుకోడానికి మధ్య ఉండే తేడాను తెలియజేస్తుంది.



ధైర్యమే దారి చూపుతుంది...

కంప్యూటర్ సైన్స్‌లో మాస్టర్స్ డిగ్రీ చేసిన సోనాక్షి పాండే స్వభావరీత్యా సిగ్గరి. ఇంట్రావర్ట్. నలుగురిలో ధైర్యంగా మాట్లాడేది కాదు. డేటాబేస్ గురించి ఒక చర్చాకార్యక్రమంలో టెక్ ఎక్స్‌పర్ట్ ఒకరు ఎంతో ఆత్మవిశ్వాసంతో మాట్లాడుతున్న, చర్చిస్తున్న యూట్యూబ్ వీడియోను చూసింది పాండే. ఈ వీడియో ఆమె కెరీర్ గమనాన్ని మార్చేసింది. ఈ వీడియోతో ఇన్‌స్పైర్ అయిన పాండే నలుగురిలో ధైర్యంగా మాట్లాడడం అలవాటు చేసుకుంది. అమెజాన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయింది. ఆ తరువాత అమెజాన్ వెబ్ సర్వీసెస్‌లో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ నుంచి సొల్యూషన్ ఆర్కిటెక్చర్‌లోకి వచ్చింది. ఇందులో పబ్లిక్ స్పీకింగ్, క్లయింట్ ఇంటరాక్షన్స్ ఎక్కువగా ఉంటాయి. అయిదు సంవత్సరాలు అమెజాన్‌లో పనిచేసిన తరువాత మైక్రోసాఫ్ట్, గూగుల్‌కు అప్లై చేసింది. రెజ్యూమ్‌లోని కీ ఎలిమెంట్స్ వల్ల రెండు దిగ్గజ సంస్థల్లోనూ పాండేకు ఉద్యోగం వచ్చింది.



సోనాక్షి పాండే

కోటి దీపోత్సవంలో దీపాల శిఖలు మిలమిలలాడుతుంటే చూడ్డానికి ఎంత ముచ్చటగా ఉంటుంది! అలాగే చిదిమి దీపం పెట్టుకోవాల్సిన చిన్నారులు ఆటిజమ్‌తో చిన్నబోకుండా ఆ అమాయకపు ముఖాలపై చిరునవ్వుల మిలమిలలను అలాగే ఉంచడానికి పూనుకుంది ‘పినాకిల్’ సంస్థ. లక్షణాల్ని బట్టి ఒక్కో ఆటిజమ్ చిన్నారికి ఒక్కో థెరపీ అవసరమవుతుంది. అలాంటి ‘కోటి థెరపీ’లను పూర్తి చేసింది ఈ సంస్థ.

కోటి థెరపీల ఉత్సవం!



ప్రతీకాత్మక చిత్రం

‘ఆటిజమ్ స్పెక్ట్రమ్ డిజార్డర్’ (ఏఎస్‌డీ) అని పిలిచే ఈ రుగ్మత ఉన్న పిల్లలకు జ్ఞానేంద్రియాల నుంచి మెదడుకు సమాచారం చేరడమూ... అక్కణ్నుంచి తాము స్పందించాల్సిన రీతిలో స్పందించకపోవడమనే సమస్య ఉంటుంది. సెన్సెస్(జ్ఞానేంద్రియాల)కు సంబంధించిన సమస్య కాబట్టి దీన్ని ‘సెన్సోరియల్ సమస్య’గా చెబుతారు. ఆ పిల్లలు తమదైన ఏదో లోకంలో ఉన్నట్లుగా ఉంటారు. కళ్లలో కళ్లు కలిపి చూడలేరు. స్పీచ్ ప్రాబ్లమ్స్ ఉంటాయి. ఉదాహరణకు నేర్చుకున్న ఒకే పదాన్ని పదే పదే అదే ఉచ్చరిస్తూ ఉంటారు. తోటి పిల్లలతో కలవడానికీ, ఆడుకోడానికి పెద్దగా ఆసక్తి చూపరు.

అలాంటి పిల్లలకు అవసరమైన చికిత్స (థెరపీలు) అందిస్తోంది పినాకిల్ సంస్థ. లోపాల్ని చక్కదిద్దడానికి అవసరాన్ని బట్టి స్పీచ్ థెరపీ, బిహేవియర్ థెరపీ, ఆక్యుపేషనల్ థెరపీ, డాన్స్ థెరపీ... ఇలాంటి అనేక థెరపీలు అందిస్తోంది. లక్షణాలూ, తీవ్రతలను బట్టి ఒక్కో చిన్నారికి నాలుగైదేసి థెరపీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఇలాంటి కోటి థెరపీలను ఇటీవలే పూర్తి చేసిందీ సంస్థ. తాము ఈ అసిధారా క్రతువు చేపట్టడం వెనక ఓ నేపథ్యముందంటున్నారు ‘పినాకిల్’ వ్యవస్థాపకురాలు శ్రీజారెడ్డి సరిపల్లి.

* * *

తొలిచూలు పంటగా పుట్టిన పిల్లాడు మొదట్లో అంతా బాగున్నట్టే కనిపించినా... ఏడాదిన్నర గడిచాక కూడా మాటలు రాకపోవడం చూసి ఆందోళన పడ్డారు కోటిరెడ్డి, శ్రీజారెడ్డి దంపతులు. డాక్టర్‌కు చూపిస్తే వినలేకపోతున్నాడనీ, బహుశా ఆటిజమ్ కావచ్చని చెప్పారు. చికిత్స కోసం అనేకచోట్ల తిరిగారు. పరిష్కారం దొరకలేదు. వ్యాధి నిర్ధారణ సరిగ్గా జరగలేదు.

పదిహేను రోజులకు అసలు విషయం తెలిసింది. ఆటిజమ్ కాదు, చెవి సమస్య అని తేలింది. అందుకు అవసరమైన శస్త్రచికిత్సలను రెండు చెవులకూ ఒకేసారి చేయించారు. పరిస్థితి పరిష్కారమైందనుకున్నారు. కానీ కేవలం శస్త్రచికిత్స సరిపోదు, స్పీచ్ థెరపీ కూడా అవసరమని వైద్యులు చెప్పారు.

అన్నీ ఉండి కూడా తమలాంటివారికే ఇంత కష్టంగా ఉంటే, ఏమీ తెలియని వారికి ఇంకెంత కష్టం ఉంటుందన్న ఆలోచన వారిలో రేకెత్తింది. ఆ ఆలోచనల నుంచి రూపుదిద్దుకున్న సంస్థే ‘పినాకిల్’. ఆ ఆటిజమ్ సమస్యను ఎదుర్కొనే పిల్లల తల్లిదండ్రుల దుఃఖం తీర్చడానికీ, ఆ పిల్లలు తమ పనులు తామే చేసుకునేలా, దాదాపుగా మిగతా పిల్లల్లాగే ఆడుకునేలా, నడచుకునేలా చేసేందుకు ఏర్పాటు చేసిన సంస్థ అది!



● శ్రీజా రెడ్డి సరిపల్లి

* * *

‘‘పినాకిల్ సంస్థకు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతో పాటు దేశవ్యాప్తంగా దాదాపు 70కి పైగా సేవాకేంద్రాలున్నాయి. ఆటిజమ్ పిల్లలకు అవసరమైన రకరకాల థెరపీలను అక్కడ అందిస్తుంటారు. లోపల జరుగుతున్న చికిత్సను తల్లిదండ్రులు బయట ఉండి స్క్రీన్ మీద చూడవచ్చు. కేవలం భారత్‌లోనే కాదు... యూఎస్‌ఏ, సింగపూర్, దుబాయ్‌లలోనూ ఈ సేవలున్నాయి. త్వరలో యునైటెడ్ అరబ్ ఎమిటేర్స్‌లోనూ పినాకిల్ సేవలు అందనున్నాయి. ఖర్చు భరించలేని వారికి ‘సేవా’ విభాగం కింద వారు తాము చెల్లించగలిగేంత లేదా కేవలం ఒక్క రూపాయి చెల్లించి సేవలు పొందవచ్చు. పద్దెనిమిది భాషల్లో మా హెల్ప్‌లైన్ పనిచేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా 130కి పైగా భాషల్లో సమాచారం తెలుసుకునేలా మా ‘థెరపాటిక్ ఏఐ’ రూపొందుతోంది. మా హెల్ప్ లైన్ 9100 181 181 కు ఏ టైమ్‌లో ఫోన్ చేసినా ఆటిజమ్ పిల్లల తల్లిదండ్రులకు ప్రాథమిక సమాచారం ఎల్లవేళలా అందుతుంది.

ఏఐ ఎందుకంటే...

ఇలాంటి ఓ రుగ్మత ఉందని కనుగొన్న నాటి నుంచి నేటికి దాదాపు 133 ఏళ్లు. ఇంతటి చరిత్రా, వేర్వేరు థెరపీల నేర్పూ, నైపుణ్యాలు ఒక్కోచోట ఒక్కొక్కరిలో ఇలా పరిమితంగానే దొరుకుతుండవచ్చు. ఆ అంతటినీ సమగ్రంగా సమీకరించడం, ఒక్కచోటే అందేలా క్రోడీకరించడం అవసరం. అది ‘ఏఐ’తోనే సాధ్యం. అందుకే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయం తీసుకుంటున్నాం.’’ అంటూ తమ సేవల గురించి వివరించారు పినాకిల్ సంస్థ ఫౌండర్, చీఫ్ స్ట్రాటజిస్ట్ శ్రీజా సరిపల్లి.

– సాక్షి ఫీచర్స్ ప్రతినిధి



వింబుల్డన్ టోర్నీకి నాదల్ దూరం!

ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలి రౌండ్‌లో ఓడిన స్పెయిన్ దిగ్గజం రాఫెల్ నాదల్ వింబుల్డన్ టోర్నీలో ఆడే అవకాశాలు కనిపించడంలేదు. మట్టికోర్టులపైనే జరిగే పారిస్ ఒలింపిక్స్ టెన్నిస్ ఈవెంట్‌కు సన్నద్ధం కావడానికి నాదల్ జూలైలో గ్రాస్ కోర్టులపై జరిగే వింబుల్డన్ టోర్నీకి దూరంగా ఉండాలని అనుకుంటున్నాడు. 2008, 2010లో వింబుల్డన్ విజేతగా నిలిచిన నాదల్ చివరిసారి ఈ టోర్నీలో 2022లో పాల్గొన్నాడు.



ఏడో సీడ్‌పై నిశేష్ సంచలన విజయం

లిటిల్ రాక్ ఓపెన్ ఏటీపీ–75 చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో తెలుగు సంతతికి చెందిన అమెరికా యువతార నిశేష్ బసవ రెడ్డి సంచలన విజయం సాధించాడు. అమెరికాలో జరుగుతున్న ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో 19 ఏళ్ల నిశేష్ 7–5, 6–4తో ఏడో సీడ్ ప్రపంచ 252వ ర్యాంకర్ ఈథన్ క్విన్ (అమెరికా)పై నెగ్గాడు. 93 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో నిశేష్ ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాకు చెందిన నిశేష్ తల్లిదండ్రులు 1999లో అమెరికాకు వచ్చి అక్కడే స్థిరపడ్డారు.

సబలెంకా బోణీ

రెండో రౌండ్‌లోకి బెలారస్ స్టార్ • తొలి రౌండ్‌లో ఓడిన ఆరో సీడ్ సాకరి

పారిస్: ఈ ఏడాది ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ప్రపంచ రెండో ర్యాంకర్ సబలెంకా ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో గెలుపు బోణీ కొట్టింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో రెండో సీడ్ సబలెంకా (బెలారస్) 6–1, 6–2తో ఇరీనా అంద్రీవా (రష్యా)పై అలవోకగా విజయం సాధించింది. 68 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో సబలెంకా ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేసింది. 27 విన్నర్స్ కొట్టిన సబలెంకా నెట్ వద్ద 11 పాయింట్లు సాధించింది. ఏడోసారి ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడుతున్న ఈ బెలారస్ స్టార్ గత ఏడాది తొలిసారి సెమీఫైనల్‌కు చేరింది. మరోవైపు ప్రపంచ ఏడో ర్యాంకర్, ఆరో సీడ్ మరియా సాకరి (గ్రీస్) వరుసగా రెండో ఏడాది ఈ టోర్నీలో తొలి రౌండ్ అడ్డంకిని దాటలేకపోయింది. సాకరి 6–3, 4–6, 3–6తో వర్వరా గ్రెచెవా (ఫ్రాన్స్) చేతిలో ఓడిపోయింది. 2 గంటల 13 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సాకరి ఆరు డబుల్ ఫాల్ట్‌లతోపాటు 39 అనవసర తప్పిదాలు చేసింది. నాలుగో సీడ్ రిబాకినా (కజకిస్తాన్), ఏడో సీడ్ కిన్‌వెన్ జెంగ్ (చైనా), పదో సీడ్ దరియా కసత్‌కినా (రష్యా) రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టారు. తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో రిబాకినా 6–2, 6–3తో గ్రీట్ మినెన్ (బెల్జియం)పై, కిన్‌వెన్ జెంగ్ 6–2, 6–1తో అలీజా కార్నె (ఫ్రాన్స్)పై, కసత్‌కినా 7–5, 6–1తో మగ్దలీనా ఫ్రెచ్ (పోలాండ్)పై గెలుపొందారు.

రూడ్ శుభారంభం

పురుషుల సింగిల్స్ విభాగంలో ప్రపంచ ఏడో ర్యాంకర్, 2022, 2023 రన్నరప్ కాస్పర్ రూడ్ (నార్వే) శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో రూడ్ 6–3, 6–4, 6–3తో అల్వెస్ మెలిగిని (బ్రెజిల్)పై గెలుపొందాడు. గంటా 55 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రూడ్ ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు. 23 విన్నర్స్ కొట్టిన రూడ్ నెట్ వద్ద 10 పాయింట్లు సాధించాడు. వర్షం అంతరాయం కారణంగా మంగళవారం జరగాల్సిన కొన్ని మ్యాచ్‌లను వాయిదా వేశారు. ఇందులో భారత డబుల్స్ ప్లేయర్లు రోహన్ బోపన్న, యూకీ బాంబ్రీ తొలి రౌండ్ మ్యాచ్‌లు కూడా ఉన్నాయి.



సబలెంకా

కార్నె వీడ్కోలు...



ఈ టోర్నీతో ఫ్రాన్స్ టెన్నిస్ స్టార్ అలీజా కార్నె కెరీర్‌కు వీడ్కోలు పలికింది. కిన్‌వెన్ జెంగ్ చేతిలో మ్యాచ్ ముగిశాక ఫ్రెంచ్ ఓపెన్ నిర్వాహకులు కార్నెను సన్మానించి చేసి వీడ్కోలు ట్రోఫీని అందజేశారు. 34 ఏళ్ల కార్నె అత్యధిక వరుస గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడిన మహిళా టెన్నిస్ ప్లేయర్‌గా గుర్తింపు పొందింది. కార్నె 2007 ఆస్ట్రేలియన్ ఓపెన్ నుంచి తాజా ఫ్రెంచ్ ఓపెన్ వరకు వరుసగా 69 గ్రాండ్‌స్లామ్ టోర్నీలు ఆడింది. 2014 వింబుల్డన్ టోర్నీ మూడో రౌండ్‌లో నాటి ప్రపంచ నంబర్‌వన్ సెరెనా విలియమ్స్‌ను ఓడించిన కార్నె 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్ చేరి తన అత్యుత్తమ ప్రదర్శన నమోదు చేసింది. 2009లో కెరీర్ బెస్ట్ 11వ ర్యాంక్‌ను అందుకున్న కార్నె తాజా ర్యాంకింగ్స్‌లో 106వ స్థానంలో ఉంది. ర్యాంకింగ్‌పరంగా కార్నెకు నేరుగా ఫ్రెంచ్ ఓపెన్‌లో ఆడే అవకాశం రాకపోవడంతో నిర్వాహకులు వైల్డ్ కార్డు కేటాయించారు.

హెడ్ కోచ్‌గా గంభీర్!

భారత మాజీ కెప్టెన్‌తో బీసీసీఐ మంతనాలు

ముంబై: యాదృచ్ఛికమో, కాకతాళీయమో కానీ... కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్) కోచింగ్ బృందంలో చేరితే ఆ తర్వాత బోలెడు అవకాశాలు కలిసొస్తాయని మరోసారి నిరూపితం కానుంది. బేలిస్ కోచింగ్‌లోని కేకేఆర్ 2012, 2014లో టైటిల్స్ నెగ్గింది. ఈ ఆస్ట్రేలియన్‌కు వెంటనే ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) నుంచి ఆఫర్ వచ్చింది. తొలుత నిరాకరించినా తర్వాత బాధ్యతలు చేపట్టాడు. ఇలాగే మాథ్యూ మాట్, బ్రెండన్ మెకల్లమ్‌లు కూడా ఈసీబీ కోచింగ్ బృందంలో అవకాశాలు దక్కించుకున్నారు. ఇప్పుడు గౌతమ్ గంభీర్ వంతు వచ్చినట్లుంది. గంభీర్‌కు ఆసక్తి ఉందో లేదో ఇంకా స్పష్టంగా తెలియకున్నా... భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) మాత్రం త్వరలో పదవీ కాలం ముగియనున్న రాహుల్ ద్రవిడ్ స్థానంలో హెడ్ కోచ్‌గా గంభీర్‌కు బాధ్యతలు అప్పగించాలని ఆరాటపడుతోంది. బోర్డు కార్యదర్శి జై షా క్రమం తప్పకుండా గంభీర్‌తో టచ్‌లో ఉన్నాడు. భారత్ నెగ్గిన రెండు ప్రపంచకప్ (2007లో టి20, 2011లో వన్డే)లలో కీలకపాత్ర పోషించిన గంభీర్ 2010–2011లలో భారత జట్టుకు ఆరు వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించి ఆరింటిలోనూ విజయాన్ని అందించాడు. ఐపీఎల్‌లో తన నాయకత్వంలో కేకేఆర్‌ను రెండుసార్లు (2012, 2014) విజేతగా నిలిపిన గంభీర్ తాజాగా ఇదే ఫ్రాంచైజీకి మెంటార్‌గా మూడో టైటిల్ అందించాడు. ఇన్నీ సానుకూలాంశాలు టీమిండియా హెడ్ కోచ్‌కు సరైన, సమర్థమైన అభ్యర్థిగా గౌతీవైపే మొగ్గేలా చేస్తున్నాయి.

కానీ... భారత్ బిజీ షెడ్యూల్‌తో ఎలా?

వృత్తిగతంగా కాలం కలిసొస్తున్న గంభీర్‌కు వ్యక్తిగతంగా కొన్ని ప్రతికూలతలు ఉన్నాయి! టీమిండియాకు హెడ్ కోచ్ కావడమంటే... లక్నో నుంచి కోల్‌కతాకు మెంటార్‌గా మారినంత సులభం కాదు. ఎందుకంటే ఐపీఎల్ రెండు లేదంటే మూడు నెలల ముచ్చటే! కానీ భారత క్రికెట్ అంటేనే బిజీ బిజీ. ఐసీసీలోని ప్రతి శాశ్వత సభ్యదేశానికి టీమిండియా ముమ్మాటికి కామ ధేనువు. భారత్ తమ దేశంలో పర్యటిస్తే బోర్డులు రూ.వందల కోట్లు పోగేసుకుంటాయి. కాబట్టి ఏడాదిలో పది నెలలు టీమిండియా ఏదో ఓ ఫార్మాట్ ఆడుతూనే ఉంటుంది. క్రికెట్ కెరీర్ అనంతరం ఎంచక్కా కుటుంబంతో కాలం గడుపుతున్న గంభీర్‌ది పెద్ద వయస్సేమీ కాదు. పిల్లలిద్దరు చిన్నవారే కావడంతో 50, 55 ఏళ్ల వయసొచ్చినపుడు నిర్వర్తించే బాధ్యతల్ని ఇప్పుడు భుజాన వేసుకుంటాడా అనేది సంకోచించాల్సిన విషయం. తాజా ఐపీఎల్ సీజన్‌లో రెండున్నర నెలల షెడ్యూల్లోనే గంభీర్ ఐదుసార్లు విరామం తీసుకున్నట్లు తెలిసింది. ఇలాంటి 'ఫ్యామిలీ మ్యాన్' కుటుంబానికి నెలల తరబడి దూరముంటాడా అనేది సమాధానం దొరకని ప్రశ్నే!

మోదీ పేరుతోనూ...

బోర్డు కోచ్ పదవి కోసం దరఖాస్తుల గడువు ముగిసిపోగా... విదేశీ కోచ్‌లు, విదేశీ మాజీ క్రికెటర్లెవరూ దరఖాస్తు చేసిన దాఖలాలైతే లేవు కానీ ఏకంగా 3000 పైచిలుకు అప్లికేషన్లు వచ్చాయి. ఆన్‌లైన్ ఫార్మాట్ కావడంతో నెట్టింట ఆకతాయిలు కొందరు ప్రధాని నరేంద్ర మోదీ, హోంమంత్రి అమిత్ షా, దిగ్గజ క్రికెటర్లు సచిన్, ఎమ్మెస్ ధోని తదితర పేర్లతో నకిలీ దరఖాస్తులు సమర్పించారు.



ఐపీఎల్ ఫైనల్ సందర్భంగా గంభీర్‌తో బీసీసీఐ కార్యదర్శి జై షా

డాక్టర్ కూడానా!!

మన నెటిజన్లు హెడ్ కోచ్ పదవి కోసం ఫన్నీగా దరఖాస్తు చేసుకోవడం విశేషం. గూగుల్ ఫామ్స్‌లో తమ వివరాలు రాసి ఆన్‌లైనే కదా అప్లై చేస్తే పోలా అన్నట్లు సోషల్ మీడియా ఫాలోవర్లు చాలామంది ఎగబడ్డారు. ఇంకో ఆసక్తికర విషయం ఏంటంటే బాల్యంలో గల్లీ క్రికెట్ ఆడిన ఓ డాక్టర్ కూడా టీమిండియా కోచ్ పదవి కోసం దరఖాస్తు చేసుకోవడమే విడ్డూరం!

ప్రిక్వార్టర్స్‌లో నిశాంత్



బ్యాంకాక్: వరల్డ్ ఒలింపిక్ బాక్సింగ్ క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. నిశాంత్ దేవ్ (71 కేజీలు), సచిన్ సివాచ్ (57 కేజీలు) ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించగా... అభినాశ్ (63.5 కేజీలు) రెండో రౌండ్‌లోనే వెనుదిరిగాడు. రెండో రౌండ్ బౌట్‌లలో సచిన్ 5–0తో ఫ్రెడరిక్ (డెన్మార్క్)పై గెలుపొందగా... నిశాంత్ పంచ్‌ల ధాటికి ఒట్‌గాన్‌బాటర్ (మంగోలియా) తట్టుకోలేకపోవడంతో రిఫరీ తొలి రౌండ్‌లోనే బౌట్‌ను నిలిపి వేసి భారత బాక్సర్‌ను విజేతగా ప్రకటించారు. అభినాశ్ 0–5తో జోస్ పోరీ (కొలంబియా) చేతిలో ఓడిపోయాడు.

సాత్విక్–చిరాగ్ జోడీకి చుక్కెదురు

తొలి రౌండ్‌లోనే ఓడిన ప్రపంచ నంబర్‌వన్ జోడీ • సింగపూర్ ఓపెన్ టోర్నీ



సింగపూర్: ఈ ఏడాది అద్భుతమైన ఫామ్‌లో ఉన్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి (భారత్) జోడీకి అనూహ్య పరాజయం ఎదురైంది. సింగపూర్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–750 టోర్నీలో టాప్ సీడ్‌గా బరిలోకి దిగిన సాత్విక్–చిరాగ్ తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టారు. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 34వ స్థానంలో ఉన్న డానియల్ లుండ్‌గార్డ్–మాడ్స్ వెస్టెర్‌గార్డ్ (డెన్మార్క్) ద్వయం 22–20, 21–18తో సాత్విక్–చిరాగ్ శెట్టి జోడీని బోల్తా కొట్టించి ప్రిక్వార్టర్ ఫైనల్ చేరింది. 47 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లోనూ పలు దశల్లో సాత్విక్–చిరాగ్ ఆధిక్యంలో ఉన్నా దానిని సద్వినియోగం చేసుకోలేకపోయారు. ఈ టోర్నీకి ముందు సాత్విక్–చిరాగ్ సీజన్‌లో ఆరు టోర్నీలు ఆడి ఫ్రెంచ్ ఓపెన్ సూపర్–750 టోర్నీలో, థాయ్‌లాండ్ ఓపెన్ సూపర్–500 టోర్నీలో టైటిల్స్ నెగ్గారు. మలేసియా సూపర్–1000, ఇండియా ఓపెన్ సూపర్–750 టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచి, ఆల్ ఇంగ్లండ్ ఓపెన్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లో వెనుదిరిగారు.

హంపి శుభారంభం



స్టావెంజర్ (నార్వే): భారత చెస్ స్టార్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారిణి కోనేరు హంపి నార్వే చెస్ మహిళల ఓపెన్ టోర్నీలో శుభారంభం చేసింది. పియా క్రామ్లింగ్ (స్వీడన్)తో జరిగిన తొలి రౌండ్‌లో ప్రపంచ ఐదో ర్యాంకర్ హంపి అర్మగెడాన్ గేమ్‌లో గెలిచింది. ఈ టోర్నీ నిబంధనల ప్రకారం ముందుగా క్లాసికల్ ఫార్మాట్‌లో గేమ్ జరుగుతుంది. ఒకవేళ గేమ్ 'డ్రా' అయితే ఫలితం తేలడానికి అర్మగెడాన్ గేమ్‌ను నిర్వహిస్తారు. అర్మగెడాన్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడే వారికి 10 నిమిషాలు, నల్ల పావులతో ఆడే వారికి 7 నిమిషాలు కేటాయిస్తారు. అర్మగెడాన్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడే ప్లేయర్ నెగ్గని పక్షంలో... నల్ల పావులతో ఆడిన ప్లేయర్ గేమ్‌ను 'డ్రా' చేసుకుంటే దానిని విజయంగా పరిగణిస్తారు. హంపి, పియా క్రామ్లింగ్ క్లాసికల్ గేమ్ 37 ఎత్తుల్లో 'డ్రా'కాగా... ఫలితం తేలడానికి అర్మగెడాన్ గేమ్ నిర్వహించారు. ఇందులో నల్లపావులతో ఆడిన హంపి 51 ఎత్తుల్లో గేమ్‌ను 'డ్రా' చేసుకోవడంతో ఆమెను విజేతగా ప్రకటించారు. భారత్‌కే చెందిన వైశాలి తొలి రౌండ్ క్లాసికల్ గేమ్‌లో 43 ఎత్తుల్లో వెన్‌జున్ జు (చైనా) చేతిలో ఓడిపోయింది. ఇదే టోర్నీ పురుషుల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ప్రజ్ఞానంద అర్మగెడాన్ గేమ్‌లో తెల్ల పావులతో ఆడుతూ 38 ఎత్తుల్లో ఫిరూజా (ఫ్రాన్స్)పై గెలిచాడు. వీరిద్దరి మధ్య క్లాసికల్ గేమ్ 44 ఎత్తుల్లో 'డ్రా' అయింది.


సినిమా

ఇండస్ట్రీ నుంచి పంపించేస్తారు అన్నారు - విశ్వక్ సేన్



• విశ్వక్ సేన్, నాగవంశీ, అంజలి

''నిజాయతీగా పని చేసి 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' లాంటి మంచి సినిమా తీశాం. అందుకే ఈ మూవీపై చాలా నమ్మకంగా ఉన్నాం. అందరూ కుటుంబంతో కలిసి రావొచ్చు. సినిమా చూశాక రెండు మూడు రోజుల పాటు ప్రేక్షకుల మనసుల్లోనే ఉంటుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. కృష్ణ చైతన్య దర్శకత్వంలో విశ్వక్ సేన్ హీరోగా, నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించిన చిత్రం 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ప్రీ రిలీజ్ వేడుకలో హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ– ''ఐదేళ్ల క్రితం మార్చి 31వ తేదీనే నా 'ఫలక్‌నుమా దాస్' రిలీజ్ అయ్యింది. నేనీ స్థాయిలో ఉన్నానంటే కారణం ఆ సినిమా.. ఆదరించిన ప్రేక్షకులే. నా కెరీర్ ఆరంభంలో 'ఇలాంటి యాటిట్యూడ్ ఇండస్ట్రీలో పనికి రాదు.. తొక్కేస్తారు.. పంపించేస్తారు' అన్నారు. అయినా నా క్యారెక్టర్ మార్చుకోలేదు. ఐదేళ్లుగా నన్ను సపోర్ట్ చేస్తున్న ఇండస్ట్రీకి, దర్శక–నిర్మాతలకు, ముఖ్యంగా నా ఫ్యాన్స్‌కి థ్యాంక్స్. ఇప్పటికే ఐదేళ్లు గడిచిపోయాయి. మరో ఐదేళ్లు ఫైనల్.. కాల్చిపడేస్తా మొత్తం. రత్నలాంటి పాత్ర చేయాలన్నది నా కల. అలాంటి కథతో వచ్చిన కృష్ణ చైతన్యకి థ్యాంక్స్. నేను ఇప్పటి వరకూ పనిచేసిన నిర్మాతల్లో నాగవంశీ బెస్ట్'' అన్నారు. కృష్ణ చైతన్య మాట్లాడుతూ– ''మా అమ్మానాన్నల ఆశీస్సుల వల్లే ఇక్కడ ఉన్నాను. మా గురువు త్రివిక్రమ్ గారే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'కి మూలం. ఆయన వల్లే ఈ సినిమా మొదలైంది. నన్ను నమ్మి ఈ సినిమా తీసిన నిర్మాతలు చినబాబు, నాగవంశీ, సాయి సౌజన్యగార్లకు కృతజ్ఞతలు. బుజ్జిగా నేహాశెట్టి, రత్నమాలగా అంజలి పాత్రలు ప్రేక్షకులకు గుర్తుండిపోతాయి. విశ్వక్ సేన్ అద్భుతంగా నటించాడు. తను చేసిన రత్న పాత్ర ప్రేక్షకుల్ని నవ్విస్తుంది.. ఏడిపిస్తుంది.. భయపెడుతుంది'' అన్నారు. **సూర్యదేవర నాగవంశీ మాట్లాడుతూ–** ''ఈ నెల 31 తర్వాత విశ్వక్ సేన్ గురించి మాట్లాడుకుంటే 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'కి ముందు, తర్వాత అని మాట్లాడుకుంటారు. నట విశ్వరూపం చూపించాడు. సినిమా చూశాక నిజంగా కృష్ణ చైతన్య తీశాడా? అనిపించింది. ఈ మధ్య కాలంలో ఇంత మంచి ఇంటెన్స్ మూవీ రాలేదు'' అన్నారు. నటి నేహా శెట్టి, నటులు మధునందన్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



• 'అల్లరి' నరేశ్

సిగరెట్ కాల్చుతూ రిక్షాలో మాస్‌గా కూర్చొన్న అతని పేరు మల్లి. ఇంటిపేరు బచ్చల. చేసేది ట్రాక్టర్ డ్రైవర్‌గా... ఇంకా అతని పూర్తి వివరాలు తెలుసుకోవాలనుకునేవారు థియేటర్స్‌కు వెళ్లాల్సి ఉంటుంది. 'అల్లరి' నరేశ్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'బచ్చల మల్లి'. 1990 నేపథ్యంలో సాగే ఈ సినిమాకు 'సోలో బ్రతుకే సో బెటర్' ఫేమ్ సుబ్బు మంగాదేవి దర్శకత్వం వహిస్తున్నారు. హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేశ్ దండా, బాలాజీ గుత్తా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మంగళవారం ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ఈ పోస్టర్‌లో సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు 'అల్లరి' నరేశ్. ''ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ బచ్చల మల్లి చాలా రోజులు గుర్తుండిపోతాడు. నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి'' అని చిత్రబృందం పేర్కొంది. అమృతా అయ్యర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో రోహిణి, రావు రమేశ్, అచ్యుత్ కుమార్, బలగం జయరామ్, హరితేజ, ప్రవీణ్, వైవా హర్ష ముఖ్య పాత్రధారులు. ఈ సినిమాకు సంగీతం: విశాల్ చంద్రశేఖర్, కెమెరా: రిచర్డ్ ఎం. నాథన్.

ఒకరికొకరు సపోర్ట్ చేసుకోవడం ముఖ్యం - రష్మికా మందన్న



• నయన్, ఆనంద్ దేవరకొండ, రష్మికా మందన్న, ప్రగతీ శ్రీవాస్తవ

''ఇండస్ట్రీలో ఒకరికొకరు సపోర్ట్ చేసుకోవడం ముఖ్యం. సినిమాల్లోకి వచ్చాక నేను ఈ విషయం తెలుసుకున్నాను. ఆనంద్ నాకు బ్రదర్‌లాంటి వాడు. అతని మీద నేను చాలా ఆధారపడుతుంటాననే విషయం ఆనంద్‌కే తెలియదు. 'గం..గం..గణేశా' సక్సెస్ సాధిస్తే ఆనంద్ ముఖంలో నవ్వు ఉంటుంది. ఆ విజయం తాలూకు నవ్వుని నేను చూడాలనుకుంటున్నాను'' అన్నారు హీరోయిన్ రష్మికా మందన్న. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతీ శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గం..గం..గణేశా'. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న విడుదలవుతోంది. ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి రష్మికా మందన్న ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ– ''గం..గం..గణేశా' సాంగ్స్‌కు నేను డ్యాన్సులు చేశాను. చేతన్ భరద్వాజ్ మ్యూజిక్ చాలా బాగుంది. డైరెక్టర్ ఉదయ్‌కి ఈ సినిమా పెద్ద సక్సెస్ ఇవ్వాలి. వంశీ, కేదార్, అనురాగ్‌లకు ఈ మూవీ మంచి లాభాలు తీసుకురావాలి'' అన్నారు. ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ– ''క్రైమ్ కామెడీలో ఫ్యామిలీ ఎమోషన్స్ కలిపి వినోదాత్మకంగా తీసిన చిత్రం 'గం..గం..గణేశా'. నేను ఈ సినిమాలో కనిపించినంత ఎనర్జిటిక్‌గా ఇప్పటి వరకూ ఏ సినిమాలోనూ కనిపించలేదు'' అన్నారు. ''గం..గం..గణేశా'లో ఒక అతిథి పాత్ర ఉంది. ఆ పాత్రను థియేటర్‌లో చూసి షాక్ అయ్యేందుకు రెడీగా ఉండండి'' అన్నారు ఉదయ్ శెట్టి. దర్శక–నిర్మాత 'మధుర' శ్రీధర్ రెడ్డి, నిర్మాత బన్నీ వాసు, సహనిర్మాత అనురాగ్ పర్వతనేని తదితరులు పాల్గొన్నారు.

పిడికిలి బిగించాడు



• కల్యాణ్ రామ్

కల్యాణ్ రామ్ హీరోగా, విజయశాంతి ఓ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా సినిమా చిత్రీకరణ హైదరాబాద్‌లో జరుగుతోంది. ముప్పా వెంకయ్య చౌదరి సమర్పణలో ప్రదీప్ చిలుకూరి దర్శకత్వంలో అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో సోహైల్ ఖాన్, సయీ మంజ్రేకర్, శ్రీకాంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. మంగళవారం ఎన్టీఆర్ జయంతి సందర్భంగా కల్యాణ్ రామ్ కెరీర్‌లోని ఈ 21వ సినిమా గ్లింప్స్‌ను 'ది ఫిస్ట్ ఆఫ్ ఫ్లేమ్' పేరిట విడుదల చేశారు. కల్యాణ్ రామ్ పిడికిలి బిగించి ఓ యాక్షన్ సీక్వెన్స్‌కు రెడీ అవుతున్న విజువల్స్ ఈ గ్లింప్స్‌లో కనిపిస్తాయి. ''సరిలేరు నీకెవ్వరు (2020)' వంటి బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ తర్వాత విజయశాంతి గారు ఈ సినిమాకు సైన్ చేశారు. 'కర్తవ్యం' సినిమాలో చేసిన పవర్‌ఫుల్ క్యారెక్టర్ తరహా పాత్రను ఈ సినిమాలో చేస్తున్నారామె'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: అజనీష్ లోక్‌నాథ్. కెమెరా: రామ్‌ప్రసాద్.

గుణశేఖర్ యుఫోరియా



'**శాకుంతలం**' (2023) తర్వాత దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించనున్న చిత్రం గురించి మంగళవారం ప్రకటన వెల్లడైంది. ఓ యూత్‌ఫుల్ సోషల్ డ్రామాతో ఈ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు గుణ శేఖర్. ఈ సినిమాకు 'యుఫోరియా' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గుణ హ్యాండ్‌మేడ్ ఫిలిమ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ ఈ చిత్రాన్ని నిర్మించ నున్నారు. ''ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణులకు సంబంధించిన వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని మేకర్స్ పేర్కొన్నారు.

రాణులకే రాణి



• కాజోల్


జాతర సందడిగా జరుగుతోంది. అమ్మవారి తల్లి సాక్షిగా కొందర్ని రఫ్ఫాడించింది ఆ మహిళ. అమ్మవారిలా ఆమె ఉగ్రరూపం దాల్చిన తీరుకి ఎదుట ఉన్నది ఎవరైనా వణికిపోవాల్సిందే. ఆ మహిళ పాత్రలో కాజోల్ చేసిన ఫైట్‌తో విడుదలైంది 'మహారాగ్ని' చిత్రం టీజర్. ఇంకా ఈ టీజర్‌లో ప్రభుదేవా ఫైట్ చేస్తూ, ఏదో పగతో ఉన్నట్లు సంయుక్తా మీనన్, సీనియర్ నటుడు నసీరుద్దీన్ షా ఓ రోల్‌లో కనిపించారు. కాజోల్, ప్రభుదేవా లీడ్ రోల్స్‌లో నసీరుద్దీన్ షా, సంయుక్తా మీనన్, జిషు సేన్ గుప్తా, ఆదిత్యా సీల్ ఇతర పాత్రల్లో నటిస్తున్న చిత్రానికి 'మహారాగ్ని' టైటిల్ ఖరారు చేశారు. 'క్వీన్ ఆఫ్ క్వీన్స్' (రాణులకే రాణి) అనేది ట్యాగ్‌లైన్. ఈ టైటిల్, ట్యాగ్‌లైన్ కాజోల్ పాత్రను ఉద్దేశించి పెట్టి ఉంటారని ఊహించవచ్చు. నిర్మాత చరణ్ తేజ్ ఉప్పలపాటి దర్శకత్వంలో వెంకట అనీష్ దొరిగిల్లు నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా మూవీ టీజర్‌ని మంగళవారం విడుదల చేశారు. ''భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'మహారాగ్ని'. షారుక్ ఖాన్ 'జవాన్' చిత్రానికి పని చేసిన జీకే విష్ణు మా సినిమాకి సినిమాటోగ్రాఫర్‌గా చేస్తున్నారు. విజువల్స్ అద్భుతంగా ఉన్నాయి. మ్యూజిక్ డైరెక్టర్ హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకి వెన్నెముక. ఆయన మంచి సంగీతం, అద్భుతమైన నేపథ్య సంగీతం ఇచ్చారు'' అని యూనిట్ పేర్కొంది.

ప్రేక్షకులు చూపు తిప్పుకోలేరు - ప్రశాంత్ రెడ్డి



''**ఈ** చిత్రంలో హీరో పెద్ద క్రికెటర్ కావాలనుకుంటాడు. ఆ గోల్‌తో సిటీకి వస్తాడు. ఆ లక్ష్యాన్ని చేరుకుంటున్న సమయంలో హీరోని వేరే సమస్యలు చుట్టుముడతాయి. అప్పుడేం చేశాడు? అన్నదే 'భజే వాయు వేగం' చిత్రకథ'' అన్నారు ప్రశాంత్ రెడ్డి. కార్తికేయ గుమ్మకొండ, ఐశ్వర్యా మీనన్ హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'భజే వాయు వేగం'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో ప్రశాంత్ రెడ్డిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, యూవీ కాన్సెప్ట్స్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ– ''స్వస్థలం మెదక్. అక్కడ రాజమౌళిగారి 'సై' సినిమా షూటింగ్ జరిగింది. రాజమౌళిగారి స్ఫూర్తితో సినిమా ఇండస్ట్రీకి వచ్చాను. ఇక 'భజే వాయు వేగం' ఫస్టాఫ్‌లో మంచి పెర్ఫార్మర్ కావాలి. మలి భాగంలో ఈ పెర్ఫార్మెన్స్‌కి హీరోయిజం తోడవ్వాలి. ఇందుకు కార్తికేయ కరెక్ట్ అనుకున్నాం. బాగా నటించాడు. సెకండాఫ్‌లో ఒక్క సాంగ్ కూడా ఉండదు. స్క్రీన్‌ప్లే రేసీగా వెళ్తుంటుంది. ప్రేక్షకులు చూపు తిప్పుకోలేరు. నా తర్వాతి చిత్రం యూవీలోనే ఉండొచ్చు'' అని చెప్పుకొచ్చారు.

రామానుజుడి గొప్పతనంతో...



• సాయి వెంకట్

సాయి వెంకట్ నటిస్తూ, దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'జయహో రామానుజ'. జో శర్మ, సుమన్, ప్రవళ్లిక కీలక పాత్రధారులు. రెండు భాగాలుగా సాయిప్రసన్న, ప్రవళ్లిక నిర్మిస్తున్న ఈ సినిమా తొలి భాగం జూలై 12న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ, సంస్కృత భాషల్లో రిలీజ్ కానుంది. ఈ చిత్రం ట్రైలర్ రిలీజ్ కార్యక్రమానికి శ్రీ కృష్ణమాచార్యులు, నిర్మాతలు టి. రామసత్యనారాయణ, శోభారాణి, ఎ. గురురాజ్, దర్శకుడు రేలంగి నరసింహారావు, బీసీ కమీషన్ చైర్మన్ వకుళాభరణం కృష్ణ మోహన్ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని అన్నారు. ''మహిళల్ని గౌరవించాలని, మానవాళి ఐకమత్యంతో ఉండాలనే సందేశాన్ని ఇచ్చిన శ్రీ రామానుజాచార్యుల గొప్పతనం ఈ తరం వారికి తెలియాలనే ఉద్దేశంతో ఈ చిత్రం తీస్తున్నాను'' అన్నారు సాయి వెంకట్.

సాక్షి బిజినెస్
బుధవారం
29-5-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
220	44
75,170	22,888

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	16,992	△	74
డోజోన్స్	38,974	▽	275
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,254	▽	63
డాక్స్	18,678	△	97
షాంఘై	3,110	▽	14
నికాయ్	38,855	▽	45

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)		
72,291	△	100
బంగారం (99.5 స్వచ్ఛత)		
72,002	△	100
వెండి (కేజీ)		
93,120	△	2,309

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.69	83.71
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	104.72	107.28
€	యూరో	ఎస్‌బీఐ	89.09	91.47
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	52.50	53.66
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.22	56.18
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	59.30	63.99
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.27	22.83
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.75	23.53
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.36	12.43

ఆర్‌బీఐ మొబైల్ యాప్

- ప్రభుత్వ బాండ్లలో పెట్టుబడుల కోసం
- నియంత్రణపరమైన అనుమతుల కోసం ప్రవాహ్ పోర్టల్
- ఆవిష్కరించిన రిజర్వ్ బ్యాంక్



ముంబై: రిటైల్ మదుపుదార్లు ప్రభుత్వ బాండ్లలో ఇన్వెస్ట్ చేయడాన్ని సులభతరం చేసే దిశగా రిజర్వ్ బ్యాంక్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించింది. దీనితో పాటు నియంత్రణపరమైన అనుమతులకు సంబంధించి ప్రవాహ్ పోర్టల్, ఫిన్‌టెక్ సంస్థల డేటా కోసం ఫిన్‌టెక్ రిపాజిటరీని ప్రారంభించింది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ మంగళవారం ఈ మూడింటిని ఆవిష్కరించారు. ప్రస్తుతం చిన్న ఇన్వెస్టర్లు రిటైల్ డైరెక్ట్ పోర్టల్ ద్వారా గవర్నమెంట్ సెక్యూరిటీస్ (జీ–సెక్)లో ఇన్వెస్ట్ చేయడానికి వీలుంది. ఇందుకోసం రిటైల్ డైరెక్ట్ స్కీము కింద ఆర్‌బీఐ వద్ద రిటైల్ డైరెక్ట్ గిల్ట్ అకౌంటును తెరవాల్సి ఉంటోంది. దీన్ని ఆండ్రాయిడ్ యూజర్లు ప్లే స్టోర్ నుంచి, ఐవోఎస్ యూజర్లు యాప్ స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

60 ఫారంలతో ప్రవాహ్..

నియంత్రణ సంస్థపరమైన వివిధ రకాల అనుమతులకు సంస్థలు, వ్యక్తులు దర ఖాస్తు చేసుకునేందుకు ప్రవాహ్ పోర్టల్ ఉపయోగపడుతుంది. వివిధ విభాగాలకు సంబంధించి ఇందులో 60 అప్లికేషన్ ఫారంలు ఉంటాయి. అవసరాన్ని బట్టి వీటిని పెంచనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. అప్లై చేసుకున్న వారు నిర్దిష్ట దరఖాస్తు ఏ దశలో ఉందో తెలుసుకునేందుకు, అలాగే దానిపై తీసుకున్న నిర్ణయాన్ని నిర్దిష్ట వ్యవధిలో దరఖాస్తుదారుకు తెలియజేసేందుకు ఉపయోగపడుతుంది.

ఫిన్‌టెక్ రిపాజిటరీ..

ఫిన్‌టెక్ సంస్థలు, వాటి కార్యకలాపాలు, టెక్నాలజీపరంగా చేకూరే ప్రయోజనాలు మొదలైన డేటాకి ఈ రిపాజిటరీ కేంద్రంగా ఉంటుంది. ఫిన్‌టెక్ కంపెనీలను నియంత్రణ సంస్థ కోణంలో మరింత మెరుగ్గా అర్థం చేసుకునేందుకు, వాటికి తగిన విధానాలను రూపొందించేందుకు ఇది ఉపయోగపడగలదు. నియంత్రిత సంస్థలు, ఆర్‌బీఐ నియంత్రణలో లేని ఫిన్‌టెక్‌లు కూడా ఈ రిపాజిటరీకి సమాచారం సమర్పించవచ్చు. మరోవైపు, ఆర్‌బీఐ నియంత్రణలో మాత్రమే ఉన్న సంస్థలు (బ్యాంకులు, బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థలు) వర్ధమాన టెక్నాలజీలను అందిపుచ్చుకోవడానికి సంబంధించిన వివరాల కోసం ఎంటెక్ (ఈఎంటెక్) రిపాజిటరీని కూడా ప్రవేశపెట్టనున్నట్లు ఆర్‌బీఐ తెలిపింది. ఫిన్‌టెక్, ఎంటెక్ రిపాజిటరీలను ఆర్‌బీఐ అనుబంధ సంస్థ రిజర్వ్ బ్యాంక్ ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌బీఐహెచ్) నిర్వహిస్తుంది.

ఆరోగ్య బీమాలోకి ఎల్‌ఐసీ

- ఎంట్రీపై కసరత్తు
- కంపెనీ చైర్మన్ సిద్ధార్థ మొహంతి



న్యూఢిల్లీ: జీవిత బీమా రంగ దిగ్గజం ఎల్‌ఐసీ తాజాగా ఆరోగ్య బీమా రంగంలోకి కూడా ప్రవేశించే యోచనలో ఉంది. ఇందుకోసం ఇన్‌ఆర్గానిక్ అవకాశాలను (వేరే సంస్థను కొనుగోలు చేయడం వంటివి) పరిశీలిస్తామని సంస్థ చైర్మన్ సిద్ధార్థ మొహంతి తెలిపారు. ప్రస్తుతం దీనిపై అంతర్గతంగా కసరత్తు జరుగుతోందని వివరించారు. అగ్ని ప్రమాద బీమా వంటి జనరల్ ఇన్సూరెన్స్ విభాగంలో ఎల్‌ఐసీకి నైపుణ్యాలు లేవని, కాకపోతే హెల్త్ ఇన్సూరెన్స్ మా త్రం చేయగలదని మొహంతి తెలిపారు. ఇన్సూరెన్స్ చట్టాన్ని సవరించి ఒకే గొడుగు కింద లైఫ్, జనరల్ లేదా హెల్త్ ఇన్సూరెన్స్‌ను ఆఫర్ చేసే విధంగా బీమా కంపెనీలకు కాంపోజిట్ లైసెన్సులు జారీ చేయొచ్చనే అంచనాల నేపథ్యంలో మొహంతి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఎన్‌ఎండీసీ లాభం నేలచూపు



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ ఎన్‌ఎండీసీ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం 38 శాతం క్షీణించి రూ. 1,416 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2022–23) ఇదే కాలంలో రూ. 2,277 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 6,908 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 4,520 కోట్లకు పెరిగాయి. ఇక పూర్తి ఏడాదికి నికర లాభం స్వల్పంగా రూ. 5,571 కోట్లకు పుంజుకుంది.

షేరు బీఎస్‌ఈలో 1.5% నష్టపోయి రూ. 259గా ముగిసింది.

మూడో రోజూ లాభాల స్వీకరణ

- సెన్సెక్స్ 220 పాయింట్ల పతనం
- నిఫ్టీకి 44 పాయింట్ల నష్టం



ముంబై: గరిష్ట స్థాయిల వద్ద మూడో రోజూ లాభాల స్వీకరణ కొనసాగడంతో స్టాక్ సూచీలు మంగళవారమూ నష్టాల్లో ముగిశాయి. సార్వత్రిక ఎన్నికల్లో ఆరో విడత పోలింగ్, ఎగ్జిట్ పోల్స్, ఎన్నికల ఫలితాల వెల్లడి తదితర పరిణామాలకు ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహిస్తున్నారు. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు(–1%) అమ్మకాల ఒత్తిడికి లోనైంది. బ్యాంకులు, ఇంధన, విద్యుత్ షేర్లను సైతం ఇన్వెస్టర్లు భారీగా విక్రయించారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచీ మిశ్రమ సంకేతాలు అందాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు..., ఇంట్రాడేలో లాభ, నష్టాల మధ్య ట్రేడయ్యాయి. చివరికి సెన్సెక్స్ 220 పాయింట్లు కోల్పోయి 75,170 వద్ద స్థిరపడింది. రోజంతా 75,083 – 75,585 శ్రేణిలో కదలాడింది. నిఫ్టీ 44 పాయింట్లు పతనమై 22,888 వద్ద ముగిసింది. ఇరు సూచీలకిది మూడోరోజూ నష్టాల ముగింపు. ఫార్మా మినహా అన్ని రంగాల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు వరుసగా 1%, 0.63 శాతం చొప్పున క్షీణించాయి. చైనా, హాంగ్‌కాంగ్, జపాన్ దేశాల స్టాక్ సూచీలు డీలాపడ్డాయి. యూరప్ మార్కెట్లు ఒకశాతం వరకు నష్టపోయాయి. అమెరికా మార్కెట్లు సైతం బలహీనంగా కదలాడుతున్నాయి.

- ప్రమోటర్ సంస్థ ఐనాక్స్ విండ్ ఎనర్జీ బ్లాక్ డీల్ ద్వారా 5% వాటాను విక్రయించడంతో ఐనాక్స్ విండ్ షేరు 10% పతనమై రూ.148 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది.

ఆధార్‌తో పాన్ లింక్ చేసుకోండి



న్యూఢిల్లీ: అధిక రేటుతో టీడీఎస్ కోతల భారాన్ని తప్పించుకోవాలంటే మే 31లోగా ఆధార్‌తో పాన్ నంబరును లింక్ చేసుకోవాలని పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ సూచించింది. ఇన్‌కం ట్యాక్స్ నిబంధనల ప్రకారం పర్మనెంట్ అకౌంట్ నెంబరు (పాన్)ను బయోమెట్రిక్ ఆధార్‌తో అనుసంధానించకపోతే రెట్టింపు రేటుతో టీడీఎస్ (ట్యాక్స్ డిడక్టెడ్ ఎట్ సోర్స్) డిడక్ట్ అవుతుంది. మరోవైపు, ఎస్‌ఎఫ్‌టీ (స్పెసిఫైడ్ ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్ స్టేట్‌మెంట్) దాఖలుకు మే 31 డెడ్‌లైన్‌గా ఉంటుందని ఐటీ శాఖ పేర్కొంది. ఫారెక్స్ డీలర్లు, బ్యాంకులు, ఎన్‌బీఎఫ్‌సీలు, పోస్టాఫీస్‌లు మొదలైనవి దీన్ని దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎస్‌ఎఫ్‌టీ రిటర్నులు వేయడంలో జాప్యం చేస్తే రోజుకు రూ. 1,000 చొప్పున జరిమానా ఉంటుంది. అధిక విలువ లావాదేవీలను ఐటీ శాఖ ట్రాక్ చేసేందుకు ఎస్‌ఎఫ్‌టీ ఉపయోగపడుతుంది.

ఐటీసీ హోటల్ విడదీతకు ఓకే

సీసీఐ గ్రీన్‌సిగ్నల్



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం ఐటీసీ.. హోటళ్ల బిజినెస్‌ను ప్రత్యేక కంపెనీగా విడదీసేందుకు తాజాగా కాంపిటీషన్ కమిషన్(సీసీఐ) అనుమతిని పొందింది. విడదీత తదుపరి ఐటీసీ హోటల్స్ లిమిటెడ్ పేరుతో ఆతిథ్య రంగ విభాగం స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టకానుంది. విడదీత తరువాత ఐటీసీ హోటల్స్‌లో ఐటీసీ లిమిటెడ్ 40 శాతం వాటా పొందనుంది. మిగిలిన 60 శాతం వాటా ఐటీసీ వాటాదారులకు లభించనుంది. ఎఫ్‌ఎంసీజీ, హోటళ్లు, పేపర్, పేపర్‌బోర్డులు, ప్యాకేజింగ్, అగ్రి బిజినెస్‌లతో ఐటీసీ డైవర్సిఫైడ్ కంపెనీగా నిలుస్తున్న సంగతి తెలిసిందే. హోటళ్లు, ఆతిథ్య రంగ బిజినెస్‌ల నిర్వహణకు పూర్తి అనుబంధ సంస్థగా ఐటీసీ హోటల్స్‌ను ఏర్పాటు చేసేందుకు 2023 జులైలోనే ఐటీసీ బోర్డు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. 1975లో ప్రారంభమైన ఐటీసీ హోటల్స్ విభాగం 80కుపైగా ప్రాంతాలలో 115 హోటళ్లను నిర్వహిస్తోంది.

ఈ వార్తల నేపథ్యంలో ఐటీసీ షేరు బీఎస్‌ఈలో 0.6 శాతం నీరసించి రూ. 429 వద్ద ముగిసింది.

ఐఆర్‌సీటీసీ లాభం అప్

- క్యూ4లో రూ. 284 కోట్లు
- షేరుకి రూ. 4 డివిడెండ్



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ దిగ్గజం ఐఆర్‌సీటీసీ గత ఆర్థిక సంవత్సరం (2023–24) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు ప్రకటించింది. జనవరి–మార్చి(క్యూ4)లో నికర లాభం స్వల్పంగా 2 శాతం వృద్ధితో రూ. 284 కోట్లకు చేరింది. టికెట్ల విక్రయాలు పుంజుకోవడం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం మరింత అధికంగా 20 శాతం ఎగసి రూ. 1,155 కోట్లకు చేరింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 4 చొప్పున డివిడెండ్ ప్రకటించింది. ఈ కాలంలో నిర్వహణ లాభం(ఇబిటా) 3 శాతంపైగా మెరుగుపడి రూ. 403 కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్లు 35 శాతానికి నీరసించాయి. 2022–23 క్యూ4లో 36.8 శాతంగా నమోదయ్యాయి.

ఫలితాల నేపథ్యంలో ఐఆర్‌సీటీసీ షేరు బీఎస్‌ఈలో 1.6 శాతం క్షీణించి రూ. 1,083 వద్ద ముగిసింది.

కెమికల్ బిజినెస్‌లోకి సీఐఎల్

బీహెచ్‌ఈఎల్‌తో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: కోల్ కెమికల్ బిజినెస్ కోసం ప్రభుత్వ రంగ దిగ్గజాలు కోల్ ఇండియా(సీఐఎల్), బీహెచ్ఈఎల్ చేతులు కలిపాయి. భారత్ కోల్ గ్యాసిఫికేషన్ అండ్ కెమికల్స్ లిమిటెడ్(బీసీజీసీఎల్)పేరుతో భాగస్వామ్య సంస్థ(జేవీ)ను ఏర్పాటు చేశాయి. జేవీలో సీఐఎల్ వాటా 51 శాతంకాగా.. బీహెచ్‌ఈఎల్ వాటా 49 శాతం. నీతీ ఆయోగ్, దీపమ్ నుంచి జేవీ ఏర్పాటుకు క్లియరెన్స్ లభించినట్లు సీఐఎల్ పేర్కొంది. కోల్ ఇండియాకు అనుబంధంగా ఏర్పడిన జేవీ కోల్ టు కెమికల్స్ బిజినెస్‌లు చేపట్టనుంది. ప్రధానంగా ఇంటర్మీడియెట్ ప్రొడక్టులుగా అ మోనియా, నైట్రిక్ యాసిడ్‌లను తయారు చేయనుంది. అంతేకాకుండా అమోనియం నైట్రేట్‌ను సైతం పూర్తిస్థాయి ఉత్పత్తిగా రూపొందించనుంది. ఇక మరోవైపు కోల్ టు సింథటిక్ నేచురల్ గ్యాస్ ప్రాజెక్టు కోసం ఇంధన రంగ పీఎస్‌యూ గెయిల్‌తో రూ. 13,052 కోట్ల అంచనా వ్యయంతో అవగాహనా ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు సీఐఎల్ తెలియజేసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

29-5-2024 ఫామ్ ధర...

విశాఖ	500–00
చిత్తూరు	593–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	66.00
హైదరాబాద్	490–00
వరంగల్	492–00
రిటైల్ ధర	5.60

జీవీకే నష్టాలు పెరిగాయ్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: జీవీకే పవర్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మార్చి త్రైమాసికం కన్సాలిడేటెడ్ ఫలితాల్లో నష్టాలు అంత క్రితం ఏడాది ఇదే కాలంతో పోలిస్తే రూ.85 కోట్ల నుంచి రూ.142 కోట్లకు ఎగశాయి. టర్నోవర్ రూ.204 కోట్ల నుంచి రూ.92 కోట్లకు పడిపోయింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,155 కోట్ల టర్నోవర్‌పై రూ.212 కోట్ల నికరలాభం ఆర్జించింది.

ఫలితాల నేపథ్యంలో షేరు ధర బీఎస్‌ఈలో మంగళవారం 1.01% క్షీణించి రూ.10.75 వద్ద స్థిరపడింది.

జాబ్ పాయింట్

బీఎస్‌ఎఫ్‌లో 99 ఎస్‌ఐ, ఏఎస్‌ఐ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో పారా మెడికల్ స్టాఫ్ గ్రూప్–బి ఎస్ఐ(స్టాఫ్ నర్స్), గ్రూప్–సి ఏఎస్ఐ(ల్యాబ్ టెక్నీషియన్), ఏఎస్ఐ(ఫిజియోథెరపిస్ట్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 99
» **పోస్టుల వివరాలు:** ఎస్ఐ(స్టాఫ్ నర్స్)–14, ఏఎస్ఐ(ల్యాబ్ టెక్నీషియన్)–38, ఏఎస్ఐ (ఫిజియోథెరపిస్ట్)–47.
» **అర్హత:** పోస్టును అనుసరించి 10+2, డిగ్రీ, డిప్లొమా కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** ఏఎస్ఐ(ల్యాబ్ టెక్నీషియన్)కు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి. ఏఎస్ఐ/ఫిజియోథెరపిస్ట్‌కు 20 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్ఐ(స్టాఫ్ నర్స్) పోస్టులకు 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు ఎస్ఐ(స్టాఫ్ నర్స్)కు రూ.35,400 నుంచి రూ.1,12,400, ఏఎస్ఐకు నెలకు రూ.29,200 నుంచి రూ.92,300 వేతనం లభిస్తుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, నాలెడ్జ్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

బీఎస్‌ఎఫ్‌లో వెటర్నరీ స్టాఫ్ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో వెటర్నరీ స్టాఫ్ గ్రూప్–సి(నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 06
» **పోస్టుల వివరాలు:** హెడ్ కానిస్టేబుల్(వెటర్నరీ)–04, కానిస్టేబుల్ (కెన్నెల్‌మ్యాన్)–02.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి, పన్నెండో తరగతి, వెటర్నరీ స్టాఫ్ అసిస్టెంట్ కోర్సు సర్టిఫికేట్‌తో పాటు పని అనుభవం ఉండాలి. నిర్దిష్ట శారీరక ప్రమాణాలు కలిగి ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు హెచ్‌సీకి రూ.25,500 నుంచి రూ.81,100, కానిస్టేబుల్‌కు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**19.05.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2024.
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

బీఎస్‌ఎఫ్‌లో 37 ఎస్‌ఐ, కానిస్టేబుల్ పోస్టులు

కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, డైరెక్టరేట్ జనరల్ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్)లో ఎస్ఐ, కానిస్టేబుల్ గ్రూప్–బి, సి(నాన్ గెజిటెడ్ నాన్ మినిస్టీరియల్) పోస్టుల భర్తీకి అర్హులైన పురుష, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37
» **పోస్టుల వివరాలు:** ఎస్ఐ(వెహికల్ మెకానిక్)–03, కానిస్టేబుల్(ఓటీఆర్‌పీ)–01, కానిస్టేబుల్(ఎస్‌కేటీ)–01, కానిస్టేబుల్(ఫిట్టర్)–04, కానిస్టేబుల్(కార్పెంటర్)–02, కానిస్టేబుల్(ఏఈ)–01, కానిస్టేబుల్(వెహికల్ మెకానిక్)–22, కానిస్టేబుల్ (బీఎస్‌టీఎస్)–02, కానిస్టేబుల్(అప్‌హోల్‌స్టర్)–01.
» **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడులో ఐటీఐ, డిప్లొమా/డిగ్రీ(ఆటో మొబైల్ ఇంజనీరింగ్/ మెకానికల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణత తోపాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** గ్రూప్–బి పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు. గ్రూప్–సి పోస్టులకు 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు గ్రూప్–బి పోస్టులకు రూ. 35,400 నుంచి రూ.1,12,400, గ్రూప్–సి పోస్టులకు రూ.21,700 నుంచి రూ.69,100.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్స్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియెన్సీ టెస్ట్, ప్రాక్టికల్/ట్రేడ్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**17.06.2024
» **వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

ఐటీఐతో సత్వర ఉపాధి!

» ఏపీ, తెలంగాణల్లో ఐటీఐ ప్రవేశాలు ప్రారంభం
» పదో తరగతి అర్హతతో దరఖాస్తు అవకాశం
» కోర్సు పూర్తి చేసుకుంటే ఉపాధి ఖాయం
» దరఖాస్తులకు చివరి తేది: జూన్ 10

పదో తరగతి తర్వాత సత్వర ఉపాధికి మార్గం.. ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్స్ (ఐటీఐ)! ఇవి అందించే కోర్సులు పూర్తి చేసుకుంటే.. సంబంధిత విభాగంలో ప్రాక్టికల్ నైపుణ్యాలు సొంతమవుతాయి. దీంతో తక్షణమే ఉపాధి పొందేందుకు వీలవుతుంది. ఐటీఐ కోర్సులతో ఉన్నత విద్య అవకాశాలు కూడా అందుకోవచ్చు. 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో ఐటీఐల్లో ప్రవేశ ప్రక్రియ మొదలైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ, తెలంగాణల్లో ఐటీఐల్లో ప్రవేశాల వివరాలు, అవి అందించే ట్రేడ్స్, ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలపై ప్రత్యేక కథనం..



తెలుగు రాష్ట్రాల్లోని ఐటీఐలు ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ విభాగాల్లో వివిధ కోర్సులను అందిస్తున్నాయి. ఈ కోర్సులను ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్ ట్రేడులుగా పేర్కొంటారు. పదో తరగతి అర్హతతో సంవత్సరం, రెండేళ్ల వ్యవధితో కోర్సులను అందిస్తున్నారు. పలు ట్రేడుల్లో ఎనిమిదో తరగతితోనూ ప్రవేశం పొందే అవకాశముంది. అధికారిక గణాంకాల ప్రకారం–ఆంధ్రప్రదేశ్‌లో 82 ప్రభుత్వ, 428 ప్రైవేట్ ఐటీలు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా తెలంగాణలో 63 ప్రభుత్వ ఐటీఐలు, 211 ప్రైవేట్ ఐటీఐలు ఉన్నాయి.

40కు పైగా ట్రేడ్స్

ప్రస్తుతం రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఐటీఐలు 40కు పైగా ట్రేడ్‌లు అందిస్తున్నాయి. వీటిలో నాన్–ఇంజనీరింగ్ విభాగంలో.. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, డ్రెస్ మేకింగ్, డ్రైవర్ కమ్ మెకానిక్, ఫ్యాషన్ డిజైన్ అండ్ టెక్నాలజీ, హెల్త్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, హాస్పిటల్ హౌస్ కీపింగ్, ఐటీ టెక్నీషియన్, రేడియాలజీ టెక్నీషియన్, సెక్రటేరియల్ ప్రాక్టీస్, స్యూయింగ్ టెక్నాలజీ, స్మార్ట్ ఫోన్ టెక్నీషియన్ కమ్ యాప్ టెస్టర్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్, డెంటల్ లేబరేటరీ ఎక్విప్‌మెంట్ టెక్నీషియన్ ట్రేడులు ఉన్నాయి.

ఇంజనీరింగ్‌లో ట్రేడ్స్ ఇవే

ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి డ్రాఫ్ట్స్‌మెన్ (సివిల్/మెకానిక్), ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్స్ మెకానిక్, ఫిట్టర్, ఫౌండ్రీమ్యాన్, ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, మెషినిస్ట్ (గ్రైండర్), మోటార్ వెహికల్ మెకానిక్, ఆటో బాడీ పెయింటింగ్ మెకానిక్, ఆటో బాడీ రిపెయిర్ మెకానిక్, ఆటో ఎలక్ట్రీషియన్ అండ్ ఎలక్ట్రానిక్స్ మెకానిక్, డీజిల్ మెకానిక్, జనరల్ పెయింటర్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్ ఆపరేటర్, ప్లంబర్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్ టెక్నీషియన్, షీట్ మెటల్ వర్కర్, సోలార్ టెక్నీషియన్, టర్నర్, వెల్డర్, వైర్‌మ్యాన్ ట్రేడ్‌ల్లో ప్రవేశం కల్పిస్తున్నారు.

కోర్సుల వ్యవధి వేర్వేరుగా

ఐటీఐల్లో ఇంజనీరింగ్, నాన్–ఇంజనీరింగ్ ట్రేడ్‌లు అందుబాటులో ఉండగా.. వీటి కోర్సుల వ్యవధి వేర్వేరుగా ఉంది. అన్ని బ్రాంచ్‌లకు సంబంధించి ఆయా కోర్సుల వ్యవధి ఏడాది, రెండేళ్లుగా ఉంది.ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు సంబంధించి మాత్రం ఎక్కువ శాతం రెండేళ్ల వ్యవధిలోనే ఉన్నాయి.

ప్రాక్టికల్ నైపుణ్యాలు

ఐటీఐల్లో క్రాఫ్ట్స్‌మెన్ ట్రైనింగ్ స్కీమ్, డ్యూయల్ సిస్టమ్ ఆఫ్ ట్రైనింగ్ విధానాల్లో శిక్షణనిస్తారు. దీంతో ఇండస్ట్రీకి అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు సొంతం చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. నిర్దిష్ట వ్యవధిలో ప్రాక్టికల్ ట్రైనింగ్ అవకాశం కూడా కల్పిస్తారు. సాధారణంగా 70 శాతం సమయాన్ని ప్రాక్టికల్ ట్రైనింగ్‌కు, మిగతా 30 శాతాన్ని థియరిటికల్ ట్రైనింగ్ ఇచ్చేలా కరిక్యులం అమలు చేస్తున్నారు. మొత్తంగా చూస్తే కోర్సు వ్యవధిలో దాదాపు మూడో వంతు లేదా సగం కంటే ఎక్కువగా సమయాన్ని క్షేత్ర నైపుణ్యాలు పొందేందుకు కేటాయిస్తున్నారు. దీంతో ఐటీఐ కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉంటున్నాయి.

ట్రేడ్ టెస్ట్‌కు అర్హత

ఐటీఐలలో ఆయా ట్రేడ్‌లలో కోర్సులు పూర్తి చేసుకున్న అభ్యర్థులు నేషనల్ కౌన్సిల్ ఫర్ ఒకేషనల్ ట్రైనింగ్ నిర్వహించే ఆల్ ఇండియా ట్రేడ్ టెస్ట్‌కు హాజరయ్యే అర్హత లభిస్తుంది. ఈ ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి సదరు కంపెనీల్లో అప్రెంటీస్ నియామకాల్లో ప్రాధాన్యం ఉంటుంది. ఇంజనీరింగ్ ట్రేడ్‌లకు సంబంధించి ట్రేడ్ టెస్ట్‌లో ఉత్తీర్ణతను కొన్ని సంస్థలు తప్పనిసరి చేస్తున్నాయి. కాబట్టి ఐటీఐ ఉత్తీర్ణులయ్యాక ట్రేడ్ టెస్ట్‌లోనూ విజయం సాధిస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి.

అప్రెంటిస్

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు జాతీయ స్థాయిలో అమలవుతున్న నేషనల్ అప్రెంటీస్ ప్రమోషన్ స్కీమ్‌కు కూడా అర్హత పొందుతారు. ఎన్‌ఏపీఎస్ పోర్టల్‌లో తమ పేరు, అర్హతలు, ట్రేడ్ వివరాలు నమోదు చేసుకుంటే.. అప్రెంటీస్ ట్రైనీ నియామకాలు చేపట్టే సంస్థలు అప్రెంటీస్ ట్రైనీగా ఎంపిక చేసుకుంటాయి. అప్రెంటీస్ శిక్షణ సమయంలో నెలకు గరిష్ఠంగా రూ.9వేల వరకు స్టయిఫండ్ పొందొచ్చు. శాశ్వత ఉద్యోగుల సంఖ్య 30 మంది ఉన్న సంస్థలు అప్రెంటీస్ ట్రైనీలను నియమించుకునే విధంగా ఎన్‌ఏపీఎస్ విధానాలను రూపొందించారు. దీంతో ఐటీఐ పూర్తి చేసుకున్న వారికి అప్రెంటీస్ అవకాశాలు లభిస్తున్నాయి.

ఉద్యోగ సాధనలో ముందంజ

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు ఉద్యోగ సాధనలోనూ ముందుంటున్నారనేది ఇండస్ట్రీ వర్గాల అభిప్రాయం. ఇంజనీరింగ్ ట్రేడ్‌లు ఉత్తీర్ణులైతే టెక్నిషియన్స్, ఫ్లోర్‌మెన్ ఉద్యోగాలు లభిస్తాయి. వీరికి నెలకు రూ.20 వేల వరకూ వేతనం అందుతోంది. కంప్యూటర్ ఆపరేటర్ అండ్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ అండ్ సెక్రటేరియల్ అసిస్టెంట్ వంటి నాన్ ఇంజనీరింగ్ ట్రేడ్‌లు పూర్తి చేసుకున్న వారికి చిన్న, మధ్య తరహా సంస్థల్లో ఆఫీస్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ వంటి ఉద్యోగాలు లభిస్తున్నాయి.

సర్కారీ కొలువులు

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు సర్కారీ కొలువులూ సొంతం చేసుకోవచ్చు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలకు పోటీ పడే అవకాశముంది. ముఖ్యంగా రైల్వేలో టెక్నికల్ విభాగంలో అసిస్టెంట్ లోకో పైలట్, ఇతర టెక్నికల్ విభాగాల్లో టెక్నిషియన్ గ్రేడ్–3 ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. నవరత్న, మహారత్న, మినీరత్న హోదా కలిగిన ప్రభుత్వ రంగ సంస్థల్లో కూడా టెక్నిషియన్ కొలువులు దక్కించుకోవచ్చు. రాష్ట్ర స్థాయిలో జూనియర్ లైన్‌మెన్, డిప్యూటీ సర్వేయర్ కొలువులతో పాటు విద్యుత్ సంస్థల్లో ఉద్యోగావకాశాలు లభిస్తాయి.

స్వయం ఉపాధి

ఐటీఐ పూర్తి చేసుకున్న వారు స్వయం ఉపాధి కూడా పొందొచ్చు. ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, మెకానిక్ వంటి ట్రేడ్‌లు ఉత్తీర్ణులైన అభ్యర్థులు సొంతంగా వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించుకునే అవకాశం ఉంది. ఈ ట్రేడ్‌ల అభ్యర్థులు సొంతంగా యూనిట్స్ ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందడంతోపాటు మరికొందరికి ఉపాధి కల్పించొచ్చు.

ప్రవేశాలు ఇలా

ఏపీ, తెలంగాణలోని ఐటీఐలలో.. ప్రవేశాల కోసం అభ్యర్థులు నిర్దేశిత వెబ్‌సైట్‌లో లాగిన్ ఐడీ క్రియేట్ చేసుకోవాలి. ఆ తర్వాత ఆన్‌లైన్ అప్లికేషన్‌ను పూర్తి చేయాలి. ఈ అప్లికేషన్‌ను పూర్తి చేసే సమయంలోనే తమకు ఆసక్తి ఉన్న ట్రేడ్‌లు, ఐటీఐలను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. వీటి ఆధారంగా అభ్యర్థులకు సీటు కేటాయిస్తారు. సీటు పొందిన అభ్యర్థులు నిర్దేశిత తేదీలోపు సంబంధిత ఐటీఐలో జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది.

ముఖ్య సమాచారం

- ఏపీ ఐటీఐల్లో దరఖాస్తు చివరి తేదీ: 2024, జూన్ 10
- తెలంగాణ ఐటీఐల్లో దరఖాస్తు చివరి తేదీ: 2024 జూన్ 10
- ఏపీ ఐటీఐ ప్రవేశాలకు వెబ్‌సైట్: https://itiadmissions.ap.gov.in/iti
- తెలంగాణ ఐటీఐ ప్రవేశాలకు వెబ్‌సైట్: https://tsiti.ucanapply.com

క్లుప్తంగా...

మెగాస్టార్ చిరంజీవికి గోల్డెన్ వీసా



సాక్షి, హైదరాబాద్: ఇటీవలే పద్మ విభూషణ్ పురస్కారం అందుకున్న సినీనటుడు మెగాస్టార్ చిరంజీవి మరో అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) గోల్డెన్ వీసాను అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి యూఏఈ ప్రభుత్వం ఈ వీసాను అందిస్తుంది. తాజాగా దీన్ని అందుకున్న సినీ ప్రముఖుల లిస్టులో చిరంజీవి చేరారు.

గోల్డెన్ వీసా అంటే..

విదేశాలకు చెందిన పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన విదేశీ పౌరులకు యూఏఈ ప్రభుత్వం జారీ చేసేదే గోల్డెన్ వీసా. దీన్ని గరిష్టంగా పదేళ్ల కాలపరిమితికి అందిస్తారు. గోల్డెన్ వీసా వల్ల యూఏఈలో దీర్ఘకాల నివాసానికి వీలవుతుంది. వందశాతం ఓనర్‌షిప్‌తో సొంతంగా వ్యాపారాలు చేసుకోవడం సాధ్యమవుతుంది.

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

31వ తేదీ వరకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారి నుంచి "పద్మశ్రీ,, పద్మ విభూషణ్ అవార్డుల కోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు హైదరాబాద్ జిల్లా యువజన, క్రీడా అధికారి ఎస్.సుధాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా యువజన, క్రీడా అధికారి కార్యాలయం 8-303, థర్డ్ ఫ్లోర్, స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్ కలెక్టరేట్ కాంప్లెక్స్ లక్డీకాపూల్, హైదరాబాద్‌లో నాలుగు సెట్ల దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరేచర్, విద్య, క్రీడలు, సివిల్ సర్వీసెస్, ఇతర రంగాల్లో సాధించిన ప్రతిభకు సంబంధించి 800 పదాలకు మించకుండా వివరాలు వెల్లడిస్తూ దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు https://padmaawards.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేస్తారు.

నటి హేమకు మళ్లీ నోటీసు

శివాజీనగర: ఇటీవల బెంగళూరులో జరిగిన రేవ్ పార్టీలో పాల్గొన్న తెలుగు నటి హేమకు సీసీబీ పోలీసులు మరో నోటీసు జారీ చేశారు. సోమవారం విచారణకు రావాలని మొదటి సారి నోటీసు పంపగా, జ్వరం వచ్చినందున రాలేనని హేమ తెలిపారు. మంగళవారం రెండో నోటీస్ ఇచ్చి విచారణకు రమ్మని చెప్పారు. రేవ్ పార్టీ ఏర్పాటు చేసిన వాసు, అరుణ్, సిద్ధికి, నాగబాబుతో పాటుగా ఐదుగురికి మే 27న 10 రోజుల పాటు పోలీస్ కస్టడీకి కోర్టు ఆదేశించింది. దీంతో మంగళవారం నుంచి వారిని సీసీబీ విచారణ చేపట్టింది. రేవ్ పార్టీ, డ్రగ్స్ సరఫరా వెనక ఉన్న వారిని తెలుసుకునే లక్ష్యంగా వీరిని పోలీసులు ప్రశ్నించనున్నారు.

ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఎంటెక్ పీడీఎం కోర్సు

రాయదుర్గం: ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో ఎంటెక్ ప్రోడక్ట్ డిజైన్ అండ్ మేనేజ్‌మెంట్ (పీడీఎం) కోర్సును ప్రవేశపెట్టారు. ఈ కోర్సు కోసం పరిశ్రమ నిపుణుల నుంచి దరఖాస్తులను కోరుతున్నారు. రెండు సెమిస్టర్ల తరగతులు, రెండు సెమిస్టర్ల ప్రోడక్ట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులతో రెండేళ్ల కోర్సు పార్ట్‌టైమ్ ప్రాతిపదికన కూడా చేయడానికి అవకాశం కల్పించనున్నారు. ఐటీ పరిశ్రమలో సాంకేతిక ఉత్పత్తులు, ఆవిష్కరణలు ప్రధాన స్రవంతిగా మారడంతో ఉత్పత్తి డిజైనర్లు, ఉత్పత్తి డెవలపర్ల అవసరం పెరుగుతోంది. ఈ మార్కెట్ గ్యాప్‌ని పూర్తి చేయడానికి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్ ఇటీవలే ఈ మాస్టర్స్ కోర్సును ప్రారంభించింది. టెక్నాలజీ ప్రోడక్ట్ కంపెనీలు, టెక్ స్టార్టప్‌లలో పనిచేయడానికి ఇంజనీర్లను ఈ కోర్సు సన్నద్ధం చేయనుంది. ఈ కోర్సు కోసం అభ్యర్థులను కంపెనీలు స్పాన్సర్ చేయవచ్చు లేదా నిపుణులు నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. కోర్సు కాలమంతా విద్యార్థులకు నెలవారీ స్టైపెండ్ లభిస్తుంది. దరఖాస్తు చేసుకోవడానికి మే 31 చివరితేదీగా నిర్ణయించారు.

35 రోజులు.. రూ. 3.93 కోట్లు

యాదాద్రిలో రికార్డు స్థాయి ఆదాయం

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి రికార్డు స్థాయిలో హుండీ ఆదాయం వచ్చింది. మంగళవారం యాదాద్రి కొండకు దిగువనున్న శ్రీసత్యనారాయణ స్వామి వారి వ్రత మండపంలో భక్తులు హుండీల్లో సమర్పించుకున్న నగదు, నగలను ఆలయ అధికారులు, సిబ్బంది లెక్కించారు. ఈ లెక్కింపులో 35 రోజుల హుండీ ఆదాయం రూ.3,93,88,092 వచ్చినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు. మిశ్రమ బంగారం 174 గ్రాములు రాగా.. మిశ్రమ వెండి 7 కిలోలు, వివిధ దేశాల కరెన్సీ లభించాయని వివరించారు. ఆలయ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా హుండీల ద్వారా భారీగా నగదు లభించిందని తెలిపారు.


అయోధ్య బాలరాముడికి దుబ్బాక చేనేత వస్త్రం



దుబ్బాక: సిద్దిపేట జిల్లా దుబ్బాక చేనేత కార్మికుల ఖ్యాతి ఖండాంతరాలు దాటి ప్రశంసలు అందుకుంది. తాజాగా దుబ్బాక చేనేత కార్మికులు మగ్గంపై నేసిన వస్త్రంతో సాక్ష్యాత్తు అయోధ్యలో బాలరాముడి అలంకరణకు ఆర్డర్ రావడం విశేషం. ఆదివారం అయోధ్యరాముడిని దుబ్బాక చేనేత కార్మికులు మగ్గంపై నేసిన 12 మీటర్ల లెనిన్ ఇక్కత్ వస్త్రంతో అలంకరించారు. ఇది ఆలయ నిర్వాహకులకు నచ్చడంతో మరిన్ని రంగులతో కూడిన వస్త్రాల తయారీకి ఆర్డర్ ఇచ్చారు. ఢిల్లీకి చెందిన ముక్తిర్ ఫ్యాషన్ ఇండియా వారు 12 మీటర్ల లెనిన్ ఇక్కత్ వస్త్రాన్ని కొనుగోలు చేశారు. గులాబీ రంగులో ఉన్న ఈ వస్త్రాన్ని అయోధ్యలో శ్రీరామచంద్రుడిని అలంకరించేందుకు సమర్పించారు. ఈ క్రమంలో స్వామివారికి సమర్పించిన వస్త్రం అందంగా ఉండటంతో మరో 5 రోజుల పాటు స్వామి వారి అలంకరణకు నిర్వాహకులు ఆర్డర్ ఇచ్చారు.

దుబ్బాక చేనేత వస్త్రం అలంకరణలో అయోధ్య బాలరాముడు

టుడేస్ గ్రాఫిక్



వజ్ర సంకల్పం

తొలకరి మొదలు కాకుండానే పొలాల వైపు అన్వేషకుల పరుగులు

- ఏటా 40–50 వజ్రాలు లభ్యమవుతున్న వైనం
- తమ పొలాల్లోకి రావొద్దని విజ్ఞప్తి బోర్డులు పెడుతున్న రైతులు
- ఆఫ్రికా తరహాలో ప్రభుత్వమే వజ్రాలు కొనుగోలు చేస్తే మేలంటున్న వజ్రాన్వేషకులు

కర్నూలు, అనంతపురం జిల్లాల సరిహద్దుల్లో వజ్రాల నిక్షేపాలు ఉన్నాయనే విషయాన్ని జియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) గుర్తించింది. కర్నూలు జిల్లా తుగ్గలి, మద్దికెర మండలాల్లోని తుగ్గలి, జొన్నగిరి, పగిడిరాయి, కొత్తపల్లి, పెరవలి, అగ్రహారం, హంప, యడవలి, మద్దికెరతోపాటు అనంతపురం జిల్లా వజ్రకరూరు మండలంలోని గంజికుంట, తట్రకల్లు, రాగులపాడు, పొట్టిపాడు, కమలపాడు, గూళపాళ్యం, ఎన్ఎంపీ తండా గ్రామాల్లో తరచూ వజ్రాలు లభ్యమవుతున్నాయి. ఈ ప్రాంతంలోని భూమి పొరల్లో కింబర్‌లైట్ పైప్‌లైన్ ఉందని గనులు భూగర్భ శాఖ నిర్ధారించింది. ఈ నేపథ్యంలోనే తొలకరి జల్లులు కురిసే జూన్‌లో తుగ్గలి, మద్దికెర మండలాల్లో వజ్రాల అన్వేషణ కొన్నేళ్లుగా ముమ్మరంగా సాగుతోంది. ఈ ఏడాది మే మొదటి వారంలోనే వర్షాలు కురిశాయి. ఆ వెంటనే వజ్రాన్వేషణ మొదలైంది. ఇప్పటికే కొందరికి వజ్రాలు దొరికాయి కూడా. ఈ ప్రాంతంలోని పొలాలన్నీ జనంతోనే నిండిపోయాయి. కర్నూలు, నంద్యాలతో పాటు అనంతపురం, కడప, చిత్తూరు, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి వజ్రాన్వేషకులు తరలివచ్చారు. ఒక్కొక్కరు వారం, పది, పదిహేను రోజులపాటు ఇక్కడే మకాం వేస్తున్నారు. ఓ వైపు వజ్రాల కోసం జనాలు పొలాల్లో తిరుగుతుంటే.. వజ్రాన్వేషకులు తిరగడం వల్ల పొలం గట్టిబారి వ్యవసాయానికి ఇబ్బందిగా ఉంటోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులు తమ పొలాల్లోకి ఎవరూ రావొద్దని విజ్ఞప్తి బోర్డులు తగిలిస్తున్నారు.

– సాక్షి ప్రతినిధి, కర్నూలు

ఐదోసారి వచ్చా



వానొస్తే మా ఊరోళ్లంతా రైలెక్కి గుత్తిలో దిగి జొన్నగిరికి వస్తాం. నేను ఇక్కడికి ఐదేళ్ల నుంచి వస్తున్నాను. వచ్చి వారమైంది. ఐదేళ్లలో ఒక్క వజ్రం కూడా దొరకలేదు. తిండీ తిప్పలకు ఇబ్బందిగా ఉంది. మాతో పాటు వచ్చిన కొంతమందికి వజ్రాలు దొరుకుతున్నాయి. మాకు ఆశ చావక వెతుకుతున్నాం.

– ఈరయ్య, రామాపురం, వినుకొండ, పల్నాడు జిల్లా

వజ్రాలు ఎలా లభ్యమవుతాయంటే..

మన దేశంలో డైమండ్ మైనింగ్ మధ్యప్రదేశ్‌లోని పన్నాలో ఉంది. అక్కడ భూమిలోని రాళ్లను తవ్వితీసి వజ్రాల తయారీ ప్రక్రియ చేపడతారు. వజ్రకరూర్, తుగ్గలి, జొన్నగిరి ప్రాంతాల్లోని భూగర్భంలో 150 మీటర్ల లోతున వజ్రాలు ఉంటాయి. భూమిలో వాతావరణ మార్పులు జరిగినప్పుడు అవి బయటకు వస్తాయి. ఆ తర్వాత వెదరింగ్ (వికోశీకరణ) వల్ల అంటే ఎండకు ఎండి, వర్షానికి తడిసి పగిలిపోతాయి. వర్షాలు, వరదలు వచ్చినపుడు ఆ రాళ్ల ముక్కలు పొలాల్లో అక్కడక్కడా దొరుకుతుంటాయి. వాగులు, వంకల ద్వారా కూడా వజ్రాలు నీటిలో కొట్టుకుని ఇతర ప్రాంతాలకు చేరతాయి. అలా చెల్లాచెదురైన వజ్రాలే ఇప్పుడు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో లభిస్తున్నాయి.

ఇతర దేశాలతో పోలిస్తే నాణ్యమైన వజ్రాలు

వజ్రాల మైనింగ్ కోసం వజ్రకరూర్‌లో వజ్రాల ప్రక్రమణ కేంద్రాన్ని 1969లో ఏర్పాటు చేశారు. వజ్రాన్వేషణపై ఇది పెద్దగా దృష్టి సారించలేదు. ఆ తర్వాత ఓ ఆస్ట్రేలియన్ కంపెనీ వచ్చి కొద్దికాలం పాటు సర్వే చేసి తిరిగి వెళ్లింది. ఆఫ్రికాతో పాటు చాలా దేశాలతో పోలిస్తే ఇక్కడి వజ్రాలు చాలా నాణ్యమైనవి, విలువైనవి. అందుకే వీటి వెలికితీతపై ప్రత్యేక దృష్టి సారిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని పలువురు కోరుతున్నారు.



జొన్నగిరి సమీపంలోని పొలాల్లో వజ్రాల వేట

వజ్రాన్ని గుర్తు పడతాం



మాది కలికిరి. హైదరాబాద్‌లోని స్నేహితుడు, నేను కలిసి మూడు రోజుల క్రితం ఇక్కడికి వచ్చాం. దొరికితే వజ్రం. లేదంటే కాలక్షేపంగా ఉంటుందని వచ్చాం. మేం బంగారం నగలు తయారు చేస్తాం. వజ్రం ఎలా ఉంటుందో సులువుగా గుర్తుపడతాం.

– రామాంజులాచారి, కలికిరి, అన్నమయ్య జిల్లా

'సీమ'లో ఏజెంట్ల తిష్ట

వర్షాకాలం వస్తే జనాలు ఎలా తరలివస్తారో.. వజ్రాల వ్యాపారులు కూడా గుత్తి, గుంతకల్లు, జొన్నగిరి, పెరవలిలో మకాం వేసి వజ్రాల కొనుగోలుకు ప్రయత్నిస్తారు. ఇందుకోసం వజ్రాలు లభ్యమయ్యే గ్రామాల్లో ఏజెంట్లను సైతం నియమించుకుంటున్నారు. వజ్రం దొరికిందనే సమాచారం వస్తే ఏజెంట్లు వాలిపోతారు. వజ్రం దొరికిన వారిని వ్యాపారుల వద్దకు తీసుకెళ్లి రేటు కుదురుస్తారు. వజ్రం విలువైనదైతే వ్యాపారులే వారి వద్దకు వెళ్తారు. వ్యాపారుల మధ్య పోటీ పెరిగితే బహిరంగ వేలం వేస్తారు. వజ్రం నాణ్యత(క్యారెట్)ను బట్టి రూ.20 వేల నుంచి రూ.20 లక్షల వరకు కొనుగోలు చేస్తారు. జిల్లా చరిత్రలో 2022లో లభించిన 30 క్యారెట్ల వజ్రమే అత్యంత విలువైంది. ఈ ఏడాది ఇప్పటికే 9 వజ్రాలు లభ్యమయ్యాయి. గతేడాది సరైన వర్షాలు లేవు. అయినప్పటికీ 18 వజ్రాలు దొరికాయి. ఇక్కడ వజ్రాలను స్థానిక వ్యాపారులకే విక్రయిస్తారు. ఇక్కడి వ్యాపారులు అంత నమ్మకం సాధించారు. చెప్పిన ధర చెప్పినట్లు ఇస్తారు. అదే ప్రభుత్వ అధికారులకు సమాచారం ఇస్తే దానిని స్వాధీనం చేసుకుని పైసా కూడా ఇవ్వరనే అభిప్రాయంతో వారు అధికారులకు చెప్పకుండా విక్రయిస్తారు.

విదేశాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

ఆఫ్రికా, అంగోలా, కాంగోతో పాటు చాలా దేశాల్లో ఇదే తరహాలో వజ్రాలు లభిస్తాయి. వాటిని అల్యూవియల్ డైమండ్స్ అంటారు. అక్కడ ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. వజ్రాలు లభించిన వారు నేరుగా ఆ కేంద్రానికి వచ్చి చూపిస్తారు. వజ్రాల నాణ్యత ఆధారంగా కొంత మొత్తం చెల్లిస్తారు. వజ్రాలను లీగల్‌గా ప్రభుత్వం ప్రక్రియను పూర్తి చేసి విక్రయిస్తుంది. కర్నూలు జిల్లాలో ఏటా సగటున 50–60 వజ్రాలు లభిస్తున్నాయి. అలాగే వజ్రకరూరు ప్రాంతంలో కూడా ఏటా 30–40 వజ్రాలు లభిస్తాయి. అంటే ఈ రెండు జిల్లాల్లో ఏటా వంద వజ్రాలు లభిస్తున్నాయి. మైనింగ్ చేస్తే రూ. వందల కోట్ల విలువైన సంపద ప్రభుత్వానికి లభించే అవకాశం ఉంది.

18 అడుగుల ఎత్తులో ఆర్ఆర్ఆర్!

- కోట గోడను తలపించే ఎత్తులో నిర్మాణం కానున్న రీజనల్ రింగురోడ్డు.. వరికోత హార్వెస్టర్లు అండర్‌పాస్‌ల నుంచి దాటేందుకు వీలుగా ట్రిపుల్ ఆర్ కనీస ఎత్తు 5.5 మీటర్లకు పెంపు
- హైవేలను క్రాస్ చేసే ఇంటర్‌ఛేంజ్‌ల వద్ద ఏకంగా 30 అడుగుల ఎత్తు.. ప్రస్తుతం 11 అడుగుల ఎత్తులో నిర్మితమైన ఔటర్ రింగ్‌రోడ్డు

సాక్షి, హైదరాబాద్: దేశంలోనే అతిపొడవైన రింగురోడ్డుగా రికార్డుకెక్కనున్న రీజనల్ రింగ్‌రోడ్డు (ఆర్ఆర్ఆర్) మరో ఘనతను సొంతం చేసుకోనుంది. కోటగోడను తలపించేలా 18 అడుగుల రికార్డు స్థాయి ఎత్తుతో ఈ ఎక్స్‌ప్రెస్‌వే నిర్మాణం కానుంది. జాతీయ రహదారులు, ముఖ్యమైన రాష్ట్ర రహదారులను క్రాస్ చేసే చోట దీని ఎత్తు ఏకంగా 30 అడుగులు ఉండనుంది. ఇప్పటివరకు దేశంలో ఎక్కడా ఇంత ఎత్తులో ఎక్స్‌ప్రెస్ వేలు నిర్మాణం కాలేదు. హైదరాబాద్ చుట్టూ మణిహారంగా రూపుదిద్దుకున్న ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) ఎత్తు 11 అడుగులు మాత్రమే ఉంది.

ఇంత ఎత్తు ఎందుకంటే..

ఉత్తర భాగంలో ప్రతి అర కిలోమీటర్‌కు ఒక వంతెన ఉండనుంది. పాదచారులు దాటే అండర్ పాస్ ఎత్తు గతంలో మూడున్నర మీటర్లుగా నిర్ధారించారు. ఇటీవలే దాన్ని మార్చి 4 మీటర్లకు పెంచుతూ ఆదేశాలు జారీ చేశారు. దీంతో కొత్తగా చేపట్టే ఎక్స్‌ప్రెస్ వేలలో చిన్న అండర్‌పాస్‌ల క్లియరెన్స్ ఎత్తు 4 మీటర్లుగా నిర్ధారించారు. కానీ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో వరికోతలకు హార్వెస్టర్ యంత్రాల వినియోగం అధికంగా ఉంది. వాటి ఎత్తు 4.3 మీటర్లు. ఇవి రోడ్డు దాటాలంటే అంతకంటే ఎత్తుతో క్లియరెన్స్ ఉండాలి. ఇందుకోసం రీజనల్ రింగ్‌రోడ్డులో అండర్‌పాస్‌ల కనిష్ట క్లియరెన్స్‌ను 4.5 మీటర్లుగా నిర్ధారించారు. దానిమీద రోడ్డు మందం మరో మీటర్ కనిష్టంగా ఉంటుంది. దీంతో అండర్‌పాస్‌లు ఉండే ప్రాంతాల్లో రోడ్డు ఎత్తు ఐదున్నర మీటర్లుగా ఉండనుంది. అండర్‌పాస్‌లు లేనిచోట్ల దాని ఎత్తు తగ్గించే వీలుంది. కానీ ఈ రోడ్డులో ప్రతి అర కిలోమీటర్‌కు చిన్నదో, పెద్దదో ఏదో ఒక అండర్‌పాస్ ఏర్పాటు కానుంది. అందువల్ల అండర్‌పాస్ ఉన్న చోట్ల రోడ్డు ఎత్తు పెంచి ఆ తర్వాత తగ్గిస్తే వేగంగా దూసుకెళ్లే వాహనాలకు ఆ ఎత్తుపల్లాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. దీంతో ఈ రోడ్డు మొత్తం కనీసం 18 అడుగుల ఎత్తులో ఉండేలా డిజైన్ చేశారు. ఈ రోడ్డులో 27 పెద్ద వంతెనలు సహా 309 వంతెనలు నిర్మించనుండగా వాటిలో 187 అండర్‌పాస్‌లు ఉండనున్నాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులను దాటుతూ 11 ప్రాంతాల్లో ఇంటర్ ఛేంజ్‌లు నిర్మించనున్నారు. ఇంటర్‌ఛేంజ్‌ల వారీగా ఆయా డిజైన్లను 'సాక్షి' గతంలోనే వెలుగులోకి తెచ్చింది.

ఏడాదిన్నర కిందటే పనులు మొదలవ్వాల్సి ఉన్నా..

రీజనల్ రింగురోడ్డు ఉత్తర భాగం భూసేకరణ ప్రక్రియ తుది దశలో ఉంది. త్వరలో గ్రామాలవారీగా భూ పరిహారానికి సంబంధించి అవార్డులు పాస్ చేయనున్నారు. దీంతో 158 కి.మీ. నిడివి ఉండే ఈ రోడ్డు నిర్మాణానికి మార్గం సుగమం కానుంది. వాస్తవానికి ఏడాదిన్నర క్రితమే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) యంత్రాంగం రోడ్డు నిర్మాణానికి వీలుగా అప్పట్లోనే డిజైన్లు సిద్ధం చేసుకుంది. కానీ ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య భేదాభిప్రాయాలు తలెత్తడంతో అప్పట్లో పనులు పడకేశాయి.

వాట్సాప్‌లో ఫొటోలు..

ముహూర్తం రోజున డెలివరీ..

- పిల్లలు లేని తల్లిదండ్రులకు చిన్నారులను విక్రయించే ముఠా అరెస్టు
- 11 మంది మధ్యవర్తుల రిమాండ్.
- 16 మంది చిన్నారులను కాపాడిన రాచకొండ కాప్స్
- ఢిల్లీ, పుణే కేంద్రంగా దందా.. ఏపీ, తెలంగాణలో విక్రయం
- డిమాండ్‌ను బట్టి రూ.1.80–5.50 లక్షల వరకు...
- వివరాలు వెల్లడించిన రాచకొండ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి



సాక్షి, హైదరాబాద్: పాలుతాగే పసికందులను అపహరించి, విమానాలు, రైళ్లలో రాష్ట్రాలు దాటించి పిల్లలు లేని దంపతులకు విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. ఫెర్టిలిటీ సెంటర్లు, ఆస్పత్రులు, క్లినిక్‌లలో పనిచేసే ఫోర్త్‌క్లాస్ ఉద్యోగులను ఏజెంట్లుగా పెట్టుకొని, దంపతుల సమాచారం సేకరించి, మధ్యవర్తుల సహాయంతో ఐదేళ్లుగా ఈ అక్రమ దందా సాగుతోంది. ఢిల్లీ, పుణే నగరాల్లో రోజుల శిశువులను ఎత్తుకొచ్చి.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ఒక్క పసికందును రూ.1.80 లక్షల నుంచి రూ.5.50 లక్షల చొప్పున అమ్మేస్తున్నారు. ఈ ముఠాలో కీలకంగా వ్యవహరించిన 11 మంది మధ్యవర్తులను రాచకొండ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలను మల్కాజ్‌గిరి డీసీపీ పీవీ.పద్మజ, శిశు సంక్షేమ కమిటీ (సీడబ్ల్యూసీ) అధికారులతో కలిసి రాచకొండ కమిషనర్ డాక్టర్ తరుణ్ జోషి మంగళవారం మీడియాకు వెల్లడించారు.

- ఈనెల 22న పీర్జాదిగూడలో మూడు నెలల పాపను విక్రయిస్తుండగా మేడిపల్లి పోలీసులు స్థానిక ఆర్ఎంపీ శోభారాణితోపాటు స్వప్న, షేక్ సలీంలను అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితులను విచారించగా వీరి తరహాలోనే ఏపీ, తెలంగాణకు చెందిన మరో 8 మంది మధ్యవర్తుల పాత్ర వెలుగులోకి వచ్చింది. దీంతో పోలీసులు కేసును రివర్స్ ఇన్వెస్టిగేషన్ చేశారు. అన్నోజిగూడకు చెందిన బండారి హరిహర చేతన్– బండారి పద్మ, కుషాయిగూడకు చెందిన యాట మమత, ఉప్పుగూడకు చెందిన ముధావత్ రాజు, విజయవాడకు చెందిన బలగం సరోజ, ముధావత్ శారద, ముంతాజ్, జగన్నాథం అనురాధలను పట్టుకున్నారు.
- ఈ మధ్యవర్తుల సహాయంతో ఢిల్లీకి చెందిన కిరణ్, ప్రీతి, పుణేకు చెందిన కన్నయ్యలు తెలుగు రాష్ట్రాల్లో సంతానం లేని దంపతులకు పిల్లలను విక్రయిస్తున్నారు. ఐదేళ్లలో 60 మంది శిశువులను విక్రయించారు. తాజా కేసులో 16 మంది పిల్లలను విక్రయానికి పెట్టగా.. ఏడుగురిని ఏపీ, 9 మందిని తెలంగాణకు చెందిన దంపతులు కొనుగోలు చేశారు. మధ్యవర్తులను విచారించిన పోలీసులు 16 మంది చిన్నారులను కాపాడారు. శిశువిహార్‌కు తరలించారు. వీరిలో 12 మంది అమ్మాయిలు, నలుగురు అబ్బాయిలున్నారు. ప్రతి శిశువు అమ్మకంపై ఒక్కో ఏజెంట్‌కు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు లాభం పొందేవారు. పరారీలో ఉన్న నిందితులు కిరణ్, ప్రీతి, కన్నయ్యల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

సామాజిక మాధ్యమాల్లో..: వాట్సాప్, టెలిగ్రాం వంటి సామాజిక మాధ్యమాలలో పిల్లల ఫొటోలు పంపిస్తారు. శిశువుల రంగు, ముఖ కవలికలను బట్టి ఎంపిక చేసుకుంటారు. ఫలానా ముహూర్తానికి పిల్లాడు కావాలని చెబితే చాలు ఆ సమయానికే పిల్లాడిని తీసుకొచ్చి అప్పగిస్తారు. రోజుల వయస్సున్న శిశువులనే దంపతులు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. ఎందుకంటే ఆ వయసులో అయితేనే తనకు పుట్టిన బిడ్డగా, పిల్లలకు కూడా వీరే సొంత తల్లిదండ్రులని భావిస్తారు.

పిల్లలకు దూరం చేయకండి

పిల్లలను రెస్క్యూ హోంకు తరలిస్తుండగా అప్పటివరకు పెంచి పోషించిన తల్లిదండ్రులు తమ పిల్లలను దూరం చేయొద్దంటూ రాచకొండ కమిషనరేట్ ముందు అడ్డుపడ్డారు. దీంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు తల్లిదండ్రులను మేడిపల్లి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఓ దంపతులను 'సాక్షి' పలకరించగా.. పెళ్లై 12 ఏళ్లు అయినా పిల్లలు కలగలేదని, ఎన్ని ఆస్పత్రులు తిరిగినా లాభం లేకపోవడంతో ఆఖరికి దిక్కుతోచని స్థితిలో రెండున్నర ఏళ్ల క్రితం ఆరు రోజుల పసికందును కొనుగోలు చేశామని రావులపాలెంకు చెందిన ఓ జంట తెలిపారు. రూ.3.5 లక్షలు ఖర్చు చేసి 21వ రోజును ఘనంగా చేశామన్నారు. రూ.కోట్లాది ఆస్తిపాస్తులను వారసుడి పేరు మీద రాసేందుకూ సిద్ధమయ్యామని చెప్పారు. ఇలాంటి సమయంలో పిల్లాడిని పోలీసులు తమ నుంచి దూరం చేశారని కన్నీటిపర్యంతమయ్యారు.

కవితకు బెయిలివ్వొద్దు

ఢిల్లీ హైకోర్టులో దర్యాప్తు సంస్థల వాదన

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ ఇవ్వొద్దని దర్యాప్తు సంస్థలు ఢిల్లీ హైకోర్టును కోరాయి. కేసులో ప్రధాన లబ్ధిదారుగా ఉన్న కవితకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, ఇంకా పరిశీలించాల్సిన ఆధారాలను ధ్వంసం చేయొచ్చని ఆరోపించాయి. ఈడీ, సీబీఐ కేసుల్లో బెయిల్‌తోపాటు తన అరెస్టుకు ట్రయల్ కోర్టు సీబీఐకి అనుమతి ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ కవిత దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారించారు. ఈడీ తరఫు న్యాయవాది జొహెబ్ హొస్సేన్ వాదనలు వినిపిస్తూ.. తన బినామీ అరుణ్ పిళ్లై ద్వారా కవిత సుమారు రూ.35 కోట్లు లబ్ధి పొందేందుకు యత్నించారని బుచ్చిబాబు ఇచ్చిన వాంగ్మూలాన్ని కోర్టు దృష్టికి తెచ్చారు. ఇందులో రూ.32 కోట్లు కవిత నిమిత్తం కాగా మరో రూ.4.75 కోట్లు ఇండియా ఎహెడ్ సంస్థకు మళ్లించారని తెలిపారు. ఇండియా ఎహెడ్‌తో కవితకు సంబంధాలపై ఆధారాలు, వాట్సాప్ చాట్‌లు ఉన్నాయని, సంస్థకు కవిత ఫండింగ్ చేస్తున్న సమాచారం ఇప్పటికే కోర్టుకు అందజేశామన్నారు. కవితకు సమన్లు జారీ చేసిన తర్వాతే ఫోన్లలో డేటా ధ్వంసం చేశారని చెప్పారు. అనంతరం సీబీఐ తరఫు న్యాయవాది వాదనలు కొనసాగిస్తూ.. మాగుంట శ్రీనివాసులు రెడ్డి, శరత్‌చంద్రారెడ్డిల వాంగ్మూలాలు వివరించారు. ఆయా ఆధారాలతో కవిత అరెస్టు తప్పనిసరి అయిందని చెప్పారు. కవిత చాలా పవర్‌ఫుల్ మహిళ అని, సాక్షిని బెదిరించిన ఆధారాలు కూడా తమ వద్ద ఉన్నాయన్నారు. దర్యాప్తు సంస్థల వాదనలను కవిత తరఫు న్యాయవాది నితీశ్ రాణా ఖండించారు. కవిత ఎలాంటి ఆధారాలను ధ్వంసం చేయలేదన్నారు. వాదనల అనంతరం న్యాయమూర్తి తీర్పు రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించారు. జూలై 1 నుంచి కోర్టుకు వేసవి సెలవులు కావడంతో అంతకు ముందుగానే తీర్పు వెలువరిస్తానని చెప్పారు. కాగా, మద్యం విధానం కుంభకోణంలో వాంగ్మూలాలపై విచారణ సందర్భంగా కొన్ని అవాస్తవాలు ప్రచారం జరిగాయని కవిత తరఫు న్యాయవాది మోహిత్‌రావు మీడియాకు చెప్పారు. ఆ ప్రచారం అవాస్తవమని, కొందరు కావాలనే బురద చల్లుతున్నారని విమర్శించారు.

ప్రజాభవన్‌లో బాంబు కలకలం

డిప్యూటీ సీఎం భట్టి ఇంట్లో బాంబు పెట్టానని 100కి అపరిచితుడి ఫోన్

- ఉరుకులు, పరుగులతో పోలీసుల తనిఖీలు
- నాలుగు గంటలకి పైగా క్షుణ్ణంగా పరిశీలన.. ఏమీ లేకపోవడంతో ఊపిరి పీల్చుకున్న పోలీసులు



బాంబు స్క్వాడ్ సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పంజగుట్ట: ''ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఇంట్లో బాంబు పెట్టాం.. మరో కొద్దిసేపట్లో అది పేలబోతుంది..'' అంటూ ఒక ఆగంతకుడు పోలీస్ కంట్రోల్‌రూం డయల్ 100కు ఫోన్ చేసి చెప్పడంతో పోలీసులు ఒక్కసారిగా ఉరుకులు పరుగులు పెట్టారు. సుమారు నాలుగు గంటలపాటు మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ మొత్తం తనిఖీ చేసి ఎలాంటి బాంబు లేదని తెలుసుకుని ఊపిరి పీల్చుకున్నారు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం మధ్యాహ్నం 12:06 నిమిషాలకు పోలీస్ కంట్రోల్‌రూం 100కు ఓ అగంతకుడు ఫోన్ చేసి ప్రజాభవన్‌లోని మల్లు భట్టి విక్రమార్క ఇంటివద్ద బాబు పెట్టామని ఫోన్ చేశాడు. కంట్రోల్‌రూం సిబ్బంది 12:15కు పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్, సిటీ సెక్యూరిటీ వింగ్ అధికారులను రంగంలోకి దింపారు. హుటాహుటిన నాలుగు డాగ్ స్క్వాడ్ బృందాలు, 10 బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్స్ బృందాలు రంగంలోకి దిగాయి. పంజగుట్ట ఏసీపీ మోహన్ కుమార్ నేతృత్వంలో అణువణువూ తనిఖీ చేశారు.

ఇకపై అక్కడ భారీ బందోబస్తు..: భట్టి ఇంటితోపాటు మంత్రి సీతక్క ఇంటిని, పరిసర ప్రాంతాలనూ చెక్ చేశారు. తరువాత ప్రజాభవన్ లోపల, పక్కనే ఉన్న మరోభవనం, అమ్మవారి ఆలయం సహా అన్నీ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సుమారు 4 గంటలకు పైగా తనిఖీలు చేసి ఎక్కడా ఏమీ లేకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఇకపై ప్రజాభవన్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని నిర్ణయించిన అధికారులు.. సందర్శకులను క్షుణంగా పరిశీలించాలని సిబ్బందికి ఆదేశించారు. కాగా, ప్రజాభవన్‌లో బాంబు ఉందని ఫోన్ చేసిన వ్యక్తి గురించి పోలీసులు గాలిస్తున్నారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.